
# ఆచార్య నాగార్జున లేఖలు

(సుహృల్లేఖ - రత్నావళి - శిష్యలేఖ)



894.8276
137179

అనువక్త

వావిలాల సుబ్బారావు

# ఆచార్య నాగార్జున లేఖలు

## సుహృల్లేఖ

## రత్నావళి

## శిష్యలేఖ

(శ్రమణేర కారికలు)

ఆంగ్ల అనువాదములు ఆధారముగ
తెలుగుసేత
వావిలాల సుబ్బారావు

*Presented by*
T.V. Prafulla Chandra
cell 93461 66455
tallurivpc@yahoo.com
*In fond remembrances of*
**Late Sri T.S.R. Krishnayya**

ధాన్యకటక బుద్ధ విహారట్రస్టు
అమరావతి
522 020

ధర్మసాధన గ్రంథమాల - 8

ప్రతులు : 1000

ఆచార్య నాగార్జున లేఖలు : 2014

వెల : రూ. 120/-

C-89593

అనువక్త :
**డా॥ వావిలాల సుబ్బారావు,** M.A., Ph.D.
"హరిత" - పాపయారాధ్యవీధి,
అమరావతి - 522 020
గుంటూరుజిల్లా.

894.8276
సుబ్బా - ఆచార్య

ప్రతులకు :

1) ధాన్యకటక బుద్ధవిహారట్రస్టు, అమరావతి - 9866402973
2) మంగళగిరి బుద్ధవిహారట్రస్టు - 9848199098
   యన్.సి.సి.రోడ్డు - మంగళగిరి - 522 503
3) ఆర్ట్స్ & లెటర్స్
   దోమల్‌గూడ, హైదరాబాదు. ఫోన్ : 040 - 27635654
4) విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని శాఖలలో

ముద్రణ :
శ్రీ లక్ష్మీగణపతి ఆర్ట్ ప్రింటర్స్
2/4, బ్రాడీపేట, గుంటూరు - 2
ఫోన్ : 0863-2235036

137179

# విషయక్రమం

IX నుండి xlviii

1. ఆచార్యుడు - డా॥ పురాణం రాధాకృష్ణప్రసాద్
2. ఆసేచనం - శ్రీ యం. రాజగోపాలరావు
3. పూర్వరంగం - డా॥ వావిలాల సుబ్బారావు
4. సరళంగా రత్నావళి - మోక్షానందస్వామి
5. ఆచార్యుని సంక్షేమ రాజ్యభావన - ఆచార్య జాగర్లమూడి సీతారామమ్మ
6. ఒక్క రెండు మాటలు - డా॥ వావిలాల సుబ్బారావు
7. ఆచార్యుని లేఖల పరామర్శ - డా॥ వావిలాల సుబ్బారావు

1 నుండి 181 వరకు


8. సుహృల్లేఖ
9. రత్నావళి
10. అనువాదావసరం
11. శిష్యలేఖ - (శ్రమణేర కారికలు)




"మతమున నూతనత్వము సమంచిత రీతిని పాదుకొల్పు బా
ధృతకల పీఠ నిర్మితి కహర్నిశమందగ నిల్చి, శిల్పవి
జ్ఞత కతిమాత్ర దైవత గుణంబిదు వేళల నిన్నుకొన్న యు
ద్ధృత నవ విప్లవంబునకు జేతులు మోడ్చెద శిల్పిశేఖరా"!



సంప్రదాయ చింతనను తాము గౌరవిస్తూ
అన్ని దిక్కుల నుండి వాయువులను
ప్రసరింపనిస్తూ, తలుపులులేని
సాంస్కృతిక వాతావరణాన్ని
నాకు అనుమతించిన అమ్మకు నాన్నకు....



**శ్రీ అట్లూరి లవకుమార్ గారు**

ఈ అనువాదం గ్రంథరూపంగా వచ్చి
ధర్మవ్యాప్తి జరగటానికి దానవితరణం చేసారు.
ఈ పుణ్యకార్యఫలం తథాగతుని పాదపద్మముల నలంకరించి
సర్వజీవుల దుఃఖ విముక్తికొరకు సహకరించుగాక.
ఈ దానపారమితలను ఆచరించినవారికి, గ్రహించిన వారికి
మనసున ధరించిన వారికి
బోధిచిత్తము పెంపొందుగాక
శ్రీ అట్లూరి లవకుమార్ గారికి
ధర్మమునందు శ్రద్ధావీర్యములు పెంపొందుగాక.

# ఆచార్యుడు

డా॥ పురాణం రాధాకృష్ణప్రసాద్
ఎం.ఎ., పి.హెచ్.డి.

దాదాపు నాలుగు సంవత్సరముల క్రిందట మిత్రులందరము ఒకచోట కలసిననాడు ఆచార్య నాగార్జునుని సుహృల్లేఖను గురించిన ప్రస్తావన వచ్చింది. అది నేడు అలభ్యము, టిబెటన్ భాషలో నుండి తెచ్చిన ఆంగ్లానువాదమే ఉన్నదిగాని సంస్కృత మూలము లేదనుకొనుచుంటిమి. ఆంగ్లానువాదమును చూచిన డా॥ వావిలాల సుబ్బారావు గారు దీనిని తెలుగులోనికి అనువదించిన బాగా వుంటుందన్నారు. ఆనాడే ఆలోచన బీజప్రాయమై తరువాత కార్యరూపము దాల్చి నేడు ఫలించింది.

ఆచార్య నాగార్జునుడు ప్రాచీన భారతీయ దార్శనికులలో గణింపదగిన తత్త్వవేత్త. వేదవేదాంగ పారంగతుడు, సంస్కృతమున గొప్ప పండితుడును అయిన బౌద్ధాచార్యుడు. బహు గ్రంథకర్త. ఇరువదికి పైగా తత్త్వ గ్రంథములు, వివరణములు, వ్యాఖ్యానములు, భక్తిస్తోత్రములు, యితర గ్రంథములు సంస్కృతమున వెలయించి, బౌద్ధ లోకమును ప్రకాశింవజేసిన భానుచతుష్టయములో ద్వితీయుడుగా అశ్వఘోషుని తర్వాత పరిగణింపబడినవాడు. తన కాలమునాటి బౌద్ధుల భిన్నశాఖల మధ్యగల అంతర్గత కలహములను నివారించి భిన్న వాదములను ఒక్కచో చర్చించి వానియందలి మూల సిద్ధాంతములను విశదపరచుటకై కృషిచేసిన ప్రజ్ఞాశాలి. మహాయాన వాదియైన ఆచార్యుడు. తన వాఙ్మయమును సంస్కృతమున రచించి తన మతమును తోటి వైదిక మతముల స్థాయికి తెచ్చి గొప్ప తార్కికుడై పండితులతో తలపడి తన వాదమును స్థిరపరచుకొనుటయే గాక, తన మతమును గూర్చి ప్రవచించి ప్రబోధించుటకుగాను తానే ఒక విద్యా కేంద్రమై తనకు దీటైన ఆర్యదేవాది శిష్య పరంపరను సృష్టించుకొనిన మేధావి. భావి తరములలో గూడ విద్యావ్యాప్తిని, ధర్మ ప్రబోధమును చేయనెంచి శ్రీధాన్యకటక, శ్రీపర్వ కేంద్రములందు రెండు విద్యా పీఠములను నెలకొల్పి దేశవిదేశీయ విద్యార్థుల నాకర్షించి చిరకాలము ధార్మిక, లౌకిక విద్యావ్యాప్తిని సంకల్పించిన మేధావి.

శ్రీధాన్యకటక మహాచైతన్యమును సర్వాంగ సుందరముగా తీర్చిదిద్దు సందర్భమున మహాచైత్యము చుట్టును ఒక మహా ప్రాకారమును పండిత పామర రంజకమగునట్లు దృశ్య విధానమున ధర్మప్రబోధమునకు తోడ్పడు బహుశిల్పాలంకారములతో నిర్మింపజేసిన కార్యదక్షుడు.

ఇట్టి బహుముఖ ప్రజ్ఞాశాలి సమకాలీన సాతవాహన చక్రవర్తి నాకర్షించి వైదిక మతస్థుడగు చక్రవర్తిచే ఆహ్వానితుడై తన ధర్మ ప్రాశస్త్యమును సుబోధకముగ "సుహృల్లేఖ" రూపమున రాజన్యమిత్రునకు విశదపరచి యాతని చిరకాల మిత్రతకు పాత్రుడయిన ధీశాలి. బౌద్ధులీయనను బోధిసత్త్వునిగ ఆరాధింతురు.

అట్టి ఆచార్యుని జీవిత విశేషములు ఎక్కువగా తెలియవు. ఈయన జీవించిన దేశకాలములను గూర్చి భిన్నాభిప్రాయములున్నవి. అసలు నాగార్జునులు ఒక్కరా పలువురాయన్న సంశయమున్నది. మాధ్యమక దర్శన ప్రవర్తకుడైన ఆచార్య నాగార్జునుడును, రసవాద కర్తయగు సిద్ధ నాగార్జునుడును, తాంత్రికాచార్యులైన మరియొక రిద్దరున్నట్లు తెలియును. ఆచార్యుని గ్రంథములు దాదాపు అన్నియు మన దేశమున లుప్తములై చైనా, టిబెట్టు దేశములందు అనువాద రూపమున లభించుచున్నవి. వీనియొక్క పునరనువాదములే తిరిగి నేడు దేశమున లభించునది. ఆచార్యుని సంస్కృతవాణి సమగ్రరూపము తెలియకున్నది.

క్రీ.శ. 4వ శతాబ్ది ఉత్తరార్ధమున జీవించిన ప్రఖ్యాత బౌద్ధ భిక్షువు కుమారజీవుడు (344-413 క్రీ.శ.) మనదేశము నుండి కొనిపోయిన తొంబది ఎనిమిది బౌద్ధ గ్రంథములను నాలుగువందల ఇరువదియైదు సంపుటములుగా చీనా భాషయందనువదించెను. అందు ఆచార్య నాగార్జునుని మహాయాన గ్రంథములన్నియు కలవు. అంతేగాక ప్రఖ్యాత బౌద్ధాచార్యులగు అశ్వఘోష, నాగార్జున, ఆర్యదేవుల జీవితచరిత్రలను గూడ క్రీ.శ. 405 ప్రాంతమున సంగ్రహపరచెను. ఆ కారణమున ఆచార్యుడు కుమారజీవుని ముందుకాలము వాడని తెలియును.

కుమారజీవుడు వ్రాసిన చరిత్ర ననుసరించి నాగార్జునుడు దాక్షిణాత్యుడు. పుట్టుకచే బ్రాహ్మణుడు. వేదవేదాంగ పారంగతుడు. అణిమాది అష్టసిద్ధులను సాధించిననాడు. యౌవ్వనమున స్వేచ్ఛావిహారియై అదృశ్యకరణి విద్యాప్రభావమున తన ముగ్గురు శిష్యులతో కలసి అంతర్హితుడై రాజాంతః పురమునకు రాకపోకలు

సాగించెడి వాడట. ఒకనాడు ఆకస్మికముగా రాజభటులకు మిత్రులతో గూడ పట్టుబడి రాజదండమునకు గురియయ్యెను. ఆ యాపదనుండి బయటపడినచో బౌద్ధ భిక్షువునయ్యె దనని మ్రొక్కుకొనెను. రాజు యే కారణముననో మిత్రులను ఉరితీయించి నాగార్జునుని మాత్రము విముక్తుని జేసెను. ఈ సంఘటన అతనికి తీవ్రమగు మనః పరివర్తనము కలిగించి దుఃఖ నివారణోపాయమును గూర్చి తీవ్రాన్వేషణకు మార్గగామి యయ్యెను.

తదాది యాతడు భిక్షువై బౌద్ధ సంఘమున ప్రవేశించి తొంబది దినములలో త్రిపిటకములను అధ్యయనముచేసి ఇతర బౌద్ధ గ్రంథముల కొరకై తీవ్రమగు అన్వేషణను సాగించెను. ఆ సందర్భమున ఒక మహానాగుడు (నాగరాజు) ఈతనిని సముద్రములోని తమ లోకమునకు (సముద్రతీర దేశమునకు) గొనిపోయి అచ్చట "సప్తరత్నకోశము" (గ్రంథ సంచయము)ను తెరచెను. అందలి వైపుల్య సూత్రములచే (మహాప్రజ్ఞాపారమిత) ప్రభావితుడై నాగార్జునుడు ఆ మహాయాన గ్రంథములను కొనివచ్చి పరిశీలించి వాని అధ్యయనమున సంతృప్తుడై తన శేషజీవితము నంతను వానియందలి ధర్మసూక్ష్మములను ప్రవచించి ప్రబోధించుచు బహుగ్రంథకర్తయై దక్షిణ దేశమున బౌద్ధమత ప్రచారము గావించుచు మూడువందల సంవత్సరములు జీవించినట్లు కుమారజీవుడు పేర్కొనెను.

ఆయన అంతిమ దినములను గూర్చి ఒక సంఘటన గలదు. ఆయనకొక రాజన్య మిత్రుడుండెడివాడు. వారిరువురును ఒకే సమయమున మరణించునట్లు ఒడంబడిరి. రాజుయొక్క కుమారుడు రాజ్యకాంక్షచే తండ్రి యవసానమును గోరి ఆచార్యు నాశ్రయించెను. ఆ కారణమున ఆచార్యుడును, ఆయనయొక్క రాజన్య మిత్రుడును ఒకే సమయమున ఆత్మహత్య యొనర్చుకొనిరి. లేదా ఒకరిచేతిలో మరియొకరు మడిసిరి. ఈయనయొక్క రాజన్యమిత్రుడు సాతవాహన వంశీయుడనియు, అంతిమ దినములలో ఈయన తనకొరకై రాజుచే నిర్మింపబడిన శ్రీ పర్వత విహారము నందు నివసించెడి వాడని తెలియును.

టిబెట్టువారి వ్రాతల ననుసరించి ఈయన జీవిత ఘట్టములు కొన్ని మరియొక విధమున పేర్కొనబడినవి. ఈ దాక్షిణాత్య బ్రాహ్మణ బాలుడు స్వల్పాయుష్కుడని తెలిసి ఈతని తల్లిదండ్రులు తమ కుమారుని మరణము చూడజాలక అతని యేడవ సంవత్సరమున ఒక మహారణ్యమున వదలిరి. కాని

బాలుడు అచ్చటినుండి తప్పించుకొని బౌద్ధ సంఘమున ప్రవేశించి నాలందయందు సరాహుడు లేక రాహులభద్రుడను ఆచార్యు నాశ్రయించి "అపరిమితాయుర్ధారణి" యను మంత్రమును పొంది దాని ఉపాసన చేత తన జీవిత కాలమును పొడిగించుకొనెను. తరువాత నాలంద యందే ఆచార్యుడుగా నుండెను.

పండితులు ఈయన చారిత్రకతను గూర్చియు, జీవితాంశములను గూర్చియు భిన్నాభిప్రాయములను వెలిబుచ్చిరి. దాక్షిణాత్యుడనుటలో కొందరు పండితులు ఈయనను విదర్భవాసిగా తలచిరి. కాని లంకావతార సూత్రములందు దక్షిణాపథము నందలి "వేదలి" వాసిగా పేర్కొనబడినాడు. మరియొక యాధారము ననుసరించి ఈయన జన్మస్థానము శ్రీపర్వతమునకు పూర్వదిశయందును, శ్రీస్థానమునకు పశ్చిమ దిశయందును ఉన్నట్లు తెలియును. శ్రీపర్వతమనగా నేటి నాగార్జునకొండ వద్ద నున్న ప్రాచీన విజయపురి ప్రాంతము. శ్రీస్థానము శ్రీధాన్యకటకమునకు ప్రాచీన నామమని పండితుల యభిప్రాయము. (నేటి ధరణికోట – అమరావతి పట్టణము) ఇది శ్రీధాన్యగా గూడ వ్యవహరింపబడెడిది. అందుచే ఈ రెండు ప్రాంతములకు మధ్య గ్రామమై ఈయన జన్మస్థానము 'వేదలి' ఉండియుండును. నేడది యే గ్రామమో తెలియకున్నది.

టిబెట్టు చరిత్రకారుడు తారానాథుని వ్రాతల ననుసరించి ఆచార్యుడు శ్రీపర్వత వాసియనియు, శ్రీధాన్య కటక మహాచైత్యమునకు శిలాప్రాకారమును నిర్మింప జేసెననియు, సాతవాహన చక్రవర్తిగు గౌతమీపుత్రునకు ధర్మోపదేశము చేసిన వాడనియు తెలియును.

ఆ కారణమున నీయన ఆంధ్రుడై, సాతవాహనుల పూర్వతీరాంధ్ర రాజ్యమున ముఖ్యనగరమగు శ్రీధాన్య కటకమున నున్న మహాచైత్యమును ముఖ్య కేంద్రముగ నుంచుకొని, అప్పుడప్పుడు రాజునకు తత్త్వోపదేశము చేయుచు, సన్నిహితుడై తన ప్రశాంత ఆధ్యాత్మిక జీవనమునకు, తత్త్వచింతనకు శ్రీపర్వత ప్రాంతము నెంచుకొని ఈ రెండు ప్రాంతములమధ్య రాకపోకలు సాగించుచునుండి యుండును.

అగుచో, నీయన మిత్రుడై, ధర్మోపదేశమును పొందిన సాతవాహన రాజెవరు? అతని కాలమేది? అన్న ప్రశ్నలు పొడమును. ఆచార్యుని తత్త్వోపదేశము "సుహృల్లేఖ" రూపమున గౌతమీపుత్రున కుద్దేశింపబడినది. "రత్నావళి" యను

మరియొక గ్రంథము గూడ యిట్టిదే యున్నను నేడది అలభ్యము. అందలి కొన్ని సంస్కృత శ్లోకములు మాత్రము అక్కడక్కడ ఉదహరింపబడి లభించుచున్నవి.

ఆచార్యుని కాలమును గూర్చియు, సమకాలీనుడగు రాజును గూర్చియు పండితుల యందు భిన్నాభిప్రాయములున్నవి. కవివత్సలుడగు హాలుని కాలమునాటి వాడనియు, గౌతమీపుత్ర సాతకర్ణికి సమకాలీనుడనియు, గౌతమీపుత్ర యజ్ఞశ్రీ మిత్రుడనియు, కనిష్కుని తోటి వాడనియు తలంచిరి.

కాని బౌద్ధాచార్య పరంపరయందు కనిష్కుని సమకాలీనుడగు అశ్వఘోషుడు పదమూడవ వాడు కాగా నాగార్జునుడు పదునైదవ తరము వాడగుటచే కనిష్కుని సమకాలీనుడనుట పొసగదు. కనిష్కుని కాలమున జరిగిన మహాసంగీతియందు మహా యానీయులు పాల్గొనలేదు. తరువాత వచ్చిన ఈ ఆచార్యుడే మహాయానమును సంస్కరించి ఉన్నత స్థానమును కల్పించి ప్రాచుర్యమునకు తెచ్చెను. ఆ కారణమున కనిష్క – అశ్వఘోషులకు రెండు మూడు తరములు తరువాత వాడై యుండు నవకాశము హెచ్చుగా నున్నది. హాలునకు గాని, గౌతమీపుత్ర సాతకర్ణికి గాని శ్రీధాన్యకటకముతో నెట్టి సంబంధమున్నట్లు పురాతత్త్వ శాస్త్రజ్ఞులంగీకరింపరు.

చీనా యాత్రికుడగు హ్యుయాన్‌సాంగు నాగార్జునుని సమకాలీనుడగు రాజు “యిన్‌చెంగు” అనియు, సువిశాల సామ్రాజ్యాధి పతియనియు తెలియ చేయుటచే అతడు యజ్ఞశ్రీతో సరిపోలును. ఇతడును గౌతమీపుత్రుడే. ముప్పది సంవత్సరములకు పైగా సువిశాల రాజ్యమును పాలించినవాడు. యుద్ధబాధలు లేక దేశము ప్రశాంతముగ నున్నట్లు తెలియును. అట్టి సమయమున వైదికాచార పరుడగు యజ్ఞశ్రీ, బౌద్ధ ధర్మమును గూర్చి వినగోరి ఆచార్యుని ఆశ్రయించి కృతార్థుడై యుండును. తదాది ఉభయులు మిత్రులైరి. ఆచార్యుడు షుమారు నూరు సంవత్సరములు జీవించి రాజుసమక్షమున అంత్యకాలము వరకు గడిపి యుండును. అగుచో ఆచార్యుడు క్రీ.శ. రెండవ శతాబ్ది పూర్వార్ధమున మూడవ శతాబ్ది మొదటి పాదము వరకు జీవించి యుండును. (క్రీ.శ. 125–225)

ఆచార్యుడు మహాయానవాది. మహాయానము ఆచార్యునకు పూర్వము నుండియు ఉన్నదే యైనను కొత్తగా ఆవిర్భవించిన యీ యానము ప్రతిపక్షులగు థేరవాదుల వలన తీవ్ర విమర్శలకు గురియగుచుండుటచే, తనవాదమును

కాపాడుకొన వలసిన ఆవశ్యకత యేర్పడెను. ఆ కారణమున మహాయానమును శాస్త్రీకరించి, విస్తృత ప్రాతిపదికను కల్పించి, స్థిరపీఠమున నిల్పి బహుళ ప్రచారము గావించెను. తన బుద్ధి చాతుర్యముతో మహాయాన వాఙ్మయమున అనేక తత్త్వ గ్రంథములను సంస్కృతమున సృష్టించి తన మతమునకు ఇతర వైదికమతముల స్థాయిని చేకూర్చి గొప్ప తార్కికుడై పండితులతో తలపడి తన మతమును స్థిరపరచెను.

ఆదియందు ఈయన మహాయాన గ్రంథములను నాగలోకమున మహానాగుని నుండి సంగ్రహించెనని చెప్పుదురు. ఈ నాగలోకము కృష్ణానదీ ముఖద్వారమున నుండియుండును. నాగముఛిలిందుడు బౌద్ధులకు అత్యంత ప్రీతిపాత్రుడగు మిత్రుడు. నేటి మచిలీపట్టణమే నాటి ముఛిలింద నగరమై యుండవచ్చు. గుంటుపల్లి బౌద్ధ విహారములున్న కొండలను నాగపర్వతములుగా వ్యవహరించెడివారని ప్రాచీన శిలా లేఖనములవలన తెలియుచున్నది. తీరాంధ్రము నాగదేశమై రాజులు నాగరాజులుగా వ్యవహరించబడిరి. ప్రజలు నాగజాతివారు. ఆ కారణమున మహాయాన మూల గ్రంథములను, అవతంసక, ప్రజ్ఞా పారమిత, సద్ధర్మ పుండరీకములను, నాగదేశముననే ఆచార్యుడు సంపాదించెను. అనగా ఆచార్యుని కాలమునాటికే బౌద్ధ సాంప్రదాయములు తీరాంధ్రమున ముఖ్యముగా కృష్ణా పరివాహక ప్రాంతమున నెలకొని యున్నట్లుదోచును. అవి యానాడు ఉత్తరదేశమున నున్నవానికన్న భిన్నమయినట్లు తోచును. ఏమైనను ప్రజ్ఞా పారమిత ప్రవచనములు బౌద్ధమునందలి యితర సాంప్రదాయములను గాని, తత్త్వ సిద్ధాంతములను గాని తెరమరుగునకు నెట్టినవనవచ్చును.

ఆచార్యుని తత్త్వశాస్త్రమునకు మూలగ్రంథమగు ప్రజ్ఞా పారమిత సూత్రములు ఆయనకన్న ముందు సుమారొక వంద సంవత్సరములు పైగా లోకమున నుండి యుండవచ్చును. వానియందలి మూల తత్త్వమును సుస్థిర ప్రాతిపదికపై నిర్వచించి లోకమునకు చాటిన ఘనత ఆచార్యునకే దక్కును. ఆయన సునిశిత మేధాపటిమ, అసమాన తార్కికశక్తి, సరస వ్యాఖ్యాన చతురతతో అతిగహనమగు విషయమును గూడ సరళముగ ప్రవచించు నేర్పువలన ఆయన మహాయానమునకు ప్రసిద్ధ ఆచార్యుడగుటయేగాక ఆయన ప్రవచించిన ప్రజ్ఞాపారమిత వ్యాఖ్యానము వలనను,

మాధ్యమిక కారికల వలనను బౌద్ధ ధర్మ చరిత్రలోనే విప్లవాత్మకమగు ఫలితములు లేక మార్పులు సంభవించుటతోబాటు అటు తర్వాత వచ్చిన బౌద్ధ, బౌద్ధేతర తాత్త్విక ఆలోచనా విధానములు రెండున్నూ గణనీయంగా ప్రభావితములు అయినవి.

ఆచార్యుని పరిశ్రమ నంతయు పరిశీలించినచో, బుద్ధుని అంతరదృష్టిని సూక్ష్మ పరిశీలన జేసి, బౌద్ధులలోని భిన్నవాదములను ఒకచో చర్చించి, వానియందలి మూల సిద్ధాంతమును విశదపరచుటయేనని తోచును. ముఖ్యముగా సర్వాస్థివాదులు వారిదృష్టిలో నున్నట్లు దోచును. బౌద్ధేతర సాంప్రదాయములను గూర్చి తక్కువగా మాట్లాడును. వానిలో సాంఖ్య, వైశేషిక సాంప్రదాయములను మాత్రమే పరిశీలించుట కనపడును.

ప్రజ్ఞాపారమిత సూత్రములతోపాటు ఇతర మహాయాన సూత్ర గ్రంథములు కొన్ని ఆచార్యుని ప్రభావితం చేసినవనవచ్చును. అట్టివానిలో 'విమలకీర్తి నిర్దేశము' ఒకటి. పారమిత సూత్రములతో తుల్యమైనది. సద్ధర్మ పుండరీకము, అక్షయ పరిపుచ్ఛము, సురంగమ సమాధి మరికొన్ని మహాయాన గ్రంథములు ఆచార్యునిచే పలుమార్లు ప్రస్తావించబడినవి. మహాప్రజ్ఞాపారమిత సూత్రములపై లక్షశ్లోకాత్మక మగు మహావ్యాఖ్యాన గ్రంథమును రచించెను. ఈ సూత్రములను నిర్వచించిన నేర్పు అద్వితీయము. ఈయన సిద్ధాంతము యుక్తిపై నాధారపడునే గాని అద్వైతాదుల వలె శ్రుతిపైగాదు.

పరతత్త్వముయొక్క యదార్థ తత్త్వము శుద్ధనిర్గుణ తత్త్వమే. అవిచ్ఛిన్నము, జ్ఞానస్వరూపము, అద్వయ ధర్మము అనుపలబ్ధమునగు శూన్యత. బుద్ధీంద్రియాలకు గోచరం కాని పరమార్థం ఒకటి ఉన్నదని, అది అహేతుకము, అనిర్వచనీయము, పరమ శాంతియుతము, సర్వభౌతిక ధర్మాలకు, మూలకాలకు ఆధారము, అచ్యుతము, అనంతము, స్వభావ, స్వరూప రహితమని దీనిని ప్రవచించెను.

తన గ్రంథములయందు నాస్తికత్వమును నిరసించుటయే గాక, నాస్తికత్వమును నిర్వచించు, కర్మమునకు ఫలము కలుగదనువాడు నాస్తికుడు, ఫలము కలుగునను వాడు ఆస్తికుడనెను. వివిధ మతములకు సమన్వయమును గుదిర్చి ద్వేషమును పరిహరింపవలయునన్న మార్గము నుపదేశించెను. శుష్క వేదాంతముచే నుపయోగము లేదనియు, కేవల శరీర తాపము వలన ధర్మము

కలుగదు. ద్రోహవిరతియు పొడమదు. పరుల కనుగ్రహము వాటిల్లదు. దానశీల క్షమా స్పష్టమగు సద్ధర్మ పథము నంగీకరింపవలెనని బోధించెను.

ధర్మము నుపదేశించుతరి నిర్భీతిగా చక్రవర్తిని సైతము లెక్కచేయక ఆయన యందలి లోపములను ఎత్తిచూపి రాజు తన ప్రజలయెడ ఎట్లుండవలెనో, దోషుల యెడ ఎట్లు ప్రవర్తింపవలెనో, వారిని సన్మార్గ గాములగునట్లు ఎట్లు శిక్షింపవలెనో బోధించెను. అనాధులు, వికలాంగులు, వ్యాధిపీడితులు, అంధులు మొదలగువారియెడ ఆదరణమును, అర్థింపకున్నను కోవిదులు, సత్పురుషు లగువారు ఇతర రాజ్యముల వారైనను ఎట్లు సత్కరింపవలెనో సూచించెను. మతమును గూర్చి ప్రబోధించు సమయమున "మత విషయమున సత్యము గ్రహించుట కష్టము గాన ఉపేక్ష వహించుట మేలు. ఉపేక్ష పాపముగాదు. ద్వేషము పాపము. ద్వేషము వలన లాభముత్పన్నముగాదు. ఆత్మ కాములైనవారు ఉపేక్షచే తమ యాత్మను రక్షించు కొనవలయును" అని మతసహనమును, మతప్రసక్తిలేని పాలనమును నాడే ఊహించి చక్రవర్తికి ఉపదేశించెను.

ఆచార్యుడు వ్రాసిన గ్రంథములను పండితులు ఆరు తరగతులుగా వర్గీకరించారు.

1. సర్వాస్థివాదమును, ఇతర వైదిక వాదములను సూక్ష్మ పరిశీలన చేయు గ్రంథములు :

I) మాధ్యమక కారికలు

2) విగ్రహ వ్యావర్తిని

3) ఏకశ్లోక శాస్త్రము

4) ద్వాదశ ముఖశాస్త్రము

5) శూన్యతా సప్తతి

II) వివరణ గ్రంథములు :

6) ప్రతీత్య సముత్పాద హృదయశాస్త్రము

7) యుక్తిషష్ఠిక

8) బోధిసత్త్వ పాథేయ శాస్త్రము

III) 9) మహా ప్రజ్ఞాపారమిత టీకా శాస్త్రము

10) దశభూమి విభాషా శాస్త్రము

11) భవసంక్రాంతి శాస్త్రము

12) ఆర్యధర్మ ధాతు గర్భవివరణ

13) వైదల్య సూత్ర ప్రకరణము

IV) భక్తి స్తోత్రములు / స్తవములు

14) నిరౌపమ్యస్తవము

15) లోకాతీత స్తవము

16) అచింత్యస్తవము

17) స్తుత్యాతీతస్తవము

18) పరమార్థస్తవము

19) ధర్మధాతుస్తవము

V) లేఖలు :

20) సుహృల్లేఖ

21) రత్నావళి

VI) సూత్ర సముచ్చయము :

ఇవిగాక మరికొన్ని గ్రంథములు నాగార్జున కృతములుగా చీనా టిబెట్టు దేశములందు లభించుచున్నవి. కాని వాని ప్రామాణికతను నిర్ణయించుట సులభము గాదని పండితాభిప్రాయము.

1) వ్యవహారసిద్ధి

2) చతుస్తవము

3) ఉపాయ హృదయము

4) మహాయాన వింశకము

5) అబుద్ధ బోధకము

6) భవ సంక్రాంతి సూత్రవృత్తి

7) ప్రజ్ఞాదండము

8) ధర్మసంగ్రహము

9) ద్వాదశ భూమి విభాషాశాస్త్రము

10) నవరత్నాకము - వైద్యగ్రంథము

ఈయనకు తత్త్వశాస్త్రము నందేకాక, రసవిద్య, వైద్యశాస్త్రము, ఖగోళశాస్త్రము, రత్నశాస్త్రము మున్నగువానిలో గూడ విశేష నైపుణ్యమున్నట్లు తెలియును.

బహుముఖ ప్రజ్ఞాశాలియగు నీ యాచార్యుడు బౌద్ధమునకు అరిస్టోటలు వంటి వాడనియు, మాధ్యమిక వాదమునకు క్రీస్తు వంటి వాడనియు, మహాయానమునకు సెయింట్‌పాలు వంటి వాడనియు ఆధునిక తత్త్వవేత్తలు కొనియాడిరి.

ఆచార్యుని సుహృల్లేఖ పండితపామర రంజకమై దీర్ఘకాలము బహుళ ప్రచారము నందిన గ్రంథము. ఎనిమిదవ శతాబ్ది ప్రారంభమున మనదేశమును సందర్శించిన చీనా యాత్రికుడు ఇట్సింగు (700 క్రీ.శ.) నాడు పిన్నలు, పెద్దలు దీనిని కంఠస్థము చేయుచుండిరనియు, పెద్దలు దీనియందలి విషయ విచారణ చేయుచుండగా గమనించినట్టు పేర్కొన్నను దాదాపు అయిదువందల సంవత్సరములకు పైగా ప్రజల నైతిక ప్రవర్తనను కట్టుబాటుచేసి ధర్మప్రబోధము గావించినది.

అట్టి సుహృల్లేఖ - ఆర్య నాగార్జునుని ముఖమున వెలువడి సాతవాహన చక్రవర్తి నలరించిన బుద్ధవాణి మృదుమధురమగు తేటతెలుగున మనల నాకర్షించ గలదనుటలో నెట్టి సంశయము నుండబోదు. అందుకే ఈ ప్రయత్నము. డా॥ సుబ్బారావు గారు అమరావతి - ధరణికోట కళాశాలలో తెలుగు శాఖాధ్యక్షులు, గ్రంథాన్ని తేటతెలుగులో సుబోధకంగా వివరించిన సమర్థులు. కృషించి సఫలీకృతులైనారు. ఇది జిజ్ఞాసువుల నలరించగలదని నమ్మిక. ఇటువంటిదే రత్నావళిగూడ. త్వరలో ఆంధ్రులకందించ గలరని అకాంక్ష.

వారిని మనసారా అభినందిస్తూ

ప్రజోత్పత్తి ఆశ్వయుజ పూర్ణిమ

తెనాలి. 23-10-1991

# ఆసేచనము

శ్రీ యం. రాజగోపాలరావు
ఎం.ఎ., ఎం.ఫిల్.
ప్రాచార్యులు : ఆర్.వి.వి.యస్.కాలేజి
ధరణికోట

నాగార్జునుడు మనకందరికీ తెలుసు. మన వాడని, అంటే ఆంధ్రుడనీ, అందులోనూ గుంటూరు జిల్లావాడనీ, ఎంతో మమకారంతో మన జలాశయానికి నాగార్జున సాగరమనీ, మన విశ్వవిద్యాలయానికి నాగార్జున విశ్వవిద్యాలయమనీ నామకరణం చేసుకోవడమే కాక మన స్వంత సంస్థలకు, పిల్లలకు ఆ పేరు పెట్టుకొని ఆనంద పరవశులం కావటం మన కందరికీ అనుభవసిద్ధమే. అయితే మనకు తెలియకముందే ఆయన సుదూరాలలో ఉన్న చైనా, టిబెట్, కొరియా, జపాన్ వారికి తెలుసు. మన పొరుగునే ఉన్న నేపాల్, భూటాన్, సిక్కిం దేశాల వారికి తెలుసు. మహాయానాన్ని అనుభవించే దేశాల వారందరికీ తెలుసు. తెలియడమే కాదు, వారందరు నాగార్జునుని ఒక మహాత్మునిగా, బోధిసత్వునిగా, మరో బుద్ధునిగా ఆదరించటమేగాక ఆరాధిస్తారని, బౌద్ధ ధర్మానుసారులకు, బౌద్ధసాహిత్య విద్యార్థులకు, బౌద్ధ సంస్కృతీ అన్వేషకులకూ తెలుసు. ఎందరో మహాయాన శ్రద్ధాళువులు నాగార్జునుడు జన్మించిన భారతదేశాన్ని, నడయాడిన ధాన్యకటకాన్ని, విహరించిన శ్రీ పర్వతాన్ని (నాగార్జునకొండ) పవిత్ర ప్రదేశాలుగా, యాత్రాస్థలాలుగా పరిగణించుకొని ఒకసారి వాటిని దర్శించ కలిగితే జన్మ ధన్యమౌతుందని, నిర్వాణం అందుకోగలమని విశ్వసిస్తూ, ఆ అవకాశం కోసం ఎదురుచూస్తూ హృదయాంతరాళాలలో నాగార్జునుని మూర్తిని నిలుపుకొని "మహాయానశ్రద్ధోత్పాద"నను మననం చేస్తూ "చతుస్తవా"లను పారాయణం చేస్తూ బ్రతుకు కొనసాగించే పరమ భక్తవరులున్నారని బౌద్ధధర్మ పరిశీలకులకు తెలుసు. ఇంతమందికి, ఇంతగా తెలిసి, ఇందరి ఆరాధనను అందుకొంటున్న నాగార్జునుని గురించి మనకంతగా తెలియదని, ఆయన గురించి ఇతమిద్ధంగా తేల్చి చెప్పగలిగింది బహుస్వల్పమని, తెలుసుకుంటే, ఆయన మీద భక్తిని పెంచుకొని, ఆయన చుట్టూ మార్మికమైన కంచెను – కథలు, గాథలరూపంలో నిర్మించుకొని, ఉత్తేజితులయ్యేవారి మనస్సు వికలమయిపోతుంది. నైరాశ్యం వారిని ఆవేశిస్తున్నది. ఇంతకు నాగార్జునుడు ఎవరు? ఎక్కడివాడు? ఎప్పటివాడు? అనే అంశాలను

చారిత్రకంగా సమర్థించి వివరించగల్గిన సామాగ్రి మన దేశములో లభించనేలేదు. నాగార్జున కొండలో దొరికిన నాగార్జునమూర్తి నాగార్జున బోధిసత్త్వుని ఊహారూపమే. ఇక మన డ్రాయింగు రూములలోను, గ్రంథాలను అలంకరిస్తున్న ఆచార్య నాగార్జునుని తైలవర్ణ చిత్రం 14వ శతాబ్దపు టిబెటన్ కళాకారుని ఊహాచిత్రమే. క్రీ.శ. 404లోనో 405లోనో వచ్చిన కుమారజీవుని 'నాగార్జున జీవిత సంగ్రహం' (1) చైనా దేశంలో వారి భాషలో లభిస్తున్నది. దాని ఆధారంగా కొన్ని మార్పులు, చేర్పులతో తాంత్రిక దృక్పథంతో రూపొందించిన మూడు, నాలుగు జీవిత సంగ్రహాలు టిబెటన్ దేశంలో వారి భాషలో లభిస్తున్నాయి. మూల సంస్కృత రూపంలోగాని, పునరుద్ధారమందిన సంస్కృత రూపంలోగాని, అనువాద రూపంగా మరే భారతీయ భాషలోగాని, మన నాగార్జునుని జీవిత సంగ్రహం మనదేశంలో ఇంతవరకు లభించటం లేదంటే (నాకు తెలిసినంత వరకు), మన ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని ప్రశంసించి, మన చారిత్రక దృక్పథానికి జబ్బలుచరచి, మన ఆత్మాభిమానాలకు అభినందనలు తెలుపవలసిందే. మనకంటే ముందు పాశ్చాత్యులే వాటి ననువదించుకొని నాగార్జున జీవిత సంగ్రహాంశాలను సంపాదించుకొన్నారు. మాక్స్‌వాలెసర్ (2) వ్యాస ఆంగ్లానువాదం చిన్న పుస్తకంగా వచ్చి మనలను వెక్కిరించింది. చైనా, టిబెటన్ భాషలో వచ్చిన కొన్ని వ్యాసాలను వ్రాశారు. కాని నాగార్జున జీవిత సంగ్రహాన్ని సమగ్రంగా అందించలేదు. ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి గారిచేత "నాగార్జున" (3) అనే ఆంగ్ల గ్రంథాన్ని జీవిత సంగ్రహాల శ్రేణిలో భాగంగా నేషనల్ బుక్‌ట్రస్ట్‌వారు వ్రాయించారు. అదయినా ఇంతవరకు తెలుగు భాషలో అనువాదం కాలేదు.

మనకందికలో వచ్చిన సమాచారాన్నిబట్టి నాగార్జునుడనబడే ఒక భారతీయ మేధావి బహుగ్రంథకర్త తన ప్రతిభా వ్యుత్పన్నతతో బౌద్ధాన్ని, ముఖ్యంగా 'మహాయాన బౌద్ధాన్ని, వినూత్న పథంలో పయనింపజేసి భారతీయ ధర్మ పురోగమనాన్ని ఎంతగానో ప్రభావితం చేసాడని అర్థమవుతుంది. నాగార్జునుని అనుగమించిన వారందరు; బౌద్ధేతర తీర్థంకరులుగాని, థేరవాదులు (4)గాని, మహాయాన యోగాచార విజ్ఞాన వాదులుగానీ – వేదాంతాచార్యులుగాని - ఇతర ధర్మాల వారెవరయినాగాని – ఆయన ప్రభావంలో తలమునకలయిపోయి ఆయన విమర్శనలను విశ్లేషణలను అంగీకరిస్తూనో వ్యతిరేకిస్తూనో అప్రస్తావితంగా ఉపయోగించుకొంటూనో అన్యాపదేశంగా ఉద్దేశిస్తూనో తమ తమ దర్శనాలను

పరీక్షించుకొని, పదునుపెట్టుకొని పరీక్షించుకొన వలసి వచ్చింది. అటువంటి ప్రభావంతోనే నాగార్జునుని "మాధ్యమిక కారిక"ల మూసలో మాండూక్య కారికలు రూపొందించిన గౌడపాదాచార్యుడు వేదాంత దర్శనానికి నూతన రూపం సమకూర్చటం, అది గోవిందాచార్యుల ద్వారా శంకరాచార్యుల దర్శనంలో ప్రతిబింబించటం, దాని ఆధారంగ శంకరాచార్యులవారిని ప్రత్యర్థులు 'ప్రచ్ఛన్నబౌద్ధుడు'గా విమర్శించటం పండితులెరిగిందే. నాగార్జునుడు భారతీయ దర్శనాన్ని మహోన్నత పథంలో నడిపించటానికి అవసరమయిన మూల ధృక్పథాలను సమకూర్చి ప్రపంచం నలుమూలలా విస్తరించే అవకాశం కలిగించాడు.

ఆనాడు ఎందరో తీర్థంకరులు ఎన్నోరకాల సిద్ధాంతాలతో, వాదాలతో, సంస్థాగారాలలో (5) బౌద్ధులతో తలపడుతుండేవారు. ఆనాటికే బౌద్ధం శాఖోపశాఖలుగా చీలిపోయింది. థేరవాదులు సాంప్రదాయకంగా పద్దెనిమిది శాఖల నంగీకరిస్తున్నారు. ఆ పద్దెనిమిది శాఖలేమిటో నిర్ణయించటం ఈనాటికి సమస్యగానే ఉంది. (6) ఎందరో థేరులు, మహాథేరులు తయారయారు. బౌద్ధం బహుళంగా విస్తరించటంతో ఆరామాలు విహారాలు పెరిగిపోయాయి. ఎన్నో భిక్షు (7) సంఘాలేర్పడ్డాయి. అందరూ బుద్ధవచనాన్ని పేర్కొంటూనే, బౌద్ధ ధర్మాన్ని అనుసరిస్తూనే పరస్పర విరుద్ధ సిద్ధాంతాలతో బౌద్ధ ప్రత్యర్థుల నధిగమించిన విద్వేషాలతో ప్రచారాలు చేసుకుంటూ వాదవివాదాలతో తలమునకలవుతూ, అనంత విభజనలతో అందరినీ గందరగోళపరుస్తూ, పరినిర్వాణమార్గంలో పయనిస్తుండేవారు. ఆ పరిస్థితి నుంచి బౌద్ధాన్ని పరిరక్షించి ఏకోన్ముఖం చేసి సమన్వయాత్మకంగా బౌద్ధధర్మాన్ని తీర్చిదిద్ది బౌద్ధులను నిర్వాణ మార్గంలోకి పునరంకితం చేయవలసిన అవసరం ఏర్పడింది. ఆ కర్తవ్యాన్ని స్వీకరించిన నాగార్జునుడు అనంత కౌశలంతో నిర్వర్తించి ఖ్యాతి నందాడు.

బౌద్ధధర్మ మౌలికాంశాలన్నింటినీ స్వీకరిస్తూ – లక్షణత్రయము, ఆర్యసత్యాలు, అష్టాంగమార్గము, ప్రతీత్యసముత్పాదము, ప్రపంచ పదార్థాలన్నింటినీ పంచ స్కంధ సంతానంగా వివరించడం వగయిరా అభివృద్ధి చెందిన శాఖాభేదాల నన్వయిస్తూ మాధ్యమిక ప్రతిపత్తిని పునస్ వ్యాఖ్యానించి, నామ, లక్షణ, వికల్పాది, లౌకికవర్ణనల కందని శూన్యంగా పరమార్థాన్ని ప్రతిపాదిస్తూ, అనుపలంబ

యోగాన్ని అందరికి నిర్దేశిస్తూ, అన్ని వాదాలకు భేదాలకు భేదమయిన ఏకయానంగా మహాయానాన్ని రూపొందించటం నాగార్జునుని ప్రతిభకు నికేతనం. పాళీసాహిత్యాన్ని పరమ ప్రమాణంగా స్వీకరించి నిషేధాత్మకంగా శూన్యతను వివరించే పద్ధతికి భిన్నంగా, ప్రజ్ఞా పారమిత సూత్రాల ఆధారంగా విధ్యాత్మకంగా వివరించటం నాగార్జునుని ప్రత్యేకత. వ్యావహారిక ప్రపంచాన్ని అనుభవాలను నిరర్థకాలనక సంవృతి సత్యంగా అంగీకరిస్తూ, దానికి మూలంగా పరమార్థ సత్యాన్ని ప్రతిపాదిస్తూ, ఆ పరమార్థ సత్యగ్రహణమే అద్వయసిద్ధిగా చూపించాడు. అదే బుద్ధత్వ ప్రాప్తిగా వివరించాడు. ఈ దార్శనిక ఔన్నత్యమే అటు తర్వాత అభివృద్ధి చెందిన వేదాంత వ్యాఖ్యానాలలో గోచరిస్తుంది. నాగార్జునుని సంవృతిసత్యం వ్యావహారిక సత్యంగా, పరమార్థసత్యం పారమార్థిక సత్యంగా, అద్వయం అద్వైతంగా వేదాంతంలో వ్యక్తం కావటం యాదృచ్ఛికం కాదు.

నాగార్జునుని కృషిలో, రచనా వ్యాసంగంలో రెండు ధోరణులు ప్రస్ఫుటం అవుతాయి. ఒకటి తార్కికము రెండవది ప్రాజ్ఞకము. మాధ్యమిక కారిక, విగ్రహ వ్యావర్తిని వంటి గ్రంథాలు ఆయన నిశిత తార్కికతా వైలక్షణ్యాన్ని ప్రదర్శిస్తాయి. అయితే నాగార్జునుని లక్ష్యం తార్కిక విశ్లేషణ కాదు. ఆనాడు అంతటా అలముకొన్న తార్కిక వాతావరణాన్ని భేదించటమే ఆయన ధ్యేయం. అటు కొన్ని బౌద్ధశాఖలు, ఇటు నైయాయ్యాయికులు, వైశేషికులు, సాంఖ్యులు తర్కబద్ధంగా అన్నింటినీ వివరించటమే సక్రమావగాహనగా పరిగణించారు. ఆ తార్కిక ప్రక్రియా పరిమితులను తార్కికంగానే విశ్లేషించి చూపి తర్కాతీతమయిన పారమార్థిక సత్యానుభవాన్ని గమ్యంగా నిర్దేశించాడు. అయినా ఇటీవలివరకు బౌద్ధాన్ని తార్కిక విధాన ప్రతీకగా, శాస్త్రీయ విధానానుసార వ్యవస్థగా పరిగణించటం గమనిస్తాము. (9) మహాయాన సాహిత్యం మరింత వెలుగులోకి రావటంతో బౌద్ధాధ్యయానాల ధోరణి మారింది. పాళీ త్రిపిటకాలే బుద్ధ వచన కాణాచులనే భ్రమను ఇవి పటాపంచలు చేసాయి. బుద్ధవచనం బహుపురాతన కాలం నుంచీ సంస్కృతంలో కూడ నిక్షిప్తమయి ఉందని ఇవి నిరూపించాయి.

నాగజాతివారి ఆధీనంలో ఉన్న సంస్కృత ప్రజ్ఞాపారమిత (10) సూత్రాలను నాగార్జునుడు మహానాగుని ద్వారా సంపాదించాడు. వాటిని అధ్యయనం చేసి, పరిష్కరించి, వ్యవస్థీకరించి 'ప్రజ్ఞాపారమిత' శాస్త్రాన్ని రచించాడు. ఆ స్ఫూర్తితోనే

బౌద్ధధర్మాన్ని పునర్వ్యాఖ్యానించి శూన్యతను కొత్త వెలుగులో చూపించి పరమార్థాన్ని అద్వయంగా వివరించి మహాయాన బౌద్ధాన్ని పరిపుష్టంచేసి భారతీయ దర్శనానికి నూతనమైన ఒరవడి నేర్పరచాడు. అప్పటివరకు ఉత్తర భారతంలో ప్రచారమవుతున్న బౌద్ధధర్మానికి భిన్నంగా దక్షిణ భారతదేశంలో సంస్కృతభాషలోని ప్రజ్ఞాపారమిత సూత్రాలలో నిక్షిప్తమయి ఉన్న బౌద్ధధర్మాన్ని నాగార్జునుడందు కొన్నాడని ప్రొఫెసర్ వెంకటరమణన్ (11) భావించాడు. అదే శూన్యత్వాన్ని విధ్యాత్మక ప్రాతిపదికతో వివరించటానికి దోహదం చేసింది. అదే మహాయాన మాధ్యమిక వాదాన్ని శూన్యవాదంగా ప్రసిద్ధం చేసింది. ఆ ప్రేరణతోనే మహాయానంలో మరొకశాఖగా బయలుదేరిన యోగాచారశాఖ విజ్ఞాన వాదాన్ని ప్రతిపాదించి అత్యధిక ప్రచారమంది కొంతకాలం పాటయినా మాధ్యమిక వాదాన్ని మరుగు పరచగలిగింది.

ఇంతగా నాగార్జునునికి కీర్తిప్రతిష్టలు సమకూర్చిన తార్కిక గ్రంథాలలోగాని ప్రజ్ఞాపారమిత శాస్త్రంలోగాని నాగార్జునుని చారిత్రకతను నిరూపించటానికి దోహదం చేసే అంశాలేవి కనిపించవు. అందువల్లనే కొందరు నాగార్జునుని అస్తిత్వాన్నే శంకించే అవకాశం కలిగింది. (12) అయితే శ్రావకధర్మ ప్రతిపాదకంగా నాగార్జునుడు రచించిన లేఖలు 'సుహృల్లేఖ' 'రత్నావళి' నాగార్జునుని చారిత్రకంగా నిరూపించే ఆధారాలందిస్తున్నాయి. నాగార్జున జీవిత సంగ్రహాలలో వ్యక్తమయిన కొన్ని అంశాలను చారిత్రకంగా సమర్థిస్తున్నాయి. తనకు స్నేహితుడయిన ఆనాటి శాతవాహన పాలకునికి శ్రావక ధర్మానుసరణం ద్వారా శూన్యత్వాన్ని అందుకొమ్మని ప్రబోధిస్తూ నాగార్జునుడు వ్రాసిన లేఖే 'సుహృల్లేఖ'. ఆ పాలకుడు బాలశ్రీ కుమారుడు గౌతమీపుత్ర శాతకర్ణిగా పండితులు గుర్తించారు. ఆ విధంగా నాగార్జునుని జీవితకాలాన్ని క్రీ.శ. 75-150 ప్రాంతంగా నిర్ణయించారు. గౌతమీపుత్ర శాతకర్ణి నాగార్జునునికి శ్రీపర్వతంమీద ఆరామం కట్టించి ఇవ్వటాన్ని, అందులోనే నాగార్జునుడు చరమదశను గడపటాన్ని శాతకర్ణి కుమారుని సంతృప్తికోసం స్వచ్ఛంద మరణం పొందటాన్ని చారిత్రాకాంశాలుగా ఉటంకిస్తున్నారు. ఆ కాలంలోనే నాగార్జునుడు ధాన్యకటక మహాచైత్యాన్ని దర్శించి శిల్పాలంకృత ప్రాకారాన్ని నిర్మించాడనే అంశాన్ని ఆ చారిత్రక అవశేషాలద్వారా పురాతత్త్వశాస్త్ర వేత్తలు సమర్థిస్తున్నారు. రాహులభద్ర శిష్యునిగా ప్రారంభించి నలంద మహావిహార ఆచార్యుడుగా దాని అభివృద్ధి కెంతగానో కృషిచేసినా

నాగార్జునునికి, ఆంధ్రపాలకులతో ప్రదేశాలతో ఉన్న అవినాభావ సంబంధాలనుబట్టి ఆంధ్రుడే అయి ఉండాలని నొక్కి వక్కాణిస్తున్నారు. నాగార్జున జీవిత సంగ్రహాల ననుసరించి ఆయన 600 సంవత్సరాలు జీవించాడనటం చారిత్రకంగా సమర్ధనీయం కాకపోవటంతో నాగార్జునునితో ముడిపడి ఉన్న తాంత్రికతను, సిద్ధ, రసాయనికతను, ఆధారం చేసుకొని ఆచార్య నాగార్జునుడు, సిద్ధ నాగార్జునుడు, రస నాగార్జునులను వేరువేరు వ్యక్తులుగా వేరువేరు కాలాలలో ఉన్నట్లు గ్రహించి వారివారి చారిత్రకతను నిరూపిస్తున్నారు. ఏమయినా నాగార్జునుడు దేశకాల పరిమితులకు అతీతుడుగా తన దార్శనిక ఔన్నత్య ప్రభామండలిని ప్రపంచం దశ దిశలా విరజిమ్ముతూనే ఉంటారు. ఆయన అజరామరుడు.

నాగార్జునుని సుహృల్లేఖ భారతదేశంలో భారతీయ భాషలలో లభ్యం కావటం లేదు. అనువాదరూపంగా చైనా టిబెట్ భాషలలో లభిస్తున్నది. వాటిని వంద సంవత్సరాల క్రితమే ఆంగ్లభాషలోకి అనువదించటం జరిగింది. నూతనావగాహనతో ఆధునిక పరిభాషలో ఆంగ్లానువాదాలు మాత్రమే ఉన్నాయి. ఆయనను సంస్కృత భాషలోకి పునరుద్ధరించటం గాని ఇతర భారతీయ భాషలలో అనువదించటంగాని జరిగిన దాఖలాలులేవు. మాతృక సంస్కృతభాషలో ఆర్యావృత్తాలలో ఉన్నదనటానికి ఆదివృత్తమే ఆధారం. మాతృక లభ్యం కాకపోవటంవల్ల, ఆంగ్లానువాదాల ఆధారంగా అనువదించటంలో కొన్ని ఇబ్బందులుండటంవల్ల, ఇంతవరకెవరు తెలుగులోకి అనువదించే సాహసం చెయ్యలేకపోయారు. అటువంటి సాహసాన్ని నా సహాధ్యాపకుడు డాక్టరు వావిలాల సుబ్బారావు గారు చేశారు. అయితే వారి అనువాదమంతా సామాన్య పరిభాషలోకి సాగింది. అందువల్ల బౌద్ధధర్మ స్వభావం మరుగునపడింది. ఈ అనువాద ప్రేరణతోనయినా బౌద్ధపరిభాషాభినివేశమున్న వారెవరయినా ఆలోటు తీర్చే ప్రయత్నం చేయగలరని ఆశిస్తున్నాను. తొలి తెలుగు అనువాదాన్ని వీలయినంత సరళంగా వ్యావహారిక భాషలోకి అందించిన సుబ్బారావుగారిని అభినందిస్తున్నాను. అమరావతి వాస్తవ్యుడయిన ఈ అనువాదకుడు తనకున్న నాగార్జున అభిమానాన్ని ఈ విధంగా వ్యక్తం చేయటం అత్యంత హర్షణీయం.

1. కొందరు నాగార్జునుని జీవితచరిత్రే అన్నారుగాని అది సరికాదని నా అభిప్రాయం.

2. Max Walleser- "Life of Nagarjuna from Tibetan and Chinese Sources."

3. ఆ పుస్తకం వెలువడినపుడే దానిని తెలుగులోకి అనువదింప జేయమని వారిని కోరటం, అప్పటికే ఆ బాధ్యత నెవరికో అప్పగించామని వారు వ్రాయటం జరిగి రెండు దశాబ్దాలు దాటిపోయింది. అయినా ఇది ఇంకా తెలుగు వెలుగు చూడలేదు.

4. భవసాగరం నుండి బయటపడే తీర్థాలను (మార్గాలను) జయించి (పొంది) ఇతరులకు బోధించేవారు.

5. గ్రామాలలో ఉండే కమ్యూనిటిహాల్ వంటివి. వీటిలోనే ఆనాడు చర్చలు జరుగుతుండేవి.

6. నళినాక్షరత్‌గారి "Buiddhist Sects in India" అనే గ్రంథం ఈ విషయం మీద ఎంతో సమాచారాన్ని అందిస్తుంది.

7. శ్రావక, భిక్షు సంఘ విభజనను థేరవాద బౌద్ధమంగీకరిస్తుంది. గృహస్థులుండేవి శ్రావక సంఘాలు, అర్హత యానులుండేవి భిక్షుసంఘాలు.

8. బౌద్ధంలో ప్రజ్ఞకు అత్యున్నత స్థానం ఉంది. శీల, సమాధి, సంపత్తుల ద్వారా ప్రజ్ఞా స్థితి నందుకొనవలసి ఉంటుంది. ప్రజ్ఞాత్వంవల్లనే సర్వజ్ఞత్వ లక్షణాలు లభిస్తాయి. అపుడే పరమార్థం అనుభూతమయి బుద్ధత్వమందుతారు.

9. ఈ అవగాహనవల్లనే ఎందరో పాశ్చాత్యులు బౌద్ధాధ్యయనాలను చేపట్టారు. ఆధునిక కాలంలో వారి కృషిద్వారానే బౌద్ధవాఙ్మయం అందరికి అందుబాటులోకి వచ్చింది. Scherbatsky "Buddhist Logic" ప్రపంచ ప్రసిద్ధం. నాగార్జునుని "మాధ్యమిక కారిక"లోని తార్కికతకు ప్రాధాన్యం యిస్తూ దాన్నే బౌద్ధానికి కేంద్ర దర్శనంగా ప్రొఫెసర్ T.R.V. Murty "The Central philosphy of Buddhism" వ్రాశారు. ఇటీవల వరకు ఇదే నాగార్జున దృక్పథావగాహనకు ప్రమాణంగా నిలిచింది.

10. బుద్ధ వచనం వినటానికి వచ్చిన నాగయువకులు వంటికి పూసుకున్న సుగంధ పరిమళానికి అబ్బురపడిపోయి వారితోపాటు వెళ్ళి సముద్రంలో ఉన్న వారి లోకం నుంచి ప్రజ్ఞాపారమిత సూత్రాలను సంపాదించాడంటున్నాయి ఆయన జీవిత సంగ్రహాలు.

11. వీరు చైనా భాషలో నిష్ణాతులు. ప్రజ్ఞాపారమిత సూత్రాలను స్వయంగా అధ్యయనం చేసి ఆ దృక్పథంతో "Nagarjuna's Philosophy" అనే గ్రంథం వ్రాశారు.

12. నాగార్జున పేరున నాగ+అర్జున అని విభజించి – నాగజాతి వారితో ఏర్పడిన సంబంధంవల్ల "నాగ" వచ్చిందని అర్జునవృక్షం (జమ్మిచెట్టు) క్రింద జన్మించటంతో "అర్జున" శబ్దం వచ్చిందని ఆ పేరు పౌరాణికమేగాని చారిత్రకం కాదని కొందరు వివరించారు.

# పూర్వరంగం

నేను బౌద్ధుణ్ణి కాను. ఆ సిద్ధాంతాల మీద ప్రేమ కలిగేంత పాండిత్యం నాకు లేదు. కాని నా జీవితకాలం ఎక్కువ భాగం అమరావతితో పెనవేసుకు పోవటం వల్ల ఇక్కడి ప్రతి అణువు నా జీవితంలో భాగమేననిపిస్తుంది. ఈ ప్రాంతం అంటే నాకు పులకింత. ఇక్కడ ఇంతకాలం ఉండి, ఆ నీటిలో ఆ మట్టిలో ఆ గాలిలో నేను పరిణమించినందుకు నాకు గర్వం. ఇక్కడ శిల్పాలలోని ఆకృతులు నా మిత్రులు. ఈ స్థూప ప్రదేశం నా జన్మ జన్మాంతరాల క్రీడారంగం. అందువల్ల ఆచార్య నాగార్జునుడు నా ఆత్మబంధువై ఉండాలి. లేకపోతే నాకు, ఈ సుహృల్లేఖకు ఏమి సంబంధం? "సుహృల్లేఖ" అనేమాట, ఎట్లాగో గుర్తులేదు, అనేకసార్లు నా చెవిన పడింది. అందంగా మారుమ్రోగింది. అందులోని విషయం ఏమిటోకూడా తెలియదు. ఆ పేరు కోసమే ఆ పుస్తకం చదవాలనిపించింది. ఈ పుస్తక రచనకు కారణమైన సన్నివేశం ఉదాత్తంగా ఉంది. ఒక మహా చక్రవర్తికి, ఒక మహాతాత్త్వికుడు, మతబోధకుడుగా మిత్రునిగా చనువు తీసుకుంటూ మతబోధకుని అధికార స్వరంతో, రాజును చక్కదిద్దితే రాజ్యమంతా చక్కబడుతుందని భావించి కాబోలు, సుదీర్ఘమైన నీతిబోధ చేశాడు. వక్త, శ్రోతలు ఎంత ఉన్నతులో ప్రయోజనం కూడా అంత ఉన్నతం. ఈ నేపథ్యం మరికొంత ఆకర్షించింది.

పుస్తకం కోసం విచారణ చేశాను. అనువాదమే కానీ మూలం అలభ్యం అని తెలిసింది. నేను ఇపుడు తిరుగుతున్న నేలమీదనే ఈ పుస్తకం పుట్టింది. టిబెట్, చైనా మొదలైన దూరదేశాల్లో అనువాదం పొంది ఆదరింపబడుతున్నది. పుట్టిన గడ్డపై నేడు పేరైనా లేదు. పైగా నాగార్జునుడు ఆంధ్రుడని, గుంటూరు జిల్లాలోని "వేదలి" వాడని కూడ అంటున్నారు. మన నిర్లక్ష్యానికి నామోషీ వేసింది. ప్రాంతీయ సంకుచితాభిమానంగా దీనిని ఎవరైనా వ్యాఖ్యానించవచ్చు. మన నేలపై పండిన సంస్కృతికి వారసులం కాలేకపోవడం మన అలసత్వానికే చిహ్నం కానీ, హృదయ వైశాల్య చిహ్నం కాదనుకుంటాను. ఇట్లాగే అనేక ఆంధ్ర తత్త్వవేత్తలను మన మనస్సుల్లోకి చేర్చుకోలేదు. నాటి నాగార్జునుని నుండి, నేటి జిడ్డు కృష్ణమూర్తి, యు.జి.ల వరకు మనం పట్టించుకోవటం లేదు. ఇంకా దేశ దేశాల వేత్తలను అధ్యయనం చేసెదెప్పుడు!

డా॥ పురాణం రాధాకృష్ణప్రసాద్ గారు సుహృల్లేఖ పుస్తకం ఇచ్చారు. అది చదివిన తర్వాత అనువాదం చేద్దామని ఉబలాటం కల్గింది. పూజ్యమిత్రులు, నిత్యజిజ్ఞాసువు డా॥ పురాణం వారు; సహాధ్యాపకులు, ఆత్మీయులు శ్రీ పి.వి. శివరామమూర్తి గారు ప్రోత్సహించారు. అంతేకాదు చేసిన అనువాదాన్ని ఆంగ్లమూలంతో సరిచూసి చక్కదిద్దటంలో ఉభయులు చాలా రాత్రులు వెచ్చించారు. వారి శ్రద్ధకు సదా కృతజ్ఞుడను. బద్ధకపు మాధుర్యం నాకు తెలిసినంతగా ఇతరులకు తెలియదు. అందువల్ల రెండు సంవత్సరాల క్రితం పూర్తయిన అనువాదం నిద్రపోతున్నది. ఇంతలో శాతవాహన వైభవ ఉత్సావాలు అమరావతిలో జరపాలని ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వ్యవహారాల శాఖ నిర్ణయించినట్లు తెలిసింది. నావంతు నేను నిర్వర్తించవలసినది ఏమిటి అని, నాలో నేను వెతుక్కుంటున్న సమయంలో మళ్లీ సుహృల్లేఖ జ్ఞాపకం వచ్చింది. ఈ గ్రంథాన్ని ఆవిష్కరించడానికి ఇంతకన్నా శుభసమయం సర్వయోగ్యమయిన సన్నివేశం ఇంకెప్పుడు అబ్బుతుంది? ఆ సమయం కోసం త్వరపడి అచ్చుకు పూనుకున్నాను. (చివరకు ఆ ఉత్సవాలు జరగనేలేదు) శ్రీ లక్ష్మీగణపతి ప్రింటర్స్ నిర్వాహకులు నాకు కుడిభుజంగా నిలిచారు. వారికి కృతజ్ఞతలు. నాగార్జునుని రూపాన్ని రకరకాలుగా చిత్రించిన వారున్నారు. తన ఊహతో నాగార్జునుని చిత్రించి యిచ్చిన మిత్రులు, ప్రసిద్ధ చిత్రకారులు శ్రీ దాసరి నాగవర్ధనరావు గారికి కృతజ్ఞుడను. డా॥ పురాణం రాధాకృష్ణప్రసాద్ గారు చారిత్రక అంశాలను జనశ్రుతులను వ్రాసి, శ్రీ ఎం.రాజగోపాలరావు గారు నాగార్జునుడు భారతీయ తాత్త్విక పరిణామంలో నిర్వహించిన పాత్రను సమీక్షించి నా కృషికి రత్నాలపొడిని అద్ది అలంకరించారు. పాఠకులకు గ్రంథ విషయమే కాక అవసరమైన మరికొంత పరిజ్ఞానాన్ని కూడ అందించటానికి వారి ముందు మాటలు ప్రయోజనకారులై, ఈ అనువాద కృషిని మరికొంత అర్ధవంతం చేశాయి. ఈ పెద్దలిద్దరు నాకిచ్చిన చేయూతకు కృతజ్ఞతలు.

నా అనువాద పద్ధతిలో ఒకటి, రెండు లోపాలు కన్పించవచ్చు. నాకు ఆధారం సంస్కృతం మూలం కాదు. ద్రవిడ ప్రాణామాయం చేసివచ్చిన ఆంగ్ల అనువాదం నాకు ఆధారం. సంస్కృత మూలమయితే భారతీయ భాషలలో అనువాదం సులువుగా ఉంటుంది. చాలా వరకు మూలంలోని మాటలన్నీ

వాడుకోవచ్చు. ఇంగ్లీష్ నుండి కావటం చేత నాగార్జునుని హృదయానికి, పలుకుబడికి, శిల్పానికి ఎంత దూరం జరిగిపోయానో చెప్పలేను.

నాగార్జునుని మూలంలో మతాధిపతి అధికారం ధ్వనిస్తున్నదా! మిత్రభావం ఆవరించి ఉన్నదా! రచనా విన్యాసంలో ఏ వయ్యారం, ఏ చాతుర్యం గ్రంథమంతటా మెరుస్తున్నదో తెలియదు. అందువల్ల ఈ అనువాదం నాగార్జునుని భావాలకు ఎన్నో అంతరువుల దూరంలో వినిపించే ప్రతిధ్వని మాత్రమే. ఇది మొదటి లోపం.

ఇక రెండవది, శ్రీ రాజగోపాలరావుగారు నాతో అన్నమాట. ఈ అనువాదంలో మహాయాన, బౌద్ధ పరిమళం తగలటం లేదు అని. శ్రమణకులు, శ్రావకులు, విహారము, ప్రతీత్యము, భిక్కులు, చీవరము మొదలగు బౌద్ధ వ్యవహారపదములను వాడటంవల్ల బౌద్ధ వాతావరణ ధ్వని కల్పింపవచ్చు. నా అనువాదంలో బహుశ అది లోపించింది. అనువాదం విషయ ప్రధానంగానూ, సమకాలీన పాఠకునికి అశ్రమంగా అర్థం అయ్యేటట్లు ఉండటమే నా లక్ష్యం. బౌద్ధవాఙ్మయంలోని ప్రత్యేక పదాలను వాడి ఉంటే, వాటిని వివరిస్తూ ఉండాలి. ఆ పదం వచ్చినపుడల్లా ఆ వివరణను పాఠకుడు మనసులో మోసుకుపోతూ ఉండాలి. ఇది పాఠకునికి శ్రమ కల్గించవచ్చు. ఆ పదజాలాన్ని ఇవాళ మళ్ళీ వ్యవహారంలోకి తేవలసిన అవసరంలేదు. బౌద్ధం నేడు తెలుగువాళ్ళలో కొనసాగుతున్న సంప్రదాయం అయి ఉంటే ఆ పదజాలాన్ని వాడినా పాఠకునికి శ్రమ ఉండదు. భారతీయ గ్రంథాలను ఇంగ్లీష్‌లోకి అనువదించుకొని వాళ్ళు తాత్పర్యాన్ని గ్రహించ గల్గుతున్నట్లే, మనం గూడ తెలుగు ద్వారా విషయ ప్రధానంగా గ్రహించాలని నా ఉద్దేశ్యం. తదనుగుణంగానే, అనువాదం నిర్వహించాను. పూజనీయ "లోజాంగ్ జమ్పాల్" "నావాంగ్ సంతన్ బోఫిన్" "పీటర్ డెల్లాసాంతిన" గార్లు 'సుహృల్లేఖ'ను 'టిబెటన్' నుండి సవ్యాఖ్యానంగా ఆంగ్లంలోకి అనువదించారు. వారి వ్యాఖ్యానాలలో ఇతర బౌద్ధగ్రంథాల పాండిత్యం విశేషంగా ఉంది. వారి వ్యాఖ్యానం నాకు ప్రధానం ఆధారం. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం, శ్రీ ఎన్. రామేశన్ M.A. I.A.S. గారు రచించగా, శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి గారు అనువదించిన 'బౌద్ధ దర్శన గ్రంథము' కూడా నాకు ఉపకరించాయి. వీరందరికీ నా కృతజ్ఞతలు. సుహృల్లేఖ భాగాన్ని మాత్రమే

యధాతధంగా అనువదించాను. వ్యాఖ్యాన భాగాన్ని అంతా తీసుకొనలేదు. ఇందులో విషయం ఇతర గ్రంథాలు అన్నీ కలిపి సహకరించాయి.

ఆచార్య నాగార్జునుడు మనకు అపూర్వ సంస్కృతీ వారసత్వాన్ని ఇచ్చి వెళ్ళారు. ఈ కొద్దిపాటి అనువాదంతో ఋషిఋణాన్ని కొంత తీర్చుకొనడానికి ప్రయత్నించాను. ఇది పూర్తిగా తీరే ఋణం కాదని తెలుసు.

అట్లాగే మా మాష్టారు శ్రీ యస్వీ జోగారావు గారికి కూడా. వారు నాకు మాష్టారైనా, వారు నన్ను విద్యార్థిగా కంటే మిత్రునిగా మన్నిస్తారు. స్నేహశీలత వారి ఆత్మగుణం. గురు ఋణాన్ని ఇది తీర్చుకోవడం కాదు. ఆ ఋణానికి ఇది నోటు వ్రాసినట్లు. ఈ అనువాదాన్ని వారికి అంకితం చేస్తున్నాను.

**"మతమున నూతనత్వము సమంచిత రీతిని పాదుకొల్పు బా**
**ధ్యతకల పీఠ నిర్మితి కహర్నిశమందగ నిల్చి, శిల్పవి**
**జ్ఞత కలిమాత్ర దైవత గుణంబిదు వేళల నిన్నుకొన్న యు**
**బ్భ్రిత నవ విప్లవంబునకు జేతులు మోడ్చెద శిల్పిశేఖరా"!**

అని మా తండ్రిగారు చేసిన నాగార్జున స్తుతిని జ్ఞాపకం చేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

ఇట్లు
**వావిలాల సుబ్బారావు**

# సరళంగా రత్నావళి

మోక్షానందస్వామి
వినయపిటక అనువాదకులు

బుద్ధపురుషులు రాజును ధర్మమార్గంలో నియమించటం భరతవర్షానికి కొత్తకాదు. ప్రాచీనకాలం నుండీ ఉన్నదే. జాతక కథా సాహిత్యంలో ఇందుకు ఎన్నో ఉదాహరణలు మనకు కనిపిస్తాయి. రాజ్యవ్యవస్థ రాజు చుట్టూ అల్లుకొని ఉంటుంది. రాజు అధర్మమార్గం పడితే రాజోద్యోగులు, రాజ్య యంత్రాంగం అంతా అధర్మమార్గంలోనే నడుస్తుంది. అందువలన ప్రజలకు సుఖశాంతులు కరువౌతాయి. ప్రజల క్షేమాన్ని కోరిన బోధిసత్త్వులు, బుద్ధులు రాజు ఎప్పుడు ధర్మం నుండి తప్పినా అతన్ని హెచ్చరించి ధర్మమార్గంలో ప్రవేశపెట్టేవారు. ఆరాజు తనకు మిత్రుడైనప్పుడు ఆచార్యుడు అతనికి ధర్మ, జ్ఞానాలను ఉపదేశించటంలో ఆశ్చర్యం ఏముంది? అయితే ఆ ఉపదేశం కేవలం అతనికి మాత్రమే కాక అతనిని నిమిత్తంగా చేసుకొని మానవాళికంతటికీ చేయబడినదిగా భావించాలి. అలా శాతవాహనరాజైన గౌతమీపుత్రునికి ఆచార్య నాగార్జునుడు చేసిన ఉపదేశాలే సహృల్లేఖ, రత్నావళి రూపంలో మన ముందున్నాయి.

బౌద్ధానికి అహింస, కరుణలే మూలం. తోటి ప్రాణుల దుఃఖాన్ని చూసి, హృదయం కరుణాప్లావితం కావటమే సిద్ధార్థుని మహాభినిష్క్రమణానికి కారణం. శ్రావక, ప్రత్యేకబుద్ధ, బుద్ధ యానాలని థేరవాదంలో మూడు యానాలు ఉన్నాయి. ఆచార్యుని మార్గదర్శనంలో సాధనచేసి, ముక్తిని సాధించుకొంటాడు శ్రావకయాని. గురువు సహాయం లేకుండా తన ముక్తిని సాధించుకొంటాడు ప్రత్యేకబుద్ధయాని. అసంఖ్యాక ప్రాణికోట్ల విముక్తికి సహకరించాలనే సంకల్పంతో అనేక జన్మలుగా సాధనచేసి సంబోధిని పొందుతాడు బుద్ధయాని. ఈ మూడింటిలో మొదటి రెండు తన ముక్తిని సాధించుకోవటానికే ఉపకరిస్తాయి కాని, పరులను దుఃఖముక్తులను చేయటానికి ఉపకరించవు. బుద్ధయానం అలాకాక అసంఖ్యాక ప్రాణికోటి దుఃఖవిముక్తికి ఉపకరిస్తుంది. బుద్ధత్వ సంకల్పాన్ని స్వీకరించిన వ్యక్తిని బోధిసత్త్వుడంటారు. బోధిసత్త్వుడు బుద్ధుడుగా పరిణమించటానికి పదిరకాల పూర్ణత్వాలను సాధించాలి. ఆ పూర్ణత్వాలనే పారమితలు అన్నారు. అవి 1. దాన పారమిత, 2. శీల పారమిత, 3. నైష్కర్మ్య (వైరాగ్య) పారమిత, 4. ప్రజ్ఞా

పారమిత, 5. వీర్య (కార్యసాధనాకారకమైన దృఢశక్తి) పారమిత, 6. క్షాంతి (ఓర్పు) పారమిత, 7. సత్యపారమిత, 8. అధిష్ఠాన (దృఢసంకల్ప) పారమిత, 9. మైత్రీపారమిత, 10. ఉపేక్షపారమిత.

బోధివృక్షం క్రింద బుద్ధత్వ సంకల్పంతో కూర్చున్న సిద్ధార్థుని "ఓ సిద్ధార్థా! ఇచట నుండి లే! ఈ ఆసనం నీది కాదు. నాది" అన్నాడు మారుడు. "ఈ ఆసనం నీది ఎలా అవుతుంది? అనేక జన్మలుగా దశపారమితలను సాధిస్తూ వచ్చిన నాది" అన్నాడు సిద్ధార్థుడు. "అందుకు సాక్ష్యం ఎవరు" అన్నాడు మారుడు. "ఇదిగో ఈ భూమి" అని నేలను తట్టినాడు సిద్ధార్థుడు. అది భయంకరమైన పిడుగుల చప్పుడుగా వినిపించి మారుడు అచటినుండి పలాయనమయ్యాడు. కనుక మారుని ఓడించి బుద్ధత్వాన్ని సాధింప చేసేవి దశపారమితలే.

"థేరవాదంలో పైన చెప్పబడిన మూడు యానాలకు సముచితస్థానం ఉండేది. ఎవరి శక్తినిబట్టి వారు పై మూడింటిలో ఏదో ఒకదాన్ని ఎన్నుకొనేవారు. కాని మొదటి రెండు స్వార్థసాధనకే తప్ప పరహితానికి ఉపయోగపడేవి కావు అనీ, కనుక అవి హీనయానమని వాటిని నిరసించి, బుద్ధయానానికి ప్రాధాన్యతను కల్పించి, దానిని మహాయానమనే పేర ప్రస్తుతించటం ఆచార్య అశ్వఘోషునితో మొదలైంది" అంటాడు రాహుల్ సాంకృత్యాయన్. ఏది ఏమైనా పరహితసాధనే ధ్యేయంగా కలిగిన మహాయానం ప్రజలకు ప్రీతిపాత్రం కావటంలో ఆశ్చర్యం ఏముంది!

మహాయానంలో బోధిసత్త్వులకు చాలా ప్రాముఖ్యం ఉంది. 'ప్రపంచంలో దుఃఖించే ఒక్క ప్రాణి ఉన్నంతవరకు కూడా తాము బుద్ధత్వాన్ని పొందకూడద'ని బోధిసత్త్వులు కోరుకొంటారు. ఎందుకంటే భవాగ్రాన్ని అతిక్రమించిన బుద్ధునకు మహాపరినిర్వాణం తర్వాత ధర్మకాయం తప్ప ఇతర అస్తిత్వం ఉండదు. ధర్మకాయం అంటే అతడు బోధించిన ధర్మమే. అందువలన బోధిసత్త్వులు పరులకు తోడ్పడానికి ఏదో ఒక రూపంలో, ఏదో ఒక లోకంలో తమ అస్తిత్వాన్ని కాపాడుకొంటారు.

దీన్నే రత్నావళి పద్యాల్లో -

219. బోధిసత్త్వులీ లోకమున కాలమితి లేక యుందురు.
పరిమితి లేక శరీరధారులై ఎదురు చూతురు.
అపరిమిత బోధిగుణము కొరకు

అమిత పుణ్యక్రియలనాచరింతురు."

485. "ఎక్కడ ఏ జీవుడు ఎంతకాలము
ముక్తిని పొందడో అంతకాలము
జ్ఞానసిద్ధి కలిగినను వారికొరకు
ఇక్కడే ఉండిపోదును గాక!" అని చక్కగా వివరించాడు.

స్వార్థమే పరమావధియైన ప్రస్తుతకాలంలో "పీడితుల, దుఃఖితుల కన్నీళ్లు తుడవడానికి పరహితం కోసమే ప్రతి ఒక్కరూ ప్రయత్నించాల"ని చెప్పే మహాయానం యొక్క ఆవశ్యకత ఎంతో ఉంది.

నరకాన్ని వర్ణించి భయపెట్టి పాపాలను చేయకుండా నివారించటం, స్వర్గాన్ని వర్ణించి పుణ్యకర్మలవైపు ప్రేరేపించటం అన్ని మతాల్లోనూ ఉన్నదే. రత్నావళిలోని విశేషం రెండు అంశాల్లో ఉంది.

1. రాజును ధర్మమార్గంలో నడువుమని చెప్పటమే కాకుండా నేరస్థుల పట్ల, ఖైదీలపట్ల కూడా ఉదారంగా ఉండమని చెప్పటం. సంక్షేమ రాజ్యభావన. ఇందుకు 'అశోకుని శిలాలేఖనాలు నాగార్జునాచార్యునకు త్రోవ చూపించి ఉండవచ్చును' అనునది ఒక ఊహ. అది నిజమై ఉండవచ్చును. ఎందుకంటే అశోకుని కాలంలోనూ, శాతవాహనుల కాలంలోనూ ఇక్కడి ప్రజల భాష ప్రాకృతమే. అశోకుడు వేయించిన ఎర్రగుడి శిలాలేఖనం ప్రాకృతంలోనే ఉంది. భాషావిషయకంగా గానీ, ఇతరత్రాగానీ ఈ నాలుగైదు వందల సంవత్సరాల్లో అశోకుని శిలాలేఖనాలు మరుగున పడేంత పెద్ద మార్పులేవీ జరుగలేదు. కనుక అవి ప్రాచుర్యంలో ఉండే ఉంటాయి. ఇక సంక్షేమ రాజ్యభావనను దీఘనికాయంలోని కుటదంతసూత్రంలో బుద్ధుడు ముందే వర్ణించాడు. అవే అశోకునికీ, నాగార్జునుకీ ప్రేరణనిచ్చి ఉంటాయి.

2. లోకాన్ని గురించీ, నిర్వాణాన్ని గురించి నాగార్జునుడు బుద్ధుడు చెప్పినదానికి భిన్నంగా వర్ణించటం.

బుద్ధుడు ఎప్పుడూ 'నిర్వాణం అనిర్వచనీయమే' అన్నాడు. ఈ లోకవ్యవహారం భావాభావాలకు సంబంధించినది. లోకాతీతమైన నిర్వాణం మాటలకు అందేదిదికాదు.

శూన్యాన్ని అదే పద్ధతిలో నిర్వచించిన నాగార్జునుడు దానిని 'అనంతత్వ సర్వాధిపతి' అనీ, చేతన అనీ అనటం ఒక వైచిత్రి. (రత్నావళిలోని 94వ పద్యం)

ఇక బుద్ధుడు లోకాన్ని 'పరిణామశీలం' అన్నాడు కాని 'మిథ్య' అని ఎన్నడూ అనలేదు. దాన్నే ఆ తర్వాత 'క్షణికవాదం' అన్నారు. కాలాన్ని అనుసరించి రూపంలో కలిగే మార్పులను బుద్ధఘోషుడు తన విశుద్ధిమగ్గలో విస్తారంగా వర్ణించాడు.

కాని ఆచార్యుడు జగత్తు ఎండమావిలా, ఇంద్రజాలికుడు సృష్టించిన ఏనుగులా 'మిథ్య' అన్నాడు. జగత్తే మిథ్య అయినపుడు తానెక్కడ ఉంటాడు? కనుక తాను (ఆత్మ) కూడా మిథ్యయే. ఇక సత్యమైనది శూన్యమొక్కటే.

నిర్వేదానికి, నిర్వాణానికి ఉపకరించని 'జగత్తు సాంతమా? అనంతమా? వంటి ప్రశ్నల గురించి చర్చించటం సమయాన్ని వృథా చేసుకోవటమే' అని బుద్ధుని అభిప్రాయం. ప్రోష్ఠపాదసూత్రంలో ప్రోష్ఠపాదుడు ఈ ప్రశ్నను లేవనెత్తినపుడు బుద్ధుడు ఇదే సమాధానాన్ని చెప్పాడు.

కాని నాగార్జునుడు అవిద్య వలన జగత్తు గోచరిస్తుందనీ, అవిద్య నశించినపుడు జగత్తు చేతనలోనే కరిగిపోతుందని అన్నాడు. ఈ పద్యాలను చూడండి.

94. అనంతత్వ సర్వాధిపతిలోగాని
అదర్శనీయ చేతనలోగాని
పృథివ్యాపస్తేజో వాయువుల
ఆవరణలు కానరావు.

95. వస్తుతత్త్వము తెలియనేరకముందు
చేతనయందు కన్పడినదెల్లయు
వస్తుతత్త్వమెరిగిన పిదప.
అట్లె సమసిపోవును చేతనయందె

మసకచీకట్లో ఒకడు త్రాడును చూసి పామనుకొన్నాడు. దీపంలో వెలుగులో చూసినపుడు అచట ఉన్నది త్రాడే అని తెలిసింది. పాము కనిపించటం భ్రాంతిమాత్రమే అని అర్థమైంది. అలాగే వస్తుతత్త్వం తెలియకముందు చేతనలో కనిపించిన జగత్తు ఒక భ్రాంతి. ఉన్నది చేతన మాత్రమే.

నిర్వాణాన్ని అనంతత్వ సర్వాధిపతి అని పేర్కొనటం వలన నాగార్జునుడు బుద్ధుని ఉపనిషత్తుల బోధకు సమీపంగా తీసుకెళ్లాడనీ, జగన్మిథ్యాభావాన్ని ప్రవేశపెట్టటం వలన అద్వైతానికి పునాదిని సమకూర్చాడనీ అర్థమౌతుంది.

ఆత్మ గురించి బుద్ధుని అభిప్రాయం ఇది. 'అస్తిత్వంలో ఉన్నదంతా కూడిక వలన ఏర్పడినటువంటిదే. కూర్పు వలన ఏర్పడినది ఎప్పటికైనా విడిపోయేదే కాని శాశ్వతంగా ఉండేది కాదు. ఆత్మ భావం కూడా సంస్కారాల కూర్పువలన ఏర్పడినదే. కాని వేరు కాదు. అటువంటప్పుడు శాశ్వతమైన, మార్పులు లేని, ఆనందమయమైన ఆత్మ ఉండటానికి అవకాశంలేదు.'

జగత్తును పరిణామశీలం అన్నా, మిథ్య అన్నా; ఆత్మను కూర్పు వలన ఏర్పడినది అన్నా, మిథ్య అన్నా, ఈ రెండు వాదాలూ వైరాగ్యానికి ఉపకరించినంతవరకు వాటివలన కలిగే నష్టం ఏమీలేదు. అయితే ఆచార్యుడు బుద్ధుని మౌనాన్ని ఎంతవరకు తన భావాలతో పూరించాడన్న విషయమే ఇక్కడ చర్చించబడింది.

ఇంతవరకు తెలుగులోకి అనువదింపబడిన మహాయాన గ్రంథాలను వేళ్లమీద లెక్కించవచ్చును. జననాంతర సౌహృదంలాగా శ్రీ వావిలాల సుబ్బారావు గారికి ఆచార్యుడంటే భక్తి, శ్రద్ధలున్నాయి, దానికి తోడు ఒకప్పుడు ఆయన తిరుగాడిన ఈ ధాన్యకటక పరిసరాల్లోనే తానూ నివసిస్తున్నానే అనుభూతి ఒకటి. ఆ ప్రేరణతో వారు ఈ అనువాద కార్యానికి పూనుకొని, తెలుగువారికి ఈ మహాయాన జ్ఞానపుష్పాలను అందించారు.

శ్రీ సుబ్బారావు గారి అనువాదం తేలికపాటి పదాలతో సరళంగా సాగింది. అయితే శూన్యవాదాన్ని వివరించే సందర్భంలో ఈ తేలికపాటి మాటల వెనుక లోతైన తాత్త్విక అంశాలు కూడా ఉన్నాయి. థేరవాదాన్ని లోతుగా పరిశీలించినవారే రత్నావళిని సులువుగా గ్రహించగలుగుతారనేది నా అభిప్రాయం.

# ఆచార్యుని సంక్షేమ రాజ్యభావన

- ఆచార్య జాగర్లమూడి సీతారామమ్మ
మహాయాన బౌద్ధ అధ్యయన కేంద్రం,
ఆచార్యనాగార్జున యూనివర్శిటీ

బుద్ధుని జీవితకాలంలోనే బౌద్ధధర్మం ఆంధ్రదేశంలోనికి ప్రవేశించినట్లు అత్యంత ప్రాచీన బౌద్ధ గ్రంథమయిన సుత్తనిపాతంలోని పారాయణవర్గలో పేర్కొనబడినది. మహాకాత్యాయనుడు అస్సక చక్రవర్తికి దీక్ష ఇవ్వటం ద్వారా బౌద్ధాన్ని స్వీకరించినట్లు విమానవత్తు అట్టకథలో తెల్పారు. మొదటి నుండి ఆంధ్రులు బౌద్ధంమీద అత్యంత అభిమానాన్ని ఆసక్తిని పెంచుకొన్నారు. ప్రాచీన బౌద్ధ సాహిత్యంలో ఆంధ్రదేశ బౌద్ధుల, బౌద్ధభిక్షువుల ప్రస్తావన ఉన్నది. వీరిని అంధకులుగా పేర్కొన్నారు. మహావగ్గ వినయపిటకంలో అంధకవన, అంధకవింద అనే రెండు బౌద్ధ కట్టడాలను గురించి ప్రస్తావించారు. ఇవి బహుశ ఆంధ్ర బౌద్ధభిక్షువులు బౌద్ధ ప్రసిద్ధ ప్రాంతాలయిన శ్రావస్తి, రాజగృహాలకు యాత్రికులుగా వెళ్ళినప్పుడు బసచేయటానికి నిర్మించుకొని ఉండవచ్చు. ఇలాగే మన నాగార్జునకొండమీద కూడా సింహళ విహారమున్నది. మహావిహారవాసి విహార అనే పేరుతో నిర్మించబడిన ఈ విహారం, శ్రీలంకలోని మహావిహారం నుండి వచ్చిన బౌద్ధభిక్షువులు ఇక్కడ బసచేసేవారు. దీనినిబట్టి ఆంధ్రదేశంనుండి బౌద్ధభిక్షువులు నలుదిక్కులకు పర్యటించినట్లు అలాగే ఇతర ప్రాంతాల నుండి భిక్షువులు ఆంధ్రకు కూడా యాత్రీకులుగా ధాన్యకటక, శ్రీపర్వత చైత్యాలను దర్శించుటకు వచ్చుచున్నట్లు తెలియుచున్నది. ఇంతేకాకుండా అశోకుని కాలంలో నిర్వహించబడిన తృతీయ బౌద్ధసంగీతిలో అంధకులు లేదా ఆంధ్ర బౌద్ధభిక్షువులు ప్రధానమయిన పాత్ర పోషించినట్లు తెలుస్తుంది. ఈ సంగీతిలో జరిగిన చర్చల్లోనూ, వాద వివాదాల్లోను అంధకులు ప్రముఖపాత్ర వహించారు. దీనినిబట్టి అంధకులు ఎంతటి నిష్ణాతులో, బౌద్ధ ధర్మాన్ని ఔపోసన పట్టారో తెలుస్తుంది.

సింహళ గ్రంథం నికాయసంగ్రహంలో మహాసాంఘిక శాఖలయిన హేమవతిక, రాజగిరిక, సిద్ధార్థిక, పుబ్బశైల, అపరశైల, వైతుల్యక ఈ ఆరు ఆంధ్రదేశంలో అభివృద్ధి చెందినట్లు తెలుస్తుంది. ఇవి ప్రధానమయిన మహాసాంఘిక

శాఖలు, వీటిని గూర్చిన ప్రస్తావన మనకు అమరావతి, నాగార్జునకొండ శిలాశాసనాల్లో లభిస్తుంది. శారీపుత్రపరిపృచ్ఛ అనే బౌద్ధ గ్రంథంలో మహాదేవ భిక్షువుని, అతను ప్రతిపాదించిన అయిదు సూత్రాలను గురించి వివరింపబడింది. ఇతని సూత్రాలే బౌద్ధసంఘంలో చీలికకు దారితీసి, సంఘం రెండుగా చీలి 1) స్థవిరవాద, 2) మహాసాంఘిక అనే రెండు వర్గాలుగా చీలిపోయింది. ఇతని ఆధ్వర్యంలో ఉత్తరభారతదేశం నుండి దక్షిణానికి వచ్చి శ్రీధాన్యకటకంలో స్థిరనివాస మేర్పరచుకొన్న భిక్షువులే అంధశాఖలను నడిపారు. మహాదేవ భిక్కుని శిష్యులు, ప్రశిష్యులు చైత్యకశాఖను అనేకశాఖోపశాఖలుగా విడిపడి చిన్నచిన్న సిద్ధాంత విభేదాలతోనూ అలాగే వేర్వేరు ప్రాంతాలలోను ముఖ్యంగా కొండలమీదనే స్థిరపడ్డారు. ఈ చైత్యక శాఖకు వ్యవస్థాపకుడు మహాదేవుడే. ఈ చైత్యకశాఖ నుండే ఇతర అంధకశాఖలు పరిణామం చెందాయి.

మహాయాన బౌద్ధం ఆవిర్భావానికి చైత్యకశాఖ సిద్ధాంతాలు మార్గాన్ని సుగమం చేశాయి. క్రీస్తు శకారంభంలో ఆంధ్రదేశం మహాయాన బౌద్ధానికి కేంద్ర స్థానమయినది. ఆచార్య నాగార్జునుడు, ఆర్యదేవుడు, భావవివేకుడు, దిగ్నాగుడు, ధర్మకీర్తి ఇక్కడే పుట్టి విలసిల్లారు.

మహాయాన బౌద్ధ సాంప్రదాయం నుండి వచ్చిన ఆచార్య నాగార్జునుడు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తాత్వికులలో ఒకరు కావటమే కాదు అత్యంత ప్రభావశాలి అయిన చింతనాపరుడు. మహాయాన బౌద్ధ ఆవిర్భావానికి, విస్తరణకు ఆచార్య నాగార్జునుని రచనాలే పునాదివేసాయి. బౌద్ధమత చరిత్రలో నాటి సామాజిక, రాజకీయ ధార్మిక మరియు ఇతర సంస్థల నేపథ్యంలో నాగార్జునుని జీవితాన్ని రచనలను మొదటిగా విశ్లేషించిన వ్యక్తి 'జోసఫ్‌వాల్‌సర్'. అప్పటికున్న బౌద్ధ సిద్ధాంతాలకు మహాయాన బోధనలకు వారధిగా రత్నావళి, సుహృల్లేఖ నిలిచాయి. అలా చెయ్యటంద్వారా మహాయాన భాష్యానికి బౌద్ధారామ పరిధిలో నాగార్జునుడు సాధికారికతను కల్పించాడు. దీనితో బౌద్ధసాంప్రదాయంలో మహాయాన బౌద్ధానికి ప్రముఖ స్థానం ఏర్పడింది.

కాలక్రమంలో ఆంధ్రదేశంలో బుద్ధభక్తి ప్రబలింది. మహాయానం ప్రబలంగా వ్యాప్తి చెందింది. ధాన్యకటక, / అమరావతీ ప్రాంతాలలో ధ్యానబుద్ధ అమితాభుని కొలిచే సాంప్రదాయం బలంగా వేళ్ళూనుకొంది. దానితోపాటు ఆచార్య

నాగార్జునుడు కూడా అమితాభుని భక్తుడయ్యాడు. ముఖ్యంగా సుహృల్లేఖలో కూడా అమితాభుని విశ్వప్రభువుగాను, భగవంతునిగాను నాగార్జునుడు పేర్కొన్నాడు. ధాన్యకటక విహారాలలోనే అమితాభుని స్తుతిస్తూవచ్చిన అమితాయుర్ధార సూత్రం, సుఖావతీ వ్యూహసూత్రం రూపుదిద్దుకొని ఉండవచ్చని భావిస్తున్నారు. అలాంటి భక్తి భావనతో కూడిన బౌద్ధసాహిత్య రూపకల్పనకు తగు వాతావరణం ఇక్కడ ఉండటమే మహాయాన వైపుల్యసూత్రాలు రచించటానికి ప్రోద్బలమయినది. ముఖ్యంగా ఈ అంధకశాఖల విహారాలలో అంధకులే ఈ నవవైపుల్యసూత్రాలను సంకలనం చేసినట్లు కన్పడుచున్నది.

మహాయాన మూలగ్రంథాలయిన ప్రజ్ఞాపారమిత సూత్రాలను ఆధారం చేసుకొనే ఆచార్య నాగార్జునుడు మాధ్యమక వాదాన్ని అభివృద్ధి చేశాడు. ఉత్తర బౌద్ధదేశాలన్నింటిలోనూ నాగార్జునుని రెండవబుద్ధునిగా అభివర్ణించి కొలిచారు. మహాయాన సిద్ధాంతానికి మొట్టమొదటి అత్యంత ప్రతిభావంతమయిన రూపకర్త ఆచార్య నాగార్జునుడేనని జేన్ర్యూసుకుమోటో అభివర్ణించారు. మహాయానం ఒక తాత్వికశాఖేకాదు. ఇది ప్రపంచంలోనే ఆధ్యాత్మిక ఐక్యతను నెలకొల్పింది. విశ్వప్రేమ, విశ్వమైత్రి, ముదిత, ఉపేక్ష, విశ్వకరుణలతోపాటు, విశ్వమంతటికి నిర్వాణమార్గం వైపు పయనించి నిర్వాణమే గమ్యంగా ప్రబోధించింది. దీనిలో ప్రధాన అంశాలు- 1) బుద్ధుడు సర్వాంతర్యామి అయిన దేవాతిదేవుడు, 2) బుద్ధుని ఆరాధన, పూజావిధానం, 3) బోధిసత్వ సిద్ధాంతం, 4) త్రికాయ సిద్ధాంతం, 5) ధర్మశూన్యత సిద్ధాంతం, 6) దశ పారమిత, దశభూమికల అనుసరణ, 7) మహాయాన నిర్వాణం. పైన పేర్కొన్న ఈ మహాయాన అంశాలన్నీ మనకు శ్రీపర్వత ధాన్యకటక ప్రాంతాలలోని శిలా శాసనాల్లో ప్రతిబింబించాయి. ఈ అంశాలన్నీ ఉజ్వల రూపంలో ఆచార్య నాగార్జున విరచిత గ్రంథాలు సుహృల్లేఖ, రత్నావళీలలో ప్రతిధ్వనించాయి. మరొక ఆశ్చర్యకరమయిన అంశమేమంటే అశోకుని శిలాశాసనాల్లో వ్యాప్తి చేసిన ధర్మాన్ని, ప్రజాహిత కార్యక్రమాలను మరింత విస్తరింపజేసి తమ సమకాలీన పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని నాగార్జునుడు సంక్షేమ రాజ్య అవసరాన్ని నొక్కిచెప్తూ తన మిత్రుడయిన శాతవాహన రాజు యజ్ఞశ్రీ శాతకర్ణికి సుహృల్లేఖ ద్వారా తెలియజేశాడు. ఈలేఖ భారతదేశంలోనే కాక చైనా, జపాన్, టిబెట్, భూటాన్ దేశాల్లో అనేక శతాబ్దాలుగా సుహృల్లేఖలోని బోధనలను ధర్మమార్గానికి చెందిన మౌలిక బోధనలుగా పరిగణిస్తున్నారు.

సుహృల్లేఖలోని చాలా శ్లోకాలు పాలీధమ్మపథంలోని శ్లోకాలని పోలి ఉన్నాయి. చైనాయాత్రికుడయిన ఇత్సింగ్ సుహృల్లేఖయొక్క ప్రాశస్త్యాన్ని గొప్పగా కొనియాడారు. నాటి పరిస్థితులలో, యువకులు, విద్యార్థులు, సుహృల్లేఖను కంఠస్తం చేసేవారని పెద్దలు దానిని నిత్యపారాయణ గ్రంథంగా అధ్యయనం చేస్తూ, పఠిస్తున్నట్లు పేర్కొన్నాడు.

నాగార్జునుని సుహృల్లేఖ, రత్నావళి గ్రంథాలకు లౌకిక సాహిత్యంలోనూ ప్రముఖ స్థానం ఉంది. దీనిలోని అంశాలయిన నైతికత, రాజకీయ సంస్థలు లాంటి వాటిమీద ఈ గ్రంథాలలో వ్యక్తమయిన అభిప్రాయాలే అందుకు నిదర్శనం. ఆధునిక సంక్షేమ రాజ్యాన్ని తలపింపజేసే అనేక భావనలు రత్నావళిలో మనకు కన్పిస్తాయి. దిక్కులేనివారు, బీదబిక్కి, రోగగ్రస్తులు, అంగవైకల్యులు, నిరాదరణకు గురైనవారు ముఖ్యంగా ఖైదీలు, వీరిపట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను అతి సున్నితంగా ఎంతో కరుణ ప్రేరితంగా పేర్కొన్నారు. ఎన్నో సూక్ష్మమయిన అంశాలను కూడా వీరికి సౌకర్యాలను కల్పించే విషయంలో చర్చించారు. అత్యంత ఘోర నేరాలుచేసిన వారిపట్లకూడా దయతో వ్యవహరించాలని నాగార్జునుడు పేర్కొన్నాడు. శిక్షలు కూడా వీరిని సంస్కరించే దిశలోనే ఉండాలని ప్రతిపాదించాడు. సహనం, కరుణ, శీలం, సమాధి యొక్క ప్రాశస్త్యాలను నొక్కి చెప్పారు. విజ్ఞుల సలహాలపై ఆధారపడి పరిపాలన సాగాలని, మరణశిక్షను రద్దు చెయ్యాలని కూడా సూచించారు.

వర్తమాన సంక్షుభిత పరిస్థితుల నుండి పరిష్కారాన్ని వెతుక్కునే క్రమంలో సుహృల్లేఖ, రత్నావళిలోని సామాజిక, రాజకీయ తత్వవిచారానికి నేడెంతో ప్రాసంగికత ఉన్నది. తెలుగులో వెలువడుతున్న ఈ సుహృల్లేఖ, రత్నావళి అనువాదం బౌద్ధ ధర్మమార్గాన్ని తెలుసుకోవటానికి తెలుగు పాఠకులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

# ఒక్క రెండు మాటలు

సుహృల్లేఖ అనువాదాన్ని 1991లో అచ్చువేశాను, రత్నావళిగూడ అనువదించమని పూజ్యమిత్రులు డా॥ పురాణం రాధాకృష్ణప్రసాద్ గారు, సుహృల్లేఖకు వ్రాసిన పీఠికలో సూచించారు. నాశక్తిమీద నాకున్న అనుమానంతో తొందరపడలేదు. సుప్రసిద్ధ పండితులు శ్రీ జి.వి.కృష్ణారావు గారు అనువదించారని, కాని వ్రాతప్రతిగూడ నష్టమయిందని శ్రీ అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి గారు స్వయంగా తెలిసి చెప్పారు. ఎవరయినా అనువాదం చెయ్యకపోతారా అని ఆగాను. ఇంతవరకు జరగనేలేదు.

శ్రీ బోధచైతన్య గారితో పరిచయం అయింది. నా కోర్కెను తెలిపాను, ఒక ఇంగ్లీషు అనువాదాన్ని, లభ్యమయిన కొంత సంస్కృత మూలాన్ని సేకరించి పంపారు. వారికి కృతజ్ఞుడను. నాకు సంస్కృతంరాదు. ఇంగ్లీషు కొద్దిగానే వచ్చు. ఇంగ్లీషు అనువాదాలు గూడ సహజమయిన ఇంగ్లీషు రచనలలాగా ఉండవు. అంతర్జాలం నుండి మరొక ఇంగ్లీషు అనువాదాన్ని, సుహృల్లేఖ సంస్కృత మూలాన్ని మా అల్లుడు డా॥ కె.వి.హెచ్.శాస్త్రి సంపాదించి పెట్టారు. వాటిని పట్టుకొని ఈ మాత్రం నెరవేర్చాను. అయినా నా అనువాద నిర్దోషత మీద నాకు సందేహమే. శ్రీ మోక్షానందస్వామి గారికి నా అనువాదాన్ని ఇంగ్లీషు మూలాన్ని పంపితే, చాలా శ్రద్ధగా చూచి కొన్ని సూచనలు చేసారు. కొంతవరకు పాటించి అనువాదం పూర్తిచేసాను, అయినా బెరుకుగానే ఉంది.

ఎందుకంటే, తాత్విక విషయాలు వచ్చినపుడు నామిడిమిడి జ్ఞానంతో ధర్మాపచారం చేస్తానేమోనని మొద టి శంక. ఆచార్యుని రచనలు ప్రసంగాలవలె కాక తార్కికంగా ఉంటాయి. పొల్లు తేడావస్తే తర్కం వికటించవచ్చు. అట్లాంటివేమయినా తారసిల్లుతాయేమోనని రెండవది. బౌద్ధ ధర్మస్వభావాన్ని నా అనువాద భాషతో సరిగా పలికించగలనా అన్నది మూడవది. అనువాదం అచ్చు అయి పాఠకుల చేతికి చేరటం ఎట్లాగా అన్నది చివరిది. ఇవీ నా బెరుకుకు కారణాలు.

తప్పులుంటే భవిష్యత్తులో ఎవరయినా సవరించకపోతారా అన్న భరోసాతో మొదలుపెట్టాను. ఆచార్యుని మహాసంకల్పం, రాజధర్మ నిర్దేశంలో కరుణాపూర్వకమయిన పరిపాలనకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యం, ఎంతకాలమని

తెలుగువారికి తెలియకుండా ఉండాలి అన్న తొందర, నన్ను అనువాదానికి పురికొల్పాయి.

ఈనాడు మళ్లీ తెలుగునాట బౌద్ధం మోసులెత్తుతున్నది. కాని అది ఏకపక్షంగా ఉన్నట్లు అనిపిస్తున్నది. సర్వపక్షాలు రెక్కలు విప్పి విహరించటంలేదని తోస్తున్నది. కొన్ని బౌద్ధ దేశాలలో ఆచార్య నాగార్జునుని బుద్ధుని తర్వాతి స్థానంలో గౌరవిస్తుంటే మన ప్రాంతంలో అపార్థాలు వ్యాపిస్తున్నాయి. అది పొరపాటేమో..

తెలుగులో బౌద్ధం గురించి వ్రాయదలచినవారు, పరిశోధనలపై మాత్రమేకాక, తమదృష్టిని ప్రామాణిక గ్రంథాల అనువాదాలపై గూడ మళ్లించటం మంచిది. పూర్వాచార్యుల రచనలు తెలుగులో లభ్యమైనపుడు మాత్రమే తెలుగు పాఠకులలో మౌలిక చింతనకు బాటలు ఏర్పడతాయి. అన్ని వైవిధ్యాలు, చింతనా విస్తృతి తెలుగులో పరిచయం కావాలి. ఆ పని పాశ్చాత్య అనువాద పండితులు చేస్తున్నారు. కొందరు ఇంగ్లీషు అనువాదకులు ఏ ధర్మశాలకో, తైవాన్, బర్మా వంటి సంప్రదాయ బౌద్ధదేశాలకోవెళ్లి అక్కడి పండితులతో సుదీర్ఘంగా సంప్రదించి వారి ఆమోదం అయిన తర్వాతనే ప్రచురిస్తున్నారు. అట్లాంటి అనువాదాలు తెలుగులో గూడ లభ్యమయినపుడే అర్థవంతమయిన బౌద్ధ చింతన మనదేశంలో కొనసాగుతుంది.

బౌద్ధ పరిభాష, వాతావరణం నా అనువాదంలో వచ్చాయో లేదో పెద్దలు చెప్పాలి. మూలకర్త హృదయం సరళంగా తెలుగులో అర్థం కావాలన్నదే నా అనువాద శైలికి లక్ష్యం. సుహృల్లేఖను వచనంలోకి అనువదించాను. మొదట నాకు లభించిన అనువాద పాఠం వచనంలో ఉంది. ఇటీవల సంస్కృతశ్లోక పాఠం లభించింది. కాని నా అనువాదం మార్చక వచనంలోనే ఉంచాను. సంస్కృతాను గుణంగా కొన్ని పదాలు సవరించాను. వ్యాఖ్యాన భాగంలో సమంజసమనిపించని కొన్ని నా వాక్యాలను పరిహరించాను.

రత్నావళికి రెండు ఇంగ్లీషు అనువాదాలు లభించాయి. చాలావరకు ఒకటిగానే ఉన్నాయి, కొన్ని మార్పులు వివరణలు మినహా. విస్తార వ్యాఖ్యానం లేదుగాని విషయవిభజన లఘు వివరణలు ఉన్నాయి. వాటిని తెలుగులోకి తెచ్చాను. ఎక్కడయినా పారిభాషిక పదాలకు వివరణలు తప్ప నేనుగా చేర్చిన అంశాలు తక్కువ. సుమారు 270 శ్లోకాలకు సంస్కృత మూలం లభించింది. అది సమానార్థకాలను వెతకటానికి సహకరించింది. సంస్కృత మూలం శ్లోకరూపం

కావటంవల్ల, ఇంగ్లీషు అనువాదంగూడ లయాత్మకంగా పద్యంలాగా ఉండటంవల్ల నేనుగూడ అనువాదాన్ని పద్యభ్రాంతి కలిగేటట్లు వ్రాశాను.

నాకు పద్యాలు వ్రాయటం రాదు. కాని పద్యసాహిత్య పరిచయం కొంత ఉండటంవల్ల అనుకోకుండా ఛందోబద్ధ పాదాలు దొర్లాయి. అది దిద్దుకోవలసిన తప్పుగా అనిపించలేదు. అట్లాగే ఉంచాను. కొన్ని గణబద్ధంగా (తే.గీ., ఆ.వె.) కొన్ని అబద్ధంగా ఉంటాయి. కనుక వీటిని అబద్ధ గణపద్యాలు అన్నా పరవాలేదు. ఈ పద్యాలు - తెలుగు పద్య స్వరూపం తెలిసినవారిలో కోపాన్ని, అది తెలియనివారిలో ఆమోదాన్ని కలిగించవచ్చు.

సుహృల్లేఖ అనువాద కాలంలో - ఆచార్య నాగార్జునుడు తిరిగిన అమరావతి నేలమీద నేనుగూడ తిరుగుతున్నాను అన్న దొక్కటే ప్రేరణ నాకు. ఆప్రేమతోనే ఆచార్యుని విగ్రహం నామిత్రుడు డా॥ సుధాకర్ ఆర్థిక సహాయంతో వేయించాను. ఇపుడు నాకు పారమితా ప్రధానమయిన మహాయానం మీద గూడ ఆయనవల్ల ప్రీతి కలుగుతున్నది. పారమితలు ప్రజ్ఞా సముత్పాదానికి సహకరిస్తాయి గదా!

మరొక అనువాదం శిష్యలేఖ. ఈ పుస్తకం గూడ నాకు శ్రీ బోధచైతన్యగారివల్లనే లభించింది. నాగార్జున రచనగా దీన్ని అందరూ అంగీకరించకపోయినా శ్రమణ దీక్ష తీసుకొన్న వారిని ఉద్దేశించి ఉపదేశించిన సదాచార గౌరవం, పెద్దలపై పూజ్య వినయం, సభ్యగౌరవాలు, అనుదిన క్రమశిక్షణ ఇందులో ఉన్నాయి. అన్నీ తెలియదగినవే. కొన్ని అందరూ పాటింపదగినవి, గృహస్థులు తమ పిల్లలకు నేర్పదగినవి. అందుచేత ఈ లఘు గ్రంథాన్ని గూడ ఇందులో చేర్చి, నాగార్జునుని మూడులేఖల సంకలనంగా, ఈ గ్రంథాన్ని బౌద్ధాభిమానులు, సంస్కృతీ చరిత్ర జిజ్ఞాసువులు అయిన పాఠకుల ముందు ఉంచుతున్నాను.

ఈ పుస్తకాన్ని ధాన్యకటక బుద్ధవిహారట్రస్టు తరఫున ముద్రిస్తున్నాను. ఈ ట్రస్టు వ్యవస్థాపనకు శ్రీ చెన్నూరి ఆంజనేయరెడ్డి గారి సంకల్పమే ప్రథమ కారణం. అత్యంత కారణం గూడ ట్రస్టుకు గౌరవ అధ్యక్షులుగా ఉంటూ బౌద్ధ ధర్మ రచనలు గూడ ప్రచురించమని ప్రోత్సహించినందుకు వారికి కృతజ్ఞతలు.

ఈ గ్రంథముద్రణా వ్యయం తానే భరించాలన్న అవ్యాజ శ్రద్ధతో సహకరించిన శ్రీ అట్లూరి లవకుమార్ (విజయవాడ) గారికి మైత్రీభావనాపూర్వక కృతజ్ఞతలు, విసుగుదల ఎరుగక డి.టి.పి. చేసిన పాండురంగామూర్తి గారికి లక్ష్మీగణపతి ప్రింటర్స్ వారికి శుభాభినందనలు - వావిలాల సుబ్బారావు

# ఆచార్యుని లేఖల పరామర్శ

126 శ్లోకాల "సుహృల్లేఖ", 500 శ్లోకాలు, ఐదు పరిచ్ఛేదాలుగా ఉన్న "రత్నావళి" రెండూ లేఖలే. 'శిష్యలేఖ'గా చెప్పే శ్రమణేర కారికలు మరొకలేఖ. నాగార్జునాచార్యుని పేరుమీదుగా టిబెట్టులో ప్రసిద్ధిలో ఉన్నా, కర్తృత్వం సందేహాస్పదం. మొదటి రెండు లేఖలలో రాజును సంబోధించే శ్లోకాలున్నాయి.

సుహృల్లేఖ, రత్నావళి తాత్త్వికుల శాస్త్రచర్చ కోసం వ్రాసినవి అయి ఉండవు. శ్రావకులకు, ఉపాసకులకు తత్త్వ ప్రతిపాదనలను పరిచయంచేసి ఆచరణ మార్గాన్ని సూచించటానికి రచించినట్లు తోస్తుంది. సంబోధించింది రాజునే అయినా అందరకు వర్తించే ఉపదేశాలెన్నో ఉన్నాయి.

పుణ్యం చేస్తే స్వర్గ ఫలితాలు కలుగుతాయని ప్రోత్సహించటం – పాపంచేస్తే నరక ఫలితాలు కలుగుతాయని మందలించటంద్వారా ద్విముఖ శిక్షణకు (పాపవర్జనం, పుణ్యాచరణం) గృహస్థులను ప్రేరేపించ యత్నించారు. ఏవి సత్కార్యాలు, ఏవి అసత్కార్యాలు అన్నది 'సుహృల్లేఖ'లో సంగ్రహంగాను రత్నావళిలో విస్తారంగాను వర్ణించారు.

సాధారణ జీవితంలోనే ధర్మాన్నిపాటించే మార్గాన్ని బోధించటం సుహృల్లేఖలోను, తత్త్వబోధ మరికొంత అధికంగా రత్నావళిలోను చేసారు.

రత్నావళి రచనా ప్రణాళిక చూస్తే, సుహృల్లేఖకన్నా రత్నావళి మరికొంత ఉత్తమాధికారిని ఉద్దేశించిన రచన అనిపిస్తుంది. రత్నావళి 400వ శ్లోకంలో "ధర్మాన్ని అమలుచేస్తూ పరిపాలించలేకపోతే పరివ్రాజకదీక్ష తీసుకోవటం మంచిది" అని తీక్షణంగానే చెప్పారు. కనుక ఇది సుపరిపాలకుల స్థాయివారిని ప్రధానంగా ఉద్దేశించిన రచన.

'సుహృల్లేఖ'లో ధర్మపరిచయం చేసి, రత్నావళి దగ్గరకు వచ్చేసరికి, తత్త్వోపదేశము, రాజవృత్తము, ఆపైన బుద్ధత్వ సిద్ధికై చేయవలసిన సాధన దశానుక్రమంగా చెప్పటం చేత, బహుశ సుహృల్లేఖ మొదటి ఉత్తరం, రత్నావళి అనంతర లేఖ అయి ఉండవచ్చు. ఇవి పోస్టుచేసిన ఉత్తరాలా పోస్టు చెయ్యని ఉత్తరాలా అన్నది చర్చనీయంకాదు. ప్రత్యక్షంగా చేసిన బోధకే, తర్వాత కాలంలో

గ్రంథరూపం యిచ్చి ఉండవచ్చు. ఒక మహాతాత్త్వికుడు ఒక మహావిజేత అయిన రాజుకు బోధించే ఈ సన్నివేశమే ఘనమయిన, గంభీరమయిన దృశ్యాన్ని ఆవిష్కరిస్తుంది.

బౌద్ధం అనగానే అత్యంత హేతుబద్ధత, స్వానుభవ ప్రామాణికతలు ముఖ్యంగా గుర్తుకు వస్తాయి. తథాగతుడు అనుభవ దూరమయిన విషయాలను ప్రతిపాదించలేదు. ఒకవేళ ఎవరయినా వాటి గురించి ప్రశ్నించినా మౌనం వహించాడు. ఇద మిద్ధమని తేల్చి చెప్పలేదు. అట్లాంటి ధర్మాన్ని ఉపదేశించే ఆచార్యుడు స్వర్గ నరకలోకాలను వర్ణిస్తూ స్వయంగా చూచినంత స్పష్టంగా వివరించటం సమంజసమా అన్న శం క కలుగుతుంది. సుహృల్లేఖలో నరకాన్ని గురించి ఒళ్లు గగుర్పొడిచే లాగా వర్ణించారు. రత్నావళిలో ఎంతెంత పుణ్యంవల్ల ఎంతెంత ఫలితం కలుగుతుందో, కొలతలు గుణితాలతోసహా వివరించారు. మూడవ పరిచ్ఛేదంలో. పాఠకులను మళ్లీ పురాణాల మాయలోకి తీసుకొని పోతున్నట్లు అనిపిస్తుంది. దీనికంతా కారణం ఏమయి ఉంటుంది.

ఈ రెండు లేఖలు శాస్త్ర ప్రవచనం ప్రధాన లక్ష్యమయిన గ్రంథాలు కావని, మామూలు వాళ్లకు ధర్మాసక్తిని, సదాచరణ ప్రేరణను కలిగించే ప్రోత్సాహక గ్రంథాలని, ఇందులోని వర్ణనలు అందుకు బోధనోపాయాలు మాత్రమేనని, గుర్తుంచుకోవాలి. పిల్లలకు "బూచి" భయంపెట్టినట్లు "తాయిలం" ఆశపెట్టినట్లు, అనుకోవాలి. రత్నావళి మొదటి పరిచ్ఛేదంలోనే, అన్నీ శూన్యమేనని దాపరికం లేకుండానే చెప్పారు. 'శూన్యతను గ్రహించగలిగే వరకు సత్కర్మలకు సత్ఫలితాలు, దుష్కర్మలకు దుష్ఫలితాలు ఉంటాయి. అందుకు నిబద్ధమయిన శిక్షణ తప్పదు.' అని చెప్పటమే ఆచార్యుని తాత్పర్యం కావచ్చు.

### - : *రత్నావళిలోని ప్రధానోపదేశం* : -

నైతిక జీవనం లేకుండా సాధన ఫలించదు. శీలంవల్ల సమాధి, అందువల్ల ప్రజ్ఞ కలుగుతాయి. నిర్వాణానికి శీలము ప్రజ్ఞ రెండు అవసరాలే. వాటిలో ధర్మాచరణం వల్లనే ప్రజ్ఞ కలుగుతుంది. ప్రజ్ఞే లక్ష్యం. కాని శీలం పూర్వవర్తి. ప్రజ్ఞవల్ల మాత్రమే శూన్యత బోధపడుతుంది. పంచశీలాలను పాటించటమే శీలమంటే! "పాటించకపోతే ఏం!" అని ప్రశ్న వేసుకున్న వారికి నరకవర్ణన వినిపించారు. శీలవర్తనం ఇహలోక స్థిరతకు, పరలోక ఫలితానికి కూడ అవసరమే.

నాస్తిక ఆస్తికతలకు ప్రత్యేక నిర్వచనం యిచ్చారు. కార్యకారణ సంబంధాన్ని, కారణానికి ఫలితం ఉంటుందని, అంగీకరించకపోవటమే నాస్తికత. కారణానికి ఫలితం ఉంటుందని అంగీకరించటమే ఆస్తికత అన్నారు. ఏ విషయానికయినా రెండే ధృవాలు ఉంటాయనుకోవటం పొరపాటు. అస్తి, నాస్తి – ఉన్నది, లేదు మాత్రమే కాదు మరొక ప్రత్యామ్నాయం గూడ ఉండవచ్చు. అదేశూన్యత. శాశ్వత అస్తిత్వంగాని, శాశ్వత నాస్తిత్వంగాని పరిణామ ధర్మంగల సంసారానికి ఉండవు. కనుక పరిణామ రహితమయిన ఆత్మలేదు. ధర్మాన్ని ఆచరించటానికి, నిర్వాణానికి ఉన్న సంబంధాన్ని స్థాపించి శూన్యతను నిశ్చయం చేయటం మొదట పరిచ్ఛేద విషయం.

ధర్మానికి శ్రేయస్సుకు ఉండే పరస్పర సంబంధ నిరూపణం రెండవ పరిచ్ఛేద విషయం. పంచశీలాలను పాటించకపోవటమే అకుశలం. వాటిని పాటించటమే కుశలం. రాగద్వేష మోహాలనుండి పుట్టిన కర్మలు అకుశలాలు. అవిలేని కర్మలు కుశలాలు. పారమితలు నిర్వాణకారకాలు కాకపోయినా అహంకారాన్ని తొలగిస్తాయి. అహంకారం ఉన్నంతవరకు ప్రజ్ఞ కలుగదు. ధ్యానపారమిత బ్రహ్మవిహారాలు సాధకుల అంతరంగ జీవితాన్ని ఉన్నతపరచి శాంతినిస్తాయి. రెండవ పరిచ్ఛేదంలో పారమితలను పాటించమని నొక్కి చెపుతారు.

మూడవ పరిచ్ఛేదంలో పుణ్యము, ప్రజ్ఞల గురించి ఉపదేశించారు. పుణ్యసంపాదనకు స్థూపం, బుద్ధమూర్తి మొదలయిన చిహ్నాలను నిర్మించటం ఆరాధించటం, భిక్షువులను ఆదరించటం వంటి బాహ్యాచర్యలతో ప్రయత్నించమని చెప్పారు. విశ్వం అనంతం గనుక అనంతమయిన సత్కార్యాలతో పుణ్యరాశిని గూడ అనంతంగా పొందవచ్చు. దానివల్ల అపరిమిత బుద్ధత్వం సాధ్యమవుతుంది. ఎంతెంత పుణ్యానికి ఎంతెంత శుభలక్షణాలు కలుగుతాయో పరిమాణాలతో సహావివరించారు.

రాజు ఎట్లా ప్రవర్తించాలో, రాజ్యాన్ని ఎట్లా పాలించాలో రాజవృత్తోపదేశం అనే నాల్గవ పరిచ్ఛేదంలో వివరించారు. ఓర్పుతో ఔదార్యంతో, ప్రజలకు, అధికారులకు భయం పోగొట్టాలి. పరరాజులకు అసూయ కలిగేంతగా సత్కార్యాలు చేయాలి. ధర్మం తెలిసిన వారినే ఉద్యోగులుగా నియమించాలి. తప్పులు చేసిన కుమారుని సన్మార్గంలో పెట్టటంకోసం శిక్షించే తండ్రిలాగా, రాజు నేరస్థులపట్ల

ప్రేమతో శిక్షలు అమలు చేయాలి. గత పుణ్యంవల్ల రాజ్యం లభించింది. కనుక పాలనగూడ ధర్మంగానే చేయాలి. పరమార్థంలో సుఖాలు దుఃఖాలు అని రెండు లేవు. శూన్యతను తెలుసుకొనటమే ముక్తి. స్వార్థ నిరపేక్షత, కరుణాపూర్వక చర్యలు, పరార్థరసైకప్రీతి, మహాయాన లక్షణాలు. దానశీలాలు; పరులయడల; శ్రద్ధావీర్యాలు తనకోసం, ధ్యానప్రజ్ఞలు పరమార్థం కోసం పాటించాలి. అన్నది మహాయాన ప్రధానబోధ. మహాయానంలోని అనుత్పాదము, హీనయానంలోని (థేరవాదము) వ్యయము – రెండింటి తాత్పర్యము శూన్యతయే. ధర్మబద్ధంగా పరిపాలించలేని రాజు భిక్షువు కావటంమేలు అన్నారు.

బోధిసత్వ చర్యోపదేశం అనే చివరి పరిచ్ఛేదంలో అర్హత స్థితిని పొందటమే పరమ లక్ష్యమని నిర్దేశించారు. సాధారణ గృహస్థులకన్న రాజులకు సత్కార్యాలు చేసే అవకాశాలు మెండు. కనుక ధర్మదీక్షా బద్ధుడయిన రాజు త్వరగా అర్హతుడు కాగలడు. మహాయానం చెప్పేవన్నీ తథాగతుడు చెప్పినవే నన్నారు. దశభూమికలను తెలియజెప్పి, వర్జించవలసిన ఏభైఏడు దోషాలను పేర్కొన్నారు. మహాయాన సాధనలు పరిపక్వం అయితే "సుఖావతి" స్థితిని చేరగలుగుతారు. మన శరీరం మనకు ఎంత ఇష్టమో ఈ అభ్యాసాలుగూడ అంత ఇష్టం కావాలి. నీపై నీవు శ్రద్ధ చూపుకొన్నట్లు అభ్యాసంమీద శ్రద్ధ చూపించాలి. నీ జ్ఞానంమీద నీవు శ్రద్ధ చూపించుకున్నట్లు ఇతరుల జ్ఞానంపై శ్రద్ధ వహించాలి. జ్ఞానంమీద శ్రద్ధ చూపినట్లు జ్ఞానులపై శ్రద్ధ చూపాలి. ధర్మాలు రాజులకు మాత్రమేకాదు, ప్రజలందరు పాటింపతగ్గవే. ఈ ఉపదేశాన్ని సర్వజనోపయోగ లక్ష్యంతో చేసారు. 465 - 486 పద్యాలు నిత్యం మననం చేయదగ్గవి.

రాజ్యపాలన గురించి సుహృల్లేఖలోకన్నా రత్నావళిలో విశేషంగా వివరించారు. నాల్గవ పరిచ్ఛేదం (100 శ్లోకాలు) మొత్తం అందుకే వినియోగించారు.

### – : వర్ణనలు అవాస్తవాలు కదా! : –

ధర్మకర్మలను ఆచరించటంవల్ల కలిగే శారీరక లక్షణాలను, పుణ్యలోక ఆధిపత్యాలను, పాపాలవల్ల కలిగే నరక బాధలను కళ్లతో చూచినంత వివరంగా వర్ణించారు. ఈ వర్ణనలకు పూర్వ సంప్రదాయంలోని పురాణ కల్పనలు సహకరించి ఉండవచ్చు. ఆ నరకలోకాలు బాహ్యావాస్తవాలు కాదు. చేసేపాపాలు, అనైతిక జీవనం, దోషిత్వ భావం, మానసిక వ్యధ కలిగించినపుడు అంతరంగ క్షోభ కలిగితే,

ఆ మనోయాతనకు ఇవి రూపచిత్రణ ల్లాగా వివరించుకోవచ్చు. అవ్వి అలంకారికమయిన దృశ్యకల్పనగా నేను అర్థం చేసుకుంటాను, అది మానసిక నరకం. అదృశ్యాలు మానసిక నరకానికి రూపకల్పనలు. కవితా కల్పనలను వాస్తవ దృశ్యాలనుకోవటం భావనను శాస్త్రాన్ని కలగా పులగం చేయటం అవుతుందేమో!

అట్లాగే పుణ్య సంపాదనవల్ల కలిగే శరీర గతమయిన మార్పులు పూర్తిగా పనికిమాలిన వర్ణనగా తీసివేయరాదు. పుణ్యానికి కుశలాచరణలకు యిచ్చిన కొలతలు తూనికలు మన ఊహల స్పష్టతకోసమేగాని అవ్వి నిజమయిన గణాంకాలు కావు. ఫలితాలు పూర్తిగా అవాస్తవం కాకపోవచ్చు గూడ. అటువంటి శరీర ప్రభావాలు కనుపించిన విశ్వసనీయమైన ఉదాహరణలు కొందరి జీవితాలలో ఉన్నాయి.

చూ॥ ("Biology of Enlightenment" conversations with U.G.Krishna Murthy - Edited by Mukundarao - Harper Colliness Publishers)

## - : రాజధర్మంలో నవ్యమార్గం : -

రాజ్యపాలన, వ్యవస్థా నిర్వహణల్లో ఆచార్యుడు చేసిన ఉపదేశాలకు పూర్వశాస్త్రాల, పూర్వరాజుల సన్మార్గ దర్శనం ఎంతవరకు ప్రభావసహాయం చేసాయో పరిశీలించటం మంచి విద్యావ్యాసంగం కావచ్చు. బుద్ధుని ఉపదేశాలను ఆధారం చేసుకొని మహాయాన సూత్రాలను నిర్మించుకున్నట్లే, దానశీలక్షమాది; పారమితలను వ్యక్తిగత ఆచరణ స్థాయినుండి రాజ్యపాలనాధర్మంలో భాగం చేయటంవరకు విస్తరించటం ఆచార్యుడు చూపించిన నూతనమార్గం. రాజ్యహింసను నివారించిగూడ రాజ్యభద్రత కాపాడవచ్చునన్నది ఆచార్యుడు ప్రసరించిన కొత్తకోణం. శ్రావకులు ఉపాసకులు పాటించే ధార్మిక జీవన నియమాలకు, రాజ్యపాలకుడు పాటించే రాజ్యాంగ నియమాలకు సామరస్యం, ఏకవాక్యత ఉన్నపుడు మాత్రమే పాలకులకు పాలితులకు మధ్య ధర్మ సామరస్యం కలుగుతుంది. ఈ సామరస్య నిశ్చయమే ఆచార్యుని లేఖారచనల లక్ష్యం. ఈ సామరస్యం తన రాజ్యపరిధిలో ఆగిపోకుండా పరరాజులకు గూడ అసూయ కలిగించేంత ఉదారంగా ఉండాలని, పరరాజులను శిక్షించదలిస్తే ముందుగా వారి సద్గుణాలను అభ్యాసం చెయ్యమని చెప్పటం, విదేశాంగ నీతికి నూతన ఆదర్శాన్ని నిర్దేశించటమే.

ఆచార్యుడు ఈ ప్రణాళికను, ఆచరణ సూచనలను ప్రతిపాదించటానికి అతఃపూర్వ సంస్కృతిలో మూలాలు ఏమయినా ఉన్నాయా? రెండవ శతాబ్దిలోని నాగార్జుననకుముందు కనీసం వెయ్యిసంవత్సరాల సంస్కృతీవారసత్వం ఉంది. దానినుండి ఎంత స్వీకరించాడు - ఎంత వదులుకున్నాడు - స్వంత ఆలోచన ఎంత అన్నది పండితులు పరిశీలింపదగిన అంశం.

మనుధర్మశాస్త్రం - కౌటిల్యుని అర్ధశాస్త్రం కొన్ని గృహ్యసూత్రాలు మనకు లభ్యమవుతున్నాయి. వాటిలో పూర్వ శాస్త్రకర్తల పేర్లను కొన్నిపేర్కొన్నారు. వారి గ్రంథాల నుండి ఉదహరించిన కొన్ని వాక్యాలు మాత్రం లభ్యమవుతున్నాయి. నవ్యధర్మాన్ని ఆచరించటానికి ప్రయత్నించిన రాజులలో అశోకుడు శ్రేష్టతముడు. అతని శిలాశాసనాలే అతని డాక్యుమెంట్లు. కనిష్కునిపై గూడ వీటన్నింటి ప్రభావం ఎంత ఉందో అంచనా వేస్తే పరిపాలనా శాస్త్రంమీద కొంత కొత్తకాంతి ప్రసరిస్తుంది.

మనుధర్మశాస్త్రం సమాజనిర్వహణ మొత్తాన్ని గురించిన శిక్షాగ్రంథం. చుట్టరికాలు, వివాహ సంబంధాలు, ఆచారవిధులు, వర్ణధర్మ పరిమితులు, అన్నీ అందులో విధించారు. కౌటిల్యుని ప్రధానలక్ష్యం రాజు - మంత్రాంగం - పరరాజులు - యుద్ధ పద్ధతులు - శిక్షలు. వీటిలో ఎక్కడా ప్రేమకరుణలకు స్థానం లేదు. వ్యవస్థా నిర్వహణ, క్రమబద్ధీకరణ, శాంతి, భద్రతలతో దండనీతి ప్రధానమయిన నిర్దేశమే ఉంటుంది. మార్గశుద్ధిగురించి ప్రస్తావించరు. ఫలితమే ప్రధానం. మార్గమేదయినా వ్యవస్థాపటిష్టత ప్రధానధ్యేయం. మానవీయ సంబంధాలకు ద్వితీయస్థానమే.

ఆచార్యుని ఉపదేశం ఇందుకు పూర్తిగా భిన్నం ప్రేమపూర్వకమయిన పాలన, పరరాజులకు గూడ ఆదర్శవంతమయిన ధర్మోన్నతి, ప్రధానగమ్యాలు. ఇందుకు బుద్ధుని ఉపదేశాలలోని తత్వాన్నే పునాదులుగా స్వీకరించారు. రాజకీయంగా, ప్రాపంచికంగా, సత్వర ఫలసిద్ధినిచ్చే కఠిన నియమాల శాస్త్రదశ నుండి, ఉదారమయిన కరుణాప్లావిత హృదయంతో సమాజ పరివర్తనా పూర్వకమయిన పరిపాలనను ప్రతిపాదించటం ఆచార్యుని నూతన ప్రయత్నం.

రాజుకు ఆచార్యుడు సూచించిన అనేక విధులు అశోకుని శాసనాలలో కనిపిస్తాయి. రహదారుల్లో వైద్యశాలలు, చలివేంద్రాలు. విశ్రాంతి మందిరాలు, అక్కడ గోడలమీద వైద్యసూచనలు, అవసరమైన మందులు మూలికలు సిద్ధంగా

ఉంచటం. మొదలయిన అనేక అంశాలు (చూ॥ రాజవృత్తోపదేశ పరిచ్ఛేదం) అశోకుని ప్రయత్నాలను జ్ఞాపకం చేస్తాయి. అశోకుని చర్యలన్నీ కరుణా ప్రేరితాలు. బుద్ధుని బోధలనుండి మైత్రీ కరుణలు, దానాది పారమితలు తనను వశం చేసుకోగా, తానే తన ప్రణాళికను సిద్ధం చేసుకొన్నాడేమో! అవి అశోకునికి పూర్వగ్రంథాలలో సిద్ధంగా ఉన్న కార్యక్రమాలు కావు. అశోకునిపాలనా కార్యక్రమం ఆచార్యునికి మార్గదర్శనం చేసి ఉండవచ్చు. మిత్రుడైన శాతవాహన చక్రవర్తిని గూడ అశోకుని ప్రతిరూపంగా చక్కదిద్దాలన్న ప్రయత్నంగూడ ఉండి ఉండవచ్చు.

శాతవాహన రాజులు బౌద్ధాన్ని ఆదరించిన హిందూ మతాభిమానులు అని చరిత్ర పండితుల చెపుతున్నారు. పూర్వ రాజనీతి శాస్త్రాలకు ప్రత్యామ్నాయ సూచనలు చేయటానికి ఆచార్యుడు సంకల్పించి ఉండవచ్చు. అలగ్జాండరుకు అరిస్టాటిల్‌వలె, చంద్రగుప్తునికి చాణక్యునివలె, నాగార్జునుడు యజ్ఞశ్రీ శాతకర్ణిని నడిపించిన గురువు కాడు. గౌరవపాత్రుడయిన మిత్రుడు మాత్రమే అయి ఉండవచ్చు. కనుక "అర్థశాస్త్రం"వలె నూతనశాస్త్రరచన చేయటానికి స్వేచ్ఛా పరిమితులుంటాయి. ఈ రెండు గ్రంథాలు రాజును స్నేహితునిగా సంభావిస్తూ సంబోధించిన రచనలు మాత్రమే అయినా, సర్వపాఠకులకు ఉచితమయిన అంశాలు అవిరళంగా ఉన్నాయి. నాగార్జునాచార్యుడు భిక్షువులకు మాత్రమే ధర్మ ప్రబోధం చేసుకుంటూ పండితులతో శాస్త్రచర్చలుచేసుకొని, తార్కిక గ్రంథాలు వ్రాసుకుంటూ కూర్చోలేదు. రాజ్యపాలకుల పరివర్తనను, పాలకపాలిత సంబంధాలను నూతన మార్గానికి మళ్లించటానికి ప్రయత్నించాడని ఈ రెండు గ్రంథాలవల్ల స్పష్టమవుతుంది. నాగార్జునునిలోని సామాజిక తత్వవేత్తను ఈ రెండు లేఖలు విశదం చేస్తాయి. ఆచార్యుని వ్యక్తిత్వ అధ్యయనానికి ఈలేఖలు ఉపకరిస్తాయి.

– పటిష్టమయిన పాలన రాజుకు లక్ష్యమని పూర్వశాస్త్రాల నిర్దేశం.

– ఆచార్యుని దృష్టిలో మైత్రీకరుణలతో రాజ్యపాలన చేయటం ద్వారా అర్హత స్థితిని పొందటం. రాజు లక్ష్యంమని ఆచార్యుని సందేశం.

– పూర్వ శాస్త్రాలకు రాజ్య సుస్థిరత ముఖ్యం.

– ఆచార్యునికి ధర్మ సుస్థిరత ముఖ్యం.


– సుస్థిరంగా పరిపాలించలేకపోతే దమననీతి పాటించమని పూర్వశాస్త్రాలు చెప్పిన ప్రత్యామ్నాయం.

– ధర్మబద్ధంగా పరిపాలించలేకపోతే భిక్షుదీక్ష తీసుకొని పరిపాలనను వదులుకొమ్మని ఆచార్యుని ప్రత్యామ్నాయం.

ఆచార్యుని లేఖలమీద, పూర్వశాస్త్రాల ప్రభావంమీద పండితులు అర్థవంతమయిన అధ్యయనం చేయగలరని ఎదురుచూద్దాం.


– వావిలాల సుబ్బారావు





అమరావతి పురాతత్త్వ ప్రదర్శనశాల ముందున్న

**ఆచార్య నాగార్జుని విగ్రహం**



## గౌతమీపుత్ర యజ్ఞశ్రీ శాతకర్ణి (క్రీ.శ. 174 - 203)

(అమరావతిలో ధ్యానబుద్ధ క్షేత్రంవద్ద )

అత్యంత విశాల సామ్రాజ్యమును పరిపాలించిన శాతవాహన చక్రవర్తులలో చివరివాడు. ధాన్యకటకమును రాజధానిగా చేసుకొని పశ్చిమమున కొంకణము నుండి గుజరాత్ వరకు. ఉత్తరమున సాంచీ, తూర్పున కళింగము వరకు ఆంధ్రరాజ్యమును విస్తరించెను. ఆచార్య నాగార్జునుని ఆదరించెను. శ్రీ పర్వతమున ఆచార్యునికై బౌద్ధారామమును నిర్మించెను. ఆచార్యుని నుండి "సుహృల్లేఖ" "రత్నావళి" అను రెండు ధర్మలేఖా గ్రంథములను స్వీకరించెను.

# సుహృల్లేఖ

కర్త

బౌద్ధాచార్యుడు

## నాగార్జునుడు

స్వీకర్త

శాతవాహనప్రభువు

## గౌతమీపుత్రుడు

ప్రథమ ముద్రణ : 1991

అనువక్త

## వావిలాల సుబ్బారావు

అమరావతి

రసలోకం ఆయన నివాసం

మిత్రత్వం ఆయన అంతస్సు

సాహిత్యం ఆయన తపస్సు

వీటిని గుర్తించని ఏ న్యాయము ఆయనకు విరోధం

ఎవరు వారు!

మా మాష్టారు

**ఆచార్య యస్వీ జోగారావు గారు**

ఇంతకు మించిన ఏ బిరుదము,

నిండు నమస్కారం కాక ఏ బహూకృతి,

ఆయన హృదయాన్ని

కౌగిలించదు

ఇది

వారికే అంకితం

(సుహృల్లేఖ ప్రథమ ముద్రణ – అంకితపత్రం)

గౌతమీపుత్రునికి

# ఆచార్య నాగార్జునుని సుహృల్లేఖ

**ఓ సత్యవ్రతా! గుణశ్రేష్ఠా!! నేను నీ కోసం రచించిన**
**ఈ ఆర్యావృత్తాలను వినటం శుభం. అందువల్ల**
**'సుగతుని' బోధలనుండి జనించే ఔన్నత్యాన్ని పొందగలవు. 1**

గౌతమీపుత్ర శాతకర్ణిని ఉద్దేశించి వ్రాస్తున్న ఈ లేఖను ప్రారంభిస్తున్నాడు ఆచార్య నాగార్జునుడు. ఇది అందరకు ఉపయోగించే ప్రబోధం. 'సుగతుడు' బోధించిన పవిత్ర ధర్మానికి ఆచరణ మార్గం ఉపదేశిస్తున్నాడు ఆచార్యుడు. సంసార బంధాల నుండి విముక్తిని సాధించటానికి సుగతుని బోధలే శరణ్యమయిన మార్గం. ఇతర మార్గాలు తపస్సును, ఆత్మధ్యానాన్ని మాత్రమే బోధిస్తాయి. జ్ఞానాన్ని, ప్రజ్ఞను పొందటానికి అవి అసమగ్రాలు, సుగతుని మార్గంలోనే వీటిని సంపూర్ణంగా సాధించవచ్చు.

ఆచార్య నాగార్జునుడు ఈ లేఖను ఆర్యావృత్తాలలో వ్రాశాడు. వీటిని అధ్యయనం చేయటానికి, ఆచరణలో ప్రయత్నించటానికి గౌతమీ పుత్రునికున్నట్లు – సత్యవ్రతత్వం, గుణశ్రేష్ఠతలు అవసరమయిన లక్షణాలని సూచిస్తున్నారు.

సుగతుడు అనేది బుద్ధునికి పర్యాయపదం. "పునరావృత్తి లేక లెస్సగా మోక్షమును పొందినవాడు" అని వ్యుత్పత్తి.

**చూడు! సుగతుని రూపాన్ని – దారువుతో నిర్మించినా**
**విద్వాంసులకు పూజ్యమే కదా!**
**అట్లాగే నారచన మనోజ్ఞంగా లేకపోయినా నిరాదరించ తగదు,**
**సద్ధర్మవివేచన మీదనే ఈరచన ఆధారపడ్డది. 2**

ఆచార్యుని పండిత వినయం ఇందులో వ్యక్తమవుతున్నది. ఆచరించ దలచుకొన్న వారికి బోధనలోని లక్ష్యమే ప్రధానం కాని – బోధించే రీతిలోని

సౌందర్యం ప్రధానం కాదు. రచనా సౌందర్యం కోసం వెదకేవాడు ఆచరణ కోసం ఉద్యమించడు.

**అతిమధురమైన శాక్యముని వచనాలను నీవు ఎన్ని అయినా**
**విని ఉండవచ్చు. బోధపరచుకొనిగూడ ఉండవచ్చు.**
**సుధానిర్మితం అయినా, సౌధకాంతి చంద్రజ్యోత్స్నలో**
**ద్విగుణితం ఔతుంది గదా! 3**

ఈ గ్రంథం పండితులకు గూడ పఠింపదగినదే. చదివిన విషయాలేగదా అని నిర్లక్ష్యం చేయనక్కరలేదు. వారి పాండిత్యం సౌధం వంటిది. పండు వెన్నెలలో ఇంకా మెరిసే సౌధంలాగ ఈ లేఖవల్ల ఆ పాండిత్యం ఇనుమడిస్తుంది.

సౌధం అంటే సున్నంతో కట్టిన భవనం. (సుధా నిర్మితం సౌధం – సుధ అంటే సున్నం) సున్నంవల్ల తెల్లగానే ఉన్నప్పటికీ అని విశేషస్ఫూర్తి.

**బుద్ధుడు – ధర్మం – సంఘం – త్యాగం – శీలం – దివ్యత్వం**
**అనే షడంగాలను ఎప్పుడూ మనసులో నిలుపుకో.**
**వీనిలో ప్రతిదాని గుణరాశిని 'జినుడు' విశదం చేసాడు గదా!**
**అవి మళ్లీ స్మరించుకొనదగినవి. 4**

లక్షణాల ననుసరించి బుద్ధునికి అనేక పేర్లున్నాయి. 'జినుడు' అంటే జయించినవాడు అని అర్థం. సన్మార్గంలో ప్రయాణించదలచిన వారిని 'బుద్ధుడు' సరిదిద్దుతాడు. బుద్ధిని స్వాధీనం చేస్తాడు. ధర్మం రెండు రకాలు. పఠన శ్రవణాదులవల్ల తెలియబడేది (పరియత్తి) ఒకటి. (పటివేధ) తనకై తాను సాక్షాత్కరింప చేసుకొనేది మరొకటి. ధర్మం సహజ నిర్మలమైన కాంతి వంటిది. స్వీయానుభవ సంవేద్యమయిన యీ ధర్మమే సాధకులు దర్శించే జ్ఞానం. ఇది వైయ్యక్తికం గనుక అనిర్వచనీయం. పరివ్రాజక సంఘం నైతిక నియమాలను నిలుపుతుంది; స్థిర లక్ష్యం మీద దృష్టినిలిపి సుశిక్షితమయిన మనసు కలిగి ఉంటుంది, సత్యాన్ని దర్శించగల జ్ఞానం పొంది ఉంటుంది. వారి గుణాలు, లక్ష్యాలు, భావాలు, తత్త్వం, అన్నీ ఏకరూపంగా ఉంటాయి. ఈ నాలుగు లక్షణాలు సంఘానికి సహజం కనుక పరివ్రాజక సంఘాన్ని సేవించాలి.

లోభం లేకుండా ఇవ్వాలి. ఆనందాన్ని పొందుతూ చేసే త్యాగాన్ని సేవించాలి.

అకలుషితము – నిరంతరాయం – నిర్దోషం అయిన శీలాన్ని పాటించాలి. తద్వారా మాత్రమే సమాధి అనుభవంలోకి వస్తుంది. పిదప ప్రజ్ఞ కలుగుతుంది.

**మనోవాక్కాయాలతో దశవిధ కుశలకర్మల మార్గాన్ని**
**సర్వదా అనుసరించు. మధువును నివారించు**
**పుణ్యమయ ఆజీవికతో సుప్రసన్నతను పొందుము 5**

సన్మార్గాన్ని ఆచరణ పూర్వకంగా అభ్యసించటానికి ఆచార్యుడు ప్రాధాన్యం ఇస్తున్నాడు. సన్మార్గం ద్వారానే సత్ఫలితం వస్తుంది. దశవిధ పాపాలను పరిహరించాలి. శారీరకములైన హింస – చౌర్యం – అతిచారం, వాచికాలయిన అనృతం – నిందారోపణలు – పరుష ప్రసంగం – వ్యర్థ ప్రలాపం, మానసికాలయిన దురాశ – అపకారచింత – దురుద్దేశాలు – ఇవ్వి దశదోషాలు.

**సంపద అసారము – చలము – అని గుర్తించి, భిక్షువులకు**
**ద్విజులకు – దీనులకు – మిత్రులకు – యోగ్యమయిన**
**దానాలుచెయ్యి. ఉత్తర జన్మకు దానగుణం కన్న పరమమిత్రుడు లేడు. 6**

గుణ సంపన్నులయిన భిక్షుకులకు, బ్రాహ్మణులకు మాత్రమే గాక, తల్లిదండ్రులకు – గురువులకు – సాధకులయిన మిత్రులకు – దీనులయిన వారికి గూడ దానాలు చెయ్యాలని – అభిధర్మకోశం పేర్కొంటున్నది.

**జడములకు – చేతనములకు – భూమియే ఆధారమయినట్లు,**
**సౌశీల్యమే సర్వగుణములకు మూలం.**
**కనుక నిష్కళంకము – అనింద్యము – అకలుషితము –**
**నిరంతరాయమైన – సౌశీల్యాన్ని అవలంబించు. 7**

లౌకిక అలౌకిక సుగుణాలను – ప్రజ్ఞలను – సమాధి స్థితిని పొందటానికి నైతిక శిక్షణే మూలాధారం. ముక్తికి – నిర్వాణానికి ఆధారం నైతిక వర్తనమే. ఋజువర్తనకు నాలుగు ముఖ్య లక్షణాలున్నాయి. – నిరంతరాయం – అనిద్యం – నిర్మలం – సమగ్రం.

నైతిక నియమాలను ఎల్లపుడు ఆచరించటంవల్ల అది నిరంతరాయంగా ఉంటుంది. కనుక నియమోల్లంఘన దోషం వాటిల్లదు. ఇది నియమోల్లంఘనకు ప్రేరేపించే కారణాలను నిరోధిస్తుంది కనుక – ఇది అనింద్యము. మలిన భావాలను

దూరంచేసే సదాచారంవల్ల అది నిర్మలమయినది. కళంక భూయిష్టమయిన ప్రాపంచిక సంపదలనుకాక సమ్యగ్జ్ఞానాన్ని, నిర్వాణాన్ని లక్షించేది గనుక ఇది సమగ్రం.

**దానం - శీలం - క్షాంతి - వీర్యం - ధ్యానం - ప్రజ్ఞ**
**అనే ఈ ఆరు పారమిత లందు అగణ్యమయిన**
**పరిపూర్ణతను వృద్ధిచేసుకో. ఈ భవసాగరపు**
**ఆవలి తీరాన్ని చేరిన జినేంద్రుడవు అగుదువుగాక. 8**

మహాయాన మార్గాలన్నీ ఈ ఆరు 'పారమిత'లలో ఇమిడి ఉన్నాయి. వీనిలో మొదటి మూడు పుణ్యార్జనకు చెందిన కార్యాలు. చివరి రెండు జ్ఞానార్జనకు చెందినవి. అన్ని స్థాయిలలోను గుణాలలోను అవసరమయినది కనుక వీర్యం (విడువని ప్రయత్నం) రెండింటిలోను చేర్చారు. మహాత్ముడయిన బోధిసత్వుడు సంసార గతుడయినా, నిర్వాణాన్ని సాధించినా, ఈ గుణాలను సాధించటంవల్లనే అర్హతలన్నీ సిద్ధిస్తున్నాయి.

ఈ ఆరు పారమితలందు సమగ్రతను పొందిన బోధిసత్వుడు సంసార గతుడయినపుడు జీవులకు సహాయభూతుడు కావటమే గాక ప్రాపంచికమయిన అస్తిత్వంలోని దోషాలను గూడ నివారిస్తాడు. దానము - శీలము - క్షాంతి - వీర్యము లందలి పరిణతివల్ల సంతోష వంతుడవుతున్నాడు. సంభోగకాయ, నిర్మాణకాయములు ఇతనికి సుగమములు. అందువల్ల ఇతడు జీవుల అవసరాలను తీర్చగలడు. పరిణతమైన ధ్యానము ప్రజ్ఞలవల్ల జ్ఞానమును పొందిన బోధిసత్వుడు సమగ్ర సుఖంలో ఉంటాడు. భావాతీతమైన ధ్యానము ప్రజ్ఞలవల్ల బోధిసత్వుడు ధర్మకాయాన్ని కూడ పొందగలుగుతున్నాడు.

**తల్లిదండ్రులను ఆరాధించువాని వంశము ఆచార్యులతోను**
**బ్రహ్మాముతోనూ, సమృద్ధమయి ఉంటుంది. వారిని గౌరవించువారు**
**కీర్తిని పిదప ఉత్తమగతులను పొందుతారు. 9**

తల్లిదండ్రులను గౌరవించటంవల్ల ఈ జన్మలో అనేక సుగుణాలు చేకూరుతాయి. అవి ఉత్తమ జన్మలను పొందటానికి సహకరిస్తాయి. ఈ జన్మలో మనయందు మిక్కిలి వాత్సల్యం కలవారు తల్లిదండ్రులే. తల్లిదండ్రులను గౌరవించి సేవించేవారు బ్రహ్మాణ్యుల కోవకు చెందినవారని బుద్ధుడు ప్రకటించాడు.

**జీవహింసను - చౌర్యాన్ని - మదిరాసేవనాన్ని - కాముక అతిచారాన్ని-**
**అనృతాన్ని - నృత్యగీతాదుల ఆసక్తిని విడనాడుము.**
**అకాల భోజనాసక్తి, ఉన్నతాసనాలు, సుఖశయ్యలపై**
**అభిలాషను, మాలికా గంధాభరణాలపై వ్యామోహం విడనాడు. 10**

ఇవి దశశీలాలు. ఈ పై నియమాలను ఎల్లప్పుడూ పాటించటం సామాన్యులకు అంతగా సాధ్యం కాదు. కనుక ఉపోసథవ్రత దినాలలోనో, ముఖ్య దినాలలో నయినా దీన్ని పాటిస్తే - ఇది ఉత్తమ ఆదర్శం అన్న భావం ప్రజలకు కల్గుతుంది. (ఇది వ్యాఖ్యాతల వివరణం)

**ఈ అర్హతశీలాన్ని అనుకరిస్తూ ఉపోసథలను పాటిస్తూ,**
**అష్టాంగశీలాన్ని పురుషులయినా స్త్రీలయినా ఆచరిస్తే,**
**రమ్యమయిన కామావచరాది దివ్యకాయాలు గలుగుతాయి. 11**

ఈ లక్షణాలను దీక్షతో పాటించటంవల్ల, కామధాతు దేవతల వంటి ప్రసన్నాకృతి కల్గుతుంది. నియమాలు పాటించటంవల్ల ఆకృతిలోనూ, స్వభావంలోనూ, శక్తులలోనూ వచ్చే పరిణామాన్ని తెలియచేస్తున్నాడు. బాహ్య నియమాలు మూర్తి గాంభీర్యాన్ని అంతరంగ నియమాలు ప్రసన్నతను కలిగిస్తాయి.

కామధాతుస్థితి - విషయవాంఛలకు అనుభవాలకు చెందినది.
రూపధాతు స్థితి - తేజస్సంబంధియై వియచ్చరుల దశకు చెందినది.
అరూపధాతు స్థితి - లోకాంతర స్థితికి చెందినది.

**మాత్సర్యం - వంచన - శఠత్వం - సంపదపై వ్యామోహం -**
**సోమరితనం - గర్వం - రాగము - ద్వేషం - కులీనత**
**రూప - విద్య - బల - యౌవ్వన - అధికార గర్వాలను**
**శత్రువులుగా భావించు. 12**

- స్పష్టం -

**సావధానతయే అమృతస్థితికి మూలం. అనవధానతయే**
**సంసారానికి మూలం. అని శాక్యముని బోధించాడు.**
**కనుక కుశలధర్మ వృద్ధికోసం శ్రద్ధతో సావధానత నభ్యసింపుము 13**

**నందుడు - అంగులిమాలుడు - అజాత శత్రువు - ఉదయనుడు**
**వంటివారు ఆరంభంలో అనవధానంగా ఉన్నా, అనంతరం**
**శ్రద్ధావంతులై మబ్బులు తొలగిన చంద్రుడిలా ప్రకాశించారు. 14**

ఔన్నత్యం ప్రయత్న సాధ్యం, జన్మాంతర కర్మ సిద్ధం మాత్రమే కాదు. కృషికి సావధానత (అప్రమాదత) ప్రధాన సాధనం. వాంఛా పూరితుడైన నందుడు, ద్వేషపూరితుడైన అంగుళిమాలుడు, తండ్రినే చంపిన - అజాతశత్రువు, తల్లినే చంపిన ఉదయనుడు మొదట్లో దోషాల ఉరవడిలో పడిన పావులే. అయినా తరువాత వాళ్ళు ధర్మమార్గంలో ప్రవేశించి యోగ్యులయినారు. తమ గత పాప జీవితం వల్ల ధర్మమార్గానికి యోగ్యులం కాదనుకున్న వారుకూడ పై ఉదాహరణలను గమనించి సావధానతతో కృషి చేయవచ్చు.

**క్షాంతిని మించిన తపస్సు లేదు.**
**కనుక క్రోధం తలెత్తే అవకాశమే ఇవ్వకూడదు.**
**క్రోధాన్ని విడనాడితే సంసారబంధ పునరావృత్తిలేని దశను**
**పొందగలరని బుద్ధుడు చెప్పాడు. 15**

క్రోధంవల్లనే హింస కూడ కలుగుతున్నది. అరిషడ్వర్గాలు, మరికొన్ని దోషాలు కలిపి ఇంతకు ముందు పేర్కొనబడ్డాయి. కఠోర నియమాచరణమే తపస్సు కాదు. ఇందువల్ల మోక్షం రాదు సరికదా, కనీసం ఉత్తమ జన్మ అయినా రాదు. కానీ, క్రోధరహితునకు మోక్షం మాత్రం నిశ్చయం. - ఇది క్షాంతి పారమిత గురించి.

**వీళ్ళు నన్ను నిందించారు - బంధించారు - జయించారు -**
**నా సంపదను కబళించారు' అనుకుంటూ**
**ఆక్రోశానికి లోనైతే వైరమే జనిస్తుంది.**
**వైరానికి ఆశ్రయం ఇవ్వని వాళ్ళు సుఖంగా నిద్రిస్తారు. 16**

పరిసరాల ఎడల వ్యతిరేక భావం కంటె, అనుకూలభావమే సుఖప్రదమని వివరిస్తున్నారు - క్రోధ రహితునకే ఇహము పరము. "ధమ్మపదం"లోని యమకవర్గం 4వ గాథకు ఇది ప్రతిధ్వని.

**నీటిమీద - నేలమీద - రాతిమీద చెక్కిన చిత్రాలులాగ**
**సత్త్వాల మనసు త్రివిధంగా ఉంటుంది. మొదటి పద్ధతి**

**క్లేశాలతో జీవించేవారికి సరిపోతుంది. ధర్మాన్ని అనుసరించే**
**వారికి చివరి పద్ధతి తుల్యంగా ఉంటుంది 17**

మనసు నుండి త్వరగా తొలగిపోయే భావాలు నీటిమీద చిత్రాలవంటివి. మరికొంత ఎక్కువ కాలం నిలచేవి నేలమీద చిత్రాలు. దాదాపు స్థిరమైనవి రాతిమీద చిత్రాలు, అని ఉపమానం. నియమ రహితుల భావాలు కూడ అస్థిరంగా ఉంటాయి కనుక, పాపచింతనలను నీటిమీద చిత్రాలులాగా వెంటనే మరచిపోవాలి. ధార్మిక భావాలను శిలలపై చెక్కిన శిల్పాలులాగా మనస్సులో స్థిరంగా ఉంచుకోవాలి.

**వాక్కులు, మధురం - సత్యం - మిధ్య - అని మూడు**
**తీరులుగా ఉంటాయి. అవి మకరందం - కుసుమం -**
**కశ్మలం - వంటివి. వీనిలో చివరి దానిని విసర్జించుమని**
**జినుడు స్పష్టం చేశాడు. 18**

ఇందులో వాక్సంస్కారాన్ని బోధిస్తున్నాడు. ప్రియమైన వాక్కు మధువువలె స్వాదువుగా ఉంటుంది. సత్యవాక్కు కుసుమంవలె ప్రశంసనీయం. దుష్టమయిన వాక్కు కశ్మలం వలె ఏహ్యం. కనుక విసర్జనీయం. రుచికరంగా మాత్రమేగాక - వాక్కు సౌందర్యవంతంగా ఉండాలి. ప్రియము, సత్యము అయిన ప్రసంగం చేయాలి.

**కాంతిలోనుండి అధిక కాంతిలోకి వెళ్ళేవారు -**
**తమస్సులోనుండి అధిక తమస్సులోకి వెళ్ళేవారు -**
**కాంతిలోనుండి అధిక తమస్సులోకి వెళ్ళేవారు -**
**తమస్సులో నుండి అధిక కాంతిలోకి వెళ్ళేవారు - అని**
**ప్రజలు నాల్గు రకాలు. వీరిలో నీవు ప్రథమ వర్గంలోనే ఉండు. 19**

పూర్వజన్మ పుణ్యం వలన ఇపుడు యోగ్యమయిన జన్మను పొంది పుణ్యకార్యాలు చేస్తూ ధర్మమార్గాన్ని ఆచరించటంవల్ల ఉత్తమోత్తమ జన్మనూ, తద్వారా ముక్తిని పొంది తరువాత బుద్ధులయ్యేవారు మొదటి వర్గం.

ఇపుడు అల్పమైన జన్మనుపొంది, ఇంకా పాపాలు చేయటం వల్ల, మరీ నీచ జన్మను పొందబోయేవాడు మరొక రకం.

పూర్వ సుకృతం వలన శ్రేష్ఠమైన జన్మను పొందికూడా, పాపాలు చేస్తూ, నీచజన్మలోకి నడిచేవాడు వేరొక రకం.

ధర్మాచరణకు అవకాశంలేని దురదృష్టకరమైన జన్మను పొంది, ధర్మబద్ధమయిన సుకర్మలను ఆచరించటం వలన, ఉత్తమ జన్మను పొందబోయేవాడు మరొక రకం.

ఈ గాధను జన్మ జన్మాంతరాలకేకాక, ప్రస్తుత జన్మలో ప్రారంభ సంస్కారానికి – సంస్కార పరిణామానికి గూడ అన్వయించుకొనవచ్చును.

**పండక పండనట్లు – పండినా పండనట్లు – పండక**
**పండినట్లు – పండి పండినట్లు – కనిపించే**
**మామిడి పండ్ల లాగా వ్యక్తుల్ని గూడ అర్థం చేసుకోవాలి.** 20

బాహ్యా చర్యలకు, అంతర్గత భావాలకు పై ఉపమానం చెపుతున్నారు.

సదుద్దేశాలు, సత్కార్యాలు రెండూ లేనివాడు, సదుద్దేశాలు ఉండికూడా సత్కార్యాలు చేయనివాడు, సదుద్దేశాలు లేకుండా సత్కార్యాలు చేసేవాడు, సదుద్దేశాలు, సత్కార్యాలు రెండూ కలవాడు –

వీరందరూ ఉపమేయాలు. పండ్లు ఉపమానాలు. మనుష్యులను అర్థం చేసికొనవలసిన లోకజ్ఞతను ఇందులో బోధిస్తున్నారు. వ్యక్తులతో స్నేహం చేసేటప్పుడు వారి స్వభావాన్ని పరిశీలించాలి. చివరి వర్గంవలె ఉంటూ, అట్లాంటి వారితో స్నేహం చేయాలి.

**పరసతులపై దృష్టి సారించకు – తప్పనిసరి అయితే**
**తల్లిగానో – సోదరిగానో – పుత్రికలాగానో వారి**
**వయో దశల ననుసరించి భావించు. అప్పటికీ మోహభావం**
**తొలగకపోతే ఆ మాలిన్యం గురించి విచారణ చెయ్యి.** 21

స్త్రీల యెడల అతిచార భావాలను నిగ్రహించుకొనటానికి మార్గాన్ని ఉపదేశిస్తున్నాడు. పురుషుని ఎడల స్త్రీలకు కలిగే అతిచార భావాలకు కూడా ఇదే మార్గం. స్త్రీలోకంటే, పురుషునిలో ఈ కామచాంచల్యం అధికమని అనుకోవటంవల్లనూ, ఈలేఖ పురుషుడయిన రాజును ఉద్దేశించి చెప్పింది గనుకనూ, స్త్రీలను భావించవలసిన తీరును ప్రస్తావించారు.

ప్రతిని - పత్రుణ్ణి - నిధిని - ప్రాణాన్ని కాపాడుకొన్నట్లుగా
చంచలత్వమునుండి బుద్ధిని కాపాడుకో.
క్రూర సర్పానికి - విషానికి - శస్త్రానికి - శత్రువుకు - అగ్నికి దూరంగా
జరిగినట్లు నీ మనస్సును కామ విషయాలకు దూరంగా ఉంచుకో. 22

మనిషికి మనసే సర్వస్వం. కనుక దానిని భద్రంగా రక్షించుకోవాలి. ప్రమాదాల నుండి దూరంగా ఉంచుకోవాలి. ఇవన్నీ నైతిక శిక్షణకూ, మానసిక క్రమశిక్షణకూ సంబంధించిన సూచనలు.

కోర్కెలు అనర్థజనకాలు కనుక, అవి కింపాక ఫలాల
వంటివని జినప్రభువు స్పష్టం చేశారు.
ఈ ఇనుప సంకెలలు సంసారంలో చరించే లోకులను
కారాగారంలో బంధిస్తాయి. కనుక అవి విసర్జించదగినవి. 23

కింపాక ఫలాలు ఆకర్షణీయంగా కనిపిస్తాయి. కానీ, అవి విషపూరితాలు. అట్లాగే కోర్కెలు కూడా సంసారంలో బంధించి జీవునికి అపకారం చేస్తాయి.

చంచలములు, క్షణికములు అయిన షడింద్రియ విషయాలను
జయించిన వానినా! యుద్ధంలో శాత్రవసైన్యాన్ని జయించిన వానినా!
ఎవర్ని ఎంపిక చేసికోవాలి? అంటే
తెలివయిన వాడికి తెలుసు, ఇంద్రియ విజేతయే శ్రేష్ఠుడని. 24

బాహ్య శత్రువులను జయించటం కన్నా మనోజయమే మహాకష్టం. బాహ్య శత్రువులతో పోరాడి జయించటం పశువులు కూడ చేస్తాయి. ఉన్నతుడైన మనుష్యుడు పోరాడవలసినది ఇంద్రియాలతో, ఇది ఏ కొద్దిమందికో సాధ్యం.

యువతుల దేహాన్ని మలినంగా, నవరంధ్రాల నుండి దుర్వాసనలు చిమ్ముతూ
ఉండే కశ్మల భాండంగా, ఆభరణాలతో అలంకరించిన
చర్మం కప్పిన మలిన పూరంగా, మళ్ళీ మళ్ళీ భావించు 25

ఈ శిక్షణ వల్ల అసహ్యభావనామార్గాన వైరాగ్యం కలుగుతుంది కానీ, ఇదొక రకమైన శిక్షణ. అంతకుముందు 21లో చెప్పినది ఉత్తమ పద్ధతి. ఇట్లాంటి సాధనను - అశుభ భావన అంటారు. ఇట్లాంటి వర్ణనలు 'రత్నావళి'లో అధికం.

**పురుగులు పట్టిన కుష్ఠువాడు బాధోపశమన సుఖం కోసం**
**పూర్తిగా నిప్పుల మీదనే ఆధారపడతాడు. అలాగే**
**కామాసక్తునికి శాంతిలేదని తెలుసుకో. 26**

కోర్కెలు పట్టుకు వ్రేళ్ళాడేవాడికి కుష్టువాడు ఉపమానం. ఉపశాంతికై కోర్కెలు తీర్చుకొనటానికి నిప్పులమీద ఆధారపడటం ఉపమానం. ఎంత భయంకరమైన పద చిత్రమో! రోగం తగ్గనిది. నిప్పులమీద ఆధారపడటం తప్పదు. అయినా బాధ పెరుగుతూనే ఉంటుంది. అనుభవించిన కొద్దీ కోర్కెలు అధికమౌతాయే కానీ తృప్తి, సమాప్తి ఉండవు.

**పరమ సత్యాన్నెరిగి సర్వభావములను**
**వివేచన చేయటంలో మనసుంచుము.**
**మరేగుణవంతమయిన ధర్మము దీనికి సాటిరాదు 27**

పరమసత్యం తర్కంతో బోధపడేది కాదు. మాటలతోనూ, ఉపమానాలతోనూ తెలియచెప్పేదికూడ కాదు. పరమసత్యం ఎలా ఉంటుందో ఒకరికొకరు వివరించలేరు, అది అనుభవైకవేద్యం. ఆ అనుభవం పొందిన తర్వాత చేసిన వివేచనయే ఉత్కృష్టం. రూపము, వేదన, సంజ్ఞ, సంస్కారం, విజ్ఞానం అనే పంచస్కందాల నిజస్వరూపం తెలుసుకోవటమే వివేచన. ఈ సూక్ష్మ వివేచనం పరమ సత్యాన్ని ఎరుక చేస్తుంది. మాధ్యమిక వాదం, పరమ సత్యాన్ని గురించి బుద్ధుని బోధనలకు భిన్నమైన సిద్ధాంతాన్నేమీ ప్రతిపాదించదు. ఇతర ప్రతిపాదనలను సూక్ష్మ వివేచన చేయటమే దాని పద్ధతి.

**ఎంత కులీనుడు, రూపవంతుడు, విద్యావంతుడు అయినా**
**జ్ఞానవంతుడు శీలవంతుడు కాకపోతే గౌరవించబడడు.**
**ఈ రెండు గుణాలు ఉండి, తక్కిన గుణాలు**
**లేకపోయినా గౌరవించబడతాడు. 28**

ఔన్నత్యానికి గాని, పతనానికి గాని, ప్రవర్తనే ఏకైక కారణం. ప్రవర్తన శీలబద్ధం కావాలి. నీతి మార్గం తెలియటానికి ప్రజ్ఞయే నేత్రం. ప్రజ్ఞవల్ల దేన్ని అంగీకరించాలో, దేన్ని విడనాడాలో తెలుస్తుంది. ప్రజ్ఞాశీలాలు లేనివాడు, పవిత్రుడు కాలేడు. శీల, సమాధి, ప్రజ్ఞలు - ఒకదాని నొకటి వృద్ధి పొందించుకుంటాయి.

**ఓ లోకజ్ఞుడా! లాభనష్టాలు; సుఖదుఃఖాలు -**
**కీర్తి అపకీర్తులు, దూషణ భూషణలు అన్న**
**ఈ ఎనిమిది లక్షణాల గురించి మనసుపెట్టు**
**వాటియందు సమదృష్టితో ప్రవర్తించు 29**

ప్రాపంచికాసక్తులైనవారు పైనాలుగు జంటలలో మొదటి నాల్గింటిని వాంఛనీయాలుగానూ, (లాభం, సుఖం, కీర్తి, భూషణ) తర్వాతి నాల్గింటిని (నష్టం, దుఃఖం, అపకీర్తి, దూషణ) అవాంఛనీయాలుగానూ భావిస్తారు. వీటి నన్నింటిని సమానంగానే భావించి నిరాకరించాలి. పరస్పర విరుద్ధాలయిన ఈ గుణాలన్నింటినీ ఒకే విలువతో నిరాకరించమంటున్నాడు.

**బ్రాహ్మణులు, భిక్షువులు, దేవతలు, అతిథులు, తల్లి**
**దండ్రులు, భార్యాపుత్రులు, సేవకులు - ఎవరికోసమయినా,**
**సరే పాపం చెయ్యవద్దు. దాని ఫలితంగా వచ్చే నరకంలో**
**వీళ్ళెవ్వరూ పాలుపంచుకోరు. 30**

మంచి చెడులకు కర్తయే ఫలభోక్త. కర్మలవల్ల కలిగే ప్రాపంచిక ఫలితాలను మాత్రమే తోటివాళ్ళు పంచుకుంటారు. వాటి పారలౌకిక ఫలితాలయిన పుణ్యపాపాలను - వాటి అనంతర ఫలితాలయిన జన్మాంతరాలను కర్త అనుభవించ వలసిందే. కర్మ ఫలితాలు మూడు అంతరువులలో అనుభవంలోకి వస్తాయి. కొన్ని జీవితం ముగిసేలోగాను, మరికొన్ని మరుజన్మలోను, ఇంకొన్ని అనేక జన్మల తరువాత కలుగవచ్చును.

**చేసిన కొన్ని పాపాలు అస్త్రపాతంపలె వెంటనే బాధించకపోయినా**
**ఆ కర్మఫలితాలు మృత్యువు సమీపించినపుడు ఎదురుగా వస్తాయి 31**

పనికి ఫలితానికి మధ్య కొన్నిసార్లు చాలా అంతరం ఉండవచ్చు. పాపఫలితాలు వెంటనే అనుభవంలోకి రానంత మాత్రాన అవి లేవనుకోరాదు. నిప్పును తాకటం అన్న క్రియకు కాలటంఅన్న తక్షణ ఫలితం అనుభవంలోకి వస్తుంది. కొన్ని అట్లా జరగవు. వారి పాపాల భయంకర ఫలితాలు మృత్యుదేవత సమీపించినపుడు అనుభవంలోకి రావచ్చు.

కర్మకు - సుదీర్ఘ వ్యవధానం తర్వాత జరిగే ఫలితానికి, మధ్య కాలంలో ఫలితం రూపొందే ప్రక్రియ జరుగుతూ ఉంటుంది.

శ్రద్ధ - శీలము - త్యాగము - అమలత్వము, అధ్యయనము
వినయము - వివేకము - అన్నవి అనింద్య మయిన
సప్త సంపదలని శాక్యముని వచనం
ఇతరములు సాధారణ సంపదలు. 32

1. త్రిరత్నములపైన, కర్మఫలం మీద, పరమసత్యంమీద ఉండే విశ్వాసమే శ్రద్ధ.
2. శీలం అనగ సమ్యక్‌వాక్కు, సమ్యక్కర్మ, సమ్యక్ ఆజీవిక.
3. దానధర్మాలు చెయ్యటం.
   ఆచార్యుడు దానం అనే అర్థంలో త్యాగశబ్దాన్ని ప్రయోగిస్తుంటారు.
4. మలిన రహితంగా స్వచ్ఛంగా ఉండటం - త్రికరణశుద్ధి
5. ధర్మం అనగా బుద్ధుని బోధనలను వివేచించటం.
6. వైరాగ్యంవల్ల, లజ్జవల్ల దుష్కర్మలను విడనాడటం.
   ఆచార్యుడు "హ్రీ" - అన్న శబ్దాన్ని వినమ్రతార్థంలో వాడారు.
7. సదసత్కర్మల మధ్య భేదాన్ని గుర్తించే ప్రజ్ఞ
   సమ్యక్‌దృష్టి - సమ్యక్ సంకల్పం.

దుఃఖరహితమయిన నిర్వాణ సాధనకు ఈ సప్త సంపదల సాధనయే సరియైన మార్గం. - ఇవి అనివార్యాలు.

జూదం, వినోదాలను చూడటం, సోమరితనం,
పాప కర్మలతో చరించటం, మద్యసేవనం, నిశాసంచారం,
అన్న ఈ ఆరులక్షణాలు కీర్తినష్టాన్ని, నీచ జన్మను కలిగిస్తాయి.
కనుక వీటిని విడిచిపెట్టు. 33

- వివరణ నిరపేక్షం -

సర్వసంపదలలోకి సంతృప్తి సర్వోత్తమమని
బోధి సత్వుడు చెప్పాడు. కనుక ఎల్లపుడు తృప్తినే అనుష్ఠించు.
ధనం లేకపోయినా - తృప్తి కలవాడే ధనికుడు. 34

సంపాదనా వ్యామోహం దుఃఖకారకం. జీవితంలో దుఃఖాన్ని తొలగించు కోవాలంటే ధనసంచయేచ్ఛను పోగొట్టుకోవాలి. ధనార్జనా వాంఛవల్ల ఆందోళన, సంరక్షణ శ్రమ, ఇవన్నీ కలుగుతాయి. దారిద్ర్యంలో ఉన్నా తృప్తిని పొందితే అదే సంతోషాన్నిచ్చే మహాసంపద.

**ఓ దయామతీ! ఎక్కువ పడగలున్న నాగశ్రేష్ఠునికి బాధలూ ఎక్కువే.**
**ఎక్కువ సంపదలు ఉన్నవానికి బాధలు గూడ ఎక్కువే.**
**కోర్కెలు స్వల్పంగా ఉంటే బాధలు గూడ స్వల్పమే. 35**

సగం శరీరం సర్పాకారం - సగం శరీరం మానవాకారంగా ఉండే జీవులను నాగులంటారు. ఈ జీవులు భూమిలో ఉంటూ వర్షాలను ప్రభావితం చేస్తుంటారు, సంపదలను రక్షిస్తుంటారు అని బౌద్ధ వాఙ్మయం పేర్కొంటుంది.

**సహజ శత్రుత్వం కలిగి ఉండే తలారి లాంటి స్త్రీ.**
**భర్తను గౌరవించక స్వైరిణిలాగా ఉండే స్త్రీ.**
**దొంగలాగ స్వల్ప వస్తువులను గూడ తస్కరించే స్త్రీ.**
**ఈమూడు రకాల స్త్రీలను భార్యలుగా స్వీకరించగూడదు. 36**

**సోదరిలాగ అనుకూల, మిత్రునిలాగా హృదయ మెరిగినది,**
**తల్లిలాగా శ్రేయోభిలాషి - అయిన**
**స్త్రీని ఇలవేల్పులాగా గౌరవించాలి. 37**

ఈ లేఖ రాజుగారికేగాక సాధారణులకుగూడ ఉద్దేశించినది అవటంచేత సాధారణ వ్యవహార జ్ఞానంకూడ ఇందులో ఉంది.

**ఆహారాన్ని ఔషధంలాగా సేవించాలి.**
**బలం, దర్పం, కోసంగాని**
**అందం కోసంగాని సేవించరాదు.**
**దేహపోషణకోసం మాత్రమే స్వీకరించాలి. 38**

ఆకలి అనే దేహావసరాన్ని తీర్చటానికే ఆహారం. ఆకలిగూడ వ్యాధి లాంటిదే. రోజు రెండుసార్లు వచ్చే వ్యాధి. కనుక దాన్ని తీర్చే ఆహారం, ఔషధం వంటిదే, అంతకుమించి ప్రాధాన్యం ఇస్తే ఆహారం, వాంఛగా, బంధంగా మారుతుంది.

వస్త్రంగూడ ఇంతే. మూడు దుస్తులు మాత్రమే ఉంచుకొని తక్కినవి దానం చెయ్యమని బోధి చర్యావతారంలో ఉంది.

ఓ గుణవంతుడా! పగలు అంతటినీ, రాత్రిలో తొలిభాగాన్ని
తుదిభాగాన్ని, శుభములందు ప్రయోజనవంతంగా గడుపుము.
రాత్రి మధ్య భాగంలో మనసుపెట్టి నిదురించుము.
అందువల్ల నిద్రాసమయం గూడ నిష్ఫలం కాదు. 39

రోజులో వీలయినంత ఎక్కువ భాగాన్ని వినియోగించుకోవాలి. ఆలస్యంగా నిదురించి పెందలకడనే మేల్కొనటంవల్ల, ఎక్కువ కాలాన్ని జాగ్రదవస్థలో గడపటానికి, నిదురించిన కొద్దికాలం గాఢంగా నిద్రించటానికి వీలవుతుంది. నిదురకుముందు మైత్రీభావన చేయటంవల్ల సుప్తచేతన గూడ ప్రభావితం అవుతుంది.

మైత్రి కరుణ ముదిత ఉపేక్ష - వీనినే సదా ధ్యానించు
అనుత్తర స్థితి అందకపోయినా ఈ మార్గాన
బ్రహ్మలోకము నిశ్చయంగా కలుగుతుంది. 40

ఈ అనంత గుణాలను ధ్యానించటంవల్ల పరమానందం లభిస్తుంది. ఇందువల్ల పరమ ప్రయోజనమయిన నిర్వాణం లభించకపోవచ్చు. కాని వాంఛా దుఃఖాదులుండే కామధాతు దశను కాకుండా, మరుసటి జన్మలో, తేజస్సంబంధమయిన రూపధాతు దశను పొందవచ్చు. అనుత్తరస్థితి అంటే - ఇకపై ఏమిలేని స్థితి. మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్షలను బ్రహ్మవిహారాలు అంటారు. బ్రహ్మ అంటే అనంత, విస్తృత అని. ముదిత అంటే - పరుల సుఖాలకు సంతోషించటం - ఉపేక్ష అంటే ద్వంద్వాల యడల సమభావం.

కామాన్ని, ప్రీతివిచారాన్ని, సుఖ విచారణను,
చతుర్విధ ధ్యానమార్గాలద్వారా విడనాడి, బ్రహ్మ
ఆభాస్వర - శుభకృత్స్న - బృహత్ఫల అనే సంపత్కర
భూమికలలో భాగం పొందగలవు. 41

సుఖ దుఃఖాదులు వాంఛావరణానికి చెందినవి. ఈ ఆవరణం మొత్తాన్ని విడనాడాలి. దీన్ని దాటగలిగితే ఉన్నత భూమికలను సాధించవచ్చు. అందుకు

నాల్గు రకాల ధ్యానమార్గాలున్నాయి. కాయ, చిత్త, వేదన, ధర్మానుపస్సనలనే ఈ నాల్గు రకాల మానసిక ఏకాగ్రతలు సమాధి స్థితినుండే కలుగుతాయి. ప్రథమ దశలో, సూక్ష్మ పరిశీలన - ప్రీతి కలుగుతాయి. ద్వితీయదశలో, ప్రీతిసుఖాలు - మాత్రం కలుగుతాయి. తృతీయ దశలో, సుఖం మాత్రం మిగులుతుంది. చతుర్థ దశలో, సుఖంతోసహా అన్ని అనుభవాలను దాటిన నిర్లిప్తమయిన స్థితి కలుగుతుంది.

**అభినివేశం - తత్పరత - అవికల్పత - గుణసమృద్ధి -**
**హితైషులు - అనే ఐదు అంశాల పునాదిమీదనే పుణ్య**
**పాపకార్యాలు ఉద్భవిస్తాయి. కనుక కుశల కార్యాచరణ**
**కోసం కృషిచెయ్యి.** **42**

మంచిదయినా, చెడ్డదయినాసరే - కార్యసిద్ధికి ఐదు అంశాలు అత్యవసరం. ఇవి సమృద్ధిగా ఉంటే కార్యసాధన జరుగుతుంది. ఈ సాధన సంపత్తిని సత్కార్యాలకే వినియోగిస్తే పుణ్యఫలం. దాన్నే మనసులో ఉంచుకోవాలి.

ఎల్లవేళల సత్కార్యాలు చేయాలనే ఆసక్తి ఉండటం (అభినివేశం) - సత్కార్యాలనే తప్ప అన్య విషయాలను గురించి చింతించకపోవటం (తత్పరత) - సదాచరణకు కలిగే అవరోధాలను దరికి రానివ్వకపోవటం (అవికల్పత) - త్రికరణ శుద్ధితో ఆచరించటం (గుణసమృద్ధి) - తలిదండ్రులు మొదలయిన వారికి శ్రేయస్సు కలిగించటం (హితైషులు). అన్నవి ఈ అయిదు అంశాలు.

**ఉప్పు కొద్దిపాటి నీటి రుచినే మార్చగలదుగాని, గంగా**
**నది రుచిని మార్చలేదుగదా! అట్లాగే కొద్దిపాటి పాప**
**కార్యం స్వల్పకుశలాన్ని కళంకితం చేయగలదు గాని**
**అపార సత్కార్యాలను కళంకితం చెయ్యలేదు.** **43**

ఒక మహత్తర సత్కార్యసాధనలో అనివార్యంగా చేయవలసి వచ్చే స్వల్ప దోషాలకు ఆచార్యులవారు వెసులుబాటు ఇస్తున్నారు. లక్ష్యానికి ఫలితానికి మాత్రమే అగ్రప్రాధాన్యం. స్వల్పదోషాలు మహాకార్యంలో మరుగున పడిపోతాయి. చంద్రుని కళంకం చంద్రకాంతిలో నిమజ్జనం అవుతుంది గదా.

**ఔద్ధత్యం - కౌకృత్యం - వ్యాపాదం - స్త్యానమిద్ధ - కామేచ్ఛ**
**అనే ఈ ఐదు తమోవృత్తులు, గుణసంపదలను**
**హరించే దొంగల వంటివి, జాగ్రత్త సుమా!** 44

ప్రాపంచిక మయిన ఉన్నత లక్ష్యాలను, ఉత్తమ శీలాన్ని, సాధించటానికి ఈ జాగ్రత్త లెంత అవసరమో, ఆధ్యాత్మిక లక్ష్యసాధనకు గూడ అంతే అవసరం. మొదటి రెండు, మానసిక అస్తిమితత్వాన్ని - అపమార్గాన్ని కల్గిస్తాయి. ఉదాసీనత - నిద్రాసక్తిని వ్యామోహబంధాన్ని కలిగిస్తుంది. శంక పురోగమనానికి, ఆత్మవిశ్వాసానికి అవరోధం. ఇవే పంచ = నీవరణాలు 1 ఉద్ధత్వం = కౌకృత్యం (వ్యాకులత, సందిగ్ధత), 2. వ్యాపాదం = వ్యతిరేకత, 3. స్త్యానమిద్ధ = సోమరితనం, నిరుత్సాహం, 4. కామేచ్ఛ = పంచేంద్రియ వ్యామోహాలు, 5. విచికిత్స = అవిశ్వాస శంక.

**శ్రద్ధ - వీర్యం - స్మృతి - సమాధి - ప్రజ్ఞ అనే ఈ**
**అయిదు ఉత్తమ అభ్యాసాలను నిశ్చయ బుద్ధితో ఆచరించు.**
**ఇంద్రియాలకు ఇవే బలం, శక్తి ఇచ్చేవి.** 45

బోధిసత్వుడు బుద్ధత్వాన్ని పొందటానికి పదిభూమికలగుండా ప్రయాణించాలి. ప్రథమ భూమిక సాధించినపుడు బోధిసత్వుడు ఆర్యత్వాన్ని పొందుతాడు.

ఇపుడు విముక్తి సాధకమయిన ధర్మాచరణను బోధిస్తున్నాడు.. అందుకు ఇవి అభ్యాసాలు. ఊష్మ - మూర్ధ - క్షాంతి - అగ్రధర్మ - అనే నాల్గు రకాల స్థాయిల నుండి ఆధ్యాత్మిక పురోగతిని సాధించాలి. వీటి వివరాలు బౌద్ధయోగ పద్ధతుల నుండి విశదంగా తెలుసుకోవాలి.

సత్యంపై విశ్వాసం (శ్రద్ధ) ఉండాలి - దాన్ని సిద్ధింపజేసుకొనే ఉత్సాహం (వీర్యం) ఉండాలి. సాధనలో కలిగే అనుభవాలపై మనసు నిలకడగా (స్మృతి) ఉంచుకొనాలి. తద్వారా ఏకాగ్రమయిన చిత్తం (సమాధి) కలుగుతుంది. ఆ స్థితియందు పరమసత్యమయిన శూన్యత అనుభవంలోకి వస్తుంది. ఆ శూన్యతయొక్క వాస్తవాన్ని జ్ఞానంతో (ప్రజ్ఞ) వివేచించాలి.

**వ్యాధి జరా మృత్యువులు ప్రియ వియోగాలు**
**అన్నీ కర్మకు లోబడినవేనన్న భావాన్ని మళ్లీ మళ్లీ మననం చేసుకో.**
**ఈ శిక్షణవల్ల అహంకారం ఉత్పన్నం కాదు.** **46**

ఉన్నత భూమికలను సాధించడానికి అహంకారం పెద్ద అవరోధం. ఈ అహంకారాన్ని తొలగించుకొనటానికి ఆచార్యులు శిక్షణామార్గాన్ని సూచిస్తున్నారు. ఆత్మ విశ్లేషణం – ధ్యానం – ఇందుకు ఆవశ్యకం. విశ్లేషణతో స్వస్థితిని గుర్తించాలి. తాను చేసిన సదసత్కర్మల ఫలితాలు తనకే పరిమితం. ఇతరులెవ్వరు ఆ ఫలితాలను పంచుకోరు. కనుక తన కర్మలవలననే వ్యాధి జరాదులు కలిగాయి అని పదేపదే మననం చెయ్యాలి. అపుడు అహంకారం నశించి, 'వాటి నుండి విముక్తిని కలిగించే కర్మలు చెయ్యాలి' అన్న పరిజ్ఞానం కలుగుతుంది.

**స్వర్గం – మోక్షం – కోరినట్లయితే సమ్యక్ దృష్టితో**
**భావించి కార్యాచరణచెయ్యి. మిథ్యాదృష్టి కలవారు**
**సత్కార్యాలు చేసినా వారు భయంకరమయిన**
**ఫలితాలు పొందుతారు.** **47**

సరయిన ధర్మాన్ని ఆచరించటం గూర్చి ఉపదేశించబోతూ ప్రారంభవాక్యాలు చెపుతున్నాడు. 43వ శ్లోకంలో కొద్దిపాటి పాపాలున్నా సత్కార్యానికి దోషం లేదని చెప్పారు. అది ఆచరణలో అనివార్యమయిన దోషాల గురించి. ఇపుడు హెచ్చరిస్తున్నది మౌలికంగా దృష్టియందుంచుకొనవలసిన సన్మార్గం గురించి. కర్మసూత్రాన్ని ఎరిగి పాటించాలి. సర్వ ధర్మాల లక్ష్యము శూన్యతయే. అది తెలియటమే సరయిన దృష్టి. కర్మసూత్రం, శూన్యతా లక్ష్యం, తెలుసుకొనక చేసేపనులన్నీ – అవి మంచినయినా సరే – నిష్ఫలాలే.

**జీవులు దుఃఖితులు – అశాశ్వతులు – ఆత్మరహితులు – మలినులు**
**అన్న ఈ నాల్గు గుణాలను సమగ్రంగా తెలియాలి.**
**వీటిని స్మృతియందు నిలుపనివారు పతనమౌతారు.** **48**

కొన్ని భావాలను శ్రద్ధతో నిరంతరం మననం చెయ్యాలి. అట్లాంటి శ్రద్ధ చూపటానికి ఈ నాల్గు భావాలు మూలస్తంభాలు. దుఃఖం – అశాశ్వతత్వం అనేవి స్థిరమైన వాస్తవాలు. మన కర్మలవల్ల, శరీర పదార్థాలవల్ల, మాలిన్యం

కలుగుతుంది. కర్మ మాలిన్యాన్ని సత్కర్మలతోనే క్షాళనం చేసుకోవాలి. స్వయం నియంత్రకమయిన స్వేచ్ఛాయుతమయిన, శాశ్వతమయిన ఆత్మ మనకున్నదనుకొనటం అసత్యమేగాక అహంకార ప్రేరకం గూడ.

**"రూపం ఆత్మకాదు - రూపం కలవాడు ఆత్మకాదు -**
**రూపమునందు ఆత్మలేదు - ఆకృతిలో ఆత్మ నివసించదు"**
**అని చెపుతున్నారు. ఇట్లాగే తక్కిన**
**నాలుగు స్కంధాలను శూన్యం అని తెలుసుకో.** 49

**స్కంధాలు యాదృచ్ఛికంగా గాని, కాలం నుండి గాని**
**ప్రకృతివల్లగాని, స్వాభావికంగా గాని,**
**ఈశ్వరుని వల్లగాని, కారణంవల్ల గాని - జన్మించలేదు.**
**అజ్ఞాన కర్మల నుండి తృష్ణ నుండే జన్మించాయి.** 50

అజ్ఞానం అంటే సరియైన దృష్టి లేకపోవటం. శూన్యతను గ్రహించటమే సరియైన దృష్టి. వైవిధ్యమంతా వాస్తవం, శాశ్వతం అనుకొనటమే అజ్ఞానం. ఈ అజ్ఞాన భూమి నుండి, తృష్ణవల్ల జన్మబంధం - సంసారబంధం కలుగుతున్నాయి. ఈ కాంక్షే లేకపోతే కాలం ప్రకృతి మొదలైనవి ఉన్నా జన్మ కలుగదు. కనుక తృష్ణే ప్రధాన కారణం. ప్రకృతి మొదలయినవి కారణాలు కాదని నిరూపించే వాద వివరాలను నాగార్జునాచార్యుని ఇతర గ్రంథాల నుండి గ్రహించాలి.

**కాలః పచతి భూతాని; కాలః సంహరతే ప్రజాః**
**కాలః సుప్తేషు జాగర్తి కాలోహి దురతిక్రమః**

కాలం భూతాలను పక్వం చేస్తున్నది - కాలం ప్రజలను పూర్తిగా హరిస్తున్నది. కాలం నిదురించే సమయంలోను మేల్కొని ఉంటుంది - కాలందాట రానిది. అందమైన ఈ శ్లోకం అదనంగా లభించిన పాఠం. కాని పూర్వాపర సందర్భంలో ఇమిడినట్లు కనిపించటంలేదు.

**ఆత్మను గురించిన మిథ్యాదృష్టి - శీలవ్రత పరామర్శ**
**సంశయాత్మకత అన్నవిమూడు సంసార శృంఖలాలని,**
**ముక్తి పురద్వారానికి అవరోధాలని తెలుసుకో.** 51

సాధనారంభంలో మొదటి లక్షణమయిన పరివ్రాజకత్వం కొంతవరకు అవసరం. వైరాగ్యదీక్ష - శిక్షణకోసం నియమపాలనం అవసరమేగాని అవ్వే

పరమార్ధంగా భావించటం శీలవ్రత పరామర్శ. 'నేను' 'నాదీక్ష' 'నానియమం' అనే స్వాతిశయం కలుగుతుంది. శాస్త్రాధ్యయన దశలో శంకలు రావటం జ్ఞానాభివృద్ధికి దోహదం చేస్తుంది. కాని ఆధ్యాత్మిక సాధనలో కలిగే అనుభూతులను శంకిస్తూ ఉంటే పురోగమనం ఉండదు. స్వీయానుభవంమీదనే కాలుఉంచి సాధనలో ముందుకుసాగాలి. అనుభవాన్నే శంకిస్తే అడుగు ముందుకు సాగదు. ఆత్మలేదని, సర్వతంత్ర స్వతంత్రంగా కన్పించే సర్వము కార్యకారణ చక్రంలో బద్ధమయినదేనని తెలుసుకోవాలి. ఆ ఎరుకగల స్థితియే ముక్తిపురము.

**ఎవరి ముక్తి వారిపైనే ఆధారపడి ఉంటుంది.**
**అది పరుల సహాయంవల్ల కొంచెమయినా జరిగేదికాదు.**
**అందువల్ల అధ్యయనం, శీలము, ధ్యానాలతో**
**చతుస్సత్యాలను సాధన చెయ్యాలి.** **52**

సూత్ర గ్రంథాలు చదివి, ఆచరింప దగినదేదో ధర్మమేదో తెలుసుకొనాలి. వాటిని ఏకాగ్రమయిన ధ్యానంతో అధ్యయనం చెయ్యాలి. అపుడు నాలుగు పరమ సత్యాలు తెలుస్తాయి. వాటిని అనుభవంలోకి తెచ్చుకొనాలి. 1. దుఃఖ స్వరూపం తెలుసుకోవాలి. 2. దుఃఖ కారణమయిన తృష్ణను విడనాడాలి. 3. నివారణను తెలియాలి. 4. ముక్తికొరకు ఆమార్గంలో పయనించాలి. ఈ చతురార్య సత్యాలను ముఖ్యంగా శూన్యతను ధ్యానించటంవల్ల ముక్తిని సాధించగలరు.

**అధిశీలము - అధిచిత్తము - అధిప్రజ్ఞల యందు**
**సుశిక్షితుడవుకావాలి. నూటయాభైకన్న అధికమయిన**
**శిక్షాపదములు ఈ మూడింటిలో ఇమిడి ఉన్నాయి.** **53**

శీలాచరణ నియమాలు తెలుసుకొనటానికి 'వినయపిటకం' - జ్ఞానవిషయాన్ని తెలుసుకొనటానికి 'అభిధమ్మపిటకం' - ధ్యానమార్గాన్ని తెలుసుకొనటానికి 'సుత్తపిటకం' - అధ్యయనం చెయ్యాలి. ముక్తిని సాధించటానికి అవసరమయిన మార్గాలన్నీ పై పిటకాలలో కూర్చబడ్డాయి. త్రిపిటకాలను అధ్యయనం చెయ్యమనటమే ఈ శ్లోకలక్ష్యం.

**రాజా! కాయగతానుస్మృతి ఒకటే ముక్తికి సరియైన మార్గమని**
**బుద్ధుడు చెప్పెను - ఆ స్మృతియే నశిస్తే అన్ని ధర్మాలు నశిస్తాయి.**
**కనుక దాన్ని ప్రయత్న పూర్వకంగ రక్షించుకో.** **54**

శరీరం అస్థిరం - అప్రధానం - అని రాబోయే వాక్యాలలో చెపుతూ ధర్మాచరణకు - లక్ష్యసాధనకు ఈ శరీరమే ఏకైక సాధనమని గుర్తించమంటున్నారు. ఇది నిరంతర కాయానుపస్సన ప్రాధాన్యం గురించి తెల్పుతున్నది.

**గాలిలో చిక్కిన నీటిబుడగలాగ**
**అనేక ఆపదల మధ్య నున్న జీవనం అశాశ్వతమయినది.**
**ఉచ్ఛ్వాసం తర్వాత నిశ్వసించటం - నిద్రతర్వాత మేల్కొనటం**
**- ఇవే ఎంతో అద్భుతం.** **55**

ఎంతకాలం జీవించినా మరణప్రాప్తి క్షణంలోనే జరుగుతుంది. మరణ కారణాలు లోపల బయట ఎప్పుడూ ఆవరించే ఉన్నాయి. అది ముందుగా తెలిసి జరిగే పనికాదు. మనం జీవించి ఉన్నందుకు ఏ క్షణానికి ఆక్షణమే ఆశ్చర్య పడుతూ ఉండాలి. ఊపిరి పీల్చిన తర్వాత విడచేదాకా ఉండటం- నిదురించిన తర్వాత మేల్కొన్నదాకా జీవించటం కూడ ఆశ్చర్యకరమే. జీవితం అంత క్షణికం. ఇది గుర్తులో ఉంటే మరణ భయం ఉండదు.

55-60; 66-102 శ్లోకాలు కవితాత్మకంగా ఉన్నాయి.

**అసత్తు అయిన ఈ దేహం చివరకు బూడిదగానో,**
**శుష్కంగానో, శిథిలంగానో, కుళ్ళిపోయిగాని పూర్తిగా నశించిపోతుంది.**
**ధాతువులన్నీ చెల్లాచెదరైపోయే**
**స్వభావం గలదీ దేహమని తెలుసుకో.** **56**

ఈ శరీరానికి ఇదే రూపంతో ఉండే స్థిరలక్షణం లేదు. వ్యామోహాలకు ఉపాధియైన, ధాతు నిర్మితమైన, ఈ దేహమే అస్థిరమని స్పష్టంగా తెలుసుకొనటంవల్ల దేహాసక్తి - దేహాత్మ భ్రాంతి తొలగిపోతాయి.

**సప్తసూర్యుల జ్వాలలు భూమిని - మేరుపర్వతాన్ని -**
**అన్ని సముద్రాలను - ధూళిమాత్రంగా నైనా మిగులకుండా**
**అపహరించి వేస్తుంటే దుర్బల మానవుల గురించి చెప్పేదేమిటి?** **57**

స్థిర వస్తువులుగా కనుపించే భూమి - మేరుపర్వతం - మొదలైన మహాపదార్థాలు గూడ కల్పాంతంలో నశిస్తాయి. కల్పాంతంలో ఏడుగురు సూర్యులు ఉజ్వలంగా ప్రకాశిస్తారు. ఒక్కొక్క కల్పంలో ఒక్కొక్క బుద్ధుడు మానవదేహంతో

అధిపతిగా ఉంటాడంటారు. అనిత్యతలోని భీకరత్వాన్ని వర్ణించటంకోసం సంప్రదాయ కల్పనను సాధనం చేసుకున్నారు.

**ఓ రాజా! సర్వ మనిత్యము, అనాత్మికం, అశరణం,**
**అనాథం, అనికేతం, కనుక కదళీ తరువు వంటిది.**
**సారహీన సంసారం నుండి నీ మనస్సును అపసరించుకో. 58**

అరటి కాండానికి పొరలన్నీ ఊడదీస్తే లోపల ఊచ ఉంటుంది. అదికూడ లేక అన్నీ పొరలే ఉంటే! అన్నీ ఊడదీసిన తర్వాత ఏమీ ఉండదు. అట్లాగే అన్నీ కలిసి ఉండి సంసారంగా భాసిస్తున్నదేగాని అన్నింటిని పరిహరిస్తే మిగిలేది శూన్యమే. ఆ శూన్యమే సత్యం. అరటిలాంటి ఉపమానమే ఉల్లిపాయ. పాయలన్నీ తొలగిస్తే ఉల్లికి అస్తిత్వం లేనట్లే, సంసారానికిగూడ స్వతంత్రమయిన అస్తిత్వం లేదు.

మూలశ్లోకంలో పదరచనా సౌందర్యం, తత్త్వాన్ని కవిత్వంగా చేసింది.

**యుగాంత మహార్ణవంలోని తాబేలు మెడను**
**కాడి కన్నంలోకి దూర్చటంకన్న,**
**పశుజన్మ నుండి మానవజన్మను పొందటం దుర్లభం**
**కనుక ఓ జననాథా! సద్ధర్మాన్ని ఆచరిస్తూ**
**ఈ మనుష్య జన్మను సఫలం చేసుకో. 59**

పద్దెనిమిది రకాల అనుకూల పరిస్థితులు సమకూడితేనేగాని ధర్మాన్ని అనుష్ఠించటం సాధ్యంకాదు. ఈ జన్మ ధర్మానుష్ఠాన యోగ్యమయింది. అతిప్రయాస పూర్వకమయిన పరిణామ ఫలితంగా వచ్చింది. ఎంత అశాశ్వతమయినా ఈ మానవజీవితం అపురూపం. కనుక లభించిన ఈజన్మను సద్వినియోగం చేసుకోవాలి.

ఈ ప్రయాసకు ఒక ఉపమానం ఉంది. అది సుత్త నికాయంలోని కథ. అలలతో కల్లోలంగా ఉండే సముద్ర గర్భంలో ఒక గ్రుడ్డి తాబేలు ఉంది. అది నూరేళ్ళ కొకసారి సముద్రం ఉపరితలంమీదకు వస్తుంది. కాడి ఒకటి అలలమీద తేలుతు దొర్లుతు ఉన్నది. తాబేలు పైకివచ్చినపుడు దాని మెడను కాడి రంధ్రంలోకి దూర్చాలి. మిక్కిలి కష్టానికి ఈ కథ ఉపమానం. మానవ జన్మను పొందటంగూడ అంత కష్టం.

**మనుష్యజన్మను పొందిగూడ పాపకార్యాలు చేసేవాడు**
**రత్నాలంకృత హేమపాత్రలో**
**వమనం చేసుకొనేవాని కంటే మూర్ఖుడు. 60**

ఈ జన్మబంధాలను, దేహాన్ని నిరసిస్తూనే మనుష్య జన్మ ప్రాశస్త్యాన్ని, ఆవశ్యకాన్ని స్పష్టీకరిస్తున్నాడు. ఉత్తమమయిన మనుష్యజన్మను హేమపాత్రతో పోల్చారు. జన్మను దుర్వినియోగం చేయటం అంటే విలువయిన హేమపాత్రలో వమనం చేయటం, అంటే నీచపరచటం వంటిది.

**అనుకూలదేశవాసం; సత్పురుషుల సమాశ్రయం;**
**శుభప్రణిధానం; పూర్వజన్మ పుణ్యసంచితం -**
**అన్న నాల్గు చక్రాలు నీకు లభించాయి. 61**

ఇది ప్రత్యేకంగా రాజును ఉద్దేశించి చేస్తున్న హెచ్చరిక. సాధారణ ప్రజలకు లేని అనుకూల పరిస్థితులు జన్మచేత - సంచితం వల్ల - పరిసరాలవల్ల నీకు సమకూరాయి గనుక సద్వినియోగం చేసుకొమ్మని హెచ్చరిక.

**కల్యాణ మిత్రుల సేవతో బ్రహ్మచర్యము పరిపూర్ణ**
**మవుతుందని తథాగతుడు బోధించాడు.**
**జినుని ఆశ్రయించి చాలామంది ప్రశాంతి పొందారు.**
**నీవునూ పవిత్రుల నాశ్రయించుము. 62**

కల్యాణమిత్రులు అంటే ప్రజ్ఞాపారమితలను ఉపదేశించగల గురువులు. ఆధ్యాత్మిక సాధన ఒంటరిగా చేయవలసిన ప్రయాణం అని గతంలో చెప్పారు (52). ఇపుడు మిత్రులను గురువులను ఆశ్రయించమంటున్నారు. ఇందులో వైరుధ్యం ఏమీలేదు. గురువు మార్గాన్ని ఉపదేశిస్తాడు. సాధనచేసే మిత్రులవల్ల అనుమానాలను అనుభవ పూర్వకంగా రహితం చేసుకొనటానికి వీలవుతుంది. తుల్యజీవనంచేసే సహచరులవల్ల ప్రాపంచిక జీవితంలోగూడ మనస్సు అన్యత్రా వ్యాపించకుండా ఉంటుంది.

**మిథ్యాదృష్టి కలవాడు - జంతువు - క్షుధాపిశాచి -**
**నరకప్రేతము - మ్లేచ్ఛుడు - జడుడు - దీర్ఘకాల దివ్యుడు -**
**బుద్ధుని బోధలేని వాడు - 63**

**ఈ ఎనిమిదిమంది దోషభూయిష్ట**
**ప్రతికూల స్థితిలో ఉన్నవారే. ఈ దశలో ఉండిగూడ**
**ముక్తిని పొందగల అవకాశం ఉందిగదా!**
**నీవు జన్మ రాహిత్యానికి యత్నించరాదా! 64**

ఇక్కడ చెప్పిన ఎనిమిది స్థితులు ధర్మాచరణకు ప్రతికూలమైన జీవి దశలు. పాపాలు చేసిన జీవి ఒక స్థితిలో జంతువుగాను, క్షుధాపిశాచిగాను గడుపుతాడు. పుణ్యాలు చేసినవారు దివ్యులుగా మారినా పూర్ణముక్తిని పొందటానికి మళ్ళీ ఉత్తమ మానవజన్మను పొంది, సాధన చేయవలసిందే. ఇట్లాంటి వాళ్ళుగూడ ఏనాటికయినా ముక్తిని పొందే అవకాశం ఉన్నది. కనుక మానవులకది యింకా సుసాధ్యమని ప్రోత్సహిస్తున్నారు.

జంతువు – పిశాచి – నరకజీవి – మొదలయిన వారంతా పాప ఫలితాలు అనుభవించేవారు. దివ్యులు యొదలయినవారు పుణ్య ఫలితం పొందినా ముక్తిని చేరనివారు. అవిశ్వాసి – మూర్ఖుడు – మొదలైనవారు జ్ఞానబోధలేనివారు. ఏనాటికయినా వీరికి ముక్తి పొందే అవకాశం ఉండగా, తథాగతుని బోధలు పొందిన నీకు ఇంకా సుసాధ్యం కాదా.

**తీరని కోర్కెలకు – రోగ జరా మృత్యువులకు –**
**అనేక దుఃఖపరంపరలకు ఆకరమయినది సంసారము.**
**దానిని గూర్చి విచారపడు. దాని దోషాలను ఆలోకించు.**
**నరాధిపా! వాటిని తరించుము. 65**

కోరినవి జరగకపోవటం – కోరనివి జరగటం – కోరినవి లభించినా వాటిని ఏనాడయినా విడువవలసి వస్తుందేమోనన్న విరహభయం – ఇవన్నీ దుఃఖాలే. మొత్తంమీద సంసారమంతా దుఃఖ భూయిష్టమే. సంసారంమీద వైముఖ్యం కలిగించుకొనే విధానం బోధిస్తున్నారు. బాధయొక్క స్వభావాన్ని అవగాహన చేసుకొమ్మని బుద్ధభగవానుడు చెప్పాడు. పాప పర్యవసనాల్నే కలిగినది సంసారం. కనుక దానిమీదనే విశ్వాసం ఉంచినవాడు తన శరీరంతోనే దాని ఋణాన్ని తీర్చుకొనవలసి ఉంటుంది.

**తండ్రులు, కుమాళ్ళు కావచ్చు - తల్లులు, భార్యలు కావచ్చు-**
**శత్రువులు, మిత్రులు కావచ్చు - తలక్రిందులుగాగూడ కావచ్చు.**
**సంసారచక్రంలో ఏది ఏమాత్రం నియతంకాదు. 66**

సంసార చక్రం అంటే ఈ ఒక్క జన్మకు మాత్రమే చెందినది కాదు. జన్మజన్మాంతర సంబంధాలన్నీ ఈ చక్రంలోవే. ఈ జన్మలో తండ్రి అయినవాడు మరు జన్మలో కుమారుడు కావచ్చు. చనిపోయిన తండ్రి ఈ జన్మలోనే కుమారుడై పుట్టవచ్చు. ఏ సంబంధాలు ఎట్లాగైనా పరిణమించవచ్చు. కనుక దేనికీ స్థిరమైన విలువ అంటూలేదు. అందువలన ఎవరినీ శత్రువని కానీ, మిత్రుడని కానీ భేదభావం చూపరాదు.

**ప్రతిజీవి తానుత్రాగిన మాతృస్తన్యం**
**నాలుగు సముద్ర జలాలంతకన్నా ఎక్కువే.**
**సంసారేచ్ఛ కలవాళ్ళు మామూలు ప్రజలనే అనుసరిస్తారు.**
**వాళ్ళు ఇంతకన్నా ఇంకా చాలా త్రాగవలసే ఉంటుంది. 67**

ఈ జీవుడు ఎత్తిన అన్ని జన్మలలోనూ త్రాగిన తల్లిపాలు నాలుగు సముద్రాల పరిమాణం కంటే ఎక్కువట.

జనన మరణచక్రం నుండి బయటపడేదాక జీవుని అస్తిత్వం అంతా కలసి ఒకటిగానే స్వీకరించి వర్ణిస్తున్నారు ఆచార్యులు. జీవితంలో సుఖాలను మరిగి, మళ్ళీమళ్ళీ కోరినకొద్దీ ఇంకా ఇంకా జన్మలే. అదే సంసారేచ్ఛ. ఈ సాధారణ మార్గాన్నే అనుసరించటమా! మోక్షమార్గాన్ని ఎన్నుకోవటమా! అది తాను నిర్ణయించుకోవాలి.

సాధారణ జనులను అనుసరిస్తే జన్మలు పెరుగుతాయి. కనుక ధర్మాన్ని అనుసరించాలి.

**తన జన్మ జన్మాంతర దేహాల ఎముకల కుప్పలు**
**మేరుపర్వమంతో ఇంకా అధికమో.**
**ఈ భూమి మట్టి అంతటినీ రేగుపండ్లంత వుండలుచేసి లెక్కించినా**
**అవి నీ పూర్వజన్మల్లోని తల్లుల సంఖ్యకు సరికావు. 68**

ఊహకందని గడచిన జన్మల సంఖ్యను వివరించటానికి రకరకాల పదచిత్రాలను కల్పిస్తున్నారు. భూమినంతా చిన్న చిన్న గింజలుగా చేసి లెక్కించినా

సంఖ్య చాలదు. ఆ దేహాలలోని ఎముకల మొత్తం మేరుపర్వతమంత ఔతుంది. ఈ భయంకర చిత్రణతో పాఠకుల్లో వైరాగ్యం మేలుకొనవచ్చు.

సర్వలోక పూజ్యుడైగూడ సంసారంలో
పూర్వకర్మల ప్రాబల్యంచేత మళ్ళీ పతనం కావచ్చు.
అట్లే చక్రవర్తివై కూడ ఈ సంసారచక్రంలోపడి
భృత్యానుభృతుడై జన్మించవచ్చు. 69

సంసారచక్రంలో మన గమనం ఊర్ధ్వముఖంగానే ఉంటుందని నిశ్చయం ఏమీలేదు. పతనముఖంగా కూడా ఉండవచ్చు. రాజు కింకరుడు కావచ్చు. కింకరుడు రాజుకావచ్చు.

అప్సరోభామల కుచతటీ స్పర్శసుఖాన్ని
స్వర్గంలో చిరకాలం అనుభవించినపిదప, మళ్ళీ నరకంలో
అవయవాలను అణచి భేదన ఛేదనాలతో దుస్సహ
దుఃఖం కలిగించే భయంకర యంత్ర స్పర్శను
అనుభవించవలసి ఉంటుంది. 70

సంసార చక్రంలో నిర్దాక్షిణ్యంగా కలిగే కర్మఫలితాలకు, మనం సంసిద్ధంగా ఉండవలసిన ఉత్థాన పతనాల క్రమాన్ని వర్ణిస్తున్నారు.

సుమేరుశృంగాల మృదుతలంమీద చిరకాలం చరించి
సుఖస్పర్శననుభవించిన చరణాలే - మళ్ళీ ఆలోచించుకో
ఆ చరణాలే - మండే అగ్నికణాలమీద, కుళ్ళి చివికిన
శవాలమీద, భయంకర క్లేశంతో నడవవలసి వస్తుంది. 71

ఇహలోక సుఖాలెంత సుస్థిరాలుకావో, కర్మఫలంగా పొందిన పరలోక సుఖదుఃఖాలు కూడా అంతే అశాశ్వతములు.

దేవాంగనలు సేవించే రమ్య నందనోద్యానాలలో
విలాసక్రీడలు గడపిన పిదప - గుర్తుంచుకో - మళ్ళీ
అవేపాదాలు, చేతులు, ముక్కు, చెవులు నరకంలోని
బాకులఆకుల తోటలో నరకివేయబడతాయి. 72

**వికసితముఖులౌ దేవసుతులతో, స్వర్ణకమలాలతో,**
**శోభిల్లే దివ్యకాంతుల మందాకినిలో, క్రీడించినవాడే**
**మళ్ళీ - నిర్ఝరమై, సెగలు క్రక్కే వైతరణీ**
**క్షారజలంలో పడవలసి ఉంటుంది. 73**

స్వర్గలోకంలో నదిని 'మందాకిని' అంటారు. నరకంలోని నికృష్టమైన నది పేరు 'వైతరిణి'. అప్సరః కాంతలు, ఉద్యానాలు ఇవన్నీ హిందూ పురాణాల్లోని సన్నివేశాలనే తలపిస్తున్నాయి.

**వీతరాగ సుఖాన్నో, దేవతల కామ సుఖాలనో, నిర్మోహమైన**
**బ్రహ్మలోకంలో అనుభవించిన తర్వాత కూడా**
**'అవిచి' నరకం చేరి అగ్నిలో సమిధవై కాలుతూ నిరంతర**
**దుఃఖం అనుభవించవలసి వస్తుంది. గుర్తుంచుకో. 74**

**సూర్యత్వమో, చంద్రత్వమో సిద్ధించి స్వదేహ ప్రభలతో**
**ప్రపంచాన్నంతా వెలిగించే దశనందుకున్నా గాని;**
**ఏనాడో, చాపిన తన చెయ్యి తనకే కనిపించనంతటి**
**ఘన తమస్సులోకి చొరవలసి ఉంటుంది. 75**

కామ ధాతు స్థితివలన తక్కువస్థాయి సుఖాలు కలుగుతాయి. రూపధాతు, అరూపధాతు స్థాయిలు బ్రహ్మలోకానుభవాన్ని సూచిస్తున్నాయి. రూపధాతు దశలో ఆ జీవునికి ఎక్కువ స్వేచ్ఛ ఉంటుంది. అవిచిలో నరకబాధలు ఉంటాయి. జీవుని పరిణామక్రమంలో బ్రహ్మత్వ, సూర్యత్వ, చంద్రత్వాలు పొందికూడ మళ్ళీ పతనం కావచ్చు. 'అవిచి' అన్నది చాల హీనస్థాయి నరకం.

**మృత్యు విట్టిదని తెలిసి త్రివిధమయిన**
**పుణ్యదీపాలను తోడు చేసుకో. లేకుంటే**
**సూర్యచంద్రాదులకు కూడా శక్యంకాని**
**అంధ తమస్సులోకి ఏకాకివై ప్రవేశించ వలసి వస్తుంది. 76**

మనస్సు, వాక్కు, కాయములయందు పరిశుద్ధంగా ఉండటమే త్రికరణశుద్ధి. అదే త్రివిధమయిన పుణ్యదీపం. అంతఃకరణ శుద్ధియే మనకు తోడు. అంతఃకరణ మలినం కావడం అంటే మనకు మనమే దూరంకావటం. అదే

ఒంటరితనం. ఈ చీకటి, సూర్యచంద్రులవల్ల అంటే, బాహ్యాకాంతి వల్ల తొలగేది కాదు. శుద్ధికర్మా నీదే, వచ్చే కాంతీ నీకే. మానవుడు శుద్ధి కర్మలోనూ ఒంటరివాడే. కాంతి జీవితంలోనూ ఒంటరి అనుభవమే. కనుక మానవుడు ఉన్నతికైనా, పతనానికైనా ఒంటరి ప్రయాణీకుడే. కనుక త్రికరణ శుద్ధిని ఏ సమయంలోనూ విడువకూడదు.

**పాపకర్మలలో లగ్నమయిన జీవులు సంజీవ, కాలసూత్ర,**
**ప్రతాపన, సంఘాత, రౌరవ, అవిచి అనే నరకాల్లో ఎపుడూ**
**బాధలు అనుభవించవలసి వస్తుంది. 77**

మహారౌరవ, తాపన అనే మరిరెండు కలిసి మొత్తం ఎనిమిది ఉష్ణ నరకాలున్నాయి. మనస్సు, వాక్కు కాయములద్వారా పాపాలు ఆచరించిన వాళ్ళు వీటిలో బాధలు అనుభవించాలి. ఇవికాక శీతల నరకాలు కూడా ఎనిమిది ఉన్నాయి. అవి అర్బుద, నిరర్బుద, హాహవ, హుహువ, ఆటట, ఉత్పాల, పద్మ, మహాపద్మ – ఇక్కడ పడేబాధలు బహుశ నిర్భర శైత్యంతోనూ, పైవాటిలో తీవ్ర ఉష్ణంతోనూ కలుగుతాయి కాబోలు.

**కొందర్ని నువ్వుల్ని పిండినట్లు పిండుతారు.**
**మరికొందర్ని పొడి అయ్యేట్లు విసురుతారు.**
**కొందర్ని రంపాలతో ముక్కలు చేస్తారు. మరికొందర్ని**
**భయంకరమైన గొడ్డళ్ళ వాదరతో చీలుస్తారు. 78**

సంఘాత నరకంలో గొర్రెతలల వంటి రెండు కొండలమధ్య పెట్టి నువ్వుల్ని పిండినట్లు జీవుల్ని పిండుతారు. కాలసూత్ర నరకంలో ఒంటిమీద నల్లని గీతలు గీసి కాలే రంపాలతో ముక్కలుగా కోస్తారట.

**కణకణమంటూ చిక్కగా కాగే లోహ ద్రవాన్ని**
**కొందరి గొంతులోకి పోస్తారు. ఎర్రగా కాల్చిన ఇనుప**
**ముళ్ల శూలాలకు దిగవేస్తారు కొందర్ని. 79**

ఇవి ఉష్ణనరకాలలో ఒకటైన ప్రతాపన నరకంలో పెట్టే బాధలు.

**లోహదంష్ట్రలు కల క్రూరమైన జాగిలాలముందు**
**శక్తి హీనులై ఆకాశంవైపు చేతులు జాచి కొందరు**

భయంకరమైన కాలి గోళ్లతో వాడి ఇనుప ముక్కులతో
కాకులు చీలుస్తుంటే లొంగిపోయిన వాళ్ళు కొందరు 80

రకరకాల కీటకాలు, పేదపురుగులు, మాంసం తినే ఈగలు
భరించలేని గాయాలు చేసే నల్ల తేనెటీగలు,
వందలు వేలుగా దేహంమీద వాలి ఆహారంగా
తింటుంటే భరించలేక విలపించేవాళ్ళు కొందరు -
బాధతో మెలికలు తిరిగేవారు కొందరు. 81

ఉష్ణ, శీతల నరకాలకు, పరిసర నరకాల్లో ఇట్లాంటి శిక్షాస్థానాలు ఉంటాయట.

మండే నిప్పుల రాశులలో నోళ్లు తెరచుకొని కొందరు
అగ్నికుండాలలో నిరంతరం కాల్చబడుతుంటారు.
పెద్దపెద్ద ఇనుప గంగాళాల్లో తలక్రిందులుగా మరికొందర్ని,
అన్నం వండినట్లు ఉడకబెడుతుంటారు. 82

ఉష్ణ నరకాలలో ఇది మరొకచోట పెట్టేబాధ.

ఊపిరికి ఊపిరికి మధ్యనున్న కాలంకన్న
తక్కువ దూరంలో నరకం ఉండిగూడ,
అనంత నరక యాతనలను వినియైనా,
పాపుల వజ్రకఠినమైన స్వభావాలు సహస్రధా భిన్నంకావు. 83

నరకం గురించి మనసులో చిత్రించుకున్నా,
ఈ చిత్రాలు చూచినా, దాన్ని గురించి చదివినా,
జ్ఞాపకం వేసుకున్నా భయం పుడుతుందే -
ఇక భయంకరమయిన ఆస్థితిని అనుభవించటమంటే
చెప్పేదేముంది? 84

నరకంలో మళ్ళీ మళ్ళీ పుట్టటానికి క్షణకాలం చాలు. మళ్ళీ మళ్ళీ పుట్టి మళ్ళీ మళ్ళీ అనుభవిస్తుంటారన్నమాట. నరకంలో విధించబడే శిక్షలను తెలుసుకొని అయినా పాపాలు చెయ్యటం మానాలి. నరకం తప్పించుకోవాలి.

సమస్త సుఖాలలోకి తృష్ణాక్షయమే
సర్వోత్తమ సుఖమయినట్లు, సర్వ దుఃఖాలలోకి
అవిచి నరక దుఃఖమే సహించరానిది 85

మూడువందల బల్లేల తీవ్రఘాతాన్ని ఒకేసారి అనుభవిస్తే
కలిగే బాధకూడ నరకబాధలో అణుమాత్రానికయినా సాటికాదు. 86

వాంఛారాహిత్యం వల్ల కలిగే సుఖానికి, అవిచినరక భయంకరత్వానికి వాటి ఆధిక్యతలోనే పోలిక. సుఖాలలో అది ఎంతో, ఈ బాధానుభవంలో 'అవిచి' అంత. ఇది ఎనిమిదవ ఉష్ణనరకం. మూడు వందల బల్లేల బాధానుభవం మానవ దేహానికి చెందినది. ఈ అనుభవంతో నరకానుభవాన్ని కొలిచి చూపుతున్నారు.

తన పాపకృత్య ఫలితం తీరేవరకు ఆ జీవి కోట్లకొలది
సంవత్సరాలు భయంకర బాధలు అనుభవించినా గాని,
అతని నరక జీవితానికి విడుదలలేదు. 87

అతని పాపకృత్యాలు కొనసాగినంత కాలం - వాటి ఫలితాలు పూర్తి అయ్యేవరకు ఎన్ని వేల జీవితాల వరకయినా, ఆ బాధలను అనుభవిస్తూనే ఉండాలి. చేసిన పాపం ఏదీ ఊరకేపోదు. దాని ఫలితాన్ని చేసినవారొక్కరే అనుభవించాలి.

మనోవాక్కాయ కర్మలతో చేసే దురాచారాలే
అనిష్ట ఫలాలకు బీజాలు.
నీ శక్తి అంతా వినియోగించు. అణుమాత్రమయినా
దోషం దరికిరాకుండా జాగ్రత్తపడు. 88

త్రికరణాలలో దేనిద్వారా పాపం చేసినాసరే ఫలితం అనుభవించక తప్పదు. అజాగ్రత్తవల్ల కూడ మనం పాపకృత్యం చేయవచ్చు. అందువల్ల జాగ్రత్తగా నీ సామర్థ్యం వినియోగించమంటున్నారు.

ప్రశాంతిదాయకములయిన సత్కార్యాలను
పరిహరించినవారు జంతుకోటిలో పుడతారు.
అక్కడ ఒకర్ని ఒకరు భక్షించుకొనటం, చంపుకోవటం

**బంధింపబడటం – దెబ్బలు తినటం వంటి**
**నానా బాధలను అనుభవించాలి.** **89**

సత్కార్యాలు ఉత్తమ జీవితాన్ని, ప్రశాంతిని ప్రసాదిస్తాయి. అట్లాంటి పనులను నిరాకరించి పాపకార్యాలకు పూనుకుంటే, నరక బాధలేగాక జన్మాంతరంలోగూడ బాధలు తప్పవు.

**ముత్యాలు – ఉన్ని – ఎముకలు – మాంసం – చర్మం**
**ఇన్నింటికోసం చంపుతారు కొన్నింటిని.**
**తన్ని గుద్ది కొరడాలతోకొట్టి, అంకుశాలతోగుచ్చి,**
**సేవచేయించుకుంటారు మరికొన్నింటిని.** **90**

జంతువులకు ఉండే విలువయిన సహజ వస్తువులుగూడ వాటికి ఉపయోగపడవు. మానవుల ఉపయోగం కోసం అవి బాధలను అనుభవించాలి. మాంసం కోయటం కోసం వ్రేలాడదీయబడ్డ జంతువు, పాపం ఏ అకార్యం చేసి ఈ స్థితిని పొందిన జీవుడో గదా!

**ఇష్ట లాభాలవల్ల నిరంతరాయంగా కలిగే దుఃఖాలు అనుభవించటం**
**ప్రేతయోనులకు గూడ తప్పదు. భయం, ఆకలి దప్పులు,**
**శీతోష్ణాలు, అలసటలవల్ల కలిగే అసహ్యా దుఃఖాలను,**
**అవికూడ భరించాలి.** **91**

బాధలు నరకలోకంలోను జంతులోకంలోను మాత్రమేకాదు, తృతీయస్థాయి అయినా క్షుధా పిశాచాల దశలోగూడ ఈ బాధలున్నాయి. పూర్వజన్మలో వారు లోభిగా పిసినారిగా జీవించినదానికి ఇది ఫలితం. తీవ్రమయిన ఉష్ణం, దాహం, ఆకలితో బాధపడతారు. ఆకలి తీరక నిష్ఫలంగా అక్కడ ఇక్కడ తిరుగుతారు. ఒకవేళ ఏదయినా లభించినా, ఆయుధాలు ధరించిన భయంకర జీవులు దాడిచేసి నిరోధిస్తారు.

ఇష్టలాభాలు = ఇష్టాలు, లాభాలు అంటే కోర్కెలు, అసహ్యం= సహించరాని.

**ఆకలితో అల్లాడుతున్నా సూదిబెజ్జమంతే నోరు,**
**కొండంత పొట్ట, ఉండటంవల్ల – ఎంగిలిదో, పాచిపోయినదో,**
**ఏదో ఒకటి లభించినా కొద్దిపాటి ఆహారమైనా**
**తినలేని వాళ్ళు మరికొందరు.** **92**

పొట్ట కొండంత, కంఠం మెంట్రుకవాసి, నోరు సూదిబెజ్జం అంత; అధికమయిన ఆకలి ఉంది. అసహ్యంగా ఉన్నదయినా, ఎదురుగా లభ్యం అవుతున్న ఆహారంతో అవసరం తీరకపోవటం విచిత్రమయిన బాధ.

ఎండిన తాడిచెట్టు కొనలాగా ఎముకలు చర్మం మాత్రమే ఉన్న
మిగిలిన దిగంబరులు కొందరు, రాత్రులు నోటి నుంచి
మంటలు క్రక్కుతూ, వాళ్ళ నోళ్ళల్లోకి పడుతున్న మండే
ఇసుకనే ఆహారంగా మింగేవాళ్ళు కొందరు. 93

క్షుధా పిశాచాలకు రక్త మాంసాలు ఉండవు. బక్కచిక్కి ఉంటారు. ఆకలిమంట అనేది రూపకాలంకారం కాదు. వాస్తవంగా ఆకలి మంటలాగ నోట్లో నుంచి వస్తూ వుంటుందక్కడ. ఒకవేళ లభ్యమయిన దేమయినా తిన్నా అది మంటలాగామారి వారిదేహాల్ని దహిస్తుంది.

పాపం! మరికొందరికి చీము నెత్తురు అమేధ్యం వంటి
అపరిశుద్ధమయిన ఆహారంగూడ లభించదు. అందుకని
వాళ్ళు ఒకళ్ళ ముఖాలపై ఒకళ్ళు ఆక్రమించుకుంటూ వాళ్ళ
కంఠాలపైనున్న పక్వమయిన వ్రణాలలోని చీమును తింటుంటారు. 94

ఇంకా ఏం వివరించాలి!!

వేసవిలో చంద్రుడుగూడ వేడిగాను!
సీతాకాలం సూర్యుడుకూడ చలిగాను ఉంటాడు!
వాళ్ల చూపులు తాకితేచాలు చెట్లకు పండ్లు లేకుండాపోతాయి.
నదులుగూడ ఎండిపోతాయి. 95

వాళ్ళ పాపశక్తి అంతటిది.

ఈ బాధనంతా నిరంతరాయంగా అనుభవిస్తు
వాళ్ల దుశ్చరిత కర్మపాశంతో దృఢంగా బంధింపబడి
ఐదు నుండి పదివేల సంవత్సరాలవరకు
చావకుండా అట్లాగే ఉండేవారు మరికొందరు. 96

ఇదికూడ ఆకలి పిశాచాలుగా పాపాలను అనుభవిస్తున్న వారి సంగతే!

**ఈ పిశాచాలుపడే బాధలు వివిధాలుగా ఉన్నా**
**బాధానుభవం అంతా ఒకటే.**
**అత్యాశ, లోభం, మాత్సర్యమనస్సు,**
**వీటికి కారణాలని బుద్ధుడు చెప్పాడు.** **97**

అత్యాశాది గుణాలతో బ్రతికి ఎవరికీ ఏమి పెట్టని లోభంతో జీవించినవాడు ఈ పిశాచరూపం పొందుతాడు. అర్థ సంచయన కాంక్షను ఆకలి దాహ గుణాలతో పిశాచత్వ రూపంలో అనుభవిస్తున్నారు. ఎవరికీ తాను పెట్టలేదు గనుక తనకు ఏమి దొరకలేదు. ఫలితంగా తిండి నీరుగూడ లభించవు. పిశాచాలుపడే బాధలు రకరకాలుగా ఉన్నా అన్నింటిలోని బాధాగుణం సమానంగానే ఉంటుంది. వాళ్ళు మానవరూపంలో, పుట్టినా బీదరికాన్నే పొందుతారు.

**స్వర్గసుఖాల అనంతరం కలిగే పునర్జనన మరణాల వేదన**
**ఇంకా అధికతరమైంది. దీన్ని విచారించిన విజ్ఞులు**
**అంతరించిపోయే స్వర్గం కోసం ఆరాటపడరు.** **98**

దివ్యత్వం పొందినాగూడా కొన్ని బాధలున్నాయి. కామధాతు దేవతలస్థితిలో ఎన్ని అమరసుఖాలు అనుభవించినా, ఆ అవధి ముగిసిన తర్వాత మళ్ళీ మనుష్య జన్మకు రావాలి. దివ్యస్థితి ముగియబోతున్నదని, మళ్ళీ జన్మించబోతున్నామని వారికి తెలుసు. జన్మవల్ల రాబోయే కష్టపరంపరగూడ తెలుసు. అపుడు వారి దుఃఖం అలవిమాలినది. అది నరక బాధలకన్న మిన్న. ఉన్నతంగా ఆకాశంలో విహరించే పక్షి చిన్న బాణాఘాతంవల్ల క్రిందకు పడటం లాంటిదే ఇది. అందువల్ల వివేకవంతులు నరకబాధలకు దూరంగా ఉన్నట్లే స్వర్గ సుఖాలకు గూడ దూరంగానే ఉంటారు.

**ఇదివరకు ఎన్నడూలేనట్లు శరీరచ్ఛాయ వివర్ణం అవుతుంది.**
**కూర్చోలేదు. మెడలోని పూలదండలు వాడిపోతాయి.**
**దుస్తులు మురికి దుర్గంధం అవుతాయి.**
**శరీరంమీద చెమటలు క్రమ్ముతాయి.** **99**

**భూలోకవాసులు అవసాన లక్షణాలనుబట్టి సమీపిస్తున్న**
**మృత్యువును గుర్తించినట్లు, స్వర్గంలోని దేవతలకు**
**పునర్జన్మలే మృత్యువును సూచిస్తాయి.** **100**

అందం - మనశ్శాంతి - నిత్యవికాసం - శుభ్రత - ఇవి దివ్యలక్షణాలు. అవి సమాప్తి చెందబోతున్నపుడు ఆకారవికృతి, ఆందోళన, పూలు వాడటం, మాలిన్యం ఏర్పడటం, మొదలయినవి కలుగుతాయి. ఇవి స్వర్గంలో అవసానదశను సూచించే లక్షణాలు. దివ్యత్వంలో నుండి దిగువ భూమికలలోకి రావటమే మరణించట మన్నమాట.

**దేవలోకం నుండి (దేవత్వం నుండి) పునర్జన్మయెత్తి వచ్చేటప్పుడు**
**పుణ్యలేశం ఏమీ మిగిలి ఉండకపోతే శక్తిహీనులై జంతువులుగానో**
**పిశాచాలుగానో నరకలోక నివాసులుగానో జన్మిస్తారు. 101**

వీళ్ళ బాధ మరీ ఎక్కువ. మొదటినుండి నరకంలో ఉన్న వాళ్ళు కొంతయినా ఆ కష్టాలకు అలవాటయి ఉంటారు. కాని స్వర్గంలో సుఖాలు అనుభవించినవారు వీటిలో పడితే వారికష్టం మరీ ఎక్కువ కదా!

**దేవతల వైభవంమీద అసురులకు సహజవైరం ఉన్న కారణంగా,**
**వారికి మానసిక వ్యథ ఎక్కువ.**
**వీళ్ళుకూడ ధీమంతులే అయినా**
**జన్మావరణంవల్ల సత్య దర్శనం చేయలేకపోతారు. 102**

వాళ్ళల్లో వాళ్ళకు అసూయలు. అందువల్ల వైరాలు. అంతవరకే అగుతాయా! అసురులకు ఈ వ్యతిరేక గుణాలవల్ల సత్యదర్శనం జరుగదు. అసూయాదులు సత్యదర్శనానికి అవరోధాలు.

**దేవతలు, మానవులు, నరకలోక ప్రేతాలు, పశువులు**
**ఎవరయినా యిదీ సంసారం తీరు. ఎవరుగా పుట్టటమయినా**
**దురదృష్టకరమే. వీటన్నిటికీ జన్మయే ఆలవాలం అని గుర్తించు. 103**

ఎక్కడ పుడతామన్నది ప్రశ్నకాదు. ఏస్థాయిలో నయినా అసలు జన్మించటమే దురదృష్టకరం. కనుక మన చర్యలవల్ల పాపాల వల్ల ఈ స్థాయిలలో పునర్జన్మ కలుగుతుందేమోనన్న భయంతో ఉండాలి. వాంఛించవలసింది జన్మ రాహిత్యమే గాని ఉత్తమ జన్మను కాదు.

**నీగుడ్డలకో తలకో హఠాత్తుగా నిప్పంటుకుంటే**
**త్వరగా నివృత్తిచేసే ఉపాయం ఉపేక్షించనట్లు**

**పునర్జన్మ లేకుండుటకు ప్రయత్నించు.**
**ఇంతకంటే ఉత్కృష్టమయిన ప్రయోజనం ఏదీలేదు.** **104**

జన్మ రాహిత్యావసరాన్నిగూర్చి, నిర్వాణ గుణాన్ని గూర్చి, సాధన మార్గంగూర్చి హెచ్చరిస్తున్నారు.

సుదీర్ఘకాల సాధనవల్లనే నిర్వాణం సాధ్యం. ఆలస్యం చేసిన కొద్దీ దూరం జరుగుతుంది. శరీరానికి నిప్పంటుకుంటే ఆర్పటానికి ఆలస్యం చేయనట్లు, జన్మలను ఆర్పుకొనటానికిగూడ ఆలస్యం చేయగూడదు. ఉపమానం ఎంత స్పష్టంగా కర్తవ్య ప్రేరకంగా ఉందో.

'తలకు నిప్పంటుకోవటం' అనే ఉపమానాన్ని తథాగతుడే వాడారు.

**శీలము, సమాధి, ప్రజ్ఞల ద్వారా ప్రశాంతము**
**అకల్మషము ప్రసన్నము అయిన నిర్వాణమును పొందుము.**
**దానికి వయస్సులేదు. మరణములేదు. అది అవ్యయం.**
**సూర్యచంద్రులకు పృథివి ఆపస్తేజోవాయువులకు**
**నిరపేక్షమయినదీ నిర్వాణము.** **105**

శీలము, సమాధి, ప్రజ్ఞ, నిర్వాణ సాధకాలు, నిర్వాణం సోపాధికమని నిరుపాధికమని రెండు రకాలు. నిరుపాధికంలో పంచస్కందాలు ఉండవు. సోపాధికంలో పంచస్కందాలు ఉండి శరీరనాశంతోపాటు అవికూడ అంతరిస్తాయి. సోపాధిక (స+ఉపాధి) నిర్వాణాలలోగూడ శూన్యత అనుభూతం అవుతూనే ఉంటుంది. ఈ నిర్వాణస్థితి పొందినప్పటి నుండి మనసు నిర్మలంగా ఉంటుంది. వయోధర్మం ఉండదు. ఇక జన్మ ఉండదు గనుక మరణంగూడ ఉండదు. అందువల్ల మృత్యురహితం. దానికి రూపాది గుణాలే ఉండవు. రూపాలు, గుణాలు, పంచభూతాలు, అక్కరలేనట్టి అస్తిత్వం కలిగి ఉంటుంది. నిర్వాణస్థితి అంటే గుణరూప రహితమయిన అస్తిత్వం అన్నమాట. ఆ రెండు నిర్వాణాల్లోను ఆలోచనావృత్తి భావనలు ఉండవు. ఈ నిర్వాణస్థితులు రెండింటిలోను పాపాలు జయింపబడతాయి కనుక అవి స్వచ్ఛము.

**జ్ఞానోదయానికి అవయవాలవంటివి**
**ప్రశ్రబ్ధి, ధర్మవిచయ, వీర్య, ప్రీతి, స్మృతి, సమాధి, ఉపేక్ష**
**ఈ ఏడు నిర్వాణసాధకమయిన బోధ్యంగాలు.** **106**

ఈ ఏడు సాధనాలు బోధి (జ్ఞానం)కి సాధన క్రమాలు – వీటిని విపస్సనా సాధన ద్వారా పొందవచ్చు.

ప్రశ్రబ్ధ = సాధకునికి శరీరంలోను, చిత్తంలోను కలిగే చంచలతను అలసటని పోగొట్టును.

ధర్మవిచయ = నామరూపాలను విభజించి వాటి యధార్థ స్వరూపం తెలియటం.

వీర్య = ధ్యానంలో వెనుతిరుగకుండా నిరంతరం ప్రయత్నానికి బలం యివ్వటం.

స్మృతి = చిత్తంలోని అకుశల ధర్మాలను నిర్మూలించటానికి నాలుగు అనుపస్సనలను వృద్ధిచేయటం.

ప్రీతి = మొదటి రెండు ధ్యానాలలో మనసుకు కలిగే మానసిక అభిలాష

సమాధి = స్రోతాపన్నాది నాలుగు మార్గాలను నాలుగు ఫలాలను పొందటానికి దోహదం చేసే లోకోత్తర సమాధి.

ఉపేక్ష = ఇది సమచిత్త స్థితి.

ధమ్మపదం పండితవర్గు 14వ గాధలో చెప్పిన సాధన.

ఈ ఏడు మార్గాలద్వారా జ్ఞానాన్ని, తద్వారా నిర్వాణాన్ని పొందటానికి సాధన చేయాలి.

ప్రజ్ఞలేక ధ్యానంలేదు. ధ్యానం లేక ప్రజ్ఞరాదు.
**ఈ రెండు తెలిసిన పిదప**
**ఈ సంసార సాగరము గోష్పాదమంత మడుగు.** **107**

ప్రజ్ఞ అంటే శూన్యతను గ్రహించగల్గిన వివేకం. ఇది కలగటానికి వేనియందు మనసు ఉంచాలో, ఉంచకూడదో తెలిసే వివేకం కావాలి.' అట్లాంటి ప్రజ్ఞ కలిగినపుడే ధ్యేయంమీద ధ్యానం నిలపగలం. ధ్యానం నిలిచినపుడే మనో లక్షణమైన శూన్యత తెలుస్తుంది. కనుక ప్రజ్ఞ, ధ్యానం ఈ రెండూ పరస్పరం ఆధారపడి పురోగమిస్తాయి. అందుకు ముందుగా మానసిక, శారీరక స్థాయిల్లో ప్రశాంతి,

స్థిమితత్వం కావాలి. సరియైన ధ్యానం, ప్రజ్ఞ సిద్ధించినవాడు సాగరం లాంటి ఈ సంసారాన్ని అవలీలగా అధిగమిస్తాడు. ప్రపంచ దృష్టి ఉన్నవాడు తనను తాను మరువలేడు. ధ్యానం చేసినా ధ్యానానంతరం మళ్ళీ మామూలు వ్యవహారంలోనే పడతాడు. ఇది తెలిసికొనడానికి ప్రజ్ఞ కావాలి. ఈ వివేకమే నిర్వాణ సాధకం. ధమ్మపదంలో అప్పమాదవర్గులో మొదటిగాధను ఈశ్లోకం అనుసరిస్తున్నది.

**ఈ లోకంలో పదునాల్గింటిని అవ్యాకృత ధర్మాలని,**
**అవి మనశ్శాంతికి అవరోధాలని, బుద్ధుడు అభిభాషించాడు.**
**అందువల్ల వాటి గురించి ఊహాగానాలు చేయవద్దు. 108**

1. విశ్వం శాశ్వతము; 2. శాశ్వతం కాదు; 3. శాశ్వతము, అశాశ్వతము రెండూనూ; 4. శాశ్వతముకాదు, అశాశ్వతముకాదు; 5. విశ్వంసాంతము, 6. విశ్వం అనంతము; 7. సాంతము అనంతమును; 8. సాంతము కాదు, అనంతమూ కాదు; 9. మరణానంతరం తథాగతుడు ఉంటాడు; 10. ఉండడు; 11. ఉంటాడు, ఉండడూను; 12. ఉండడు, ఉండకనూపోడు; 13. దేహం, ఆత్మ ఒక్కటే; 14. పరస్పరం భిన్నం.

ఈ ప్రశ్నలను బుద్ధుడిని అడిగేవారు. ఆయన సమాధానం చెప్పేవాడు కాదు. వాటిని స్థాపించడం అశక్యం. వాస్తవంలో లేనిదానిని గురించి ప్రశ్నిస్తే సమాధానం లభించదు. చంద్రుడి మీద చీమ ఎంతలావు ఉంటుంది అంటే ఏం చెప్పగలం. అందుకని ఇట్లాంటి వాటిపై మనసుపెడితే సమాధానం రాకపోగా మనః ప్రశాంతి పోతుంది. అందుకే బుద్ధుడు హెచ్చరించాడు.

**అవిద్య నుండి కర్మలు కలుగుతాయి.**
**కర్మల నుండి విజ్ఞానం కలుగుతుంది.**
**దాని నుండి నామరూపాలు పుడతాయి.**
**అందుండి షడాయతనాలు కలుగుతాయి.**
**వానివల్ల స్పర్శాదులు జనిస్తాయి. 109**

**వాని నుండి వేదనలు కలుగుతాయి.**
**వేదనలను ఆశ్రయించి తృష్ణ కలుగుతుంది.**
**దాని ఉపాదానమువల్ల భావముత్పన్న మవుతుంది.**
**భావము నుండి జాతి కలుగుతుంది. 110**

**జాతి నుండి దుఃఖము, వ్యాధి, జర,**
**వస్తు లాభము కలుగదన్న భయము, మరణము కలుగుతున్నాయి.**
**విపులమయిన ఈ దుఃఖస్కందము జాతివల్ల కలుగుతున్నది.**
**జన్మ నిషేధంతో ఇవన్నీ నిరోధించబడతాయి. 111**

అజ్ఞానం నుండి కారణజాతం కలిగి, ఆ కారణాలే కార్యాలై, కార్యాలే మళ్ళీ కారణాలై గొలుసులాగ కొనసాగి సంసార వేదన కల్గుతున్నది. జన్మ నివారించుకుంటే గొలుసులోని లంకెలు తెగుతాయి. సంసారమునకు అజ్ఞానమే మూలము. అజ్ఞాన భిన్నమైన సత్యము శూన్యత. పరస్పరాధారంగల ఈ కారణ చక్రాన్ని ఎవరు అంతం చేసుకుంటారో, వారు సంసారాన్ని, నిర్వాణాన్ని అర్థం చేసికో గల్గుతారు. అవిద్య మొదలుగ జన్మ దుఃఖాల వరకు గల కారణ క్రమాన్నే ప్రతీత్య సముత్పాదం అంటారు. కర్మక్రమాన్ని వివరించే ప్రధాన సిద్ధాంతం ఇది. ఇది ప్రత్యేకంగా అధ్యయనం చేయవలసింది.

**జినుని బోధనలకెల్ల ప్రతీత్య సముత్పాదము మిక్కిలి**
**గంభీరార్థము నిండినది, విలువైనది.**
**ఈ సిద్ధాంతాన్ని దర్శించినవారు**
**తత్త్వదర్శి అయిన ఉత్కృష్ట బుద్ధుని గ్రహించగలరు. 112**

శాశ్వతంగా ఉండేది ఏదీ లేదన్నంత మాత్రాన కారణ పరంపరా జన్యమైన, అనుభవికమైన వాస్తవాన్ని నిరాకరించినట్లు కాదు. స్వయంసిద్ధమైన సత్యం కాకపోయినా, అది పరస్పర ఆధారమైన అస్తిత్వాన్ని కల్గినదే. శాశ్వత సత్యం, పరిమితిబద్ధమైన వాస్తవం. ఈ రెండూ పరస్పర భిన్నాలే కానీ విరుద్ధాలు కావు. అన్నీ నశించేవే అని కానీ, అన్నీ శాశ్వతమే అని కానీ భావించని ఈ పరస్పరాశ్రిత సృష్టి వాదమే (ప్రతీత్యసముత్పాదవాదం) మూలసిద్ధాంతం.

సదసద్వస్తువులన్నీ పరస్పరాధారమైన అస్తిత్వం కలవే. పరిమితులలో బద్ధమైన వాస్తవాలు ఏవీ పరమసత్యానికి భిన్నము కానీ, విరుద్ధములు కానీ కావు. అట్లాగే, పరమసత్యం కూడా వాస్తవభిన్నమైనది కాదు. అన్నీ నశించేవే అనికానీ, అన్నీ శాశ్వతమైనవని కానీ భావించరాదు. అన్నీ హేతువు నుండి పుట్టును. కనుక దీనికి ప్రత్యయాపేక్ష కలదు. కనుక అవి స్వతంత్రములు కావు. నిత్యానిత్య వస్తువులు

అన్నిటి ఉత్పత్తి, ప్రత్యయ సాపేక్షమే. ఈ సిద్ధాంతమునే ప్రతీత్యసముత్పాద వాదం అందురు. సంసారము సర్వము ఇట్టిదే. జీవులు బంధములో తగిలి ఉండుట వలన సత్య దర్శనంకాదు.

పంచ స్కందాలను పట్టుకు వ్రేలాడినంత కాలం అహం కొనసాగుతుంది. ఈ అహం ప్రసరించగానే కార్యశీలత మొదలౌతుంది. అది జన్మ పరంపరలోకి, సంసార చక్రంలోకి దారితీస్తుంది. శూన్యతను గ్రహించటం కన్నా ముక్తిని సాధించటానికి వేరే శ్రేష్ఠమైన మార్గంలేదు. సంసార చక్రమును నిత్యమని కానీ, అనిత్యమనికానీ, వివరించరాదు. భావా భావరహితమైన మధ్యమ మార్గమే సత్యము. నాగార్జునుడు దీనినే శూన్యవాదము, మాధ్యమిక వాదమని చెప్పారు. బుద్ధుడు చెప్పిన ప్రతీత్య సముత్పాదమునే నాగార్జునుడు ఇట్లు వ్యాఖ్యానించెను, ఇదే బుద్ధుని బోధన సారాంశము. ఈ సిద్ధాంతమును సమగ్రంగా గ్రహించుటకు నాగార్జునుని ఇతర గ్రంథాలను అధ్యయనం చేయవలెను.

1. దేనికినీ శాశ్వతమైన అస్తిత్వం లేదు. వస్తువు తన నుండి తాను పుట్టదు.
2. వేరొక దాని నుండి కూడ పుట్టదు.
3. తననుండి, వేరొక దాని నుండి కూడ పుట్టదు.
4. తననుండి, వేరొక దాని నుండి పుట్టకనూపోదు.

ప్రతిదీ కారణము నుండి పుట్టును. కారణము నుండి కార్యము జనించును. కారణము నశించిన పిదప దేని ఉనికిని గ్రహించుచున్నామో, అది కార్యము. ఈ కార్యము వేరొకదానికి కారణమయి నశించును. కనుక అన్నియు క్షణికమయిన అస్తిత్వం కలవే.

**ప్రశాంతిని పొందటం కోసం సమ్యగ్దృష్టి, సంకల్పం, వాక్కు**
**కర్మ, ఆజీవము, వ్యాయామం, స్మృతి, సమాధి, అనే**
**ఆర్య అష్టాంగ మార్గాన్ని బాగుగా భావించు 113**

ప్రశాంతమయిన నిర్వాణస్థితిని చేరుకొనటానికి అష్టాంగ మార్గాన్ని సాధన చేయాలి. సమ్యగ్దృష్టి సమగ్రశోధనకు, సమ్యక్ సంకల్పం, జీవనం, యత్నం, వాక్కులు, సమాధి, శ్రద్ధ, కర్మలు కల్మషాన్ని క్షాళనం చేసికొనటానికి ఉపయోగిస్తాయి.

**జన్మమే దుఃఖం. సర్వదుఃఖాల సముదయానికి**
**అత్యంత కారణం తృష్ణ. తృష్ణను నిరోధించటమే నివృత్తి.**
**ఆ ముక్తిని చేరుటకు అష్టాంగ మార్గమే సాధనం. 114**

**ఈ బాటలో చతురార్య సత్యాలకు**
**విధేయుడవై యత్నించు. అదే మహాశ్రేయస్సు. ఐశ్వర్యం ఒడిలో లాలనపొందే**
**గృహస్థులు గూడ దీనివల్ల క్లేశనదిని తరిస్తారు. 115**

1. మన కర్మలవల్ల, కల్మషాలవల్ల భవచక్రంలో పరిభ్రమిస్తూ ఉంటాం. జన్మమే దుఃఖం. ఇది మొదటి ఆర్య సత్యం.
2. పంచస్కంధాలను ఆలంబనం చేసికొనటమే బాధలకు కారణం. దీనివల్లనే దుఃఖం కలుగుతున్నది. ఇది రెండవ సత్యం.
3. దుఃఖాన్ని నాశనం చేసికొనటమే నిర్వాణానికి మార్గం. ఇది మూడవ సత్యం.
4. నిర్వాణాన్ని సాధించటానికి అష్టాంగ మార్గమే సాధనం. ఇది నాల్గవ సత్యం.

ఈ నాల్గింటిలో మొదటి మూడు బోధకు చెందినవి. నాల్గవది ఆచరణకు సంబంధించినది. ఈ సత్యాలను గ్రహించటంతోపాటు దుఃఖ స్వభావంకూడ శూన్యమేనని గుర్తించాలి. దుఃఖానికి కర్త ఎవరూ లేరు. దుఃఖాన్ని అనుభవిస్తున్నది కూడ ఎవరూ లేరు. అది కూడా శూన్యమే. దుఃఖ స్వభావాన్ని తెలుసుకుంటే అది విడిచిపోతుంది. ఈ నాల్గు ఆర్యసత్యాలు. అష్టాంగమార్గ ఆచరణ, ధ్యానము చేత శూన్యతను గ్రహించగలరు. వీటివల్ల నిర్వాణమును సాధింపవచ్చును. అదే పరమశ్రేయస్సు

**సత్యాలను దర్శించినవారు ఆకాశం నుండి నక్షత్రాలవలె**
**ఊడి పడ్డవారూ కాదు, ధాన్యంమొక్కలాగా**
**భూగర్భం నుండి మొలుచుకొచ్చినవారూకాదు. వారుకూడా**
**అంతకుముందు పాపాలలోపడి వచ్చిన పృథగ్జనులే. 116**

సత్యసాక్షాత్కారం సాధనవల్ల లభించే ఫలితం. వరంగానో, జన్మ లక్షణంగానో వచ్చేది కాదు. పై చెప్పిన చతురార్య సత్యాలలో మొదటి రెండింటిని వదలినా చివరి రెండింటిని గ్రహించాలి. ఇది పెద్దలవల్ల గ్రహించి ఆచరించాలి.

మొదటి రెండు తెలుసుకోటానికి మాత్రమే పనికివస్తాయి. చివరి రెండూ సంకల్పానికి, ఆచరణకు సంబంధించినవి. పాపాలలో గడపినవాడు కూడా నిశ్చయంతో ఆచరిస్తే నిర్వాణం పొందవచ్చునని హామీ ఇస్తున్నారు. మానవులలో ఉత్కృష్ట దశలో జన్మించి, సదసద్వివేకం కలిగి ప్రజ్ఞావంతమైన శీలం కల్గినపుడు ఇంకా జ్ఞానం కలగకుండా ఎలా ఉంటుంది? అని బోధిచర్యావతారం ప్రశ్నిస్తున్నది.

**చిత్తమే సర్వధర్మాలకు మూలం అనికదా భగవానుని వచనం!**
**కనుక మనస్సును నిగ్రహించు అదే మేలు.**
**ఓ నిర్భయుడా! ఇంకా అధికంగా**
**చెప్పటానికేముంది! ఇదే హితోపదేశం. 117**

చిత్తం అధీనంలో మనం ఉండకూడదు. మన అధీనంలో చిత్తం ఉండాలి. అదే శిక్షణ. శిక్షణ లేకపోతే మోక్ష సాధకమైన అష్టాంగ మార్గం ఆచరించలేవు. శిక్షణ లేని మనసు పాపచింతనవైపే వెళుతుంది. అది సంసార కారణమై జీవి జనన మరణ చక్రంలోకి తోస్తుంది. అందుకే మనసును స్వాధీనం చేసుకో శిక్షణతో కల్మష మార్గాలను పరిహరించుకొనాలి. మనో శిక్షణే దమము గుణాలకన్నింటికీ శిక్షణాబద్ధమైన మనస్సే మూలమని బుద్ధుడు బోధించాడు మనసును దమంలో ఉంచుకోవాలి, రక్షించుకోవాలి. అంతేకానీ, వట్టి ఆచారాలన పాటించే పరివ్రాజకత్వం వల్ల ప్రయోజనం ఏముంది? స్వీయ మానసిక శిక్షణక ప్రాపంచిక భయాలు అవరోధాలు. అందుకే నిర్భయుడా అని సంబోధన.

**నీకుచేస్తున్న ఉపదేశాలు ఏకాంతవాసియైన భిక్షువయినా**
**ప్రయాసపడి ఆచరించటం కష్టమే.**
**అయినా వీటిలో ఏ చర్యాసారాన్నయినాసరే శిక్షణలో**
**ఆచరించి జీవితాన్ని సార్థకం చేసుకో. 118**

ఇపుడీ లేఖలో చెప్పిన సూచనలన్నీ పాటించవలసినవే. ఒంటరి వనవాసం చేసే శ్రమణుల కయినాసరే ఇవన్నీ పాటించటం కష్టమే. బాధ్యతా బంధాలలో చిక్కుకొనే గృహస్థులకింకా కష్టంగదా. ఏమయినాసరే దోషాచరణలను విడచి సుగుణాలను పాటించే శిక్షణలను కొన్నింటినయినా, చేతనయినంతవరకు అవలంబించాలి. అందువల్ల వాళ్ళ జీవితం ప్రయోజనవంతం ఫలప్రదం అవుతుంది.

ఉన్నత భూమికలను సాధించి జ్ఞానం పొందగలుగుతావు. 'ధర్మంవల్ల ముందుగా అర్థం సుఖం ప్రాప్తిస్తాయి. అనంతరం నిర్వాణం కలుగుతుంది' అని రత్నావళిలో ఆచార్యులు వివరించారు.

**సర్వజీవుల కుశలములకు, సర్వప్రయోజనాలకు**
**మోదం పొందుతూ త్రికరణ శుద్ధమైన**
**నీ చర్యలతో బుద్ధత్వమునకు పరిణమించుము.**
**దీని వలన నీకు పుణ్యరాశి కలుగుతుంది.** **119**

**ఈ కారణంచేత దేవ - నరలోక**
**యోగుల జన్మలను వశం చేసుకొని**
**దుఃఖితులను నీ సహాయముతో అనుగ్రహిస్తూ**
**అవలోకితేశ్వర చర్యల నాచరింపుము** **120**

అవలోకితేశ్వర = లోకుల బాధలన్నీ ఆలకించే పరమ కరుణామూర్తియైన బోధిసత్త్వుడు.

జరావ్యాధులు, రాగద్వేషములు విడనాడి భగవాన్ అమితాభునివలె, లోకేశ్వరుడయిన అమితాయుడవై బుద్ధక్షేత్రమున జన్మమును పొంది చరింతువు గాక.

బుద్ధులు, బోధిసత్త్వులు - (బుద్ధత్వ, బోధిసత్త్వ స్థితులను పొందినవారు.) సర్వజీవుల సత్కార్యాలకు మోదము పొందుతారు. అది వారి స్థితి లక్షణం. నాల్గు బ్రహ్మ విహారాలలో ముదిత మూడవది. 'మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్ష అన్నవి నాలుగు బ్రహ్మవిహారాలు. చేసే సత్కార్యాల ఫలితాన్ని తనకోసంగా పొందకూడదు. సర్వజీవుల జ్ఞానసిద్ధి కోసం అర్పణ పూర్వకంగా ఆచరించాలి. అట్లా చేసినవారు జ్ఞానసిద్ధికి ఉపకరించే అనేక జన్మలు పొందుతారు. యోగసాధనవల్ల, అంతర్జ్ఞానం, ప్రశాంతి, సమాధి స్థితులతోపాటు సత్యదర్శనం కలిగించే అగణ్య గుణాలు సిద్ధిస్తాయి.

**ప్రజలను ఆదుకొనటానికి జన్మను స్వీకరించి**
**వార్ధక్యాన్ని ద్వేషానురాగాలను నిర్మూలిస్తూ**

**అనంత జీవితకాలం ప్రపంచ సంరక్షకునిగా, భగవాను**
**డైన అమితాభునిగా, బుద్ధక్షేత్రంలో ఉందువుగాక. 121**

అనాదికాలం నుండి 'అమితాభుడు' తన వాక్కులతో మనశ్శరీరాలతో, నిర్వేదమగ్నులయిన సాధువులను ఆదుకొని సరియైన బాటలో వెళుతుండేవాడు. అట్లాగే, అందరూ తమ సత్కార్యాచరణ శక్తితో అతనివలె ప్రయత్నించాలి. మనం కూడా ఈ భవచక్రంలోనే ఉన్నాం కనుక ఇంద్రియబద్ధుల దుఃఖాన్ని, దాని కారణాలను తొలగించే యత్నంచేసి వారు సన్మార్గంలోకి మరలేటట్లు పరిణమింప చేయాలి. భవబద్ధులకు సహాయం చేస్తుంటే, ఏనాటికైనా అమితాభునివలె పరిణమిస్తారు. అమితాభ బుద్ధునిలోకం అత్యంత సంతోష ప్రదమైనది. ప్రాపంచికులకు జ్ఞానస్థితిని కల్గించటమే ఆ అమితాభ బుద్ధత్వ ప్రయోజనం. 'లోకం ఉన్నంత కాలం, వారి దుఃఖాలను నివారించే ప్రయత్నం కోసం నేనుకూడా ఉందును కాక' అని బోధిచర్యావతారంలో శాంతిదేవుడు చెప్పినట్లు భావిస్తూ ఉండాలి.


**ప్రజ్ఞా శీల త్యాగముల నుండి కల్గిన విమలఖ్యాతి**
**భూమ్యాకాశ స్వర్గముల యందు ప్రసరించుగాక!**
**భూ దేవలోక, స్త్రీ సుఖాభిలాష శమించుగాక 122**

**పాపోప హతులైన జీవుల జనన మరణ**
**భయాలను నాశనం చేయగలది; లోకోత్తరము,**
**సరళము, శాంతము, అభయము, అక్షయము,**
**అయిన జినేంద్రపదమును పొందుదువు గాక! 123**

ప్రాపంచిక సంఘటనకు, పారమార్థిక సత్యానికి మధ్యగల భేదాన్ని గుర్తించగల వివేకం ఉండాలి. గురువుకు ప్రమాణం చేసిన నైతిక జీవనానికి బద్ధులై ఉండాలి. దాన సమయంలో దాతనుగానీ, యాచకుణ్ణిగాని, మరిదేన్ని గాని ధ్యాసలో ఉంచుకోకూడదు. ఈ విధమైన ఆచరణవల్ల ప్రపంచం నలుమూలలకే కాక, దేవలోకానికి కూడ కీర్తి ప్రసరిస్తుంది. దీన్ని మార్గదర్శకంగా స్వీకరించి భూప్రజలు కూడ వైరాగ్యభావం కలిగి వారి బంధాలను దూరం చేసికొనటం ప్రారంభిస్తారు. క్రమంగా అది వారిని బంధ విముక్తులను, పాప

విముక్తులను చేస్తుంది. అందువల్ల జన్మ పునరావృతి నుండి బయటపడతారు. సాధువులను బాధలనుండి విముక్తి చేసినవాడు బుద్ధత్వాన్ని పొందుతాడు. అది భయరహితమైనది. వయస్సులేనిది. జన్మ, మృత్యురహితమైనది. అనశ్వరము, అవ్యయము అయినది. ఈ నిర్వాణం సిద్ధించినవాడు సాధుజనపోషకుడూ, రక్షకుడూ అవుతాడు.

సుహృల్లేఖ సమాప్తము



# రత్నావళి

## ఆర్య నాగార్జునాచార్య విరచితం

14వ దలైలామాగారయిన పూజనీయ టెన్‌జింగ్ గ్యాట్సో గారు
1972లో ధర్మశాలలో ముఖత: 'రత్నావళి'ని వ్యాఖ్యానించారు.
దానినమసరించి జెఫ్రీహాప్కిన్స్ గారు ఆంగ్లంలోకి అనువదించారు.

* * *

భారతీయ పండితుడయిన శ్రీ విద్యాకరప్రభా గారు,
టిబెటిన్ పండితుడయిన బెల్‌ట్జెక్ గారు మూడు సంస్కృత పాఠాలను
సంప్రదించి ఇంగ్లీషులోకి అనువదించారు. వీరి అనువాదాలను
టిబెటన్ పండితులు ఆమోదించారు.

# రత్నావళి

## మొదటి పరిచ్ఛేదము

### త్రిరత్నములకు నమస్కారము

బుద్ధం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి

బుద్ధుని గుణ సంపత్తికి వందనము

1. సర్వగుణాలంకారునకు
   సర్వదోష వినిర్ముక్తునకు
   సర్వసత్త్వైక బాంధవునకు
   సర్వజ్ఞునకు శిరసా నమస్కరింతు.

2. ధర్మోద్దీపన మొనరించు కల్యాణ కరమౌ
   సదాచరణము నెరిగించెద రాజా!
   సద్ధర్మ పాత్రయందె
   సిద్ధింపగలవు అభ్యాసములన్ని.

ప్రథమ పరిచ్ఛేదంలో ముందుగా ధర్మాచరణానికి, దానికి ఫలితమయిన పరమ శ్రేయస్సుకు గల కార్యకారణ సంబంధాన్ని వివరిస్తున్నారు ఆచార్యులు. ధర్మాచరణం అంటే, శ్రద్ధ – శీలం – సుఖం కలిగించే వానిని సాధనచేయటం. ఇందువల్ల ధర్మం సిద్ధిస్తుంది. శ్రేయస్సు కలుగుతుంది. ద్వంద్వముల కతీతమయిన జ్ఞానము విమోక్షములే శ్రేయస్సు. అస్తినాస్తులు, ఆమోద తిరస్కారాలు వంటి వివిధ ద్వంద్వముల నధిగమించి అర్థం చేసుకొనగలగటమే ప్రజ్ఞ. అది నిర్వాణకారకము.

ప్రాగ్ధర్మము – శ్రేయస్సుల పూర్వాపరాల విషయప్రతిపాదన వినటానికి ప్రథమశ్రోతయైన శాతవాహన సార్వభౌముని సంసిద్ధం చేస్తున్నారు.

3. ప్రాగ్ధర్మాభ్యుదయము ఎవనికి కలుగునో
శ్రేయోదయము వానికె కలుగు పిదప.
అభ్యుదయము సంప్రాప్తించ
శ్రేయోపదమును క్రమముగా చేరగలరు.

ఆచార్య నాగార్జునుడు రత్నావళిని, సుహృల్లేఖను, శాతవాహన రాజు నుద్దేశించి చెప్పాడు. గౌతమీపుత్ర యజ్ఞశ్రీయే ఆశాతవాహన రాజు అని చరిత్రకారుల నిర్ణయం.

వితర్క విచారాలకు, నామరూపాలకు, అతీతమై ఉన్న స్థితియే శూన్యత. దాని అనుభూతికై హేతుజ్ఞానము, శీలాచరణములు ఆవశ్యకములే. ధర్మాచరణకు శ్రేయస్సుకు గల కారణత్వ, ఫలసిద్ధులను, నిర్ణయిస్తున్నారు.

రెండింటి అనుక్రమం

4. అభ్యుదయమె సుఖస్థితియని
శ్రేయస్సే నిర్వాణమని, తలతురు -
సారము సంగ్రహముగ తెలుపవలెనన్న,
శ్రద్ధాప్రజ్ఞలు కలసియే సాధనమార్గము.

శ్రద్ధ ప్రజ్ఞ అనే రెండు కారణాలలో ఏది ప్రధానమో నిర్ణయించుట.

5. శ్రద్ధవలన ధర్మముపై నిలతురు.
ప్రజ్ఞవలన మాత్రమె తత్త్వమెరుగగలరు.
ప్రజ్ఞ ప్రధాన మీ రెండింటి యందు.
శ్రద్ధయె అర్హతయై ముందు నిలచు.

ముందుగ శ్రద్ధ ఉండాలి. అందువల్ల ఆచరణ బలపడుతుంది. ప్రజ్ఞ కలుగుతుంది.

సాధకునికి ఉండవలసిన లక్షణాలు.

6. కామ, ద్వేష, భయ, మోహముల బడి
ధర్మాచరణము నుల్లంఘించనివాడె
శ్రద్ధాళువని యెరుగ వలయు.
అదియె ఉత్తమ పాత్రము శ్రేయస్సిద్ధికొరకు

7. కాయిక - వాచిక - మానసిక
కర్మలన్ని సమ్యక్పరీక్ష చేసి,
తనకు పరులకు హితమౌ దానిని
సతత మాచరించువాడు పండితుండు.

8-9. పది అకుశల కర్మల గురించి చెపుతున్నారు. ఇవి చేయరానివి. ఇందుకు భిన్నమయినవి - కుశల కర్మలు - చేయదగినవి. లోభము - ద్వేషము - మోహము - అనే మూడు అకుశల మూలాల నుండి పుట్టేవి అకుశల కర్మలు. అకామ - అలోభ - అద్వేషములనేవి మూడు కుశల మూలాలు. వాని నుండి కుశల కర్మలు కలుగుతాయి. వీనిలో కాయిక కర్మలు మూడు, వాచిక కర్మలు నాలుగు, మానసిక కర్మలు మూడు. మొత్తం పది. కుశల కర్మలకె శుక్ల (తెల్లని) కర్మలనిగూడ వాడుక. కుశల కర్మలు ఆచరించటంవలన సుఖాన్నిచ్చే ఫలితాలు కలుగుతాయి. నైతిక శీలమును కలిగించే చేతనవల్లనే దుష్ఫలితాలు అయినా, సత్ఫలితాలు అయినా కలుగుతాయి. ఇది ప్రాపంచిక కర్మల విభజనము.

8. ప్రాణిహింసయు, దొంగతనము చేయకుంట,
పరభార్యల పొందు కోరకుంట (కాయికములు)
మృషలు - పరుషములు - కొండెములు
వ్యర్థ భాషణము లాడకుండుట - (వాచకము)

9. లోభము, అపకారచింత, మిధ్యాదృష్టి (మానసికము)
వర్జించుట - ఈ దశకర్మలు వెల్గుదారులు -
భిన్నమయినవన్ని నల్లని చీకటి దారులు

తరువాత ఇంకొక ఆరు ఆచరణీయ కర్మలను సూచిస్తున్నారు. వీటితో మొత్తం పదహారు శీలధర్మాలను పేర్కొంటూ చివరి పాదంలో సారాంశాన్ని నిర్ధారణ చేస్తున్నారు.

10. మద్యాదుల వర్జనంబు, అహింసతో
ఆజీవిక, ఆదరమున చేయు దానము,
పూజనీయ పూజనంబు, మైత్రియు,
ధర్మమార్గసార సంగ్రహమిద్ది

11-13 ఇట్లాంటి మార్గదర్శనం ఇతర ధర్మాలలో లేదని సూచన. అకుశల మార్గంలో ప్రయాణం చేయటంవలన తనకు ఇతరులకు కూడ హాని కలుగుతుందని హెచ్చరిక.

11. ధర్మమాచరించుట యన్న
శరీరమును శోషపెట్టుటగాదు.
ఒరుల బాధించుట మాననివాడు
పరుల కేపాటియైన సాయమందించలేడు.

అకుశలపథంవల్ల కలిగేదోషాలు -

12. సంసార మహాటవిలోన,
అనంత జనపాదపముల మధ్య,
క్లేశములనెడు సర్పములు పెనవేయ
దేహం తిరుగాడుచుండును చిరకాలం

దశవిధ క్లేశాలు : లోభం - ద్వేషం - మోహం - మానం - దృష్టి - విచికిత్స - అహ్రీ (సిగ్గులేమి) - అనోత్తాపము (నైతిక భీతిలేమి) - ఉద్ధచ్ఛ (అవిశ్రాంతి) - మాంద్యము అనే ఈ మాలిన్యాలు మనసికారాలను మలినం చేస్తాయి. సంసారం అంటే భవచక్రం. కామ, రూప, అరూప దశలలోగల అస్తిత్వ పరిణామంలోపడి తిరుగుతూ ఉండటాన్ని సంసారం అంటారు.

అకుశల మార్గం పట్టేవారి లక్షణం -

13. శీల, దాన, క్షమాగుణ స్పష్టమౌ
ఈసద్ధర్మ మహాపథము ననాదరించి
వెడలువారు, కారడవిలో చిక్కుదారుల
పడినవారివోలె, కాయక్లేశము నొందగలరు.

14-19 అకుశల పథంలో ప్రయాణించేవారికి కలిగే దుష్ఫలితాలు -

14. హింస నాచరించిన కలుగు అల్పాయువు.
అపకారము లొనర్ప కలుగు బహుబాధలు.
చౌర్యమున కల్గు హీన సంపద.
వ్యభిచార ఫలముగ శత్రువర్గముకల్గు.

15. అనృతములు పల్క ప్రత్యాఖ్యానంబు కల్గు.
కొండెములు చెప్ప కలుగును మిత్రనష్టం.
పరుష భాషణంబు అహితంబు చెవికి చేర్చు.
వ్యర్థ భాషణము గౌరవహాని కూర్చు.

(ప్రత్యాఖ్యానము = విరుద్ధ వచనములు - నిందలు)

16. లోభముచే నశించు మనోరథములన్ని.
ద్రోహచింతచే కలుగు భయము.
మిథ్యాదృష్టి కలిగించు వక్రదృష్టి.
మద్యపానమున కల్గు చిత్త విభ్రాంతి.

A C.No. 137/39

17. దానగుణము లేకున్న దరిద్రత
మిథ్యాజీవికమున వంచనాగుణము
కపట వర్తనవల్ల హీనవంశము
అసూయా బుద్ధిచే కల్గు రూపహీనత

18. క్రోధమువలన వచ్చు వికృతవర్ణము.
పండితుల ప్రశ్నించకున్న కల్గు మూర్ఖత.
వీని ఫలితములెల్ల కూడి,
మానవులకెల్ల దుర్గతి కల్గు తుదకు.

ఈ దుర్గతి జన్మాంతరంలోనే కలుగుతుందని కాదు. మనుష్యులందరూ పైచెప్పిన దుర్బుద్ధుల పాలైతే కళ్లముందే ఈ లోకంలోనే దుర్గతి కలుగవచ్చు. పండితులు చెప్పిన వాటినెల్ల ప్రశ్నించక తలాడించటంవల్ల వివేకం వికసించక పోవటం, క్రోధంవల్ల వికారరూపం - శత్రువర్గం - మిత్రనష్టం - ఇవన్నీ ప్రస్తుత జీవితంలో కలిగే ఫలితాలే. మూలంలో 'దుర్గతి' అన్న శబ్దమే ఆచార్యులు ప్రయోగించారు. ఆ పదానికి హీన జీవితము, నీచజన్మ అని రెండు అర్థాలు. కుశల కర్మలకు ఫలితాలు పైనచెప్పిన వానికి భిన్నంగా ఉంటాయి.

19. అకుశల గుణ ఫలితములుగ
ఇవియన్ని విదితములు.
కుశల గుణములు కలిగించు
భిన్నములౌ సత్ఫలమ్ములు.

20. లోభము - ద్వేషము - మోహము
వీనివల్ల కలుగు చేతలన్ని అకుశలములు.
అలోభ, అద్వేష, అమోహములవల్ల
జనించు చేతలన్ని కుశలములు.

21. అశుభకర్మలు సర్వదుఃఖములకు మూలం.
వానివల్ల కలుగు సర్వదుర్గతులు.
శుభకర్మలవల్ల కలుగు సుగతులు.
సర్వజన్మలందు కలుగును సౌఖ్యవితతి.

కుశలాన్ని రెండు మార్గాలలో అభ్యసించాలి. 1. కుశల ఆచరణం. 2. అకుశల నిరాకరణం, ఇదే ద్వివిధ సాధనం అంటే.

22. అశుభ కర్మలన్నింటి నిరాకరించుట,
శుభ కర్మలందె సదా వర్తించుట,
మనోవాక్కాయముల వీని నాచరించుట,
ద్వివిధాన సాధనమని యెరుగ దగును.

23. ఈ ధర్మసాధన వలన తొలగును
నరకము, ప్రేతత్వము, పశుజన్మభయము.
పొందగలడు విపుల రాజ్యమును,
సుఖసంపదలు - దివ్యపదము.

24. అప్రమాణ - అరూప్యధ్యానములవల్ల
బ్రహ్మాది సుఖములు పడయవచ్చు.
అభ్యుదయ ధర్మములకు
సంగ్రహముగ నిదియఫలము.

అప్రమాణ - ఆరూప్యములు ధ్యానస్థితులు. చేతము విముక్తిని పొంది రూపస్థితులను - పరిమితులను అధిగమించే దశలు. శుభాశుభ కర్మల ఆచరణను వాని ఫలితాన్ని సూత్రానుసారం వివరిస్తున్నారు. 25-77 వరకు పరమ శ్రేయస్సుగూర్చి వివరణ. శుభకర్మలవల్ల కలిగే శుభఫలితాలు సాపేక్షంగా మంచివే అయినా అవి చిరము, శాశ్వతము అయినవికావు.

**25. శ్రేయమునుగూర్చి జినుడు చేసిన బోధలు**
**శ్రుతమతులుగాని బాలురకు**
**భయదములు, గంభీరములు,**
**అతిసూక్ష్మములు.**

బాలురు అంటే పిన్నవయస్సులోనివారు అనికాదు. అల్పజ్ఞులు – ధర్మప్రవేశం లేనివారు.

**26. "నేను లేను, నేనుండబోను,**
**నాకులేదు, నాకుండబో"దనుట –**
**భీతిప్రదములు బాలురకు.**
**విజ్ఞులకీమాట భయహరము.**

'నేను' అన్నభావం నుండే భయాలన్నీ బయలుదేరుతున్నాయి. పరమార్థంలో 'నేను' లేదు. ఈమాట అజ్ఞులకు భయాన్ని – విజ్ఞులకు ధైర్యాన్ని యిస్తుంది.

**27. సర్వజన హితకాంక్షి అయిన**
**సుగతుడిట్లు పలికె.**
**"నేనన్న భావమున జనియించు సర్వము,**
**నావియన్న భావముచే సర్వము పరివృతము".**

28–74 వరకు. పరమ శ్రేయస్సును గురించి విస్తృత వివరణం. ద్వంద్వములకు, కామసుఖములు – ఆత్మక్లేశము అనే రెండు పరస్పర విరుద్ధ ధృవాలకు, ఆత్మ అనాత్మలకు, అస్థిత్వ అనస్థిత్వములకు, సంసార నిర్వాణములకు, కార్య కారణములకు, ఉత్పత్తి– స్థితి – లయములనే మూడు దశలకు, నిత్య అనిత్యాలకు, భేద అభేదాలకు, ఏక అనేకాలకు, అంగి అంగాలకు (అంశి అంశలు), మంచి చెడులకు, అంగీకారానికి నిరాకరణకు – అతీతమయినది. అన్నిరకాల వితర్క విచారాలను అధిగమించినది అయిన నిర్వాణ ధర్మమును గురించి వివరించబోతున్నారు.

**28. "నేను ఉన్నాను; నాదియన్నదున్నది"**
**అన్నవి పరమార్థమున మిథ్యాదృష్టులు.**
**ఇవి రెండు అసలు లేనే లేవు,**
**యథాభూత పరిజ్ఞానమందు.**

29. నామ, రూప స్కంధములు పుట్టును
నేనన్న భావమందుండి, నిజమున కది మిథ్య.
మిథ్యా బీజము నుండి పుట్టినట్టి
దేది అయిన తథ్య మగుటయెట్లు.

నిజమునకు అంటే పరమార్థంలో అని. అస్థిత్వంలో ఉన్నవాటి విశ్లేషణ మేరకు అని. ఈ మిధ్యాదృష్టులను విడిచిపెట్టి నిర్వాణం సాధించాలి.

30. స్కంధములన్ని మిథ్యలని యెరిగినంత
"నే"నన్న భావము వెంటనే అంతరించు
'నేను' భావము అంతరింప
స్కంధములికపైన ఉదయింపబోవు.

స్కంధములు, నేను మిథ్యయని తెలుసుకొని, దుఃఖమును దాని మూలమును రహితం చేసుకొనే విధానం గూర్చి. బింబము - అద్దంలోని ప్రతిబింబము ఉపమానంతో వివరిస్తున్నారు.

31. స్వముఖ ప్రతిబింబకమౌ
దర్పణమును బట్టి ముఖబింబముండు.
ఇది అందరెరిగిన మాట.
తత్వమెరిగి చూడ అచట ఏమీలేదు.

32. స్కంధముల పట్టుకొని
నేనన్న భావము నిలచియుండు,
స్వముఖ ప్రతిబింబమును వోలె.
తత్త్వమరయ అచట "నేను" లేనేలేదు.

అదే ఉదాహరణను వ్యతిరేక దిశగా వివరిస్తున్నారు. స్కందాలు = దర్పణం, నేను అన్నభావం= ప్రతిబింబం. స్కంధాలకు అస్తిత్వం లేదని నిరూపిస్తే – నేనుగూడ శూన్యం అవుతుంది.

33. దర్పణాధారమునగాక
ముఖప్రతిబింబము లేనట్లు
స్కంధము లాధారముగ లేకున్న
నేనన్న భావమున కునికి లేదు.

ముక్తికి కారణముగా శూన్యతను గ్రహించుట.

**34.** **దీని యర్థమును ప్రజ్ఞతో నెరిగిన**
**ఆనందస్థవిరుడు ధర్మచక్షువయ్యె**
**అంతట బోధచేసె భిక్షులకు నిరతమ్ము.**

ధర్మము అంటే పరమార్థము. పరమార్థ సత్యము శూన్యతయే. అదే సత్యము . దానిని సదా దర్శించువాడు ధర్మచక్షువు. అట్టివాడు ముక్తుడు. సంవృతిసత్యముగా సర్వము శూన్యము గాదు. అస్థిత్వమున్నది. సంవృతి సత్యము అంటే వ్యవహార సత్యము - ఇది మనస్సుతో గ్రహించే సత్యము. ఈ అస్థిత్వమును, పరమార్థ సత్యమైన శూన్యతను, గ్రహించేవారి అధికార భేదమును బట్టి వేర్వేరు స్థాయిలలో బుద్ధుడు బోధించాడని ఆచార్యుల వివరణం. పరమార్థమయిన శూన్యతను గ్రహించుటే తుదిలక్ష్యము. ఆనందస్థవిరుడు = బుద్ధుని విడువక ఉండే సోదరుడు.

భవచక్రమునకు మూలకారణమును గుర్తించుట. జీవులు భవచక్రంలోకి ప్రవేశిస్తున్న క్రమం -

**35.** **స్కంధములపై మిథ్యావధారణ ఉన్నంతవరకు**
**"నేను" గూడ కొనసాగుచునే యుండు.**
**నేను భావము ఉనికిలో ఉండుదాక**
**కర్మయుండును దానిచే జన్మయుండు.**

(అవధారణ= నిశ్చయం)

స్కంధములు - నేను - కర్మ - అనే ఈ మూడు పరస్పరం కారణాలవుతూ చక్రంలాగా తిరుగుతుంటాయి. దాన్నే ఉపమాన పూర్వకంగా చెపుతున్నారు.

**36.** **పునరావృతమౌచు సంసారచక్రము**
**అగ్నిమండలము పోల్కి తిరుగుచుండు.**
**ఒకదాని కొకటి హేతువగుచు ఈమూడు**
**కూడి తిరుగుచుండు, ఆది మధ్యాంతములేక.**

సంసార చక్రం పుట్టుటకు, నశించుటకు గూడ కారణములు బయటలేవు.

**37.** **అహమో, ఇతరమో - ఉభయమో,**
**త్రికాలములో - కారణమై ఈ భవచక్రము**
**జనించలేదు. "నే"నను భావము క్షయమైన**
**కర్మలు జన్మలు గూడ నశించు వెంటనే.**

**38.** **కార్య కారణములు ఎట్లు ఉదయించునో**
**ఎట్లు లయించునో దర్శించువాడు,**
**తత్వతః, ఈ భవమును అస్తియనిగాని**
**నాస్తి అనిగాని గణియింపబోడు.**

శూన్యతను గ్రహించుట వలని ప్రయోజనం -

**39.** **సర్వదుఃఖ క్షయకరమగు ధర్మమును**
**వినుటయేగాని లోతు నెరుగనివాడు**
**భయరహిత స్థితియన్న భయముచెందు.**
**అవిద్యచేత కంపమొందు.**

40-45 వరకు విముక్త స్థితి స్వభావము : -

నిర్వాణస్థితిలో ఏమి ఉండవని, శూన్యమేనని, భయపడటం తగదని వారిస్తున్నారు. స్కంధములు - అహం - కర్మ మాత్రమే ఉండవు.

**40.** **ఈ సర్వము నిర్వాణమందు**
**ఉండబోవన్న భయము లేని నీవు,**
**ఇదియంత అభావమేనని చెప్ప**
**భీతి చెందనేల.**

"నీవు" అనటం - థేరవాదులను ఉద్దేశించి అని వ్యాఖ్యాతలు.

**41.** **మోక్షమందు "నేను" లేదు స్కంధములును లేవు.**
**నిర్వాణమీరీతి స్పష్టమై ప్రియమై యుండ,**
**"నేను"గాని స్కంధములుగాని**
**ఇచట తొలగుటన్న ఏల అప్రియము.**

నిర్వాణము అనునది భావముగాదు- అట్లని అభావముగూడ కాదు. భావము= విషయము Thing ; అభావము= అవిషయము Non thing, భావమ

అంటే మనోభావము, ఆలోచనే అనికాదు. భూ= ఉండు (to be) భవము ఉండునది, అభావము=లేనిది, ఉండనిది, విషయము= బద్ధమయినది, అవిషయము= బద్ధము గానిది.

42. నిర్వాణము అభావము కాదన్నచో
భావమేరీతి దానికి ప్రాప్తించె?
భావమా - అభావమా అనెడు
పరామర్శ లేకుండుటే నిర్వాణమన్న.

సత్యదృష్టికి - మిథ్యా దృష్టికి మధ్యగల భేదం వివరిస్తున్నారు.

43. కర్మలకు ఫలితముండదనుటె
నాస్తికదృష్టి - సంగ్రహముగచెప్ప.
పాపములేదు, అపాయము లేదనుటయే
మిథ్యాదృష్టి యనగతగును.

(అపాయము= నరకము, ప్రేతత్వము, జంతుజన్మ)

కర్మలకు ఫలితాలు ఉంటాయి అని అంగీకరించటం ఆస్తికం, కర్మలకు ఫలితాలు ఉండవనటమె నాస్తికం. అంటే కార్యకారణ సంబంధాన్ని అంగీకరించటమే ఆస్తికం.

44. మూడుమాటలచెప్ప, అస్తిత్వదృష్టి యన్న
కర్మలన్నిటికి ఫలితముండు ననుటే.
పుణ్యకర్మలు సుగతిని కల్గించు.
ఇట్టి చింతనయె సమ్యగ్దృష్టి యనదగు.

సద్విషయమును గురించి ఏ భావములేక విచార రహితముగ నుండుటే నిర్వాణము. జ్ఞానంవల్ల ఉన్నది లేదు అనే భేదం నశిస్తుంది. కనుక పుణ్యపాపాలను అతిక్రమించటం సాధ్యం. అపుడు స్వర్గ నరకాలనుండిగూడ విముక్తి కలుగుతుంది.

45. కలదు లేదను భేదము జ్ఞానముచే శమింప,
పుణ్య పాపములకు ఆవలి బాటగలదు.
సుగతి, దుర్గతుల నుండి ముక్తుడగుటె
నిర్వాణమని తథాగతుడు చెప్పె.

46 – 74. ఇంద్రియ గోచరములన్నీ శాశ్వతములుగాని, అభావములుగాని, కావని నిరూపించబోతున్నారు. 46– 56 వరకు దీని విపుల వివరణ.

**46.** **ఉత్పన్నములన్ని కారణ జన్యములనుచు**
**తెలియువాడు నాస్తికత నధిగమించు.**
**నాశనముగూడ కారణము చేతనే కల్గునని**
**యెరుగువాడు అస్తితను నొక్కిచెప్పబోడు.**

(స్వాభావిక) అంతర్గత అస్తిత్వం ఉందనుకొనటమే – దుఃఖానికి మూలం. ధర్మం తెలియుటవల్ల ఇది నశిస్తుంది. ఉత్పన్నత= అస్థిత్వంలోనికి రావటం; దీనికిగూడ కారణం ఉందని తెలుసుకున్నవాడు – అనుత్పన్న (అస్తిత్వంలోకిరాని) స్థితి అనే పూర్వదశను గుర్తిస్తాడు.

విలీనం = నాశనం; అస్థిత్వం నుండి మరుగున పడటం. దీన్ని గుర్తించినవాడు – దాని పూర్వస్థితి అయిన అస్తితను గుర్తిస్తాడు. రెండూ తెలిసినవాడు ఏ ఒక్క స్థితి స్థిరం కాదని గ్రహిస్తాడు.

**47.** **కారణమునకు ముందు పుట్టెనొ, తోడుగా పుట్టెనో.**
**కారణరహితమో, కాదో, తత్త్వము నందు**
**కారణమెలేదొ. – అసలు పుట్టుక యన్నది**
**నిశ్చితముగాదు వ్యవహార మందైన – తత్త్వము నందైన.**

కార్యం ఎట్లా అస్థిత్వంలోకి వచ్చింది అన్నది మీమాంస. కార్యం కారణం కలసే వచ్చాయా; విడిగావచ్చాయా; ముందు వెనుకలున్నాయా! అన్నవి తార్కిక సంభావ్యతలు.

లోక వ్యవహారము నందున్న వైరుధ్యమును పరమార్ధము నందు నిరాకరించుట.

**48.** **ఇది ఉన్నది గాన అదిపుట్టె,**
**పొడవుది ఉన్నదిగాన పొట్టిది ఉన్నట్లు,**
**దీపశిఖ పుట్టెగాన కాంతి కల్గినట్లు,**
**ఇది పుట్టెగాన అదియుపుట్టె.**

**49.** పొదవైనది ఉన్ననే పొట్టిది కలదు.
స్వస్వభావముచేత పొట్టిలేదు పొదవులేదు.
దీపకళిక లేకయున్న
వెలుగుగూడ కలుగజాలదు.

(పాఠాంతరం = పొడవు లేకుంటే – పొట్టిది ఉండబోదు)

ద్వంద్వరహిత స్థితి అనుభూత మయినపుడే నిర్వాణము బోధపడును.

**50.** ఫలితములన్ని హేతు జాతములని
లోకరీతియందుజూచి
నిశ్చయించుకొనును,
కాన అతడు నాస్తిక్య మంగీకరింపలేదు

భవలక్షణం వివరించాలంటే కార్యకారణ సంబంధం స్వతస్సిద్ధమని (యథాభూతమని) అంగీకరించాలి. కార్యకారణములు ద్వంద్వాలు. ద్వంద్వాలు వీడితేనేగాని నిర్వాణం లేదు. భవదృష్టి అంటే అస్తిత్వం శాశ్వతం అనుకోవటం. యథాభూతం అంటే శూన్యత, తత్వార్థము.

**51.** ప్రపంచ నిరోధముగూడ
యథాభూతముగనే కల్గెనని నిశ్చయించి,
భవదృష్టిని పెంచుకొనక,
ద్వంద్వములపై మనసుంచనివాడు ముక్తుడౌను

విషయముల స్వస్వభావం తెలియగలగటం తెలియలేకపోవటాలను ఉపమానాలతో వివరిస్తున్నారు.

**52.** దూరాన కనుపించు రూపంబు
చేరువ నున్నవారికి తెలియు స్పష్టముగ.
ఎండమావులు నీరమే అగునేని
చెంతనున్న వారికి నీరు కన్పింపదేమి?

**53.** దూరమందున్న వారికి ఈలోకము
వాస్తవమై ఏరీతిగ కనుపించునో

**ఆరీతిగ కనరాదు చేరువై యున్నచో**
**(నీటి) జాడలేని ఎండ మావివోలె**

స్కంధముల అస్తిత్వమును నిరాకరించుట

**54. మరీచి నీరమట్లుండునేగాని నీరుగాదు.**
**అసలక్కడ నీరమనునదేమి లేదు.**
**స్కంధములునట్లె ఆత్మవోలె తోచుగాని**
**ఆత్మకాదు నిజమునకవి లేనేలేవు.**

అస్తినాస్తులను వీడకపోతే భవచక్రం నుండి విముక్తి లేదు.

**55. మరీచికను జలమంచు తలచి,**
**దరికి చేరి చూచి**
**జలమచట లేకుంటతెలిసి,**
**మూఢుడనైతినని యెరుగు భ్రాంతి చెంది.**

**56. మరీచికను పోలిన దీలోకం.**
**ఉన్నదనిగాని, లేనిదనిగాని తలచువాడు**
**పర్యవసానమున జూడ అజ్ఞానియె.**
**అజ్ఞాన మున్నంతవరకు ముక్తిలేదు.**

ద్వంద్వములు లేవని యెరుగుట నిర్వాణస్థితికి అవసరం.

**57. లేదన్న నాస్థికులు దుర్గతిని పొందెదరు.**
**కలదన్న ఆస్తికులు పొందెదరు సుగతి.**
**యధాభూత పరిజ్ఞానయుతుడు**
**ద్వంద్వములపై నిలువక ముక్తుదగును.**

పంచేంద్రియాలతో తెలియదగు ప్రపంచ తత్వాన్ని తెలియటమే యధాభూత జ్ఞానం. అంటే ఉన్నదాని అసలు తత్వం అని శబ్దార్థ మహాయాన గ్రంథాలలో ఈ అర్థంలోనే తథత అని, శూన్యత అని, ప్రయోగిస్తారు. వాస్తవికత పరిమితులను తెలియటం అని అర్థం. శాశ్వతమయిన ఆత్మ ఒకటున్నదనుకోవటం, ఆరోపిత జ్ఞానం

అస్తి, నాస్తి అన్న రెండు అవసానాలలో ఒకదానివైపుకు నిర్ణయాన్ని త్రోసివేయటం తగదు.

58. యథాభూత పరిజ్ఞానము కలిగి,
అస్తియనిగాని నాస్తియనిగాని యిచ్ఛగించని
వాని నాస్తికుడే యంచు మోహపడనేల!
అతడు అస్తితావాది యేలకారాదు?

అస్తి, నాస్తి - ఈ రెండు ధృవాలే నిర్ణయాత్మకాలు కావు. "అదికాకపోతే ఇంక ఇదే" అని నిర్ణయించ వీలులేదు. అంటే రెండూకాని మరొక స్థితిగూడ ఉందని నిర్ణయిస్తున్నారు. దానిని గుర్తించిన వానిని నాస్తికుడు అనరాదు.

59. అస్తితను నిరాకరింప
నాస్తికుడయ్యేనేని
నాస్తితను నిరాకరించు వానిని
ఆస్తికు దనరా దొక్కొ?

60. బోధియందె నిశ్చితబుద్ధి ఉండుటచేత
దీక్ష యందైన, చర్యలోనైన, చిత్తమందైన
తత్వతః నాస్తికముండబోదు.
అట్టివాని నెట్లు నాస్తికుడనగవచ్చు.

నాస్తికుడు అంటే ఉచ్ఛేదవాది, (Nihilist) "అన్నీపోయేవే" అనేవాడు. ఆస్తికవాది అంటే శాశ్వత అస్తిత్వం ఉంటుంది అనేవాడు. అస్తి - నాస్తి అనే రెండు ధృవస్థితుల నుండి విముక్తమయ్యే ప్రతిపాదన చేయటం బౌద్ధ విశిష్ట దృష్టి

61. సాంఖ్యుల నడుగుము; ఔలుక్యుల, పుద్గలుల
నిర్గ్రంథుల, లోకీయుల, స్కంధవాదుల
లోకమందెవరినైన అడుగుము
అస్తినాస్తుల కతీతమేమయిన వచింతురేమో!

ఎవరూ ప్రతిపాదించుట లేదని తాత్పర్యం

ఔలుక్యులు= కణాదవాదులు, వైశేషికులు = అవిభాజ్యమయిన అణువులతో విశ్వం నిర్మితమయిందని, భగవదిచ్ఛచేత అవి చైతన్యవంతం అవుతాయని, విశ్వమంతా పంచభూత నిర్మితమని వీరి సిద్ధాంతం.

సాంఖ్యులు : ప్రకృతి, పురుషుల ద్వంద్వ అస్తిత్వాన్ని ప్రతిపాదిస్తుంది. పరమేశ్వరుని గూర్చి ప్రస్తావించదు.

నిర్గ్రంధులు : జైనమతస్థులు. వర్ధమాన మహావీరుడు వీరి చివరి ప్రవక్త. బుద్ధునికి సమకాలికుడు. బుద్ధునికన్న వయసులో పెద్దవాడు. వీరుకూడ సృష్టి కర్తను ప్రతిపాదించరు. కర్మఅనే అదృశ్య పదార్ధం జోక్యంచేసుకొనటంవల్ల నిర్వాణ భంగం జరుగుతుందని, కఠిన తపశ్చర్యతో జన్మచక్రం నుండి విముక్తులు కావచ్చు అని ప్రతిపాదిస్తారు.

**లోకాయతులు :** పూర్తి భౌతికవాదులు, పదార్ధమే సర్వము. చైతన్యంగూడ పదార్ధరూపమే. మరణం తర్వాత మిగిలేది ఏమి ఉండదు అంటారు.

**62.** **బుద్ధులు వచించిన శాసనామృతము**
**గభీరమని యెరుగుము.**
**అస్తినాస్తుల కతీతమయినది,**
**అసాధారణ మీధర్మము.**

రాకపోకలు స్వాభావికమయిన యధార్ధతను నిరాకరించుట.

**63.** **నాశమందినపుడు పోక, ఉనికిలోనికి రాక,**
**క్షణమయిన నిలచి ఉండక,**
**మూడుకాలముల కతీతమయిన జగము**
**నిజముగ నెట్లుండగలదు!**

**64.** **తత్వము నెరిగి చూడ రాకలేదు,**
**పోకలేదు, నిలుకడయునులేదు**
**నిర్వాణము కూడ లేదుగాన,**
**సత్యమందీరెంటికి భేదమేమి గలదు.**

విషయములకు తత్త్వతః సృష్టి (ఉదయము) స్థితి (నిలుకడ) వినాశము (లయము/ లీనము) అను లక్షణములు లేవని చెప్పుట.

**65.** **స్థితి అభావమే అయిన, ఉదయ**
**లయములు లేనెలేవు తత్త్వతః.**

కనుక ఉదయస్థితి లయములు
పరమార్థము నందెట్లుండగలవు.

(వేరొక పాఠము – 'ఉదితము – స్థితము – వినష్టము – లన్న వెట్లుండు?)

భవముయొక్క సృష్టి స్థితి లయములను గురించి బౌద్ధేతరుల నిశ్చయాలను పూర్తిగా నిరాకరించుట.

**66.** (భవములు) సదా పరిణమించుచుండ
అవి క్షణికము కావనుట యెట్లు?
పరిణమించుటే లేకయున్న
వానిలో మార్పు సాధ్యమగునె?

**67.** అంశాంశములుగ లయమౌట చేతనా!
సర్వమొకేసారి విశీర్ణ మౌటచేతనా!
క్షణికత్వము దేనివలన కలిగె? ఈ వైషమ్యము
నూహింపమిచేత క్షణిక వాదమునకు
ఎట్లైన ఉనికిలేదు.

అంశిలో అంశ ఒకటి మాత్రమే మార్పు చెందటం ఎక్కడా కనుపించదు. ఒక్క అణువులో మార్పు కలిగినా అది శాశ్వత పరిణామం అనలేము. ఆ పరిణామ దశే అశాశ్వతమని చెప్పగలము. క్షణికతను అంగీకరించిగూడ – ఉత్పత్తి విలీనాల క్రమాన్ని స్పష్టపరచటం కుదరదు. క్షణమాత్ర అస్థితను అంగీకరించ తగదు.

**68.** క్షణికతచే నాశమందెనేని
దేనినైన పురాతనమనుట యెట్లు?
స్థిరతచేత అక్షణికమై యున్న దాని
దేనినైన పురాతన మనుట యెట్లు?

వైష్ణవం ప్రతిపాదించే శాశ్వత పురుషుని నిరాకరించటం. క్షణికమయిన పురుషుడు శాశ్వతుడు కాడు. క్షణికం కాక స్థిరమయిన దానికి పురాతనత్వం రాదు. కాల విభజన లేకపోతే పురాతనత్వం ఉండదు.

**69.** క్షణమునకు గూడ ముగింపు గలదు కనుక
క్షణముగూడ ఆది మధ్యాంతములకు బద్ధము.

క్షణమునకుగల యా లక్షణ త్రయముచేత
లోకమెన్నడు క్షణమునందు బద్ధముగాదు.

క్షణమునకు క్షణమయినా స్థిరత్వంలేదు. క్షణములలో అంతర్గత విభజనం ఉంది. క్షణమునకు మొదలు తుది ఉన్నాయి. (లక్షణ త్రయమంటే ఉత్పత్తి స్థితి లయములు)

70. ఆది మధ్యావసానములను గూడ
మరల విభజింపవచ్చు - క్షణమును వోలె
ఆది మధ్యావసానములు తమనుండి గాని
అన్యము నుండి గాని కలుగలేదు

ఏకత అనేకతలను నిరాకరించటం ద్వారా స్వతస్సిద్ధ యధార్థత (స్వస్వభావం) ఉన్నదనే ప్రతిపాదనను నిరాకరించటం.

71. అనేకాంశములున్నవి గనుక ఏకతలేదు.
అంశములుగ కూడియుండనిది ఏదిలేదు.
ఒకటియన్నది లేకున్న పెక్కులు లేవు.
అస్తి యన్నది లేక నాస్తి గూడ లేదు.

72. వినాశము చేతనో, ప్రతిపక్షము చేతనో
అస్తితయన్నది నాస్తిత యగుచుండునేని,
అస్తియన్నదే లేకున్న దేనియందు
కలుగు నాశమైన ప్రతి పక్షమైన

ఉన్నది లేకుండా పోవటానికి నాశముగాని, వ్యతిరేక స్థితిగాని కారణం కావాలి. అసలు 'ఉండటం' అన్నది ఉంటే గదా? నాశనం జరగటం ఉంటుంది. ప్రతి పక్షం = విరుగుడు, ఇతర మార్గం, భిన్న స్థితి.

73. తుట్ట తుదియందు ఈలోకమంత
అంతమైపోదు నిర్వాణముచేత.
సృష్టి సాంతమాయని శిష్యులడుగ,
మిన్నకున్నాడు ఆనాడు జినుడు.

సృష్టి సాంతమా! అనంతమా? అన్న ప్రశ్నకు బుద్ధుడు సమాధానం చెప్పలేదు.

ఎందుకు చెప్పలేదు? బహుశ - 1) స్పష్టత సాధ్యం కాదు గనుక, 2) అప్రస్తుతం గనుక, 3) ధర్మాచరణకు అవసరంలేదు గనుక, 4) ఊహాజనిత సమాధానాలు చెప్పటం ఇష్టంలేక 5) విన్నవారిలో ఏదో ఒక దృష్టి కలుగుతుంది గనుక, 6) అపరీక్షితంగా చెప్పిన దాన్ని ప్రమాణంగా తీసుకుంటారేమోనని.

**74.** **గంభీరమౌ ఈ ధర్మమును లోకజనులు**
**గ్రహింపలేరని బోధించలేదు జినుడు.**
**అందువలన సర్వమెరిగిన ఆతని**
**ప్రస్తుతించి సర్వజ్ఞుడనిరి బుధులు.**

జినుని మౌనాన్ని ఎట్లా అర్థం చేసుకోవాలో ఆచార్యుదు ప్రతిపాదిస్తున్నాడు.

**75.** **తత్వదర్శినులైన సంబుద్ధు లీరీతి**
**నిశ్రేయ ధర్మమును బోధించిరి.**
**ఇద్ది గంభీరము, అనాలయము,**
**దురవగాహ, మనుచు విశదపరచిరి.**

అనాలయము అంటే విషయములకు స్వతసిద్ధమయిన అస్తిత్వం ఉన్నది అనటానికి ప్రాతిపదిక (ఆలయము) లేనిది.

గంభీరమయిన ఈ ధర్మాన్ని గ్రహించమని రాజును 76లో ఉద్బోధిస్తున్నారు.

**76.** **ఆధార రతులైనవారు, ఆధార శూన్యమౌ**
**ధర్మమును జూచి భీతి నొందెదరు.**
**అస్తి నాస్తుల కావల చూడలేక**
**నశించెదరు మందమతులు.**

"అస్తి" అనిగాని, "నాస్తి" అనిగాని ప్రతిపాదించటం అంటే, ఆలోచనకు ఒక తాత్విక భూమిక నివ్వటమే. ఈ రెండు కానిదే శూన్యత ఇది అనాలయం - ఆధార రహితం.

**77.** **అట్టి అభయమైన స్థానము జూచి భీతులై**
**తాము నాశమొంది ఒరుల చేతురు.**
**అట్టి వినాశి, నిన్ను నాశము చేయకుండ**
**ఓరాజ! నదువవలయు నీవు.**

78 - 100 వరకు

ఆమోదముగాని, నిరాకరణముగాని లేకుండా, ఈ గంభీర ధర్మశిక్షణ పొందమని ఉద్బోధించటం - 78 - 79 శ్రోతను సంసిద్ధపరచటం.

**78.** **ఓరాజ ! నాశము నీకు కలుగకుండ,**
**బుద్ధ బోధల మార్గము ననుసరించి,**
**ద్వంద్వ బద్ధముగాని పరమార్థ తత్త్వము**
**ఉన్నది ఉన్నట్లు తెలియబరతు.**

**79.** **విముక్తిని కల్గించు ఈ గంభీరార్థము**
**పుణ్య పాపముల కలీతము.**
**అనాలయ భీతులుగాని, తైర్థికులుగాని,**
**తుదకు మనముగాని దీని రుచి నెరుగలేము.**

శాస్త= బుద్ధుడు, తైర్థికులు= జైనులు, తీర్థంకర బోధలను అనుసరించేవారు, తీర్థంకరులు= జైన ధర్మ ప్రవక్తలు.

సత్వములందు అనాత్మను ప్రతిపాదించటం. ఆరు ధాతువులతో కూడినా గూడ సత్వుడు కాదు.

**80.** **సత్వుండు భూమికాదు, నీరు కాదు**
**నిప్పు, గాలి, అంతరాళమును గాదు**
**చేతనమ్మో, అన్ని కలిసియైన గాదు.**
**ఇవిగాక అక్కడింకెవడు గలడు?**

సత్వము అంటే ప్రాణిమాత్రముగాదు. చేతనా జీవి. మనసున్న జీవి. వృక్షజాలము సత్వములు కావు. కనుకనే శాకాహారమును హింసగా పరిగణింపలేదు.

ఆరుధాతువులు - భూమి - నీరు - అగ్ని - వాయువు - ఆకాశము - మనస్సు (చేతన)

**81.** **ఆరు ధాతువులొక్కటై మనుజుడయ్యె**
**అంతె కాని అతడు కేవలుడు కాదు.**

అట్లె ధాతువులు గూడ మిశ్రమంబులేగాని
కేవలములు గావు - పరమార్ధమందు.

స్కంధములకుగాని సత్వములకుగాని కేవల అస్తిత్వము లేదు. కాని వానికి సన్నిహిత సంబంధం ఉంది. అది ఎట్టిదో వివరిస్తున్నారు.

82. స్కంధములు ఆత్మగాదు - అవిలేవు ఆత్మయందు
వానియందు ఆత్మలేదు - అవిలేక ఆత్మలేదు
స్కంధముల తోడ ఆత్మ మిళితమై లేదు,
అగ్ని ఇంధనములవోలె - మరియింక ఆత్మ కస్తిత్వ మెట్లు.

ఆత్మ - స్కంధములు, ఒకటిగాగాని, అనేకంగాగాని వ్యక్తం కాకుండా ఉండవు. ఎందువల్లనంటే దృశ్యమాన మయినదంతా ఏకమో అనేకమో అయి తీరుతుంది. ఇక్కడ “ఆత్మ”కు “తాను” - శబ్దం గూడ వాడుకోవచ్చు.

83. ధాతువులు మూడు కలిసి పృథివి కాదు.
అవి దానియందు లేవు - అది వానియందు లేదు.
అవిలేక పృథివి లేదు - అన్ని ధాతువులు నింతె.
ఆత్మవోలె అవిగూడ మిథ్యగా నెరుగవలయు.

మూడు ధాతువులు = నీరు (బంధన); నిప్పు (వేడి); గాలి (కదలిక)

84. పృథివి, వాయువు, అగ్నియు, జలము
తత్వతః స్వయముగ మనుటలేదు.
వీనిలో ఏమూడు కూడక - ఒక్కటిగా మనలేదు
ఒక్క ధాతువు లేకున్న మూడును లేనియట్లె.

85. ధాతువులు మూడు నాస్తియైన, ప్రత్యేకముగ
ఒకటిలేదు. ఒకటి నాస్తియయిన, మూడులేవు
ఒకటొక్కటిగా వేనికి అస్తిత్వము లేదు.
కలసి యెట్లు మిశ్రణమును పుట్టింపగలవు.

86. అట్లుగాక ఒక్కొటొకటై మనగల్గెనేని
కట్టెలేక నిప్పు ఏలలేదు?
చలనము, దృఢత, బద్ధతా గుణములు లేక,
గాలి, పృథివి, నీరు ఏలలేవు?

పంచ ధాతువులు గూడ ఒకదానిపై ఒకటి ఆధారపడి వ్యక్త మవుతాయి. వాయువు, పృథివి, జలధాతువులు, కలిసి కట్టె అయినపుడు మాత్రమే అగ్ని ధాతువుకు ఆధారం కలుగుతుంది. అట్లే ధాతువులన్నీ మిశ్రణములు గానే తప్ప స్వతంత్రములు, ఏకైకములు గావు – నిప్పు లాగానే తక్కిన వాటికి గూడ స్వతంత్ర అస్తిత్వం నిరాకరిస్తున్నారు.

**87. నిప్పుకు ఆధార విషయము ఇంధనము**
**ఇది అందరెరిగిన సంగతి.**
**తక్కిన మూడు తమకు తామై మనగలవె**
**అన్యములు లేక? – ఆధార జన్యములు గాక**
**వీని కస్తిత యుండ నసంభవము.**

స్వతస్సిద్ధ అస్తిత్వానికి ఋజువులు నిరాకరించటం.

**88. స్వీయ అస్తిత ఉన్నవానికి**
పరస్పరాశ్రయత ఎట్లు కలుగు?
స్వీయ అస్థిత లేనివానికి
పరస్పరాశ్రయ మెట్లు కలుగు?

**89. అవిస్వయముగా అస్తిత్వము లేనివైనచో,**
**ప్రత్యేకమై ఒకటిగా ఉన్నను, మిగిలిన**
**మూడును మిళితమై యుండు. మిళితము కాకున్నను**
**ఒకచో లేకున్నను, మిళితమైనను, స్వతంత్రములు గావు.**

**90. ధాతువు లెవ్వియును స్వయముగా ఉండలేవు.**
**ఇంక వాని స్వస్వభావ గుణమెట్లు స్వయంసిద్ధమై ఉండగలదు!**
**స్వీయ అస్తిత్వము లేనివి ప్రాధాన్యమున నుండలేవు.**
**వాని గుణములు పరిగణించుట వ్యవహార సౌలభ్యము కొరకె.**

నిజానికి ప్రతి ధాతువులోను తక్కిన నాల్గింటి సామర్థ్యము కొంతైన కలిసే ఉంటుంది. ఒక ధాతువుయొక్క సామర్థ్యం ప్రధానంగా ఉంటే అది ఆ ప్రత్యేక ధాతువుగా గుర్తింపబడుతుంది. అది వ్యవహార సౌలభ్యం కొరకు మాత్రమే.

స్వతంత్ర వ్యక్తిత్వ విచారణను ఇంద్రియ విజ్ఞానానికి గూడ వర్తింపజేయటం

91. రంగు, రుచి, వాసన, స్పర్శ, రూపములకు,
నేత్ర విజ్ఞానములకును,
అవిద్యకు, కర్మకు, భవమునకు
అన్నింటి కీ రీతి నిరాకరణమె వర్తించవలయు.

92. కరణంబు - విషయము - కర్మయు - సంఖ్య
స్వామ్యము - కార్యము - కారణములు
హ్రస్వదీర్ఘములౌ కాలము - నామము
నామ్నియు - ఇంకెన్నియో - అన్నియిట్టులే.

వస్తువులకు స్వాభావిక అస్తిత్వము శూన్యమనుటకు, "దృశ్యమాన విషయములన్ని నిస్వభావములు" అన్న బుద్ధుని వచనమే ఆధారము.

93. భూమి, జలము, తేజము, వాయువు,
హ్రస్వదీర్ఘములు - స్థూల సూక్ష్మములు
పుణ్యాదులు, అన్నియు నిట్లె యథార్థ
చేతనయందు లయమౌనని చెప్పె జినుడు.

స్వభావశూన్యము లనుటకు వివరణ.

94. అనంతత్వ సర్వాధిపతిలోగాని
అదర్శనీయ చేతనలో గాని,
పృధివ్యాపస్తేజో వాయువుల
ఆవరణలు కానరావు.

95. హ్రస్వదీర్ఘములు, స్థూలసూక్ష్మములు,
పుణ్యపాపములు, కుశల మకుశలములు,
నామరూపములకిక్కడ
అస్తిత్వమణగిపోవు.

96. వస్తుతత్వము తెలియ నేరకముందు
చేతనయందున కన్పడిన దెల్లయు
వస్తు తత్త్వమెరిగిన పిదప.
అట్లె సమసిపోవును చేతన యందె.

97. సత్వసంబంధమౌ దృగ్విషయమెల్ల
చేతనాగ్నికి సమిధలై కనిపించు.
శుద్ధమౌ వివేక తేజమందు
దగ్ధమై అవియన్ని సమసిపోవు.

"నాస్తిత్వ" దృష్టి యుండుటలో దోషములేదు. అవిద్యవల్ల ఏదో ఒక భావం అంటూ ఉంటే గదా, అది లేకపోవటం అన్నది పిదప తెలుస్తుంది?

98. మొదట అవిద్యచే ఆరోపితమైన దాని
తత్వమేదో, పిదపగదా తెలియనగును.
భావమేదో ఒకటి నిలువకున్న
అభావమెట్లు తెలియగలదు?

భూమ్యాది ధాతువులే గాదు. అంతరాళముగూడ అస్తిత్వ శూన్యమే యని ప్రతిపాదన.

99. రూపభవమంత నామములు మాత్రమె.
అంతరాళముగూడ నామము మాత్రమె.
ధాతువులు లేక రూపమెట్లేర్పడగలదు!
అందుచే నామములు స్వయముగ ఉండలేవు.

100. ఆత్మను, భిన్నధాతువులను, చూచినట్లు -
వేదనలు, విభజనలు, మిశ్రణాంశలు
చేతనయు, అన్నిటి వేరుపరచి చూడవలయు.
షడాయతనములకు స్వీయాస్తిత లేదని యెరుక కల్గు.

భూమి, నీరు, నిప్పు, గాలి, అంతరాళము - చేతన ఇవి షడాయతనముల

## మొదటి పరిచ్ఛేదం పూర్తి

# రత్నావళి

## రెండవ పరిచ్ఛేదము

### ప్రాగ్ధర్మము – పరమ శ్రేయస్సుల పరస్పరత

(ధర్మము పరమ శ్రేయస్సుల మధ్యగల కార్యకారణ సంబంధము; ప్రజ్ఞతో శీలాచరణము; రెండు భిన్నధృవములకు మధ్యమ మార్గ ప్రతిపాదనము.)

పరమ గమ్యానికి మధ్యేమార్గమే అనుసరింపదగినది. రెండు ధృవస్థితులలో దేనికి చేరకుండా మధ్యమంగా ఉండాలి. ఏ విషయానికయినా అవును / కాదు; ఉన్నది/ లేదు; పుణ్యము / పాపము, అనే ద్వంద్వ స్థితులను అంగీకరించటమే ధృవాల నంగీకరించటం. ఆ ద్వంద్వాలకు మధ్య రెండూ కాని మార్గం ఒకటి ఉన్నదనటమే మధ్యే మార్గం.

శీలవ్రతాచరణమే పరమమార్గం అనుకొని అందులో స్థిరపడిపోనూ కూడదు. (శీలవ్రత పరామర్శ). లేక శీలం అనవసరం అంటూ నిరాకరించటం కూడా తగదు. ధర్మాచరణలో ఇట్టి వివేకాన్ని జతచేయాలి. పూర్తి ఆమోదం పూర్తి నిరాకరణ రెండింటిని అధిగమించి ఉండే స్థితినే మధ్యమమార్గం అని ప్రతిపాదిస్తున్నారు. ఉన్నట్లే కనిపిస్తున్నదంతా – పరమార్థంలో శూన్యమేనని ఉదాహరణ పూర్వకంగా తెలియజేస్తున్నారు.

**101.** అరటి బోదెను పొరలు పొరలుగ
ఊడదీసిన ఇంకేమి మిగులనట్లు,
పురుషుని ఆరుధాతువులుగ
విభజించి చూడ మిగులునదేమిలేదు.

ఆస్తిగాని, నాస్తిగాని అంతర్గత సత్యములుగావని తెలియజేయటం.

**102.** కనుకనే జినుదు చెప్పె
సర్వ ధర్మములు ఆత్మ రహితములనుచు.
అట్లగుటచేత – ఆరు ధాతువులు
గూడ ఆత్మ రహితములే యని గ్రహింపవలయు.

103. ఆత్మనైనను అనాత్మనైనను
యథార్థములని తలచరాదు.
కనుక ఆత్మ అనాత్మ లనెడు
దృష్టినే వారించె నామహాముని.

104. కనుపించెడివి - వినిపించెడివి - ఇంకను అట్టివి
సత్యములుగావు - మృషలునూగావని చెప్పె జినుడు.
పక్షమునకు ప్రతిపక్షము ఉత్పన్నమయిన
ఆ రెండును పూర్తి సత్యములుగావు.

(స్వతస్సిద్ధమయిన అస్తిత్వము లేదు; స్వత స్సిద్ధమయిన విషయములేదు, అట్లే స్వతస్సిద్ధమయిన అవిషయంగాని, నాస్తితగాని లేవు. ఎందుకనగా ఒకటి ఉంటేనే రెండవది ఉంటుంది. సాపేక్షంగానే తప్ప నిరపేక్షంగా ఉండదు.)

105. పరమార్థమున జూడ ఈ లోకము
సత్యాసత్యముల కతీతము.
కనుక ఉన్నదనిగాని లేదనిగాని
జినుడు వక్కాణించలేదు.

106. సర్వధా ఇవియన్ని (సత్యములు కావని)
తెలిసి సర్వజ్ఞుడు (ఈ లోకము)
అనంతమనిగాని - సాంతమని గాని
రెండు కలవనిగాని రెండు లేవనిగాని ఎట్లు చెప్పు!

భవచక్రం సాంతమనిగాని, అనంతమనిగాని, జినుడు చెప్పక పోవటాన్ని తప్పుగా ఆక్షేపించేవారికి సమాధానం (న+అంతం= అంతం లేనిది; స+అంతం= అంతం ఉన్నది)

107. బుద్ధు లసంఖ్యాకముగ వచ్చిరి.
ఇంక పైనను రాగలరు. కలరిపుడును.
శతాధిక కోట్లుగ సత్త్వలుందురు.
త్రికాలములందు బుద్ధుల స్థిరతాత్పర్యమిదియె.

108. త్రికాలములందును కల్గుచుండును క్షయము.
అది లోకమును వృద్ధి పొందనీయదు.
మరి సర్వజ్ఞుడేల మౌనమూనె,
ఈలోక పరిమితులు అవ్యాకృతములనుచు!

"బుద్ధులు అసంఖ్యాకముగా వచ్చి అంతకన్న మిక్కిలి సంఖ్యలో జీవులకు ముక్తి నిస్తుంటారు గదా! ఒకనాటికి ఏనాటికయినా జీవులందరు ముక్తులయి పోతారుగదా! అంతమెందు కుండదు" అన్నది ప్రతివాదుల తర్కం. దీనికి బుద్ధుడు ఎందుకు సమాధానం చెప్పలేదు? అని ప్రశ్న.

స్వాభావికంగా అస్థిత్వంగాని ఉత్పత్తి విలీనాలుగాని లేవనటానికి ఉపమానాలు.

109. సాధారణ జనులకు
ఈ ధర్మ గాంభీర్యము తెలియలేని రహస్యం.
భ్రాంతిజన్యమీ జగము.
ఇది బుద్ధుని బోధనామృతము.

110. లోకమును, దాని ఉత్పత్తి నాశములును,
నిజముగా అస్తిత్వమున లేవు గనుక -
మాయా గజము పుట్టుట గిట్టుటలను
భ్రాంతిగా చూచినట్లు చూడవలయు.

సమ్మోహన విద్యలో (హిప్నటిజం, మెస్మరిజం) ఏనుగు లేకపోయినా ఉన్నట్లు భ్రాంతి కల్గించటం ఒక ప్రక్రియ.

111. ఈ మాయలోకమునకున్న
ఉత్పత్తి లయముల నట్లే చూడవలయు.
నిజమునకు పరమార్థమున
జననములేదు - అంతమును లేదు.

112. మాయాజనితమైన ఏనుగు
భ్రాంత చేతన నుండి పుట్టు.
ఎక్కడ నుండియు వచ్చుటలేదు,
ఏచోటికిని బోదు, అసలు లేనేలేదు.

113. అందువలన ఈమాయ లోకము
చేతన పొందెడు భ్రాంతి మాత్రమె.
ఎక్కడ నుండి రాదు,
ఎచటికిపోదు, అసలు లేనెలేదు.

ఉన్నట్లుగా కనిపించేవన్ని భ్రాంతులే. ఆరోపణలు మాత్రమే.

114. లోకము త్రికాలాతీతము.
వ్యవహారార్థము ఆరోపించుటేగాని,
ఉండుటకైన, లేకుండుటకైన
లోక మెక్కడిది నిజమునకు.

అందువల్లనే బుద్ధుడు నాల్గువిధములయిన తార్కిక అవకాశాలను నిరాకరించాడు.

115. అనంతమనిగాని, సాంతమనిగాని
రెండు కలవని; రెండు లేవనిగాని
నాల్గు విధముల వివరణ చెప్పలేదు.
సర్వదా బుద్ధుడు మిన్నకుండె ఇందుచేతనె.

116-123 – ధర్మ గంభీరతను గ్రహించటంలోని కష్టం. నాస్తికతగా పొరపడే అవకాశం –

గంభీరతను గుర్తించటంలోని కష్టానికి కారణాలు.

నాల్గు ప్రకారాల వివరణ : 1. ఉన్నది, 2. లేదు, 3. ఉన్నది లేదు కూడ, 4. ఉన్నది లేదు అన్నదే లేదు – ఈ నాల్గు తార్కిక స్థితులను చతుష్కోటి అంటారు - ఈ నాల్గు స్థితులను గూడ అస్థిత్వ విషయంలో చెప్పలేదు. అంటే చతుష్కోటి విముక్తమయిన శూన్యతాస్థితిని బుద్ధుడు ప్రతిపాదించాడు అని ఆచార్యుని నిరూపణ. 'కోటి' అంటే చివర, తుది అని అర్థం. చతుష్కోటి అంటే నాల్గు తార్కిక చరమస్థితులు అని అర్థం. అస్థిత్వ ధర్మం ఈ నాల్గు చరమ దశలను గూడ అతిక్రమించినది. అదే శూన్యత. అని నాగార్జునుని ప్రతిపాదనము.

ఈ జీవితంలోనే ఆత్మ అంతం అవుతుందని ఇకపై మిగిలేది ఏమిలేదని ఉచ్ఛేదవాదులు అంటారు.

మరణానంతరం జీవం మరొక జన్మలోకి కొనసాగుతుందని సాంఖ్యుల వాదం.

సృష్టి సాంతమని (అంతమవుతుందని), అనంతము కూడ (అంతంలేదు) అని, ఆత్మ స్థితులకు పరిమితులున్నాయి గాని స్వభావానికి పరిమితులులేవు అని జైనులంటారు.

కర్మ ఫలితాన్ని కొనసాగించటానికి ఒక ఆధారం ఉండాలి గనుక. ఒక మూర్తిత్వం ఉంటుందని భావించి దాన్ని 'పుద్గల' అన్నవారు పుద్గలవాదులు. ఇది తార్కిక వివరణకు ఉపకారి మాత్రమే. (ఇది తీసివేత లెక్కలలో "అప్పు తెచ్చుకో - అప్పు అనగా పది" లాంటి భావన.) శాశ్వతమనిగాని అశాశ్వతమనిగాని చెప్పరాని అస్తిత్వమని వారి భావం.

**116.** **అశుచియై మొర్రటైన ఈ దేహము**
**ఇంద్రియములకు విషయమై**
**సతతము కనుల ముందున్నను,**
**దాని అశుచిత్వము మనసునందు నిలచుట లేదు.**

**117.** **అట్టిచో అతిసూక్ష్మము,**
**అతి గంభీరము, నిరాలంబము,**
**అప్రత్యక్షము, అవ్యక్తమౌ సద్ధర్మము,**
**చిత్తమునకెట్లు, సులువుగా తెలియనగును.**

గ్రహించలేని వారికి చెప్పని కారణం.

**118.** **సమ్యక్ సంబుద్ధుడైన జినుడు**
**ఈధర్మ గంభీరతా గుణము నెరిగి,**
**జనులు దీని నెరుగ కష్టమనుచు**
**బోధింప నిచ్చగించలేదు మొదట.**

119 - 123 కారణాలు వివరిస్తున్నారు -

అపార్థమయినందువల్ల కలిగే నష్టాలు

**119.** **ఈ ధర్మమపార్థమయినచో**
**అవివేకులు వినష్టులౌదురు.**

మునిగిపోదురు మలినమౌ
నాస్తికతా దృష్టి యందు.

'శూన్యత అంటే ఏమి లేకపోవటం' అని అపార్థం చేసుకొనే వారిని ఉద్దేశించి. బుద్ధ ధర్మం నాస్తికతను బోధిస్తుందనుకోవటం అపార్థమే. "నాస్తికత అంటే కారణంలేని కార్యం ఉంటుందనుకొనటమే"నని "సుహృల్లేఖ"లో కూడ ఆచార్యులు చెప్పారు. కార్యకారణత్వమే అస్థిత. (ఏ కారణజన్యము కాని సర్వేశ్వరుని అంగీకరించటమే నాస్తిత)

శూన్యత అంటే కార్యకారణతలను నిరాకరించటం అనుకొని శూన్యతను వ్యతిరేకించే పండితుల గురించి.

**120.** పండితులమను దుర్మానముతో
దుర్జ్ఞానులు కొందరు (శూన్యతను) నిరాకరించి
వినష్టాత్మలౌదురు. 'అవిచి' - నరకమునకు
అధోముఖమున పోదురు.

సరిగా గ్రహించటంవల్ల కలిగే సత్ఫలాలను గ్రహించక పోవటంవల్ల కలిగే ఇబ్బందులు.

**121.** చెడు తిండ్లవలన ఆరోగ్య
వినష్టులౌదురు,
యుక్త భోజనమువల్ల సుఖము,
రోగవిముక్తి, బలము, దీర్ఘాయువు పొందగలరు.

**122.** ఆ రీతిగనె, అపార్థము చేత
ధర్మ వినాశమునకు చేరువౌదురు.
కాని సమ్యజ్ఞానము కల్గినంత
పరమ సుఖము సంబోధియు పడయ గలరు.

కనుక ధర్మగ్రహణంలో జాగరూకతను హెచ్చరిస్తున్నారు.

**123.** నాస్తితా దృష్టియు శూన్యతా నిరాకరణము
విడచిపెట్టి, సమ్యక్ జ్ఞానముపై
పూర్ణ యత్నము నిల్పుము,
సర్వార్థములు సమకూరు కొఱకు.

124. ఈ ధర్మము సరిగ బోధపడకున్న,
అహంకారము నిన్ను ఆవరించు.
అంతట మొదలౌను శుభాశుభ కర్మలు,
వాని నుండి కల్గు శుభాశుభ జన్మలు.

125. అహంకారము నిర్మూలించెడు ధర్మము
ఎంతవరకు బోధపడదో, అంత దనుక
దానము, శీలము, క్షమాగుణములు
శ్రద్ధతో పాటించుచుండ వలయు.

"శూన్యతను బోధిస్తూ శీలమును ఆచరించమనటం దేనికి?" అన్న ప్రశ్నకు ఆచార్యుని సమాధానం. అహంకార నిర్మూలన కానిదే శూన్యత తెలియదు. కనుక అహంకారాన్ని సదాచరణలో ఉంచటానికి శీలము, పారమితల అభ్యాసం అవసరం. శూన్యత పరమధర్మం. సాధనకై శీలవ్రతాచరణ వ్యవహార ధర్మం.

సంసారంలో ఉన్నంతవరకు హెచ్చరికలో జాగ్రత్తగా ఉండటం తప్పనిసరి. లేకుంటే అధిగమనం చేయగల (స్వయంగా ధర్మ సాక్షాత్కారం పొందగల) సమర్థత, స్వేచ్ఛ కోల్పోతాడు. శూన్యతను గ్రహించకుంటే భవచక్రంలోనికే ప్రయాణం చేస్తుంటాము. అంతవరకు శీలవ్రతాచరణమే మార్గం.

126 - 143. ధర్మాచరణ ఎందుకు? ఎట్లా ఆచరించాలి? కుశలం - అకుశలం - అంటే ఏమిటి? అన్న విషయాలు వివరించబోతున్నారు. ధర్మ సాధనం చేయటంవల్ల ఐదు ప్రయోజనాలున్నాయి.

126. ధర్మముతో నారంభము - మధ్యగతముగ ధర్మము -
ధర్మనిష్ఠతోడ నిర్వహణము
భూపతీ! కార్యములన్ని సాధన చేయుము.
ఇహమందు పరమందు హానిరాదు.

127. ధర్మము పాటింపగ సుఖము కీర్తి కల్గును (యిహమందు).
నిర్భీతితోనుండు మరణ సమయమందు.
సుఖము కల్గు మరుజన్మలోన.
కనుక సర్వదా ధర్మమే పాటింపవలయు.

ధర్మాచరణమే ఉత్తమమయిన నీతి.

128. ధర్మమాచరించు టొకటే శ్రేష్ఠమౌ నీతి -
దానివల్లనె జగతి ప్రీతిచెందుచుండు
ప్రీతిచెందిన లోకము వంచించదెపుడు
ఇపుడుగాని, మునుముందు గాని.

ధర్మ వ్యతిరిక్తమయిన వాటిని నిరాకరించుట.

129. ధర్మ బద్ధము గానట్టి వర్తన వలన
లోకమంత అప్రీతినే పొందుచుండు.
అప్రీతమైన లోకమ్ము వలన
ఇపుడైన ఇంకముందైన ఆనంద మొందలేవు.

130. పర వంచనామతులు, దుర్గతి యాత్రికులు,
కఠిన శీలురు, దుష్ప్రజ్ఞావంతులు,
అనర్థదృష్టులు, ఎట్లెరుగనేర్తురు
అర్థవంతమయిన ధర్మము?

దుర్గతి= నీచ జన్మలు; సుగతి= ఉత్తమ జన్మలు

131. పరవంచనా మతులయినవారు
నీతిశీలురగుట యెట్లు?
దానివలన వారలే సహస్ర
జన్మలందు వంచన పాలౌదురు.

ప్రత్యేక పరిస్థితులలో ఆచరింపవలసిన విధానం.

132. రిపుల కప్రియము చేయదలచిన,
ముందుగ వారి దోషములుపేక్షించి
గుణముల పాటింపుము - అది నీకు
హితముగూర్చు, రిపునక ప్రియము గూర్చు.

(వేరొక ఇంగ్లీషు అనువాద పాఠము "నీ దోషము తొలగించుకొనుము.)

ఉత్తమ ధర్మాన్ని ఆచరించటంలో గూడ ప్రత్యేక విధులు, నాల్గుపద్ధతులు.

133. లక్ష్యబద్ధమౌ వర్తనము తోడ,
దానముచే, ప్రియభాషణలచే,
ప్రాపంచికులను - ధార్మికులను
ఒకచోట కూర్చగ యత్నింపుము.

సత్యభాషణం - ఉదారత - శాంతం - జ్ఞానముతో కూడిన మాటలు అను నాల్గు, వాక్కులలో శిక్షణ.

ప్రియభాషణం - అష్టాంగ మార్గంలో సమ్యక్ వాక్కుకు చెందినది.

నిబద్ధత - ఇతరులకు చెప్పిన దాన్ని తాను ఆచరించటం.

ప్రయోజనకర వర్తనము - ఉపకరించే వాటిని ఆచరించేటట్లు ప్రోత్సహించటం.

134. ప్రభువు పల్కెడు సత్యవాక్కులు
స్వభావత: విశ్వాసమును పాదుకొల్పు -
అట్లె ప్రభువు పల్కెడు అనృతములు
స్వభావత: అవిశ్వాసము కలుగజేయు.

135. వంచనకానిదే సత్యము.
అది మనసు చేసెడు కల్పనగాదు.
పర హితకారియైనదె సత్యము.
అట్లు కానిది అనృతము - అది అహితకారి.

దానగుణమందు శిక్షణ.

136. ఒక్క మహోదార చర్య
ప్రభుని సర్వదోషముల మరుగు పరచు.
అట్లె పరమ లోభముచేత
నశించు ప్రభువుల సర్వ సంపదలును.

శాంత వర్తనయందు శిక్షణ.

137. శాంతివలన గాంభీర్యము కల్గు.
దానిచే కల్గు పరమ గౌరవము,
దానివలన శక్తియు, నాధిపత్యమును.
కనుక ఉపశాంతి యందుండవలయు

ప్రజ్ఞావర్తనంలో శిక్షణ

138. ప్రజ్ఞచే కలుగు నిశ్చల చిత్తము, దృఢత్వము.
తొలగును పరాధీనత,
కలుగదు వంచన. కనుక ఓ రాజ!
సదా ప్రజ్ఞాస్థితుడవై యుండుము.

అన్నింటి గురించి సంక్షిప్త ప్రవచనం.

139. సత్యము, త్యాగము, శమము, ప్రజ్ఞ
ఈ భద్రగుణములుగల నరాధిపుని
కీర్తింతురు - నరులు, దేవతలు.
ఆ నాల్గు భద్రగుణములను కీర్తించినట్లు.

(మూలంలో "దానం" అనే అర్థంలో "త్యాగ" శబ్దం ప్రయోగించబడింది.)

కల్యాణ మిత్రులతో స్నేహమువలన పుణ్యవృద్ధి. వారు ఎట్టివారు?

140. పరిశుద్ధులు, ప్రజ్ఞాస్థితులు, కారుణికు
లైనవారితో నిరంతర సమాలోచన
చేయువానికి, వృద్ధిచెందు చుండు,
ఎల్లపుడు ప్రజ్ఞయు ధర్మము.

హితకరుల విశిష్టత -

141. హితము చెప్పెడు వారలు దుర్లభం.
హితము వినెడు వారలతి దుర్లభం.
హిత వచనము లప్రియమైనను,
సత్వర మాచరించెడు వారలత్యంత దుర్లభం.

142. గుర్తించి సమాచరింపుము వెంటనే
హిత వచనములు అప్రియమయినను.
ఆత్మీయులిచ్చిన తిక్తౌషధమును
రోగావాప్తి కొరకు త్రాగినట్లు.

మరణ అనివార్యతను గుర్తుంచుకొనటంవల్ల ధర్మాచరణం కొనసాగుతుంది.

143. జీవితము - ఆరోగ్యము - రాజ్యములు,
అనిత్యములగుట సదా గుర్తెరింగి,
తీవ్ర యత్నము చేయవలయు
కేవల ధర్మాచరణ కొరకు.

దుర్గతులను కలిగించే కారణాలను దూరం చేసుకొనాలి. అంటే అకుశలాచరణకు దూరంగా ఉండాలి.

144. మరణమవశ్యము. మరణించినను
తప్పవు పాపఫలముల దుఃఖకారణములు.
తత్కాల స్వల్ప సుఖములు
లభించినాగాని పాపక్రియలు చేయదగదు.

145. ఒకపరి భయదము కావచ్చును,
వేరొకపరి కాక పోవుగాక
సుఖప్రదమైనది ఒకటి యుండ
అన్యమైనదాని కేలభయపడవు.

పాప ఫలితం అన్నివేళల భయంకరం కాకపోవచ్చుకాని, సుఖప్రదమైనది ఒకటి ఉండగా, దాన్ని వదలి వేరొకదాన్ని స్వీకరించటానికి భయం కలుగదా! సుఖప్రదమయిన పుణ్యశీలాన్ని వదలి వేరొకటి ఆచరించటం ఎందుకు?

మద్య, మాదక ద్రవ్యాలను నిషేధించుకొనటం గురించి -

దుశ్చర్యకు భయంకర ఫలితాలు ఈ జన్మలోనే ఒక్కొక్కసారి కలుగవచ్చు, లేక వేరొక జన్మలో ఫలించవచ్చు.

146. మద్యమువలన లోకమున పరాభవము,
కార్యహానియు, ధనక్షయము,
మోహము కల్గి, అకార్యకరణము జరుగు.
కనుక సర్వదా మద్యము వీడవలయు.

జూద వ్యసనాన్ని నిషేధించుకొనవలసిన అవసరం.

147. జూదము వలన లోభము, అప్రీతి, ద్వేషము
వంచన, మోసము, విశృంఖలత, అనృతము
వ్యర్థభాషణములు పరుష వాక్కులును కల్గు.
కనుక సర్వదా జూదము వీడవలయు.

స్త్రీ పురుష వ్యామోహానికి దూరం కావటం గురించి –

దేహమాలిన్యాలను గుర్తుంచుకొని వ్యామోహానికి దూరం కావాలి.

148. స్త్రీ దేహము అమలిన మంచు తలచ
కామము తరచు కలుగుచుండు.
ఆమె దేహమందేమియు
పరిశుభ్రముగాదు నిజము.

149. నోరంతయు సొంగపాత్ర.
పండ్ల మధ్య పేరుకొనును పాచి.
ముక్కంతయు చీమిడి ముంత.
నీళ్లు, పుసులు నిండిన గుంటలు కండ్లు.

ఆకర్షించే అవయవాలకున్న అశుభ్ర లక్షణం

150. రొమ్ములు, ఉదరము, తిత్తులు, కాలేయము
మూత్రము, మలము, మురికి నిండిన కుండలు.
మాయ మసక క్రమ్మినవారు ఇట్లు చూడలేక
కామింతురు ఆస్త్రీ దేహమును.

అంతర్గతంగా మాలిన్యం ఉండి బాహ్యాలంకరణ చేయటం వంటిది.

151. సాలంకృతమైన మలిన భాండమును
కోరెదు మూర్ఖుల చందమున
అజ్ఞాను, మాయా మోహితులౌ
లోకులు, కామినుల వాంఛించెదరు.

స్త్రీ వ్యామోహంవల్ల కోర్కెలు కొనసాగుతాయి.

ఉపాదానం, అంటే తీవ్ర తృష్ణతో దేని నయినా (కోర్కెలు, అభిప్రాయాలు వ్రతాచరణం, ఆత్మపై నమ్మకం మొ॥) పట్టుకు వ్రేలాడటం.

152. సదా దుర్గంధ భూయిష్టమౌ
దేహముపైననే యింత వ్యామోహమున్న,
ఇంక ఉపాదానము నేది తొలగించగలదు.
కామబంధము నుండి యెట్లు ముక్తి కలుగు.

మలినవంతమయిన దానిని ప్రీతికరమని పొరపడటం.

153. విసర్జనములు, మూత్రము, వమనములపై
సూకరము, లాసక్తిగొన్న యట్లు;
కామమోహితులు రక్తులగుదురు
విసర్జన, మూత్ర, వమన స్థలములపై

154. త్రోసుకొనివచ్చి, నవరంధ్రముల నుండి
మలినములు స్రవించు
నగర మీదేహము. మూర్ఖ జీవులే
సుఖ విషయమని దీని గణింతురు

మొత్తం స్త్రీ దేహంమీదనే వ్యామోహాన్ని వదిలించుకోవటం.

155. విసర్జన మూత్రాది మాలిన్యములను
స్వయముగా ఒకనాడు నీవె చూచియు,
అవియన్ని నిండిన దేహముపై
నీకెట్లు మనసు కలుగు

156. మాలిన్య సారమయిన బీజము నుండి
శుక్ల శోణితముల సమ్మేళన నుండి
పుట్టిన అశుభ్రమని యెరిగి గూడ,
కామాతురుడవై వ్యామోహపడనేల?

157. స్రావములతో చిత్తడియైన
చర్మం కప్పిన మలిన రాశిపై
శయనించిన వాడు, కామిని
మలకోశంపై శయనించినట్లు.

158. సుందరియో - అనాకారియో
ముసలియో - ముతకయో
ఏది ఏమైననేమి - స్త్రీ శరీరములన్నిరోత
ఏమిచూచి నీకు ప్రీతి కలుగు.

దేహవర్ణం మీద వ్యామోహ వర్జనం

159. మలమునకు మంచి రంగున్న గాని
అది కోరదగని దైనట్లు;
తరుణికి మంచి రూపమున్న
దేహముగూడ కోరతగదు.

160. ఈ కుళ్లిన శవం - చెడిన
మాంసరాశి - పైకి చర్మం కప్పితేనేమి,
జుగుప్సాకరమైన దాని స్వభావం
ఏల కనుపించ కుండు?

వ్యామోహం అయోగ్యమయిన రాగం

161. "చర్మము కుళ్లుగాదు
అది యొక వస్త్రాలంకరణము వంటిది."
మురికి కుప్పను దాచకట్టిన
వస్త్ర మదియెట్లు పరిశుభ్రమగును!

వానిపై జుగుప్సయే తగిన భావన.

162. బయటచూడ అందముగ నున్న భాండము
మలినము నిండినంత దూష్యమగును.
దుర్గంధ స్వభావమున్న మలిన పూరమౌ
దేహమేల దూష్యముగాదు?

163. మలినమును నిందింతు వేని,
పరిమళమును విరి దండలను
భోజ్యముల, పానీయముల నన్నింటి
మురికి చేయు యీ దేహమును నిందింపవలద?

స్త్రీ దేహమే కాదు – పురుష దేహముగూడ అట్లాంటిదే. తన దేహముగూడ జుగుప్సాకరమేనని తెలుసుకోవాలి.

164. తనదైన పరులదైన
మలినాల గర్హించునట్లు,
తనదైన పరునిదైన
మలిన దేహాలను గర్హింప వలదె?

165. మాలిన్య మందు స్త్రీ దేహమెంతో
అంతె నీ దేహముగూడ.
కనుక నీపైన స్త్రీపైన
వాంఛ వీడుట ఉచితము గాదె?

ఇంత చెప్పినా మోహం వీడని వారిపై విసుగుదల.

166. స్రవించు నవరంధ్ర దేహమును
నీవె స్వయముగా కడుగుకొనుచు గూడ,
దాని మలిన భూయిష్టత తెలియకున్న
ధర్మమెంతగా చెప్పిన నేమి ఫలము!

167. ఉపమాద్యలంకారాలతో ఈ కాయమును
ఎవరెంత వర్ణించి పైకెత్తినాగాని

సిగ్గుమాలిన బుద్ధిహీనతయె గాదె!
ప్రాజ్ఞుల ముందు అదియెంత నగుబాటో!

168. జీవులన్నియు అజ్ఞాన తిమిరమందు
మోహితులై - అశుద్ధం కోసం
కాట్లాడుకొను కుక్కల వోలె
కోర్కెల కోసం కొట్లాడు కొందురు.

స్త్రీ - పురుష వ్యామోహం సుఖకరం కాదని నిరాకరించుట.

169. పుండు గోకిన చమ్మగా నుండవచ్చు.
పుండు లేకనే యున్నచో ఎంత సుఖము!
అట్లె, విషయ వాంఛలయందు సుఖము కలదు.
కాని వాంఛలే లేకుంట అధిక సుఖము.

ఈ అశుభ భావనవల్ల కలిగే మేలు.

170. ఈరీతి వివరించుకొని తెలిసికొన్న,
కోర్కెలనుండి ముక్తి కలుగకున్నను
వాంఛల తీవ్రత తగ్గవచ్చు.
భామలపైన అతిమోహమైన తగ్గవచ్చు.

171. ఆటకై వేట అతిక్రూరము.
అది ఆయువు తగ్గించు - భయముగూర్చు.
నరక కారణంబు. కనుక
నిశ్చయముగ హింస చేయ తగదు.

172. తారసిల్లిన దేహ ధారులపై
విషము చిమ్మెడు పామువోలె,
భయపెట్టును దుర్మార్గుడు.
వాని దేహం మాలిన్యపు మచ్చలతో నిండి యుండును.

జీవులకు సంతోషం కలిగించుట -

173. వాన కురియు నల్ల మేఘాలు క్రమ్మిన
రైతు మనసు పరవశించునట్లు,

హితము గూర్చువారు ఎదురుగా వచ్చిన
ముదము కల్గు రూపధరుల మదికి.

శీలాన్ని ఆచరించటం, శీలభిన్నమయిన దాన్ని విసర్జించుట - గురించి సంగ్రహ వచనం.

174. నీవును, ఈలోకముగూడ, అసమాన
సంబుద్ధి పొంద గోరినట్లైన,
ధర్మమును నిరంతర మాచరింపుము.
ధర్మ భిన్నమయిన వాని విడుము.

పరమ శ్రేయస్సును పొందాలంటే కార్యకారణాలను, స్వల్పకాల ప్రయోజనాలను అతిక్రమించే లక్ష్యం ఉండాలి. దాన్ని సాధించటానికి ప్రజ్ఞ అవసరం. ధృవాలకు బద్ధంగాని మధ్యేమార్గాన్ని ఆచరించాలి.

175. ద్వంద్వ భావములు లేని ప్రజ్ఞ,
సర్వదిశలకు ప్రసరించు కరుణ,
పర్వతరాజువంటి సుస్థిరత,
బోధిచిత్త ప్రణిధానము, సంబుద్ధికి మూలములు.

ప్రణిధానము = దృఢ సంకల్పము; సమ్యగ్జ్ఞానం పొందటానికి ముఖ్య హేతువులు. 1. ప్రజ్ఞ, 2. కరుణ 3. బోధిచిత్తం, 4. వీనియందు సుస్థిరత.

176 – 96 బుద్ధుని 32 లక్షణాలను సాధించే హేతువులకై అభ్యాస సూచనలు. సంసారంలోను, రాజుగాను, అర్హతునిగాను కలిగే తత్కాల ప్రయోజనాలకన్న అధికంగా కలిగే ప్రయోజనాలు.

సావధాన పరచుట -

176. ఓ మహారాజా వినుము
ముప్పదిరెండు మహాపురుష
లక్షణములచేత ఎట్లు
నీ దేహము అలంకృత మౌనో!

177 - 79 బుద్ధుని 32 లక్షముల వివరణం.

177. చైత్యములను, అర్హతుల,
ఆర్యజనుల, వృద్ధుల, నర్చింపవలయు.
సర్వంసహాధిపతివి కాగలవు.
నీ పాదములు, హస్తములు, చక్రాంకితములచే శోభిల్లగలవు.

బుద్ధుల అవశేషాలపై నిర్మించిన కట్టడాలు - చైత్యాలు.

178. ధర్మాచరణ దీక్షను
వీర్యముతో నిర్వహించుము.
బోధిసత్త్వుడ వౌదువు నీవు.
పాదముద్రలు సమతలము లౌను.

179. దానముచే, ప్రియభాషణముచే,
అర్థవదాచరణ చేత - నిబద్ధ వర్తనచేత,
నీ హస్తాంగుళులు శోభిల్లగలవు,
కాంతిజాలము తోడ.

180. వరిష్ట భోజన పానము లిచ్చి అమితదానము చేసిన,
రుచిర పాద హస్తములు కోమలములగును.
పాదహస్తములు, గ్రీవము, భుజదండలు, విస్తరించు
దేహము దీర్ఘమౌను, సప్తస్థానములు వెడదలౌను.

181. నేరస్థుల బాధించకు - స్వేచ్ఛ నిమ్ము
నీ దేహము సుందరమౌను, నిడుదయౌను,
ఉన్నతమౌను; హస్తాంగుళులు
దీర్ఘము లౌను; మడమలు విస్తరించు.

182. ధర్మ దీక్షాచరణను వ్యాప్తిచేయుము.
శోభ కలుగును, దేహకాంతివచ్చు,
దాగియుండు నీ శీలమండ స్పష్టమగును.
దేహకేశములు నిలచిచూచు.

183. జ్ఞానముపై కళలపై నీకున్న కాంక్షవలన,
వాని నొరులకు నేర్పింప, నీకు కల్గు
చిరుతను బోలిన జంఘలు,
సూక్ష్మబుద్ధి, అధికమౌ ప్రజ్ఞ.

184. నీసంపద - నీవస్తు జాలము - ఎవరైన అర్థింప,
తక్షణము దానమాచరింపుము. నీకు కల్గు
దీర్ఘ బాహువులు - ప్రసన్న రూపము.
ఈ ప్రపంచమునకె నేత వౌదువు.

185. విడిపోయిన మిత్రులకు
మైత్రి నుద్ధరించిన ఫలముగ,
గొప్పదైన నీ గుహ్యాంగము
లోపలికి ముడుచుకొనును.

186. మంచి గృహములు దానము చేసిన,
శ్రేష్ఠ చిత్రాసనములు దానముచేసిన,
మృదువౌ మేని కాంతి కలుగు
శుద్ధిచేసిన పుత్తడి వోలె,

187. ఉన్నతాధికారములన్ని యిచ్చి
ఆచార్యు నాశ్రయించి, అనుసరింప,
నీకేశములన్ని సాలంకృత మౌను
కేశ వలయమేర్పడు నొసటియందు.

188. ప్రియమృదు భాషణలచేత,
హిత వచనములు పాటించుటచేత,
ఎగుభుజములు కలుగు నీకు.
సింహముబోలు ఊర్ధ్వకాయము కల్గు.

189. రోగులసేవచేసి స్వస్థులచేయ,
వక్ష ప్రదేశము విస్తరించు.
జీవింతువు సహజ స్థితియందు.
సర్వరుచులును శ్రేష్ఠమౌ స్థాయినుందు.

190. బుద్ధ ధర్మ బద్ధమౌ కర్మలు మొదలు వెట్ట,
నీదు శీర్షమున స్పష్టమౌ ఉబ్బుకలిగి,
విశదమౌను - నీదేహము అరటివోలె
నిడుదయై యుండు సమముగాను.

ఉబ్బు :- శిరస్సుపై గుండ్రముగా కండతో కూడి ఎదిగే ఆకృతి. కంటికి కనిపిస్తుందిగాని, పరిమాణం స్పష్టంకాదు.

191. మృదువైన సత్యభాషణ చేత,
నృపా! నీనాల్క కొంతకాలమునకు
దీర్ఘమౌను, బ్రహ్మవంటి
కంఠస్వరము కలుగు నీకు.

192. సత్యవాక్కులు నిరతము
పల్కుచుండుటచేత,
సింహము వంటి చెక్కిళ్లు కలిగి,
కీర్తి తోడ అజేయుడవౌదువు.

193. అపార గౌరవమున అందరి సేవచేసి,
ఉచిత కార్యములదీర్ప,
నీ దంతకాంతి స్వచ్ఛమై మెరయు,
వరుసగా తీర్చినట్లుండు.

194. వంచన లేని సత్యమైన
చిరకాల వచో దీక్షవలన,
మెరయు దంతములు నాల్గు పదులు.
తీర్చినట్లుండి అచ్చెరువు గొల్పు.

195. రాగములేక, ద్వేషము లేక,
జీవుల ప్రేమమై జూచిన
నీకనులు నీలమై వెలుగుచిందు.
వృషభము వోలె కనుబొమలు దట్టమౌను.

**196.** ఈ ముప్పది రెండు లక్షణములు
ఓ పురుష సింహామా!
ఎరుగుము సంగ్రహముగ,
కార్యకారణ భావముతోడ.

ఇంకా అతివిస్తారంగా చెప్పక పోవటానికి కారణం

**197.** ప్రేమ భావము హేతువుగ
ఎనుబది సుందర లక్షణములు కలుగు.
గ్రంథమింక పెరిగిపోవునన్న
శంకతోడ రాజ! వివరింపబోనింక.

**198.** మహాసామ్రాట్టు లందరు
ఈ మహాలక్షణము లున్నవారె కాని,
వారి స్వచ్ఛత, సౌందర్యము, దీప్తి
కొంచెమైనను బుద్ధుని సాటిగావు.

**199.** సామ్రాట్టునకుండు ఈ శుభ
లక్షణములు, సుందర గుణములన్ని కలుగు
శ్రద్ధయను నొక్క గుణము
జినునిపై నున్న చాలును.

**200.** అట్టి సుగుణాలు అన్నియూ కలిసి
శతకోటి గుణితమై అర్బుద వత్స
రాలుగా నున్ననూ భగవాను రోమ
రంధ్రాన్ని ఒక్కదాని సృష్టించలేవు.

200కు ఉపమానం

మిణుగురులు ఎన్నైన ఏపాటి! సూర్య
కాంతికి సరిపోల ఎంతయో దవ్వు.
సామ్రాట్టు గుణములు బుద్ధుని చిహ్నా
ములకల్లంత దూరాన పోల్చగా వచ్చు.

– : రెండవ పరిచ్ఛేదం పూర్తి :–

# రత్నావళి

## మూడవ పరిచ్ఛేదము

### పుణ్యము - ప్రజ్ఞల గురించి ఉపదేశము

సమ్యక్సంబుద్ధికి హేతువులయిన పుణ్యమును, ప్రజ్ఞను సమకూర్చుకోవటం గురించి శిక్షణోపదేశం.

బోధన ప్రారంభం - రాజును సావధాన పరచుట.

**201.** **ఓమహారాజా! వినుము**
**అనూహ్యా పుణ్య ఫలముగ**
**బుద్ధుని లక్షణములు కలుగు విధము.**
**చెప్పెద మహాయాన గ్రంథములనుండి.**

అపరిమిత పుణ్య సంపాదనమును గురించి సవివర వివేచన. ధర్మ శిక్షణలో ఉండటంగూడ పుణ్య ఫలమే. అనంత విశ్వం లాగానే శిక్షణలో ఉన్న వారందరి పుణ్యం గూడా అగణ్యం.

**202.** **ప్రత్యేక బుద్ధులు - శైక్ష్యులు - అశైక్ష్యులు**
**అందరు ఉత్పాదించు పుణ్యారాశియు,**
**ఈ నశ్వర ప్రపంచమున కల్గు పుణ్యరాశి**
**అంతయు, ఈ విశ్వము వోలె నగణ్యము.**

**203.** **అట్టి పుణ్యారాశి దశగుణిత మైనచో**
**బుద్ధుని ఒక్క రోమకూపము కలుగును.**
**బుద్ధుని రోమ కూపము లన్నియు**
**అంతటి పుణ్యారాశులచేతనే యుత్పన్నమౌను.**

202లో చెప్పిన, పుణ్యారాశికి పదిరెట్లు అయితే బుద్ధుని ఒక రోమకూపం కలిగే పుణ్యానికి సాటి. ఇది అంతా అన్ని రోమకూపాలకు హేతువయిన పుణ్యం. దీనికి వందరెట్లు అయితే బుద్ధుని ఒక్క శరీర సాముద్రిక మంగళ లక్షణం.

**204. బుద్ధుని రోమ కూపము లన్నింటిని**
**కలుగజేయగలంత పుణ్యరాశికి**
**శతగుణిత మయిన గాని**
**మంగళకర సౌందర్య మొక్కటి పొందలేరు.**

అన్ని రోమ కూపాలు కలగటానికి హేతువయిన పుణ్యరాశికి వందరెట్లు అయితే బుద్ధుని శరీర లక్షణాలలో ఒకదానికి సమానం. ఇట్టి శుభ సాముద్రిక లక్షణాలు 80 వరకు ఉన్నాయని సంప్రదాయం.

**205. అంత శుభ సౌందర్యము**
**ఒకటి పొందగా తగినంత పుణ్యము,**
**ఎనుబది శుభ గుణములకు**
**ఒక్కొక్కదానికి అంతంత కావలయు.**

204లో గుణించిన పుణ్యరాశికి 80 రెట్లు= 1 మహాపురుష లక్షణ హేతువవుతుంది. (మంగళకర గౌణ లక్షణం (Minor Mark) అని వేరొక ఆంగ్ల పాఠం). పై సాధనకు ఇంకా వందరెట్లు పుణ్యం వల్ల గాని ఒక్క బుద్ధ లక్షణం కలుగదు.

**206. ఎనుబది శుభ సౌందర్య లక్షణములు**
**సిద్ధించుకొన ఎంత పుణ్యరాశి వలయునో,**
**అంతకు వందరెట్లు కావలయు**
**ఒక్క మహాపురుష లక్షణము పొందుకొరకు.**

204లో చెప్పిన 80 లక్షణాలకు కావలసిన పుణ్యరాశికి వందరెట్లు పుణ్యంవల్ల ఒక మహాపురుష లక్షణం కలుగుతుంది.

**207. ముప్పది మహాపురుష లక్షణములు**
**సిద్ధింప కారణమౌనంతటి**
**పుణ్యసంపదకు, వేయిరెట్లు సమకూరిన**
**పూర్ణచంద్రుని బోలు కేశరాశి కల్గు.**

మహాపురుష లక్షణాలు 30. ఒక లక్షణానికి 206లో చెప్పిన పుణ్యరాశికి 30 రెట్లు= మహాపురుష సర్వలక్షణాలు. అన్నింటికి వెయ్యిరెట్లు పూర్ణ చంద్రుని బోలు

కేశరాశి. ఇది నొసలు మీద ఏర్పడే సుడి వంటిది.

208. కేశరాశికి హేతువైన అంతటి పుణ్యరాశి
శతసహస్ర గుణితమైనచో కల్గు
రక్షకుని శిరసుపైనుండెదు,
పరిమాణము అగోచరమౌ 'ఉబ్బుకము'

బుద్ధుని శిరసుపై ఉండే కేశ శిఖరం లాంటి 'ఉబ్బుకం' కలగటానికి, పైచెప్పిన పూర్ణచంద్రునిబోలు కేశరాశికి కారణమౌ పుణ్యానికి వెయ్యిరెట్లు పుణ్యం పొందాలి. అందుకు కోటిరెట్లు అధికమయితే బుద్ధుని వాక్కులోని సరళ గంభీరత కలుగుతుంది.

సర్వ మహాపురుష లక్షణ హేతువైన పుణ్యం×1000= పూర్ణచంద్రకేశ రాశి× కోటిరెట్లు = బుద్ధుని గంభీర వాక్కు లక్షణం.

[ 208. శతసహస్ర గుణిత పుణ్యమున
రక్షకుని శిరమందలి ఉబ్బుకము కల్గు.
దానికి కోటిరెట్లు పుణ్యరాశిచే కల్గు
బుద్ధుని వాక్కుల సరళ గంభీరస్వరము. ]

ఇంకా ఇట్టివి అరవై లక్షణాలు ఉన్నాయి – ఇది అదనపు శ్లోకం. దీనిపై టిబెట్టు గురువు వ్యాఖ్యానించలేదు. అందుచే బ్రాకెట్లలో ఉంచబడింది.

209. ఇంతటి పుణ్యము ఎంత అగణ్యమైనను
క్లుప్తార్థమునకై గణన మున్నట్లు చెప్పబడియె
ప్రపంచ సర్వ పుణ్యరాశికి
ఆ పుణ్యరాశి అంతయు పదిరెట్లు.

నిజానికి అనంత పుణ్యరాశి అని చెప్పాలి. కాని శిక్షణ పొందే వారి అవగాహన నిమిత్తం, సౌలభ్యం కోసం ఇట్లా సంఖ్యారూపంగా వివరించబడింది.

210. సంసార కారణములకు వోలె
బుద్ధుని రూపకాయ కారణములు
అగణ్యములు. లెక్కింపగలమె
యింక ధర్మకాయ కారణములు?

పుణ్యం, ప్రజ్ఞల కారణాలు పరిమితంగా లెక్కకు అందేవి అయినా ఫలితాలు మాత్రం లెక్కకు అందనివి, అపరిమితాలున్నూ.

**211.** **విషయములకు కారణములు పరిమితమైనను,**
**అపరిమిత ఫలితముల నిచ్చుచున్నవి గదా!**
**బుద్ధత్వ కారణములు అగణ్యములైనను**
**గణనీయ ఫలముల మాత్రమే యిచ్చుననుట తగదు.**

అగణ్యమయిన పుణ్యం వలన బుద్ధుని భౌతిక శరీర లక్షణాలున్నూ - అగణ్యమయిన ప్రజ్ఞా గుణం నుండి బుద్ధుని ధర్మకాయ లక్షణాలున్నూ కలుగుతాయి.

**212.** **బుద్ధుని రూపకాయము జనియించు**
**బహుపుణ్య రాశినుండి.**
**ఓ రాజ! బుద్ధుని ధర్మకాయము**
**జనియించు జ్ఞాన పుంజము నుండి.**

సంగ్రహ ఉపదేశం -

**213.** **అందువలన ఈరెండు**
**బుద్ధత్వము పొంద కారణమైయుండు.**
**కనుక నిరంతరము నీయత్నము**
**పుణ్యము, జ్ఞానములపై నిలుపుము.**

214 - 227 ఈ ఉభయ సంపదలును (పుణ్యసంపద - జ్ఞానసంపద) సమకూర్చు కొనటంలో తగినంతగా చేయలేనన్న అలసత్వం తగదని ఉపదేశం. బోధిచిత్త మహత్తుకు సాటిలేదు.

లఘు సూచన -

**214.** **కనుక సంబుద్ధి సిద్ధించు కొరకు**
**పుణ్యరాశి కూర్చుకొనగ అలసత్వము వలదు.**
**హేతు విచారము - శాస్త్రములు**
**నీలోని వీర్యము నిలుప గలవు.**

215 - 226 - విస్తృత ఉపదేశం

215 - 216 - సంబుద్ధి కోసం శ్రద్ధోత్పాదనం చేసుకొనటం అపరిమిత పుణ్యం యిస్తుంది.

**215.** **ఆకాశము, భూమి, జలము, అగ్ని, వాయుభూతములు**
**అన్ని దిక్కులందున అవధి లేక ఉన్నట్లు,**
**దుఃఖితులౌ చిత్తజీవులకును**
**అవధిలేనె లేదు లోకమందు.**

చిత్త జీవులు / మానసజీవులు / సత్వములు / Sentient being= మనో సంవేదనలున్న జీవులు / వృక్షాదులు కానివి.

**216.** **అసంఖ్యాక జీవులపై కరుణతో**
**బోధిసత్త్వులు వారి దుఃఖముల**
**బాపుదురు అదియె వారిని**
**స్థిరముగ బుద్ధత్వమున నిల్పు.**

217-218 కరుణాచిత్తం హేతువుగ బుద్ధత్వ సిద్ధి సులభం.

**217.** నిదురనైన మెలకువ నందైన,
కరుణ నిండుగా మనమున
నిల్పుకొనువాడు స్థిరుడైనచో,
జాగృతిలోన లేకున్న గాని -

**218.** **- అపరిమిత పుణ్యము సమకూర్చుకొనును.**
**సత్వజీవుల సంఖ్య అపరిమితము**
**కనుక, కారణములును అపరిమితములు కాన**
**అపరిమిత బుద్ధత్వము అసంభవము గాదు.**

19 - 20. నాలుగు అపరిమితత్వాలు కారణంగా బుద్ధత్వసిద్ధి పొందటం సాధ్యమే.

**219.** **బోధిసత్వులీ లోకమున కాలమితిలేక యుందురు.**
**పరిమితిలేక శరీరధారులకై ఎదురుచూతురు.**
**అపరిమిత బోధి గుణము కొరకు,**
**అమిత పుణ్యక్రియల నాచరింతురు.**

220. సంబుద్ధి అవధిలేనిదైనను
చిరకాలమాలసింపక ఈనాల్గు
అనంత గుణములు సిద్ధించుకొనక
మిన్నక ఎట్లుండగలరు?

221. అపరిమితములౌ పుణ్యసంపదలు,
అపరిమితమౌ జ్ఞానసంపదయు,
కాయిక మానసిక క్లేశములను
సత్వరము నశింపజేయును.

ఈ రెండు సంపదలు - శారీరక మానసిక క్లేశాలను తొలగిస్తాయి. పుణ్యక్రియలవల్ల శరీరక్లేశాలు తొలగుతాయి.

222. క్షుత్పిపాసలబోలు దేహబాధలు
పాపకారణమున హీనజన్మలందు కలుగు.
వారు చేసెడు పుణ్యములవల్ల
ముందు జన్మల బాధలు పొందబోరు.

పుణ్యంవల్ల మనోక్లేశ నిర్మూలనం -

223. కామము, క్రోధము, భీతియు, మోహము
బోలిన దుఃఖములు కల్గును అవిద్యచేత.
అవియన్ని అనాలయములని యెరుగువాడు
మనోదుఃఖములన్ని పెకలించి వేయగలడు.

ఈ పుణ్య కర్మలను ఆచరించటంలో అలసత్వం ఉండటం అనాలోచితం.

224. కాయిక మానసిక దుఃఖములచేత
బోధిసత్త్వుల కేహానిరాదు.
సర్వలోక జీవుల, సర్వలోకముల
నడిపించుచున్న వారిపై నిరాదరణమేల?

225. బాధ కొలదియైన భరియింప కష్టము.
దాని చిరకాలమోర్చుట చెప్పగలమె?

బాధ నెరుగని సంతోష జీవులకు
హాని చేయగ జాలరు ఎవ్వరైన.

అపరిమిత కరుణాభావం కలిగించే మహాత్మ్యలం.

**226.** కాయిక బాధలే లేనట్టివారికి
మానసిక బాధలెట్టు లుండగలవు?
పరమకారుణ్య భావముచేత లోక
బాధల తాల్చుటకై చిరకాల ముందురిచట.

సంగ్రహభాషణ -

**227.** బుద్ధత్వసిద్ధి బహుదూర లక్ష్యమని
వెనుకాడి ఆలసింపబోకు
దోషముల పరిహరించుకొరకు,
గుణములను కూర్చుకొనుటకు వేగపడుము.

ధర్మాచరణ (పుణ్యం), పరమశ్రేయస్సు (ప్రజ్ఞ)లలోని అంశాలు.

పుణ్యంకంటె భిన్నమయినవానిని విడచి పుణ్యానుకూలమయిన వానికి ఆచరించాలి.

**228.** వాంఛయు, ద్వేషము, మోహములన్నవి
దోషములని యెరిగి విడువుము పూర్తిగ.
నిర్వాంఛ, అద్వేషము, నిర్మోహము
సుగుణములని యెరిగి అభ్యసింపుము వీర్యముతోడ.

విషతుల్యములయిన మూడుగుణాలు వాని ఫలితాలు.

**229.** వాంఛలవలన కలుగు - క్షుధాపిశాచజన్మలు.
ద్వేషముచేత నరకమున పడుదురు.
మోహమువల్ల కలుగు జంతు జన్మలధికము.
ఇవిలేకున్న దేవమనుష్య జన్మలు కలుగు.

రెండు సంపదలకు సంగ్రహ మార్గం.

230. దోష పరిహారణము - సుగుణ సంవర్ధనము
ధర్మాభిలాషులకు ఆచరణ మార్గములు.
ప్రజ్ఞచే అపదృష్టి నిర్మూలనమె
నిర్వాణాభిలాషులకు సాధనమార్గము.

రెండు సంపదలకు మార్గాలు సంఘ - బుద్ధ - ధర్మసేవలు చేయుట.

31 - 39 - సంగ్రహసూచనలు, 31 - 37 - పుణ్య సాధన మార్గాలు.

31 - 33 - ఆరాధన ప్రదేశాలు స్థాపించటం - రాజునుద్దేశించి.

231. బుద్ధమూర్తులను, ఆలయములను, మహో నిర్మాణాలు
సగౌరవముగ, విస్తారముగ, నిర్మింపుము రాజ!
ఆరామములను నిలుపుము ఘనముగ.
సంపదలను సౌకర్యములను సమకూర్చుము.

232. శ్రేష్ఠవస్తువులతో, సౌష్ఠవాకృతులతో
బుద్ధమూర్తుల నిర్మింపుము
పద్మస్థితుడైనట్లు సుందరముగ.
వరిష్ఠ నిర్మాణము లొనరింపుము.

పాత ఆరాధనా ప్రదేశాలను గౌరవించటం.

233. శ్రమణ సంఘములను, పరమ ధర్మమును
సర్వ యత్నముల పోషింపవలయు.
స్వర్ణములతో, రత్నాభరణములతో
ధాతుపేటికల నలంకరింపుము.

234. బుద్ధ ధాతుపేటికల గౌరవింపుము
స్వర్ణరజత పుష్పములుంచి,
ముత్యములు, పగడములు, వజ్రములు
పచ్చలు, గోమేధికములు, పుష్యరాగము లుంచుము.

235. ధర్మబోధకుల గౌరవించుట కొరకు
ప్రీతికరముల నొసగవలయు.
వస్తు వితరణచేసి, సేవలనర్పించవలయు.
ధర్మ నిరతితో నుండవలయు.

(వేరొక టిబెట్టు ఆచార్యుడు "ఆరు పారమితలపై నిరతితో" అని వ్యాఖ్యానించారుట.)

236. ఆచార్యులపై భక్తితో శ్రవణము చేయుము.
గౌరవించి సేవింపుము, వారి నర్థింపుము.
బోధిసత్త్వులందరను
గౌరవమున సదా అర్చింపుము.

అయోగ్యమయిన వాటికి గౌరవం ఇవ్వరాదు.

237. అన్యులను, తైర్థికులను
అర్చనారాధనలతోడ గౌరవింపరాదు.
అట్లుచేసిన అజ్ఞులు దానిజూచి
భ్రాంతిజెంది వ్యామోహ గతులౌదురు.

(తైర్థికులు అంటే తీర్థంకర అనుయాయులు అనగా జైనులు.)

ప్రజ్ఞా సంపదకు మార్గాలు -

238. భగవానుని బోధనల తెల్పు పత్రముల
గ్రంథముల - వితరణ మొనరింపుము;
వ్యాఖ్యానములతోడుగ.
లేఖన పరికరముల దానమొనర్పు మవిరతముగా.

239. రాజ్యమందు బడులు ఉన్నచోట్ల
ఒజ్జలకు భుక్తికై భూములను
దానములిమ్ము - దేశమంతట
జ్ఞానము విస్తరించు మార్గమిది.

240 - 251. స్వంత సంపదను దానము చేయుట -

240. నీ అధీన రాజ్యమందంతట
వృద్ధులు, యువకులు, వికలాంగులౌ
జనుల దుఃఖము తొలగింప
వైద్యుల, క్షురకుల నియమింపవలయు.

241. ఓ వివేకవంతుడా! నిర్మింపుము
వసతులను - ఆరామములను, పుష్కరిణులు.
మఠములందు జలభాండములు, శయ్యలు,
ఆహారము, కట్టెలు, గడ్డియును సమకూర్చుము.

242. విశ్రాంతి గృహముల నిర్మింపుము
అన్ని పట్టణముల ఆలయములకడ.
నీరుకరవైనచోట్ల నగరములందు
చలివేంద్రాలు నిల్పుము.

243. రోగులను, రక్షణ కరవయిన వారిని,
బాధోపహతులను, దీనుల, బీదల
ఆదరింపుము అధికశ్రద్ధతోడ.
కారుణ్యముతోడ పోషింపుము.

244. ఆయా ఋతువుల కనువగు అన్నపానములు,
పంటలు, ఫలములు, ధాన్యము,
యాచకులకు భిక్షువులకు యిచ్చుదాక
వానియందు భాగము గొనరాదు నీవు.

245. పాదరక్షలు, గొడుగులు, వడబోయు పనిముట్లు,
ముల్లుదీయు చిముటలు, సూదులు,
దారములు, వీవనలు దాపున
ఉంచవలయు చలివేంద్రలందు.

246. చలివేంద్రల నీటి బానలుంచుము
త్రిఫలములు, జ్వరౌషధములు,
కంటిమందు, వెన్న, తేనె, విషహరములు
మంత్రములు, రోగనిదానములు వ్రాసి యుంచుము.

ప్రత్యేక బాధలను నివారించే మంత్రాలు (పరిత్రాలు) - వ్యాధులు వానికి ఔషధాలు పట్టికగా వ్రాసి ఉంచాలి.

247. చలివేంద్రలందు సిద్ధముగ నుంచుము,
దేహము, పాదములు, శిరసులకు ద్రావణములు,
ఉన్నివస్త్రములు, ఎత్తుపీటలు - బానలు
వడ్డనపాత్రలు - కుండలు, గొడ్డలి, ఇంకను యిట్టివి.

248. చిన్న చిన్న పాత్రలందు నింపి
నూవులు - బియ్యము - ధాన్యము
ఆహారము - పానకము - త్రాగునీరు
నీడపట్టున నుంచుము అందునట్లు.

249. చీమల పుట్టల బొరియలవద్ద
నమ్మదగు సేవకుల నుంచి,
ఆహారము నీరము పంచదార
ధాన్యపు కుప్పలు సమకూర్చుము.

250. ఆహారము భుజించుటకు
ముందు వెనుకల, క్షుధాపిశాచములు,
కుక్కలు, చీమలు, పక్షులు, ఇతర
జీవుల తినగ ఆహార మిడుము.

251. (నిరంతర) బాధితులకు, పంటలు
నష్టమయిన వారికి, రోగగ్రస్తులకు,
క్షతగాత్రులకు, పరాజిత రాజ్య
ప్రజలకు శ్రద్ధ జూపు మధికముగ

ఇతరములయిన దానాలు

252. పంటపోయిన కర్షకులకు విత్తనములిమ్ము.
భత్యమిచ్చి ఆదుకొనుము.
తొలగింపుము పూర్వసుంకములు.
తగ్గింపుము పంటలపైన పన్ను.

253. నీసంపద నాశించు అవస్థ పేదలకు తొలగింపుము.
కొత్తపన్నుల విధించకుము,

భారము తగ్గింపుము - గుమ్మములకడ
నిలచు సుంకరుల బాధతొలగింపుము.

254. స్వదేశ, పరదేశములందు (దారి)
దోపిడిగాళ్ల, దొంగల నిర్మూలింపుము.
ధర లుచితమగునట్లు నిలుపుము.
కరువు కాలమున లాభము లదుపు చేయుము.

255. అమాత్యులు సూచించు మంత్రాంగము
సాకల్యముగ నెరుగుము.
అవి ప్రజలకు మేలుగూర్చునెడ
వానినె సదా జరిపింపుము.

256. నీకేది మేలు కూర్చునో తెలియుటకు
విచారణ చేసుకొన యత్నించినట్లు,
పరులకేది మేలుగూర్చునో తెలియుటకు
అటులె విచారణ చేయవలయు.

257. భూమి, నీరు, నిప్పు, గాలి, ఓషధులు,
అరణ్యములు అందరకు చేరువలోనున్నట్లు,
కొంతకాలము నీవు అన్యులకు గూడ
అందుబాటులో నుండవలయు.

258. సర్వమర్పించు దానప్రవీణులైన
బోధిసత్త్వులకు - ఏడడుగుల దూరము
నడువగా పట్టునంతటి సమయమందె.
ఆకాశముమించిన అమితమైన పుణ్యము కలుగు

వివిధ అవసరాలకు అనుగుణంగా చేసే దానం.

259. యువతులకై వెదకు వారికి
సాలంకృతలైన కన్యల
దానము చేయుము, నీకు దక్కును
పరమధర్మము నిల్పిన ఫలము.

260. గృహావసరములన్నింటితోపాటు,
ఎనభైవేల సాలంకృత కన్యల
దానమిచ్చె జినుడు పూర్వమందు.

లేనివారికి చేసే దానం.

261. యాచకులకు ప్రీతిగనిమ్ము
మెరిసేబట్టలు వివిధరకమ్ములు.
అలంకారములు సుగంధములు,
విరిదండలు, ఉల్లాస వస్తు చయము.

ధర్మార్థులకు దానం చేయటం

262. ధర్మము నభ్యసింపగ
తావేలేని అభాగ్యులకు
వసతులు సమకూర్చుము
అంతకుమించిన వితరణ మేమున్నది!

263. విషమయిన నిమ్ము అది
వారి కుపయోగ పడునేని,
పరమాహారమయిన వలదు
వారికది హానికరమైన.

264. పాము కాటందిన వేలును
తెగనరుక తగును అది మేలుకూర్చునేని.
ఒరులకు మేలుకూర్చునపుడు
కష్టము కలిగించిననేమి – అని చెప్పె జినుడు.

వేరొక ఇంగ్లీషు అనువాద పాఠం – "అట్లె ఒరులకు కష్టముల గూర్చు జినుదు, మేలుగూర్చ"

265. పరమ ధర్మమునకు దాని ఉపదేశకులకు
ఉన్నత గౌరవమొసగవలయు.
పూజ్య భావమున శ్రవణము చేయవలయు.
అట్లె ఇతరుల కుపదేశింపవలయు.

266. ఆసోది ముచ్చట్లతో ప్రీతి చెందకు.
లోకావరణ దాటిన వానిపై ఆసక్తి గొనుము.
నీవు సద్గుణములు పెంచుకున్న యట్లు,
ఒరుల యందును పెరుగగ చూడవలయు.

267. ధర్మము విన్నంత తృప్తి చెందకు.
చేయుము ధారణ – అర్థ విచారణ.
గురువుల సంప్రీతుల చేయుము.
దక్షిణలర్పింపగ సదా భావింపుము.

268. ప్రాపంచికుల, నాస్తికుల (గ్రంథాలు) వల్లించకు.
జిగీషాసక్తితో సంవాదము చేయకు.
నీ సుగుణములను స్తుతించుకొనకుము.
సద్గుణములు వైరులవైన కొనియాడుము.

269. నిశిత ప్రజ్ఞుల నెదిరింపకు (వాగ్వాదములందు).
కుటిలములు పలుకకు ఒరులగూర్చి.
ఒంటరి వేళల నీలోని తప్పులు
శోధింపుము లోనారసి.

270. విబుధులు ఒరులందు ఎంచు దోషములు
నీనుండి పెకలించుకొనుము.
నిన్నుజూచి స్ఫూర్తి బొంది
అందరట్లు చేయజూడుము.

271. ఒరులు చేయుహాని నీపూర్వకర్మల
ఫలితమంచు తెలిసి కోపముడుగుము.
అట్టి బాధలింక రాకుండ, దోషము
లన్ని తీరిపోవ, నడచుకొనుము.

272. ప్రతిఫలమ్మేమి ఆశించకుండ నీవు
సాయమొరులకు సర్వదా చేయవలయు.
కష్టముల నీవె ఒంటిగా నోర్వవలయు.
యాచకులతోడ సుఖములు పంచుకొనుము.

273. పొంగిపోకుము
దేవతల విభవము పొందియైన.
కృంగి పోకుము
క్షుధా పిశాచముల దైన్యము నందియైన.

274. సత్యము నీకొరకె పలుకవలయు
అది మరణ కారణమైన గాని.
నీ ప్రభుత నాశమైనను గాని
వేరు విధముగ పలుకరాదు.

275. యశోధనా! ఈ రీతి వివరించిన
శిక్షణ సదా పాటింపుము.
ఈభూమియందు ప్రభుత గలవారిలో
సర్వోన్నతుడవౌదువు.

("పాటింపదగిన వారిలో ఉన్నతుడవౌదువు" - వేరొక పాఠం)

276. దేనినైన చేయబోవు ముందు
సర్వమెరుగవలయు, పరిశీలనముతోడ.
వాస్తవ రూపంబు స్పష్టమైన పిదప
ఒరులపైన భారముంచదగదు.

277 - 300. పుణ్యరాశిని పెంచుకుంటున్న వారికి కలిగే సత్ఫలితాలు - (277-280 ఐదు సాధారణ సత్ఫలితాలు).

277. ఇట్టి అభ్యాసము రాజ్యమంతకు సుఖమునిచ్చు,
కీర్తి పటలము దశదిశల విస్తరించు,
మన్నింతురు నీ అధికారగణము
నిండుమనముతోడ.

278. మృతికి కారణములు పెక్కుగలవు గాని
బ్రతికి యుంటకు మాత్రము కొన్నెకలవు.
ఇవియు ఎప్పుడో మరణ కారణములౌను.
కనుక ధర్మాచరణసదా చేయవలయు.

279. ధర్మమీరీతి సదా ఆచరింప
భువిలోన, నీమదిలోన
పెంపొందు సంతుష్టి.
సర్వమును సానుకూలముగ నుంచును.

280. ధర్మాచరణ చేత సుఖనిద్రకల్గు,
సంతసముతోడ మేల్కాంచగలవు.
అంతరంగవృత్తి శుద్ధమౌను గనుక,
వచ్చుకలలుగూడ సంప్రీతిగూర్చు.

281 - 300 ప్రత్యేక సత్ఫలితాలు అవి 21.

281. సాధనములన్ని సద్వినియోగ పరచి
ఓర్పు, దాతృత, కరణార్ద్రమయిన పలుకుతోడ,
వంశ మర్యాదలన్ని మన్నించి,
తల్లిదండ్రుల సేవ చేయవలయు.

282. ఒక్క జీవితకాలమిట్లు
ఆచరించినచాలును దేవరాజువౌదువు.
ఆపైన యింకను కొనసాగింపవలయు.
కానధర్మమీరీతి పాటింపవలయు.

283. రోజు మూడుసార్లు మూడేసి వందల
అన్న కుంభములు దానముచేసినాగాని,
మైత్రి జూపు ఒక్క ఘటనకు కొంతైన
సాటిరావు పుణ్యఫలమునందు.

284. మైత్రివలన ముక్తి కలుగదు గాని,
మైత్రివలన అష్టగుణములు ప్రాప్తించు.
దేవతలు మానవులు మిత్రులౌదురు నీకు,
తిర్యక్కులు గూడ రక్షించు నిన్ను.

285. మానసిక కాయిక సుఖములు పొందగలవు
విషము, శస్త్రములు హాని చేయలేవు.

అధిక్రమ లేకనే లక్ష్యము చేరగలవు,
బ్రహ్మలోకమందు జన్మించగలవు.

286. బోధిచిత్తముతో జ్ఞానసాధనవాంఛ
సుస్థిరముగ సత్త్వులందు కలుగజేసిన,
జ్ఞానసిద్ధికై నీయందు గాఢవాంఛ
సుదృఢమౌను మేరుపర్వతరాజువోలె.

287. శ్రద్ధ పెరిగిన విశ్రాంతి తగ్గిపోదు.
సచ్ఛీలముచేత కల్గు ఉత్తమజన్మము.
శూన్యతా భావము విశదమైన పిదప
బాహ్యములపైతొలగు ఉపాదానము.

288. నిశ్చలత్వముచేత లోచూపు కల్గు.
చింతనచేత కలుగు వివేకము.
పూజ్యభావముచే ధర్మసూక్ష్మార్థములు తెలియు.
ధర్మరక్షణ చేయగా జ్ఞానివౌదువు.

289. ధర్మశ్రవణము - ధర్మదానము
నిరంతరాయముగ జరుప,
బుద్ధుల సాహచర్యము పొందగలవు.
కోర్కెలు వేగము సిద్ధించగలవు.

290. రాగము తొలగిన ధర్మమెరుక యౌను.
లోభము తొలగిన సంపద పెరుగును.
మానము తొలగిన అగ్రపూజ్యుడవౌదు.
పరమ ధర్మము నిలిపిన స్థిరతకల్గు.

291. ఐదు అవసరములను దానము చేయుటచేత,
భయస్థుల కభయ మిచ్చుటచేత,
హానికలుగదు నీకు పిశాచములవల్ల.
శక్తివంతులలోన అధికుడవౌదువు.

ఐదు అవసరములు : నెయ్యి - పంచదార - తేనె - నువ్వులనూనె - ఉప్పు.

292. స్థూపదేశముల దీపతోరణములు,
చీకటి తావుల దీప దానములు,
తైల దానములు చేయుము.
దివ్య చక్షువు కలుగు నీకు.

293. సంగీతవాద్యములు - ఘంటికలు,
స్థూపారాధనకై దానము చేయుటచేత,
భేరీ తూర్యాదికములు ఒసగుటచేత,
దివ్య శ్రోత్రము నీవు పొందగలవు.

294. ఒరుల దోషము లెన్నకు.
అంగవికలుల గూర్చి భాషింపకు.
వారి మనసులను బ్రోవుము - దానిచే
పరేంగితము నెరుగు శక్తి కలుగు నీకు.

295. చెప్పులు వాహనవసతులు యిచ్చుటచేత,
అర్భకుల నాదరించుటచేత,
ఒజ్జలకు యానము లిచ్చుటచేత,
విచిత్ర ప్రసారముల సృష్టించు శక్తి కలుగు నీకు.

ఒక ప్రసాదాన్ని అనేక ప్రసాదాలుగాను, అనేక ప్రసాదాలను ఒకటిగా మార&
చగల శక్తి.

296. బుద్ధ వచన వ్యాప్తికై వర్తించుటవల్ల
ధర్మగ్రంథముల భావము స్మృతి నిల్పుటవల్ల,
అకలుషముగ ధర్మదానము చేయుటచేత,
జన్మ జన్మాంతర స్మృతి కలుగు నీకు.

బౌద్ధ మందిరాలు నిర్మించటం - ధర్మం కోసం కష్టాలు సహించటం.

297. ఘటనలన్ని నిస్స్వభావములని
శుద్ధముగ, సత్యముగ, సమగ్రముగ తెలియ;
అద్భుతముగ సర్వమాలిన్య నాశముకల్గు.
అతీంద్రియ శక్తులు పొందగలవు.

298. ఘటనలన్నింటి యథార్థరూపము సమాధియందెరిగి
సర్వసత్వముల విముక్తికై అనుకంప తోడ
ఆర్ద్రమొనర్చుకొన్న, సర్వోన్నతి తోడ
జినత్వ మందగలవు.

299. అసంఖ్యాక పరిశుద్ధ మనోరథములచేత
నీ బుద్ధభూమి పరిశుద్ధమగును.
జిన ప్రభువునకు రత్నదానము లర్పింప
అనంత తేజము వెదజల్లెదవు నీవు.

300. కర్మలకు - ఫలములకున్న
కార్యకారణ సంబంధ మెరిగి,
ప్రాణులకు సదా సాయపడుము
అదియె నీకె సాయమగును.

-: మూడవ పరిచ్ఛేదము పూర్తి :-

# రత్నావళి

## నాలుగవ పరిచ్ఛేదము

### రాజ వృత్తోపదేశము

దోష రహిత ధార్మిక పరిపాలనమును ఉపదేశించటం.

301 - 306 - అప్రియ సత్యాలను గూడ వినటానికి రాజును సన్నద్ధంగా ఉండాలి.

301 - 303 - రాజుకు ప్రియవచనాలే చెపుతారుగాని, దోషాలు చెప్పే సాహసం చేయరు.

**301.** రాజు అసంగతములను, అధర్మములను
ఆచరించినను పొగడెదరు భృత్యులు.
రాజు దేని మన్నించునో - మన్నించడో
తెలియగ వారికి మిక్కిలి కష్టమౌటచే.

**302.** నీవంటి విపుల రాజ్యాధిపునకు, నావంటి
భిక్షువేమని చెప్పగలదు! ఒరులకు
అప్రియములు చెప్ప మిగుల కష్టము,
అవియెంత హితకరము లైనగాని.

**303.** నీమీద మిక్కిలి స్నేహమువలన,
జగతిపై నాకున్న అనుకంపచేత,
అప్రియమైనను హితవాక్యములు కొన్ని
చెప్పెదను సంకోచము లేక.

బుద్ధోపదేశానుగుణమైన హితవాక్యాలు వినుమనటం

**304.** సత్య, మర్దవంతము, సలక్షణము, సముచితంబులౌ
బోధలను, ప్రియశిష్యులకు కరుణతోడ
తగు సమయమున చేయదగునని చెప్పె
భగవానుడు - కనుక చెప్పుచుంటి.

హితవాక్యాలు వినుమని ప్రోత్సహించటం -

**305.** దృఢవ్రతా! సత్యవాక్కులుపల్క
మన్నింపవలయు క్రోధరహితముగ,
వాని వినదగు మంచి మాటలనుచు.
స్నానయోగ్యమౌ పరిశుద్ధ జలమునట్లు.

**306.** నీకు చెప్పెడి వాక్యములు
ఇహపరములకు యోగ్యములు.
బాగుగా వీని నెరిగి ఆచరింపుము
మేలుకూర్చును నీకును, లోకమునకు గూడ.

307 - 98 - దోషరహిత పాలనం గురించి విస్తృత వివరణం.

307 - 327 - రాజధర్మం; 307 - 308 దాతృత్వవృద్ధి.

**307.** గతమున ప్రాప్తించిన సంపదతో
తిరిగి యాచకులకు దానం చేయకపోతే,
లోభం, అకృతజ్ఞతల ఫలితంగా
మునుముందు సంపద మళ్లీ కలుగదు.

**308.** ఇహంలో శ్రామికులకు బత్తెములివ్వకపోతే
పాథేయం మోసుకొనిరారు - కాని
ఏబత్తెము లేకయె దీనయాచకులు నీ దానఫలం
శతగుణితంగా నీ మరుజన్మకు తెత్తురు.

309 - 317 ఆలయ నిర్మాణాల గురించి

309. ఉదార భావాలు, చర్చలు, శిక్షణ.

**309.** సతతం ఉదారచిత్తముతో నుండుము.
ఉదార క్రియా రతుడవై యుండుము.
సర్వోదార ఫలితములు జనియించును,
పరమోదార క్రియాకారణమున.

310. నాల్గుసద్గుణాలు సాధించటం.

**310.** శ్రీమంతములు, ఖ్యాతికరములు,
ధర్మమూలములౌ త్రిరత్నాలయములు,
నెలకొల్పుము, అన్యరాజులు
ఊహాలందైనను భావింప అశక్తులౌనట్లు.

311 - 317 - ప్రత్యేకంగా సాధించవలసినవి.

**311.** సామంతరాజ రోమాంచకరముగాని
ధర్మాస్పదములు నెలకొల్పకుండుటే మేలు.
అట్టి అప్రశస్త కార్యములు
నీమరణానంతరమున ఖ్యాతి పొందలేవు.

**312.** ఔదార్యముతో సర్వ సంపదలనైన వెచ్చించుము.
ఉదారులకు అతిశయ ముదుగు,
సమస్కందులుత్సహింతురు,
మందులకు ప్రేరణకల్గును.

ఈ ఔదార్యము, విస్తారముగా ఆలయములు నిర్మించటం ప్రజాక్షేమ కార్యముల గురించి.

**313.** సంపదలన్ని నీవు విడచిపుచ్చి చివరకు
ఆధిపత్యమును వీడి ఎచటికో చేరవలయు.
ధర్మమునకు వినియుక్త మయినది మాత్రమె
సత్కర్మయై నీకు ముందుగ నడచు.

**314.** పూర్వరాజుల సర్వస్వము
వచ్చి చేరెను నీకు వారసత్వముగ.
పూర్వరాజులకేమి దక్కెను?
సుఖమా! ధర్మమా! ఖ్యాతియైన గలదా!

**315.** సంపదలనుభవించిన ఇచటనె ఇపుడె సుఖము కల్గు.
దానమిచ్చిన సుఖముకల్గు పరమునందు.

ఇవ్వి రెండుగాక ధనము వ్యర్థపరుప
దుఃఖమొకటి తప్ప సుఖము కలదె?

316. అన్ని ఉడిగిన అవసానమందు వినరు మంత్రులు.
దానమేమి చేయజాలవపుడు.
సిగ్గువిడచి, నీదు స్నేహము మాని, మంత్రులు
అన్యరాజుల ప్రీతికై వెదుక బోదురు.

317. విభవము ఆరోగ్యము, అన్ని యున్నపుడె
సత్వరముగ ధర్మాస్పదములు పాదుకొల్పుము.
మృత్యు హేతువులమధ్య వసింతుమెపుడు
వాయు మధ్యస్థమౌ దీపకళిక వోలె.

318 – 320 – పూర్వ నిర్మాణాలను పరిరక్షించాలి.

318 – సాధారణ బోధ.

318. పూర్వరాజులు నిల్పిన
అన్యధర్మ కేంద్రములు, దేవళంబులు
యధాపూర్వమట్లు – రాజా!
నిర్వహించు చుండవలయు.

319. రక్షకుల నియమించటం.

319. హింసారహితుల, శుభాచారుల,
సత్యవ్రతబద్ధుల, అతిథిప్రియుల,
సర్వక్షమావంతుల, కలహ రహితుల
సేవాశీలుర నిలిపి – వాని రక్షింపవలయు.

పోషణలో సమత్వం –

320. దీనులు, హీనులు, వికలాంగులు, పతితులకు,
అంధులు, వ్యాధి పీడితులు, అనాధులకు,
ఎడలేక నిరతమ్ము అన్నపానాది
దానవసతుల నిల్పుము రాజశేఖరా!

అర్థించని వారికిగూడ సాయం

**321.** అర్థించకున్న నేమి - ధార్మికులు
పరరాజ్య భాగమందున్న నేమి,
సత్పురుషులను అనుగ్రహింపుము
భేదమేమిలేక, అనురూప వర్తనమున.

అనుగ్రహం అంటే సకల సౌకర్యాలు ఇవ్వటం.

322 - 327. మంత్రులను నియమించటం గురించి.

322. ధర్మాధికారులను నియమించటం గూర్చి.

**322.** సర్వధర్మాధి నిలయములందు
లోభరహితుల, పండితుల,
ఉత్సాహుల, బాధింపని వారల,
ధర్మపరుల, నుంచుము ధర్మాధికారులుగ.

323. మంత్రులను నియమించటం గురించి

**323.** నీతిజ్ఞుల, ధార్మికుల, స్నిగ్ధమానసుల
నిర్మలబుద్ధుల, భక్తిభావుల, ధీరుల
కులీనుల, శీలసంపన్నుల,
కృతజ్ఞుల సచివుల చేయుము.

324. దండనాయక నియామకం.

**324.** శూరుల, త్యాగ మతుల, రాగ రహితుల,
స్నిగ్ధ మానసుల, సుస్థిరమతుల,
సద్వ్యయపరుల, ధార్మికుల, అప్రమత్తుల
దండనాయకుల చేయుము.

325 - 327. కోశాధిపతుల నియామకం

**325.** ధర్మశీలుర, శుచిమంతుల, దక్షుల
కార్యజ్ఞుల, శాస్త్రకోవిదుల, యుక్తవిధుల

నెరిగినవారల, సముల, స్నిగ్ధమానసుల,
వృద్ధుల నధికృతుల నొనరింపుము.

326. ప్రతిమాసము స్వయముగ వినుము
ఆదాయ వ్యయముల వివరములు.
పిదప ధర్మ నిలయములందు చేయదగు
కార్యముల సర్వము నాదేశింపుము.

327. ధర్మము కొరకె నీరాజ్యము.
కీర్తికొరకు కాదు, కామ్యములకును కాదు.
అట్లగుట చేతనే కల్గు పూర్ణఫలము.
అన్యవిధమైనచో అన్నియనర్థములె.

328. ఈలోకమంతయు పరస్పరము
ఆమిషీభూతముగ హరించుకొందురు.
ఓ నరాధిపా! రాజ్యమెట్లు, ధర్మమెట్లు
నడపవలయునో వినుము చెప్పెద.

329 – 337 – ధర్మాచరణంలోను – అభివృద్ధిలోను పతనం లేకుండటం గురించి.

329. ఉద్యోగులుగా ప్రత్యేక సామర్థ్యం ఉన్నవారిని సమీకరించటం.

329. జ్ఞానవృద్ధులు, న్యాయకోవిదులు,
పాపభీరువులు, శ్రేష్ఠసంజాతులు,
పెక్కురు నినుకూడి యుండవలయు
కార్యదర్శనము చేయుకొరకు.

330. దండ, బంధ, ప్రహారములవంటి
న్యాయమైన శిక్షలను అధికృతులిచ్చినా,
కరుణార్ద్ర చేతముతోడ రాజు
దోషుల ననుగ్రహింపవలయు.

దోషులయెడ కరుణ -

331. తీవ్రపాపము చేసినాగాని,
సర్వ దేహధారులపై కారుణ్యభావ
ముంచవలయు, మైత్రితో
హితమునే చిత్తమున సదా తలపవలయు.

332. హంతకులపై, తీవ్రపాపులపైన
విశేషముగ కరుణ చూపవలయు.
ఉదార హృదయుల అపారకృపకు
పతనమైన వారె మిక్కిలి పాత్రులు.

బందీలపై దయ -

333. శక్తి హీనులౌ బందీల ఒకటొ ఐదో
దినముల పిదప విడుదల చేయదగును.
ఇతర బందీల చిరకాలమట్లె ఖైదు
చేయుమనికాదు - విడువుము వీలువెంట

334. ఎవరినైన విడువగా ఇచ్ఛ కలుగకున్న,
లోపించును నీయందు సహనదృష్టి.
సహనము దూరమౌట జేసి,
పాపరాశి అధికమై పెరుగుచుండు.

335. ఎంత కాలము విడుదల చేయకున్న
అంతకాలము సుఖముగ చూడవలయు.
అన్నపానాలు, స్నానము, వైద్యవసతి,
క్షురక వసతియు, దుస్తుల నివ్వవలయు.

(టిబెట్టు అనువాదంలో దుస్తుల విషయం లేదుట.)

336. అయోగ్యుడైనట్టి పుత్రుని యోగ్యుని
చేయగా తండ్రి దండించునట్లు,
కారుణ్య బుద్ధితో శిక్షింపవలయు
అర్థాభిలాషయు ద్వేషము లేక.

**337.** అతిదుష్ట ఘాతుక జనుల
వివరములన్ని వివేచించిగూడ,
రాజ్యసీమదాటి పొమ్మనుటేచాలు
చంపరాదు, హింసపెట్టరాదు.

338 – 345 – గతంలో లేని కొన్ని ధర్మాలను ఉపదేశిస్తున్నారు.

**338.** చారచక్షుల వలన స్వతంత్రముగా
సర్వ విషయముల నెరిగి,
నిత్య జాగరూకతతోడ స్మృతిమతివై,
ధార్మిక కార్యముల నాచరింపవలయు.

**339.** సద్గుణస్థానమైన సాధుజనుల
దానాది సత్కృతుల భజింపుము.
అన్యులనుగూడ ఉదారముగ,
అనురూపముగ, యథోచితముగ గౌరవింపుము.

**340.** సహనచ్ఛాయలను, సంప్రదాన మహాఫలములను
సన్మాన పుల్ల కుసుమముల నిచ్చు
రాజనెడు మహావృక్షముపై వ్రాలి
సేదతీరును సేవక శకుంత సమితి

**341.** త్యాగశీలయుతుడైన రాజు
ప్రీతిపాత్రుడౌను తేజస్వియైన.
ఏలకులు మిరియాలతో కర్కశమైనను
ఆమోదకములు మధురమైనయట్లు,

(కర్కశము = నొప్పించునది; ఘాటు అయినది అని కావచ్చు. తేజస్వి = బలవంతుడు.)

**342.** నీవిట్లు సవిమర్శతో న్యాయ
మొనరింప చెడదు నీ పాలనము.
న్యాయ హీనముగాదు – ధర్మ హీనముగాదు.
నీరాజ్యమందు నిలచు ధర్మము.

**343.** పరలోకమందుండి తేలేదురాజ్యము.
మరుజన్మకు తోడుగా రాబోదు రాజ్యము.
ధర్మముచే సంప్రాప్తమయినదీ భాగ్యము.
ధర్మహీనముగ దాని పాలింపరాదు.

**344.** అధికార యత్నముచేత
దుఃఖపెట్టి, ధనము నార్జించి,
రాజ్యకోశము నింపెడు యత్నములను
సర్వదా నీవు నిరోధింపవలయు.

**345.** ఉచితమార్గము తప్పకుండ,
రాజ్యభాండ పరంపరచేత,
రాజ్యభాండ మూల్యము పెంచుకొరకు
రాజా! సర్వదా యత్నింపవలయు.

రాజ్యభాండము (మూలం) = కోశాగారము, మూలధనం, సంపత్తి.

346 – 366 – విముక్తికి మార్గశిక్షణ.

346 – 364 – సుఖము, దుఃఖము, తృష్ణాకరము లయిన వానిని నిరాకరించుట.

346 – 361 – సుఖానుభవాన్ని నిరాకరించుట.

**346.** చతుర్ద్వీపములున్న పృథివి
ప్రాప్తించి చక్రవర్తియై ఏలుగాక,
అతని కుండెడు సుఖములు రెండే రెండు.
శారీరక – మానసిక సుఖద్వయము.

**347.** శారీరక సుఖవేదనలు
దుఃఖమునకు ప్రతిక్రియలు మాత్రమే.
మానసిక సుఖములు చింతనా జనితసుఖములు,
కేవల కల్పనాకృతములు.

**348.** ఈ లోకమందలి సుఖసంపదలు
దుఃఖములను తగ్గించు ప్రతిచర్యలు మాత్రమె.

అవియన్ని మనోకల్పనామాత్ర యత్నములె,
నిజమునకు అవియన్ని వ్యర్థములె.

349 – 360 – సుఖములనుకొనే వాటి నిజస్వరూపం వెల్లడించి, నిరాకరించటం. ఏ ఒక్కదాని అనుభవమైనా కొంతే సుఖం కలిగిస్తుంది.

**349.** ద్వీపములు - దేశములు - పురములు - గృహములు
శయ్య లాసనములు, అన్నపాన సౌఖ్యాలు,
గజ తురగతతులు, స్త్రీలు,
భోగములు కల్పించు మార్చి మార్చి.

**350.** వీనిలో ఏ ఒక్కదానిని తనకు విషయముగ
గ్రహించినను అచట సుఖమున్నదందురు.
తదితరములపై మనసు పెట్టని యపుడు
ఆ యితరములు నిజమునకు తనకు లేని యట్లే గదా!

351 - 360. భౌతిక సుఖాల హేతువులను నిరాకరించటం.

351 - 353 – పంచేంద్రియాల విషయాలు భౌతిక సుఖహేతువులు కావు.

**351.** పంచేంద్రియము లొకేసారి పంచ
విషయములను గ్రహించినాగాని,
సౌఖ్యభావము అన్నింటికొకేసారి కలుగబోదు.
అన్నికలిసి ఒకటిగా సుఖమివ్వలేవు.

**352.** ఏ ఇంద్రియమైన ఏదేని విషయమును
సుఖకరమని గ్రహియించునపుడు,
ఇతర విషయములు అనుభవాన తెలియరావు,
అవ్వి నిజమైన సుఖకారణములు కావు గనుక.

ఒక ఇంద్రియం - తనకు చెందిన విషయంద్వారా సుఖం అనుభవిస్తున్నపుడు, తక్కిన ఇంద్రియాలు ఇతర విషయాలను గ్రహిస్తున్నప్పటికి సుఖానుభవంమాత్రం ఒకదాని యందే నిలుస్తుంది. కనుక తక్కిన విషయ సుఖాలు అనుభవంలోకి రావు. సంగీతం వింటున్నపుడు శ్రవణ సుఖమొక్కటే

ప్రధానమవుతుంది. పరిసర దృశ్యాలవల్ల కంటి సుఖంగాని, అక్కడి సుగంధాలవల్ల ముక్కుకు కలిగే సుఖంగాని అనుభవంలో సమానంగా నిలువదు.

**353.** ఇంద్రియము స్పృశించిన ఏదేని
గతవిషయమును మనసు స్వీకరింప,
ఇక దానిపై ఊహలు తేలియాడుచుండు.
దానినే సుఖమంచు మురియుచుండు.

ఇంద్రియాలు విడివిడిగాకూడ సౌఖ్యకారకాలు కావు.

**354.** గ్రహియించెడు ఇంద్రియాలు లేకున్న
ఇహమందు విషయములు వ్యర్థములు.
అట్లె గ్రహింపబడుటకు
విషయాలు లేకున్న ఇంద్రియాలు వ్యర్థము.

స్వతంత్ర చేతనను నిరాకరించటం

**355.** తల్లిదండ్రు లాధారముగా
పుత్రుడు సంభవించునట్లు
చూపు రూపులవల్ల
విజ్ఞానము సంభవించు.

విషయములకు స్వతంత్ర అస్థిత్వం నిరాకరించటం.

**356.** గతము, భావియు, విషయములు,
ఇంద్రియములు, నిజముగావు.
ఈ రెంటికన్న వర్తమానము
భిన్నముగాదు. కనుక నిజముగాదు.

గతము, భవిష్యత్తులమీద ఆధారపడినపుడు మాత్రమే - అది వర్తన మానంగా మనగలుగుతున్నది. భూత భవిష్యత్తులమీద ఆధారపడ్డ వర్తమానం - వానికన్న భిన్నమయినది కాదు. కనుక స్వతంత్రమయినది కాదు. సాపేక్ష మయినది మాత్రమే.

**357.** దివిటీలు త్రిప్పుచుండ చక్షుర్భ్రాంతిచేత
అగ్నిచక్రము వోలె కన్పించునట్లు,

విషయములె వర్తమాన వాస్తవమని
ఇంద్రియాలు భ్రాంతిచెందు.

358 - 360 - ఇంద్రియములకు ఇంద్రియార్థములకు స్వతంత్రతను నిరాకరించటం.

**358.** ఇంద్రియాలు, ఇంద్రియార్థములు,
పంచభూత మయములందురు.
భూతమేదియు వాస్తవంబు గాదు,
కనుక వస్తువులును కావు వాస్తవాలు.

ధాతువులకు స్వతంత్ర అస్థిత్వం లేదనటం.

**359.** పంచభూతములన్ని వేనికవి వేరనుట -
ఇంధనము లేకయే అగ్ని ఉందు నన్నట్లు.
అవి యన్ని మిశ్రమంబులై స్వలక్షణ రహితములౌను.
ఇతర భూతముల గూర్చి ఇట్లె ఎరుగ వలయు.

ఈ భూతాలు నాలుగు పరస్పరం మిశ్రితమై ఉంటే అవ్వి స్వతంత్ర లక్షణాలను కోల్పోతాయి. కనుక రూపములకు వేటికి స్వతంత్రతలేదు.

**360.** భూతాలు మిశ్రమముగానైన, ఒంటిగానైన
వాస్తవములుగావు రెండు రీతులజూడ.
భూత మిశ్రణము వాస్తవము గాదు.
అట్లె రూపమును అర్థవంతముగాదు.

వానిపై ఆధారపడతాయి కనుక సంతోషాలు గూడ వాస్తవాలు కావు.

**361.** విజ్ఞానము - వేదనలు- సంజ్ఞలు
సంస్కారములు - అన్నియు స్వయముగా
అస్థిత్వరహితములు సర్వశః,
అందుచే పరమార్థమందవ్వి లేనెలేవు.

ఆకారణం చేతనే బాధలుగూడ వాస్తవాలు గావు.

**362.** బాధను తగ్గించుకొనుటయె
సుఖమని భావించుకొన్నట్లు,
సుఖము తగ్గుటయె
బాధగా తలచుకొందురు.

363 – 364 – శూన్యతను తెలుసుకొనటం వల్లనే ముక్తి.

**363.** సుఖములు కావలెననెడు తృష్ణను,
దుఃఖములు వలదనెడు తృష్ణను,
రెండింటి విడువ వలయు.
స్వభావతః అవ్విలేవని యెరిగిన ముక్తి కలుగు .

శూన్యతను గుర్తించే మనసును తెలుసుకోవటం.

**364.** ఏదిగ్రహించునో దానినే చిత్తమంటారు.
వ్యవహారమందు సంస్కారములు లేక
చిత్తములేదు కనుక దాని కునికి లేదు.
వేరొక చిత్తమనేది తోడుగ లేనేలేదు.

"విషయములను గుర్తించే మనను ఉన్నది" – అన్న సంగతిని గుర్తించే మరొక మనసు ఉన్నదా? అట్లా మొదటి మనసును గుర్తించే వేరొక మనసు గనుక ఉండి, అదిగూడ సమానాంతరంగా ఉనికిలోనే ఉంటే – అదే మొదటి వాస్తవాన్ని గూడ గుర్తించవచ్చుగదా! అవన్నీ మన సంస్కారాలమీద ఆధారపడ్డవే. కనుక అవాస్తవాలే. కనుక మనసుకు సమానాంతరమయిన వేరొక మనసులేదు. అనుభవించే మనసు – దాన్ని చూచే మనసు, అంటు రెండు మనసులున్నాయని కొందరంటారు. ఆవాదాన్ని ఇక్కడ నిరాకరిస్తున్నారు.

365 – 366 – హీనయానులు – మహాయానులు – ఉభయులు శూన్యతను గుర్తిస్తూనే ఉన్నారు.

365. నిర్వాణ సిద్ధికి శూన్యతను గ్రహించటం అవసరం.

**365.** సత్వములన్ని అర్థతః వాస్తవములుగావు.
యధాభూతముగ ఇవి నిరాస్పదములు
ఉపాదానము లేకున్న, మరుజన్మలేదని ఎరిగిన,
దుఃఖము దాటగలరు – ఇంధనములేని అగ్నివోలె.

366. హీన, మహాయానముల మధ్య భేదం

**366.** అంతయు ఎరిగి బోధిసత్త్వులు
కోరుకొందురు సంబుద్ధి నియతముగ
భవపరంపర కొనసాగింతురు
కరుణతోడ సంబుద్ధి కలుగుదాక.

367 – 398. మహాయాన గ్రంథాలను నిందించదగదు.

367 – 96. విస్తృత వివరణం.

**367.** బోధిసత్త్వుని సంభారమౌ పుణ్యరాశిని,
ప్రజ్ఞను, నిర్దిష్టముగ చెప్పె తథాగతుడు
మహాయానమందు. సమ్మూఢులు
ద్వేషులై నిందజేసిరి మహాయాన పథము.

**368.** గుణదోషముల విచక్షణ తెలియరాకనొ,
దోషములె గుణములనెడు భ్రాంతిచేతనో,
లేక గుణములపై ద్వేషము కలదొయేమొ,
నింద చేయుచుందురు మహాయానమన్న.

**369.** పరాపకారము దోషమంచు
పరోపకారము సుగుణ మంచు తెలిసియు,
మహాయాన నిందచేయువాడు
గుణద్వేషి యనగ చెల్లు.

మహాయానాన్ని నిరాకరించటంలోని దోషాలు.

**370.** స్వార్థ నిరపేక్షతచేత,
పరార్థైక రసప్రీతిచేత,
సుగుణాకరమౌ మహాయానమందు
కలుగుద్వేషము, వానినె దహించు.

**371.** శ్రద్ధ కల్గియు (శూన్యతను) అపార్థముచేత వీడు నొకడు.
ద్వేషముచేత (శూన్యతపై) కోపిష్టి యింకొకడు,

శ్రద్ధ కల్గినవాడును దగ్ధమానసుదయ్యెనన్న,
అయిష్టముచే ద్వేషబంధురుడైన వానినేమని చెప్పగలము?

స్వల్ప దుఃఖంతో అధిక దుఃఖాన్ని తొలగించుకొనటం -

**372.** విషము విషమును హరించుననుట
వైద్యశాస్త్రము చెప్పుసూక్తి - చికిత్సకులకు.
దుఃఖము వలనగూడ అహితమంతయు
తొలగుననుటలో వైరుధ్యమేమిగలదు?

373 - 74 -మహాయాన ఆచరణ కష్టమయినా, దుఃఖాన్ని పూర్తిగా తొలగిస్తుంది గనుక నిరాకరించక - ఆమోదించాలి.

**373.** తలపుల ననుసరించి ఆచరణ జరుగు.
అందువలన మనసె మిగుల ముఖ్యమనుట విదితము.
హితము తలచెడు పరహిత పరులకు
దుఃఖముగూడ సహకారి కాకయుండునె

(ధమ్మపదం - యమకవర్గ - 1- 2 గాథలు)

**374.** బాధగూడ మున్ముందు సత్ఫలము నిచ్చునందురు.
తనకు పరులకు హితముగోరి బాధలు
స్వీకరింప, మేలుకూర్చునని వేరుగ చెప్పవలెనె.
ఇది మహితధర్మము - సనాతనము

375 - 379 - స్వల్ప సుఖాలకై ఆశపడటం తప్పు - గొప్ప సంతోషం కోసం ప్రయత్నించటమే ఉచితం.

**375.** స్వల్ప సుఖం వదులుకుంటే,
విపుల సుఖం పిదప కలుగును.
స్వల్ప సుఖం విడచి ధీరుడు
విపుల సుఖాన్నెదురు చూచును

**376.** అట్లు విమర్శించి చూడకున్న
వైద్యులు చేదుమందు లిచ్చుటే జరుగబోదు.

స్వల్ప సుఖమునకు విపుల సుఖము
కోల్పోవుటవును - అట్లు జరుగరాదు.

**377.** అపథ్యమైనట్లు కన్పించువానినిగూడ
పథ్యమేయని పండితులందురు కొన్నిసార్లు.
సాధారణ విధులకు అపవాదములుండుట
సర్వశాస్త్రములందు విధింపబడియె.

మహాయాన ప్రీతియే యోగ్యము -

**378.** మహాయానోక్తమయిన బోధలు సర్వము
నిర్మల జ్ఞాన నిష్యందములు -
కరుణాపూర్వకములు -
మతిమంతుడెవడైన ఎట్లు గేలిచేయు!

**379.** ఇది అత్యుదారము, అతి గంభీరమౌట
శిక్షణలేని సోమరి బుద్ధులు, అశక్తులు,
మోహముచే నిందజేసిరిమహాయానమును.
పరులకు, తమకు, తామె శత్రువులైరి.

380 - 389 - మహాయానం బుద్ధవచనమేనని నిర్ధరించటం

380 - 382 - ఆరు పారమితలు - ఆచరణం.

380 - మహాయానంలో దుష్టబోధలు లేవు.

**380.** దాన శీల క్షమా వీర్య
ధ్యాన ప్రజ్ఞా కృపాత్మకము
ఐనట్టి ఈ మహాయాన
మెట్లు దుష్టబోధ చేయగలదు?

మహాయాన గ్రంథాలలో మహాయాన లక్ష్యాలు చెప్పారు.

**381.** దానము శీలములచే పరార్థములు
క్షాంతి వీర్యములచే ఆత్మార్థములు
ధ్యాన ప్రజ్ఞలచే మోక్షార్థములు సాధించవలయు
ఇదియె మహాయానార్థ సంగ్రహము.

మహాయాన గ్రంథాలు బుద్ధవచనములేనని నిరూపణ.

382. పరులకు, తనకును హితమైన లక్ష్యములు,
మోక్షార్థములు, సంక్షేపముగ చెప్పె
బుద్ధశాసనమున - ఆరు పారమితలందుజేర్చి.
కాన మహాయానముగూడ బుద్ధవచనమే.

సమ్యక్సంబుద్ధిని గూర్చిన సమగ్రమార్గం మహాయాన గ్రంథాల నుండి తెలియటం అవశ్యకం -

383. పుణ్యమయము - జ్ఞానమయము
బుద్ధుడు బోధించిన మహాపథము.
అజ్ఞానాంధులు కానలేరు
మహాయాన మార్గము

384. భావింప నశక్యమౌ గుణములు కలవందురు జినునకు.
ఆ గుణములు ఆకాశమువోలె ఊహలకందవు.
బుద్ధుని మాహాత్మ్యము గ్రహింపవలయు
మహాయానమున వర్ణించినట్లు.

385. బుద్ధుని శీలవిశేషములను
ఆర్య శారిపుత్రుడుగూడ తెలియ నేరదు.
బుద్ధుని అచింత్య మహాత్మ్యములు
మనమామోదించగ వెనుకాడుటేల.

(ఆర్యశారద్వతుడు అని సంస్కృతపాఠం)

386 - 387 - హీనయానం వివరించే వ్యయజ్ఞానం, మహాయానం వివరించే వ్యయజ్ఞానం - అనుత్పాదకతలు - ఒకే అర్థాన్ని వివరిస్తాయి అదే శూన్యతా జ్ఞానం.

386. మహాయానము చెప్పెడు అనుత్పాదము,
పరులు చెప్పెడు వ్యయమును,
అర్థమందు రెండు నొకటె చెప్పు శూన్యమనుచు.
ఉత్పత్తి వ్యయములకు లేదు స్వంత ఉనికి
కనుక (మహాయానము) బుద్ధవచనమనవలయు.

పరులు = హీనయానులు.

పుట్టేది ఏమిలేదు. (అనుత్పాదము) అంటుంది మహాయానం. అన్నీ నశించేవే (క్షయం) అంటుంది హీయానం. మొత్తంమీద ఉభయులు చెప్పేది - అంతర్గత అస్థిత్వంగా ఉండేది ఏమిలేదు అన్న సత్యమే. పుట్టేది ఏమిలేదు గనుక నశించేదీ ఏదీలేదు. అన్నీ నశించేవే గనుక ఉండిపోయేవి ఏమిలేదు. ఇదే శూన్యత. కనుక మహాయానం చెప్పే శూన్యతను బుద్ధవచనంగా అంగీకరించటమే ఉచితం.

**387.** **బుద్ధ మహాత్మ్యమును, శూన్యతను**
**హేతుసహముగ ఇట్లెరిగి చూడ**
**రెండు యానములందు చెప్పినవి**
**తుల్యములు కావని విజ్ఞులెట్లాడగలరు!**

**388.** **తథాగతుడు విశేషదృష్టితో చెప్పిన**
**వాని తెలియుట అంత సులువు గాదు**
**ఏకయానమె గాదు మూడుయానములు చెప్పె**
**ఉపేక్షకలిగి నిన్ను కాపాడుకొనుము.**

బుద్ధుని బోధనలలోని సంక్లిష్టతవల్ల అవిసరిగా అర్థం కాకపోతే ఉపేక్ష (తటస్థత) మంచిది. త్వరపడి నిరాకరించగూడదు - నిరాకరణ అపమార్గం అవుతుంది. కనుక ఆ అపమార్గం నుండి కాపాడుకోవాలి. ఉపేక్ష అంటే సమత్వబుద్ధి.

**389.** **ఉపేక్ష వలన కలుగదు దోషము,**
**పాపము వచ్చు ద్వేషముచే, శుభమెట్లు కలుగు?**
**ఆత్మ శుభము కోరువారు**
**మహాయానము ద్వేషించరాదు.**

(ఆత్మకాములౌవారు - మూ)

90 - 93 - బోధిసత్వచర్యలను హీనయానం సమగ్రంగా వివరించలేదు.

**390.** **బోధిసత్త్వుల ప్రణిధులు, చర్యలు,**
**పరిణామనలు పూర్తిగ చెప్పలేదు**

శ్రావక యానమందు. కాన
దాని ననుసరించి బోధిసత్త్వులౌట యెట్లు?

ప్రణిధులు = నిశ్చల ఆశయాలు; పరిణామనలు= ఫల సమర్పణలు.

**391.** బోధిసత్త్వుని బోధలందు
బోధికి అధిష్ఠాన మేదియో చెప్పలేదు.
ఆ యర్థము తెలియుటకు
జినునికన్న ప్రమాణమెవరు!

అధిష్ఠానము = ఆధారపీఠము / ఆధార సంకల్పము.

392. ఆర్యసత్యాలు, బోధిపక్షీయ ధర్మాలు, పాటించటమే శ్రావకమార్గం. దానివలన బుద్ధత్వం సాధ్యం కాదు.

**392.** చతురార్య సత్యార్థములు - బోధిపక్షీయ ధర్మములు
మాత్రమే అధిష్ఠానము శ్రావక సాధారణ మార్గమున.
దానివలన సిద్ధించిన బుద్ధత్వము
అధిక ఫలప్రదమెట్లౌను?

393. మహాయాన గ్రంథాలను బుద్ధ వచనంగా విజ్ఞులు స్వీకరించాలి.

**393.** బోధిసత్త్వ చర్యల ప్రతిష్ఠించు వచనమేది
చెప్పబడలేదు - ఏ (హీనయాన) సూత్రమందు.
వాని చెప్పెను మహాయాన మొకటే విస్తరించి.
స్పష్ట దృష్టిగలవారికి అవ్వి విశదమౌను.

394 - 396 - బుద్ధుడు మూడు యానములను బోధించవలసిన అవసరం.

**394.** వ్యాకరణ పండితుడు ముందుగ
అక్షరాలనె శిష్యులకు నేర్పునట్లు,
శిష్యులందుకొన గలిగినంతవరకె
బుద్ధుడు ధర్మములు బోధించె వారలకు.

**395.** పాప విముఖుల చేయగ కొందరకు,
పుణ్య సిద్ధిని సాధింప నింకొందరకు,
ద్వంద్వము నిశ్చయముచేయ మరికొందరకు,
భిన్నరీతుల బోధించె బుద్ధమౌని

**396.** ఒకదాని యందె రెండిటి కూర్చి
ఏకత్వము నాధారముగ కొందరకు చెప్పె.
గంభీరము, భీరువులకు భీషణము, శూన్యతా,
కరుణా గర్భితముగ బోధిసాధన కొందరకు తెల్పె.

సంగ్రహ వచనం

**397.** సమ్యక్ సంబుద్ధి సిద్ధించుకొరకు
సుజనులు - మహాయానముపై
కోపమును వీడుట కర్తవ్యము.
అధిక ప్రసాదబుద్ధి సాధింపయుక్తము.

**398.** మహాయానమందు శ్రద్ధచేత
తదుక్తా చరణచేత,
అనుత్తర సంబుద్ధి కలుగు.
అనుసరించిన సర్వసౌఖ్యములు కలుగు

దానము - క్షమ - శీలము - కరుణలతో రాజ్యమును పాలించుమని సంగ్రహంగా చెప్పటం.

**399.** దానము - శీలము - క్షమ - సత్యములు
గృహస్తులకు విశేషములు.
కరుణా గర్భితములుగ నివియన్ని దృఢముగ
మదినిల్పుకొనుము (రాజ్యము) పాలించునపుడు.

సాధ్యం కాకపోతే ప్రవ్రజ్య తీసుకొనుట మంచిది.

**400.** లోకమంతా ధర్మరహితమై
ధర్మపాలన దుష్కరమైతే,
రాజ్యపాలనవీడి ప్రవ్రజ్య గొనుము.
కలుగును ధర్మము - యశము - అర్థము

- : నాల్గవ పరిచ్ఛేదము పూర్తి : -

# రత్నావళి

## ఐదవ పరిచ్ఛేదము

### బోధిసత్వ చర్యోపదేశం

401 - 487 - సత్వరముక్తిని సాధించ కోరెదు బోధిసత్త్వులకు, భిక్షు దీక్షాభిలాషులకు ఉపదేశం - ప్రమాణాలు - పది బోధిసత్వభూమికలు - దశబలాలు).

401 - 402 - గృహస్థ బోధిసత్త్వులకు - భిక్షువులకు - ఆచరింపవలసిన - నిరాకరింపవలసినవాని గురించి - సంగ్రహబోధ.

**401.** భిక్షు దీక్షగొన్న పిదప, ముందుగా
శీలవ్రతముపై శ్రద్ధ నిలుపవలయు. ఆపై
స్వీయముక్తి కొరకు శిక్షణ పొందవలయు.
తరచు ధర్మశ్రవణము అర్థవిచారము చేయవలయు.

**402.** స్వల్ప దోషములుగూడ తెలిసి,
అవి పుట్టుతావుల నెరిగి, పరిహరింపవలయు.
ఏబదియేడు దోషముల
స్పష్టముగ గుర్తింపవలయు.

403 - 483 - విస్తృత వివరణ.

403 - 434 - దోష వర్జనము

403 - 433 - గృహస్థులు, శ్రమణ దీక్షాపరులు వర్జింపవలసిన ఏభై ఏడు దోషముల గురించిన విస్తృత వివరణము.

403 - 412 - క్రోధము మొదలయిన మొదటి పదిహేను దోషములు-

**403.** కోపమన్న దొక మనోవైకల్యము, 1
ఆపైన శత్రుత్వము కలతపరచు మరికొంత. 2
దోషముల దాచుటే దాపరిక మనగ 3
దుష్కృత్యములపై ఉపాదానమె పాపేచ్ఛయనగ 4

404. కుహనా వర్తనమత్యంత వంచన. 5
వక్రబుద్ధియె మోసగుణము. 6
ఒరుల మంచిని ఓర్వమియె ఈర్ష్య 7
దానభయమె లోభగుణము. 8

405. మొరటుదనమనగ, 9 సిగ్గులేమి యనగ, 10
ఒరుల యడల తనయడల, సున్నితము కోల్పోవుట. 11
ముఖస్తుతివలన గౌరవము నశించు. 12
క్రోధ కాలుష్యమువల్ల కల్గు పాపయత్నములు. 13

406. (సంపదాదుల) గర్వముచే కల్గు ఆధిక్యబుద్ధి 14
కుశల గుణములపై అవజ్ఞయె అవిధేయత 15
మానము ఏడురూపముల నుండు,
ఒకటొక్కటిగ వివరింతు ఇంక ముందు.

407. అల్పునికన్న అత్యల్పుడనని,
సాటివారికి సరిసాటివాడనని,
అల్పునికి సముడననియో, అధికుడననియో,
భావించుటెల్ల స్వాతిశయములె. 1

408. తనకన్న సద్గుణ గరిష్ఠులౌ శ్రేష్ఠులతోడ
తన్ను సరితూగువానిగా పొగడుకొనుట, 2
అత్యున్నతుల కన్న ఉన్నతుడ ననుకొనుట
యిట్టి గుణములు గర్వాతి శయములౌను.

409. ఉన్నతునికన్న తా నత్యున్నతుడ ననుట, 3
గర్వమును మించి గర్వించుకొనుట,
యివియన్ని అపరిశుద్ధ దోషాలు.
పుండుపై లేచిన పొక్కులట్లు బాధించు

410. ఐదు శూన్యముల (స్కందముల) నుండి
అవిద్యచే 'నేను'ను భావించుకొనుట,
అదియె నిశ్చయమనుకొనుట,
చింతనాహంకార మౌను. 4

**411.** సాధన గమ్యము చేరకున్నగాని
ఫలములు పొందితి ననుట మిథ్యాగర్వము. 5
తన దోషకృత్యములను తానె
ప్రస్తుతించుకొనుట దుర్గర్వ 6 మందురు బుధులు

**412.** వ్యర్ధుడను నే ననుకొనుచు
తనను తా చిన్నపుచ్చుకొనుట,
న్యూనతామానము. 7
ఏడుమానముల సంగ్రహమిద్ది.

413 - 425. వంచన మొదలుగ - మరణస్మృతి లేకపోవటం వరకు దోషాలు మొత్తం 41.

**413.** గౌరవము కొరకొ, విషయలబ్ధికొరకొ
వివేకమును నిగ్రహించుకొనుటె కపటము. 16
గౌరవముకొరకొ, విషయలబ్ధికొరకొ
ప్రియములాడుట ముఖస్తుతి యౌను. 17

**414.** పరుల సంపద పొందనెంచి
దాని పొగడుట - వక్రసంపాదనగును. 18
వస్తుసంగ్రహణ మాశించి పరులను
ఎగతాళిచేయుట, పీడించి సేకరించుటౌను 19

**415.** పూర్వదానముల మరల మరల పొగడుట, 20
లబ్ధిపైన మరల లబ్ధిపొందనెంచుటె.
ఒరులుచేసిన తప్పులు మరల మరల
వల్లెవేయుటె దోషపునశ్చరణము. 21

**416.** పరుల యెడల నిగ్రహించలేని
స్వార్థోద్రేకమె అస్థిమితత్వము. 22
తమ అవగుణములను వదలక
సోమరిగ వ్రేలాడుటే ఉపాదానము. 23

417. రాగ ద్వేష మోహములచే భ్రాంతమైన
వర్తనమె - భేదభావమనగ. 24
మనసు దేనియందైనను నిలుపకుండుటె
మనసులోనికి చూపు సారించకుండుట. 25

418. అలసత్వముచేత ధర్మబద్ధ చర్యలపై
గౌరవాదరములు క్షీణించుట, 26
ధర్మాచార్యుదనంచు, లోకోత్తరుడౌ జినుని
విధములు కలవంచు, వంచించువారు కుజనులు. 27

419. వాంఛవల్ల కల్గు
స్వల్పబంధమె రాగము 28
అదియె ప్రబలమైన
దృఢబంధమౌ తృష్ణయగును. 29

420. స్వీయ సంపదపై వ్రేలాడు
అభిలాషయె లోభము. 30
అన్యుల సంపదను ఆశించుటె
అనుచితలోభము. 31

421. దూరము పాటించదగు స్త్రీలను కోర్కెతోడ
ప్రస్తుతించుట అధర్మ కామమగును. 32
పాపవాంఛతోడ లేని సుగుణములున్నట్లు
అభినయించుట కపటమగును. 33

422. తృప్తి నెరుగరాని సంపదలపై
లోభమె అత్యంత తృష్ణ 34
గుణగరిష్ఠుదననెడు ప్రసిద్ధి ఎట్లైన
పొందు కోర్కె లాభతృష్ణ యగును. 35

423. హానిని, బాధల, నోర్చుకొన
లేకుండుటే - అసహనము - 36
ఆచార్యుల, గురువుల చేతలను
గౌరవింప కుండుటయె - అనౌచిత్యము. 37

424. ధర్మానురూప హితవాక్యములు
మన్నింపకుండుట - ఉపదేశము నవజ్ఞచేయుట. 38
బంధుగణమును కలిసెడు వాంఛయె
సజాతీయులపై రాగబంధము 39

425. సంచయేచ్ఛచే గుణముల నాపాదించుట
వస్తు విషయములపై తృష్ణయగును. 40
మరణ చింతను మరువ యత్నించుట
అమరత్వ చింతనా చపలబుద్ధియే. 41

దేనినయినా యిష్టంతో ప్రోగు చేయటం (సంచయము) తృష్ణ అవుతుంది. మరణాన్ని మరచే ప్రయత్నం శాశ్వతత్వంమీద కోర్కె అవుతుంది.

426. తన జ్ఞాన సంపదలప్రదర్శనవల్ల ఎవరైన
గురువుగా స్వీకరించాలను వాంఛ ఉన్నపుడే
తన ఉత్తమ గుణాలను పరులకు
ప్రకటించాలను కోర్కె కల్గును. 42

427. వాంఛాప్రేరితమై చేయు సహాయము
రాగముతో కూడిన సంకల్పం 43
పరులకు హానిచేయుకోర్కె
ద్వేషప్రేరిత సంకల్పం 44

428. అయిష్టత, నిలకడలేని చిత్తం. 45
కలయికపైగల కోర్కెలు, కలుషచిత్తం 46
సోమరిదేహపు అలసట
ఏమీపట్టని నిరాసక్తత 47

429. దుఃఖోద్వేగాలు ప్రభావం చూపటంవల్ల
కల్గును శరీర వివర్ణత 48
అతిభోజనమువల్ల, శరీరమాద్యము వల్ల,
ఆహారముపై జనించును అనిచ్ఛ. 49

430. నిస్పృహచిత్తము భీతచిత్తములె
బలహీనమౌ మనసులు - 50
వాంఛలకై పరితపించుటయన్న
పంచేంద్రియ విషయములు వెంటాడుటయే. 51

శబ్ద - స్పర్శ - రూప - రస - గంధాలు విషయాలు (పంచతన్మాత్రలు) - శ్రోత, చర్మ, నేత్ర, జిహ్వా, నాశికాదులు పంచేంద్రియములు.

431. తొమ్మిది హేతువుల వల్ల పరులకు
తలపెట్టు హింసాభావ మంకురించు.
తనపై, మిత్రులు, శత్రువులపై, భూత, భవిష్యత్,
వర్తమానములపై నిష్కారణముగ వ్యాకులత జనించు. 52

432. మనసు - శరీరములు భారమై
కలుగు నిష్క్రియతయే మాంద్యగుణము. 53
నిద్రాసక్తియె మగత. 54
మనశ్శరీరముల అస్థిమితమె ఉద్రేకము. 55

433. దుశ్చర్యలకుపిదప పుట్టెడు
దిగులుచే కలుగు పరితాపమె పశ్చాత్తాపము. 56
ఆర్య సత్యములు - త్రిరత్నాదులపై
గలుగు ద్వైధీభావమె సంశయము. 57

(ప్రక్కన ఇవ్వబడిన 1-57 వరకు అంకెలు 402 పద్యంలో చెప్పిన దోషముల వరుస సంఖ్యలు)

సంగ్రహ వచనము -

434. శ్రావక బోధిసత్త్వులు వీని విడతురు.
దీక్షావ్రతులౌ శ్రమణగణము పూర్తిగ విడతురు
ఇట్టి దోషములను వీడి ముక్తులైన
సులభముగ సద్గుణము లాచరింపగలరు.

435. దానము, శీలము, శాంతము, యత్నము,
ధ్యానము, ప్రజ్ఞయు కరుణాది గుణములు

బోధిసత్త్వులు పాటించు సద్గుణములు
సంగ్రహముగ చెప్పెద నిప్పుడు

436 - 437 - మంచి గుణాలను గుర్తించటం.

**436.** తన సంపద నొరులకిచ్చునదే దానము 1
ఇతరులకు సాయపడునదే శీలము 2
క్రోధమును విడచుటే శాంతము 3
సుగుణముల యందుత్సాహమె యత్నము. 4

**437.** దుఃఖ రహితమౌ ఏకాగ్రతే ధ్యానము. 5
సత్యముల అర్థనిర్ధారణమే ప్రజ్ఞ. 6
సర్వజీవులపై దయతోడ మైత్రితోడ.
స్వాదువౌ చిత్తమె కరుణ యనగ. 7

విడి విడిగా సద్గుణ ఫలితాలు గుర్తించటం.

**438.** దానముచేత సంపద, నైతికతచేత ముదము,
శాంతమువల్ల రూపశోభ, శీలయత్నముచే ప్రకాశము,
ధ్యానమువల్ల శాంతి, ప్రజ్ఞవల్ల విముక్తి కల్గు.
అన్ని లక్ష్యములు సిద్ధించు కరుణవల్ల.

439. సాధారణ ప్రభావం -

**439.** పై చెప్పిన ఏడు గుణములు
సమగ్రముగా ఏకత్రసిద్ధింప
అమేయ ప్రజ్ఞయు
లోక రక్షకత్వమును గల్గు.

440 - 461 - దశభూమికల (దశపారమితల) లక్షణాలు

440. శ్రావక యానంలో ఎనిమిది ఉన్నట్లు మహాయానంలో పది బోధిసత్త్వ భూమికలున్నాయి.

**440.** శ్రావక యానమందు శ్రావకులకు
అష్టభూమికలను వివరించినట్లు,

బోధిసత్త్వులకు దశభూమికలు
వివరింపబడియె మహాయానమందు.

ఈ దశ భూమికలకు దశపారమితలకు సమానాంతర సంబంధం గుర్తించగలము.

**441.** బోధిసత్త్వులందరు సమ్ముదితులు గాన
వానియందు ప్రథమగణ్యము "ప్రముదిత" భూమి.
వారు మూడు సంయోజనలను విడచిపెట్టుదురు.
తథాగతుల పరంపరయందుద్భవించుదురు.

మూడు సంయోజనలు- సత్త్వులను సంసార చక్రానికి బంధించే సంయోజనలు 10. వానిలో మొదటి మూడు 1. సత్కాయదృష్టి, 2. విచికిత్స, 3. శీలవ్రత పరామర్శ.

**442.** సద్గుణరాశి పరిపక్వమౌటచేత
దానపారమిత మిగులశ్రేష్ఠ స్థితినొందు.
నూరు లోకములందు ప్రతిధ్వనించు.
ఏలికయౌదురు జంబూద్వీపమునకు.

**443.** కాయము, వాక్కు, మనములందు
స్వభావ నిర్మలత్వమున
దశశీలములు పాటింతురుగాన,
రెండవది విమలభూమి.

**444.** ఆ గుణములన్ని పరిపక్వమౌటచేత
శీలపారమిత మిగుల శ్రేష్ఠ దశనొందు.
విశ్వవిభుడౌను, జీవులకు సాయపడుచు
చతుర్భువనములకు శ్రేష్ఠ నిధు లేడింటికధిపుడౌను.

చతుర్భువనములు సుమేరు పర్వతమునకు నాల్గువైపులన్న దేశములు - 1.జంబూ, 2. పూర్వవిదేహ, 3. అపరగోదాన, 4. ఉత్తరకురు.

సప్త నిధులు : స్వర్ణ, రజత, మౌక్తికాదులు, ఇవ్వి - శ్రద్ధ, వీర్య, హ్రీ, దుశ్శీల నిరోధము, స్మృతి, సమాధి, ప్రజ్ఞాది సామర్థ్యములకు సంకేతములు.

445. ప్రశాంతినిచ్చు జ్ఞానకాంతి కల్గుటచేత
మూదవ భూమిక ప్రభాకరియౌను.
ధ్యానాలు, దూరశ్రవణాలు వ్యక్తమౌను
రాగాలు ద్వేషాలు పూర్తిగా దూరమౌను.

446. ఈ గుణములన్ని పరిపక్వమౌటచేత
తీవ్రసాధన చేయును క్షాంతి గుణము.
వాంఛలన్నిటి పూర్తిగా క్షయమొనర్చి
దివ్యులకు జ్ఞానియౌ సార్వభౌముదగును.

447. సంబుద్ధికి సహకరించు ప్రత్యయముల
నన్నింటి నతిశ్రేష్ఠముగ నాచరింప,
నిజమగు ప్రజ్ఞాతేజము ప్రభవించుగాన
నాల్గవది అర్చిస్మతి యనిరి.

448. ఈ గుణములన్ని పరిపక్వమౌటచేత
'యామ'మను స్వర్గమున దేవతలకు ప్రభువులౌదురు.
"క్షణిక సంస్కారములె నిత్యమైన నేను"
అనెదు దృష్టిని త్రుంచెదరు కుశలమతులు.

449. వీరి జయింప దుఃఖముల కసాధ్యముగాన
సుదుర్జయమన్నది ఐదవభూమిక.
ఆర్యసత్యముల సూక్ష్మార్థములు
తెలియగ మిగుల నేర్పరులు వారు.

450. అన్నిగుణములు పరిపక్వమౌటచేత,
'తుషిత' మను స్వర్గమందలి దేవతలకు
అతడు రాజౌను. తైర్థికుల అపదృష్టులను
దుఃఖమూలముల నన్నింటి అధిగమించు.

451. బుద్ధుని శుభగుణములకు సమీపగతు
లగుటజేసి ఆరవభూమికను "అభిముఖ"మనిరి.
ప్రశబ్ధికి - సమాధికి అర్పితుడౌట వలన
నిరోధమును జేరి (ప్రజ్ఞయందు) పురోగమించు.

452. ఈ గుణములన్ని పరిపక్వమగుటజేసి
రాజౌను 'నిర్మాణరతి' యను స్వర్గమందు.
శ్రావకులు వారిని మించలేరు.
అణచగలరు ఆధిక్య గర్వమతుల.

453. సుగుణము లధికమై విస్తరిల్లునట్టిది
'దురంగమ" మన్న ఏడవభూమిక.
క్షణ క్షణమునకు వారు
నిరోధమందు సమత్వమందగలరు.

454. ఈ గుణములన్ని పరిపక్వమగుటచేత
రాజులౌదురు 'పరనిర్మితవశవర్తి' స్వర్గమందు.
ఆర్యసత్యములందు స్వయముగా సిద్ధి పొందిరి
గనుక, ఆచార్యులకుగూడ నేతలౌదురు.

455. అష్టమము - 'అచల'మన్న ఉల్లాసభూమిక
వితర్క రహితమగుటచేత 'అచల'మందురు.
వారి మనోవాక్కాయ చర్యలను
గురించి భావింప నతీతులువారు.

456. అట్టి గుణములు పరిపక్వమౌటచేత,
వేయిలోకాలకు విభుడై బ్రహ్మయౌను.
హీన యానులు - మార విజయులు
సాటిరారు వీరికి ధర్మార్థ నిర్ణయమున.

457. నవమ భూమిక 'సాధుమతి' యనబడును.
రాజ్యపాలకునకు వోలె సాధ్యమౌను
స్వీయప్రత్యేకబోధి.
అంతట 'సాధుమతి' భూమిక సిద్ధించగలదు.

458. అట్టి సుగుణములు పరిపక్వమౌటచేత
లక్షలాది లోకముల కధిపతియౌ బ్రహ్మ యగును.
సత్వ జీవుల చింతలు శంకలు దీర్ప
వీరికి సాటిరారు మారవిజేతలవంటివారు.

**459.** పవిత్ర ధర్మమును వర్షించుగాన
దశమ భూమికను "ధర్మమేఘ"మనిరి.
బోధిసత్త్వ లభిషిక్తులౌదురు
బుద్ధుల కాంతిచేత.

**460.** అట్టి సుగుణములు పరిపక్వమగుటచేత
శుద్ధభూమి "సుఖావతి" దేవతలకు
వారు ప్రభువులౌదురు
అవధిలేని జ్ఞాన భూమికి అధిపతులువారు

సారాంశం - బుద్ధుని అనంత శుభగుణములు - దశబలముపై నిలిచినవి.

**461.** ఈ పది భూమికలు విఖ్యాతములు
బోధి సత్త్వదశభూమికలను పేర.
బుద్ధత్వస్థితి వీనికన్న వేరయినది.
అన్నివిధముల ఊహింపనలవిగానిది.

462 - 463 - బుద్ధుని ప్రతి శుభగుణము అనంతమే
వాని అనంతత్వానికి ఉదాహరణలు

**463.** బుద్ధుల శుభగుణములు
ఆకాశము, భూమి, జలము, అగ్నివోలె
అన్నిదిక్కులందుండు వాయువువోలె
అపరిమితములు.

464 - 468 - పుణ్యహేతువుల అపరిమితత్వమే, బుద్ధుని గుణముల అపరిమతత్వానికి కారణం.

**464.** బుద్ధుల గుణహేతువులను లెక్కించి మితముచేసి
అపరిమితముగ చూడకున్న
బుద్ధుని (శుభగుణముల) అనంతత్వమును
విశ్వసింపరెవరు.

అనంత పుణ్యాన్ని సేకరించే విధానం.

**465.** బుద్ధుని ప్రతిమముందో
స్థూపమో మరిదేని ముందోనిలచి
ఈ ఇరువది పద్యములు మనన చేయుము
ప్రతి దినము మూడుసార్లు.

466 - 468 - ఏడు శాఖల గురించి సంగ్రహ వివరణం.

**466.** బుద్ధుని ధర్మమును సంఘమును
బోధిసత్త్వులను అర్హతులందరను
సమస్త గౌరవముతోడ
శిరసువంచి శరణువేడెద.

**467.** అకుశల కర్మల నాచరించను.
పుణ్యకర్మల శ్రద్ధగ ఆచరింతును.
సర్వజీవుల పుణ్యములను
ప్రస్తుతించును.

**468.** ధర్మచక్రము ప్రవర్తించుచు
జీవులకు జన్మపరంపర ఉన్నంతవరకు
తాముందురు గాకయని రెండుచేతులు చేర్చి
శిరసువంచి బుద్ధుల వేడుకొందు.

469 - 485 - అనంత జీవులకు సాయపడే ఆకాంక్షవలన పుణ్య హేతువులు గూడ అనంతము.

**469.** ఇట్లు వేడుతున్న పుణ్యమువలన,
నేను చేసిన చేయబోవు పుణ్యమువలన,
మనసున్న జీవులందరు
సమ్యజ్ఞానము నాకాంక్షింతురు గాక.

**470.** చిత్తజీవులందరకు కలుష రహితమౌ
శక్తి కలుగుగాక - అవిరత ప్రత్యయముల నుండి
ముక్తి కలుగుగాక - ఆచరణ యందు స్వేచ్ఛ కలుగుగాక
సమ్య గాజీవిక కలుగుగాక

ప్రత్యయములు - హేత్వాది ప్రత్యయములు 24. అవి భవపరంపరకు కారణమయ్యే నిర్విరామ శృంఖలలు.

**471.** శరీరధారులందరి హస్తములలో
రత్నములుండుగాక.
వారి జన్మచక్రము సాగుచుండువరకు
అసంఖ్యేయ జీవితావసరములకు కొరత రాకుండుగాక.

**472.** సర్వజీవు లెల్లపుడు
ఉత్తమ మనుష్యులై జన్మింతురు గాక.
* శరీర ధారులందరకు ప్రజ్ఞ కలుగుగాక.
శీలము ఆలంబమై నిలతురుగాక.

* (స్త్రీలందరు - అని వేరొక అనువాద పాఠం)

అనుత్తర యోగతంత్రంలో నాగార్జునుని అభిప్రాయానుగుణంగా అనువదించబడింది (ఆంగ్లవ్యాఖ్యాత)

**473.** మేలైన మేనిచాయ - దృఢకాయము
ఘనవర్చస్సు, రమ్యరూపము, అరోగత,
బలము, దీర్ఘాయువు
శరీర ధారులందరకు కలుగుగాక.

**474.** (దుఃఖనివారణ) మార్గమందు నిపుణతయు,
దుఃఖముల నుండి విముక్తి,
త్రిరత్నములందు సంలగ్నత కలుగుగాక.
బుద్ధ ధర్మసంపద చేకూరుగాక.

**475.** మైత్రి, కరుణ, ముదిత, సమత
వీరి నలంకరించుగాక.
దుఃఖభావములు తొలగుగాక - కలుగుగాక
దానశీలములు, క్షాంతివీర్యము, ధ్యానము ప్రజ్ఞయు.

**476.** పుణ్యము, ప్రజ్ఞయు నిండుగ పొంది
బుద్ధుల మహాపురుష లక్షణము, లుపలక్షణములు

వారందరు పొందుదురుగాక.
పది అగోచరస్థితులను నిరాటంకముగ తరింతురు గాక.

477. వీని తోడుగ ఇతర శుభగుణములు
నన్నుగూడ అలంకరించుగాక.
అన్ని దోషములనుండి విముక్తుడనై
చేతసులందరిపై గాఢమైత్రి కలుగుగాక.

478. చేతసులందరు ఆశించు
శీలములన్నిటిలోన పారమంటెదనుగాక.
శరీర ధారులందరి దుఃఖములు
సర్వదా నేను తొలగింతును గాక.

(చేతసులు = చిత్తమున్న జీవులు; సత్త్వములు)

479. భయముచే క్లేశపడుచున్న
సర్వలోకముల జీవులందరకు
నాపేరు విన్నంతనే పూర్తిగా
భయము తొలగుగాక.

480. నన్ను చూచినంత తలచినంత
పేరువిన్నంత, అమిత సంతోషము,
సహజత్వము, దోషరహితత్వము
సమ్యక్ జ్ఞానసిద్ధిపై నమ్మిక కలుగుగాక.

481. ఐదు అతీంద్రియ శక్తులు
అన్ని జన్మలందు అసాంతము కలుగుగాక.
సర్వదా, సర్వథా చిత్తజీవులకు
సహాయము, సంతోషము కూర్చుదును గాక.

482. దుష్కార్యము తలపెట్టు
సర్వలోక సర్వజీవులకును
హాని కలుగకుండ వెనువెంటనే
నిలువరించెదను గాక.

483. చిత్తజీవులందరకు, వారి అభిలాషమేరకు,
ఎల్లవేళల నేను సంతోష విషయ మౌదునుగాక.
భూమి, జలము, వాయువు, అగ్ని, అకాశము
ఓషధులు వనములవలె జోక్యము లేక ఉండుగాక.

484. జీవులకు తమ జీవితములవలె నేనును ప్రియమౌదుగాక.
వారు నాకు అంతకన్న ప్రియమౌదురుగాక.
నాయెడల వారి అకుశములు సఫలమౌనుగాక.
వారియడల నా శుభకామనలు సఫలమౌను గాక.

485. ఎక్కడ ఏ జీవుడు ఎంతకాలము
ముక్తిని పొందడో అంతకాలము, నాకు
జ్ఞానసిద్ధి కలిగినను, వారికొరకు
ఇక్కడనె ఉండిపోదునుగాక.

సుగుణముల అనంతపుణ్యము

486. ఇట్లు ప్రార్థించుటచేత కల్గు పుణ్యము
మూర్తి మంతమయ్యేనేని, గంగాసైకత
రేణువుల కన్న అసంఖ్యాకములౌ
లోకములంతట నింపినా చాలదనియె తథాగతుడు.

487. అందుకు హేతువిట్లు చెప్పె జినుడు
అసంఖ్యాక లోకములలోని
అసంఖ్యాక జీవులకు చేయదలచిన
పుణ్యము ఆ జీవుల సంఖ్యవలె అనంతము.

488 – 500 – ఉప సంహారము

488 – 490 – ధర్మాభ్యాసం కొరకు ఉత్సాహప్రేరణ – చతుర్విధ అభ్యాసాలు.

488. సంగ్రహముగ నీకు వివరించిన
ఈ అభ్యాసములు ప్రియము కావలెను.
నీకు నీదేహము ఎల్లపుడు
ప్రియమైనయట్లు.

489. వీని ఆచరణపై ప్రీతి పొందినవారు
తమ దేహములపై గూడ ప్రీతి పొందెదరు.
దేహప్రీతి అందులకు సాయపడునేని
ఈ అభ్యాసములు గూడ అట్లె ఉపకరించు.

490. నీపై నీవు శ్రద్ధ చూపుకొన్నట్లు అభ్యాసములపై చూపుము.
నీ అభ్యాసాలపై శ్రద్ధ చూపినట్లె - విజయములపై చూపుము.
నీ విజయములపై చూపుశ్రద్ధను జ్ఞానముపై చూపుము.
జ్ఞానముపై చూపినట్లు - జ్ఞానులపై శ్రద్ధచూపుము.

491 - 493 - ఆచార్యులపైన, వారి అర్హతలపై శ్రద్ధ చూపకపోవుట వల్ల కలిగే దోషాలు.

491. నిర్మలత్వము, మైత్రి, ప్రజ్ఞాహితమతి
శుద్ధవాక్కు కలవారి చేయూత
మేలుకూర్చదని వ్యాకులపడువారు
తమకు తామె చేటు తెచ్చుకొందురు.

492. ధర్మాచార్యుల అర్హగుణములు
సంగ్రహముగా నెరుగవలయు.
తృప్తాత్ములు, కరుణాళువులు, శీలవంతులౌ
విబుధుల బోధపొందుము.

494 - 497 - శ్రేష్ఠవర్తనతో పరమఫలము

493. దుఃఖవేదనలను పోకార్చువారి
జ్ఞాన బోధనెరిగి గౌరవించుము.
ఇట్టిశ్రేష్ఠ విధుల నెరిగి ఆచరింప
పరమోన్నతి కలుగు నీకు.

494 - 497 - ప్రవర్తనా విధి.

494. సత్యమే పలుకుము - మృదువుగ మాటాడుము
సత్వులతోడ ప్రసన్నముగ, సహజముగ పల్కుము
అచితూచి మాటాడుము - తలచకు మపకీర్తి
స్వతంత్రముగ మాటాడుము - స్వచ్ఛముగ నుండుము.

495. సుశిక్షణతో - తృప్తి ఔదార్యములతో
రుచిర స్ఫురణతో, శాంతమనస్సుతో,
ఉద్విగ్నత - అలసత్వము - దంభము లేక
దృఢ నిశ్చయముగ నుందుము.

496. పూర్ణచంద్రునివోలె ప్రసన్నముగ,
శరత్కాల సూర్యునివోలె కాంతితోడ,
సముద్రము వోలె గంభీరముగ,
మేరువువోలె సుస్థిరముగ నుందుము.

497. సర్వ దోషవర్జితుడవై,
సర్వగుణాలంకృతుడవై,
సర్వ సత్వములకు పోషకుడవై
సర్వజ్ఞుడవై యుందుము.

498. ఈ ధర్మములు రాజునకు మాత్రమే కాదు - జనులందరకును.

498. ఈ ధర్మబోధ రాజులకు మాత్రమె
సాయపడుటకు కాదు.
చిత్తమున్న జీవులందరకు బోధింపబడియె
వారికుచిత రీతి నుపకరించు కొరకు.

499. అధిప! అనుదిన మీబోధ
మనన చేయదగును, అందుచే
నీవును తోటివారును
పూర్ణమౌ ప్రజ్ఞపదయగలరు.

500 - యోగ్యమయిన సుగుణ సంపత్తి.

500. సంబుద్ధి పొందగ సాధనాపేక్ష
కలవారు వీనిని పాటింపవలయు.
అనసూయ, శీల, మాచార్య గౌరవము,
లోభరాహిత్యము, మదిలోన శాంతి,

ఫలకాంక్ష లేనట్టి బోధిచిత్తమ్ము
ధనమిచ్చి ఆర్తులకు చేయూతనిచ్చి
ఆదుకొనుట, సాధుసంగతి, అసాధు
వర్జన, శ్రద్ధగా పాటింపవలయు.
పూర్తిగా ధర్మము నెరవేర్చవలయు.

*ఆచార్య నాగార్జున విరచితమయిన 'రత్నావళి'యందు చివరిదైన*
*బోధిసత్వ చర్యలనెడు ఐదవ పరిచ్ఛేదము సంపూర్ణము*

మూల సర్వాస్తివాద సంప్రదాయానుసారం

ఆచార్య నాగార్జునులవారు రచించిన

"శిష్యలేఖ' అనెడు

# శ్రమణేర కారిక

లామా "మిపామ్" ప్రవచనం అనుసరించి

సమంత ధర్మకీర్తి రచించిన

## రత్నమాలావ్యాఖ్య

ద్రి కుంగ్ కార్గ్యు ఆచార్యులు కొంచొక్ గ్యత్సెన్ ఉపదేశాన్ని అనుసరిస్తూ

టిబెట్టు భాష నుండి ఇంగ్లీషుకు అనువదించినవారు

గెలెన్ హెబ్ ముల్లిన్

తెలుగుసేత

వావిలాల సుబ్బారావు

# అనువాదావసరం

ఈ శ్రమణేర కారికలను "శిష్యలేఖ" అనిగూడ వ్యహరిస్తారు. 'శ్రమణేరులు' అంటే భిక్షుదీక్ష తీసుకుని గురువులవద్ద శిక్షణాదశలో ఉన్నవారు. వీరు ఆరామాల్లోనో గురువులవద్దనో ఉన్నపుడు దినకృత్యం ఎట్లాగడపాలో, గురువులవద్ద, పెద్దలవద్ద ఎట్లా విధేయతతో మెలగాలో తెలియచేసే శిక్షాగ్రంథం ఇది.

దీనిని నాగార్జునాచార్యులవారు వ్రాసినట్లు భావిస్తారు. టిబెట్టు దేశంలో "సుహృల్లేఖ" అందరకు పాఠ్యగ్రంథం. "శ్రమణేర కారికలు" ఆ దేశంలోని నాలుగు శాఖల ఆరామాలలోను దీక్ష తీసుకున్న వారందరకు పాఠ్యగ్రంథం. ఈశిష్యలేఖ నాగార్జునకృతం అనటంలో అభిప్రాయ భేదాలున్నాయి. కొందరు అంగీకరించటంలేదు. అయినా టిబెట్ దేశంలో మన్నన పొందుతూ ఆచార్యుని రచనగా సంప్రదాయం గౌరవిస్తూ ఉండటంవల్లను. 'లేఖ' అనే పేరుతో ఆచార్యుని లేఖాశీర్షికన పరిగణించే వీలున్నందువల్లను, తెలియదగిన అంశాలు ఉండటంవల్లను, ఈ సంపుటంలో చేర్చాను.

టిబెట్టు దేశంలోకి ఏడవ శతాబ్దంలో బౌద్ధం ప్రవేశించింది. ఆతర్వాత ఒక శతాబ్దానికిగాని, భిక్షుదీక్షలు, శిక్షణలు, ఆరామ నియమాలు ప్రారంభం కాలేదు. భారతీయ బౌద్ధాచార్యుడయిన 'శాంతరక్షత', ఆరామ విధానం ప్రారంభించటంతో శిక్షణలు ప్రారంభం అయినాయి. అప్పటినుండి వినయ సంప్రదాయం టిబెట్టులో భద్రంగా ఉంది. వారికి "శ్రమణేర కారికలు" ప్రథమ పాఠ్యగ్రంథం. అయితే ఆచార్య నాగార్జునుడు రచించిన సంస్కృత మూలం ఆ దేశంలో గూడ లేదు. టిబెట్టు భాషానువాదమే ఆధారం.

19వ శతాబ్దానికి చెందిన "లామా మిపామ్‌రింపోచా" గారు ఈ కారికలపై ప్రవచనం చేయగా, వారి శిష్యులయిన సమంత ధర్మకీర్తి ఈ "రత్నమాలావ్యాఖ్య" సమకూర్చారు. ఈ కారికలు, వాని వ్యాఖ్యానం, ప్రధానంగా శ్రమణేరుల శిక్షణకే ఉద్దేశించినా ఇందులో అందరూ పాటించదగిన మర్యాదా పద్ధతుల, పెద్దలయందు చూపే గౌరవం, సదాచారం వంటివి, ఇళ్లల్లో పెద్దలందరూ పిల్లలకు నేర్పవలసినవి ఉన్నాయి. వినయానికి ప్రధాన ప్రయోజనం శ్రద్ధావీర్యములను

పెంపొందించుకోవటం. లక్ష్యసాధనకై ప్రయత్నించే ఎవరికయినా శ్రద్ధావీర్యములు ఆవశ్యకములే. కనుక ఇందులోని కారికలను తమ తమ ప్రత్యేక అభ్యాసాలకు అన్వయించుకుని ఆచరించవచ్చు.

టిబెట్టు దేశ బౌద్ధ సంప్రదాయంలో 'వినయ' గురించి, ఆరామాలలో శిక్షణ గురించి, థేరవాదులకు, పాశ్చాత్య బౌద్ధ పండితులకు కొన్ని అపోహలు ఉన్న కారణంగా వాటిని నివృత్తిచేసే ఉద్దేశంతో ఈ కారికలను ఇంగ్లీషు భాషలోకి అనువాదం చేయాలని ఆచార్య 'గ్యాల్ట్సన్' గారు సంకల్పించారు. జి. హెచ్. ముల్లిన్ గారు నెరవేర్చారు – ఇంగ్లీషు అనువాదానికి వీరువ్రాసిన ముందుమాటల నుండి సేకరించిన సమాచారంతో ఈ నాల్గుమాటలు వ్రాస్తున్నాను.

– వావిలాల సుబ్బారావు

# శ్రమణేర కారిక

## రత్నమాలా వ్యాఖ్య

ఓమ్ స్వస్తి

ప్రజ్ఞలకెల్ల మూలమయిన ప్రాతిమోక్షమున
పండితులైన మునులకు ప్రణామపూర్వకముగ
ఆచార్య నాగార్జున విరచిత శ్రమణేర కారికలకు
"రత్నమాలా" వ్యాఖ్యను సమకూరుస్తున్నాను.

50 శ్లోకాలున్న శ్రమణేర కారికలకు చేస్తున్న ఈ వ్యాఖ్యానంలో భిన్న కాలాలలో – భిన్న జీవన రీతులపై ఆధారపడి శ్రమణేరులు శిక్షణ కాలంలో (నిషేధాలను అధిగమిస్తూ, అనుకూలవిధుల సహాయం పొందుతూ) ఎట్లా నిర్వహించుకోవాలో – నాలుగు శీర్షికలుగ వివరింపబడింది.

ఆ నాల్గుశీర్షికలు ఏవనగా – 1) శీర్షికా వివరణం, 2) అనువాదకుని అభివాద వాక్యం, 3) మూలవాచకం (ఆచార్యుని కారిక), 4) సమాపన వాక్యం.

**శీర్షికా వివరణం :** "ఆర్యమూల సర్వాస్తివాద శ్రమణేరకారిక" అన్నది సంస్కృత శీర్షిక –

**ప్రతిపద వివరణ :** ఆర్య=ఉన్నత, ఉదాత్త; అతీత అన్నవి అర్థాలు, ఉన్నత=దేనివలన ఉన్నతులు అంటే, మనసుచేత గ్రహింపదగిన విషయములను గూడ, అతీతించి పరిణమించిన వారగుటచేత ఉన్నతులు.

**మూలసర్వాస్తివాదము :** ఇది ప్రాచీన భారతదేశంలో థేరవాదులలో ఒక శాఖ; "సర్వమూల విషయములను వివరించి చెప్పుట" – అని అర్థం. భూత, భవిష్యత్, వర్తమాన కాలములందు, రూప, చిత్త, చైత్త చిత్త చైత్త – విపర్యుక్త – సంస్కార – అసంస్కార – అనే ప్రధాన సంస్కారాల రూపంలో అస్తిత్వం

---

పూర్వశాస్త్రాలను వివరించేటపుడు ఒక నిర్దిష్ట విభజన పాటించటం – శాస్త్ర మర్యాద. రచయిత ఉద్దేశం చెప్పటం, కారికలోని ప్రతిపదాన్ని వివరించటం. దీన్ని పదసార్థక్యం అంటారు. అవసరమయినచోట 'దళ' సార్థక్యం – ఆపైన వ్యాఖ్యానం.

తెలియబడుతుంది. ఇందులో ప్రాథమిక, మౌలిక అంశాలను వివరించేది మూలసర్వాస్తివాదము - అని శబ్దార్థము.

**శ్రమణేర కారిక :** (సూత్రాదులను వివరిస్తూ రచించిన శ్లోకాన్ని కారిక అనటం శాస్త్ర పరిభాష. సూత్రంకన్నా విపులంగా, వ్యాఖ్యానంకన్న సంగ్రహంగా ఉండే శ్లోక రచన - తె. అను).

ధర్మగ్రంథాలను వరిస్తూ, ధ్యానాదులుచేస్తూ, తనకు తాను అన్వయించుకుంటూగాని, ఆచార్యుని వద్ద శుశ్రూష చేస్తూగాని ఉన్నవారికి (శ్రమణులకు) సర్వాస్తివాద సంప్రదాయంలో వ్రాసిన (శ్లోకము) కారిక. ప్రవ్రజ్య తీసుకొని బౌద్ధ సంఘంలో కొత్తగ చేరిన భిక్షువు శ్రమణేరుడు. భిక్షుణి అయితే శ్రమణేరి అంటారు.

**అనువాదకుని అంజలి :** సంస్కృతము నుండి టిబెట్టు భాషలోనికి అనువదించిన వారికి ప్రణామాంజలి.

"ఆ సర్వజ్ఞునకు సవినయంగా అంజలిస్తున్నాను".

ఈ రచన వినయ విభాగమునకు చెందినది (స్వయంశిక్షణ). కార్యకారణ స్వభావమును గురించి అతి సూక్ష్మాంశములను గూడ సాకల్యముగా ఎరిగిన సర్వజ్ఞులయిన బుద్ధులకు వినయాంజలిని అర్పిస్తున్నాడు.

కారికల ప్రవేశములో రెండు అంశాలు రచించబడుతున్నాయి. ముందుగా అభినందన - పిదప రచనా సంకల్పము వెల్లడించుట.

**అభివాదము :**

**సర్వజ్ఞులయిన బుద్ధులకు,**
**ధర్మమునకు, ఆర్యసంఘమునకు**
**ప్రణమిల్లుతున్నాను -**

ప్రతిపద వివరణము : బుద్ధులు సర్వజ్ఞులు గనుక సర్వరక్షకులు. దుఃఖము నుండి, మూడు అధోలోకముల నుండి రక్షించుదురు. తెలియదగిన సర్వాంశములను, ఆమూలాగ్రముగ నెరిగి తుదివరకు ప్రయాణించిరి గనుకను, పరమార్థ సత్యమును, వ్యావహారిక సత్యమును, యథాభూతస్థితిని, అనంత వైవిధ్యమును సమగ్రముగ ఎరిగిన వారు గనుకను సర్వజ్ఞులు.

ధర్మము : ప్రమాణ గ్రంథము లందున్న విషయములను, జ్ఞానసిద్ధి పొందిన వారి అనుభవమును – ధర్మము అని వ్యవహరింతురు.

ఆర్యశ్రావక సంఘము : శిక్షణ పొందుతున్న వారు మరియు శిక్షణా దశను అధిగమించిన వారు.

**– : మూలవాచకము : –**

**రచనా సంకల్పము :**

**శ్రమణేర శిక్షావినయమున**
**కొన్నింటి వివరింప యత్నింతును. 2**

విడువవలసిన నిషేధములను – ఆచరింపవలసిన విధులను ధర్మగ్రంథ సాగరం నుండి కొన్ని బిందువులను సమకూర్చి, సంక్షిప్తముగా మూల సర్వాస్తివాద పరిపాటి ననుసరించి ఈ శ్రమణేర కారికలను వివరిస్తున్నాను.

ఈ గ్రంథంలోని ప్రధాన భాగంలో రెండు విభాగాలున్నాయి.

1. వినయాన్ని సంరక్షించవలసిన ఆవశ్యకతను గూర్చిన ఉపదేశం.
2. అది నెరవేర్చే విధంగూర్చి విస్తృత వివరణ

**– ఆవశ్యకత –**

**శాక్యసింహుని బోధయందు శ్రద్ధవలన**
**దీక్ష స్వీకరించినవాడు, దృఢనియమముతో**
**తమ శరీరములపై తాము జాగ్రత్త వహించినట్లు,**
**తన శిక్షణను గూర్చి జాగరూకుడై శ్రద్ధ వహించు. 3**

'బోధ యందు శ్రద్ధ అనగా – చతురార్య సత్యములు – కర్మ – దాని ఫలము – మొదలగు బోధల గురించి వాస్తవ అనుభవము పొందుటకు గాఢనిశ్చయము – అభినివేశము కలిగి ఉండుటే శ్రద్ధ అనబడును.

**శాక్యసింహుడు :** – శాక్యముని బుద్ధుడు, శాక్యవంశ రాజకుమారుడు. మనోవైకల్యాలను, అసత్య తత్త్వసిద్ధాంతాలను సమయింప జేసిన సాహసవంతుడు గనుక "సింహుడు".

దీక్షను స్వీకరించినవాడు = శిరోముండనము - గడ్డము చేయించుకొని, కాషాయ వస్త్రములు ధరించి, ఆగారము (ఇల్లు) విడచి, అనాగారకుడు (ఇల్లు విడచినవాడు) అయినవాడు.

శ్రద్ధవలన : - సమగ్ర ప్రేరణతో శిరోముండనాది క్షురకర్మలు చేయించుకొనటం, దీక్షావస్త్రములు ధరించటం సమగ్రమయిన క్రమశిక్షణను తెలియచేస్తుంది. ఆవాసము నుండి నిర్వాసము (ఆగారము నుండి అనాగారము) లోకి వెళ్లటం. సమగ్ర పరిస్థితిని తెలుపుతుంది.

**శ్రమణ దీక్షను స్వీకరించుట : -** సమగ్ర ఆచరణను తెలుపుతుంది. ఇట్లాంటి శ్రమణుడు విపస్సనను, అంతర్ముఖత్వాన్ని నిరంతర అభినివేశంతో సాధనచేస్తూ నాలుగు ప్రాధమిక విధులను, ఆరు అనంతర విధులను జాగ్రత్తగా స్వల్పమయిన నియమాతి క్రమణమయిన లేకుండా శ్రద్ధ వహించాలి.

ఫలవృక్షాన్ని కాపాడటానికి చుట్టూ కంచె వేసినట్లు నియమాలను కాపాడటానికి స్వీయ నియంత్రణ అవసరం. తన శరీరానికి అపాయకరమయిన దాన్ని పరిహరించుకున్నట్లు శిక్షణను గూడ రక్షించుకోవాలి.

**విధానం : -**

నియమాలను నెరవేర్చే విధం గురించి ఐదు భాగాలుగా విస్తరించి వివరించుట.

1. ఉదయ విధులు, 2. ఆహారానంతరం విధులు

3. నిత్యశిక్షణా వివరణ 4. సాయంత్రవిధి

5. వీటిని పాటించుటవల్ల కలిగే ఫలిత ప్రశంస.

**ఉదయ విధులు :**

రాత్రి చివరి భాగమున నిదురలెమ్ము
సూర్యోదయము వరకు సూత్రపారాయణ చేయుము

---

మొత్తం 36 విధులు శ్రమణేరులు - భిక్షుణిలు పాటించాలి. అందులో 10 మూలనియమాలు. ఆ పదింటిలో 4 ప్రాధమిక విధులు. 6 అనంతర విధులు. ఇవి గౌణములు - ఈ పదిమూల నియమాలే ఈ శ్రమణేర కారికలకు ప్రధాన విషయం

దంతధావన, ప్రక్షాళనములు చేసుకొనుము
సమ్యక్ సంబుద్ధునకు ప్రణమిల్లుము 4

రాత్రి చివరిభాగం అంటే, రాత్రిని ఐదుగా విభజించగా అందులో ఐదవ భాగము. అరుణోదయము (వేకువజాము) నుండి సూర్యోదయము వరకు ఉండు సమయము. రాత్రి చివరిభాగము.

సూత్రపారాయణ : – పారాయణచేసే సూత్రాలను ఎంపిక చేసుకొని బిగ్గరగా పఠించాలి. నీ సాధనా ప్రయత్నము అంతా సర్వజీవుల క్షేమం కొరకు అర్పణ చేయాలి.

సమ్యక్ సంబుద్ధుడు : – ప్రతికూలములైన వానిని పరిహరించుటలోను, జ్ఞానమును, శక్తిని పొందుటలోను, పారమును (చివరి స్థితిని) పొందిన వారుగనుక "సమ్యక్" విశేషణము. అవిద్యా తమస్సు నుండి మేల్కొన్నవారు గనుకనూ, తెలియదగు సర్వవిషయ జ్ఞానమును పొందినవారు గనుక "సంబుద్ధులు" –

గురువు నివాసద్వారము మెల్లగా తట్టుము,
సవినయముగ క్షేమము నడుగుము,
మండలమందు వాడెడు నీటిని శుభ్రముగ
పై నుండి అడుగువరకు అల్చిప్ప సాయమున వెదకుము. 5

అట్టి సాధనము లేకున్నచో దోసిలితోగాని,
ఆకు దొప్పతోగాని, అట్లు చేయదగును.
కీటకములు లేకుండ చూచి ఘటము నింపుము.
అతివేగపడక – కీటకము లుండునేమొ –
వడపోయుము, వాని కెట్టిహాని కలుగకుండ.
కరుణగలవారు చూచిచూచి గదా
ద్రవములు పుచ్చుకొందురు!

గురువు : – విహారమండలి పెద్ద – లేక – శిక్షణ ఆచార్యుడు.

అల్చిప్ప : – లోపల మెరిసేతెల్లదనం ఉండటంవల్ల మాలిన్యాలు స్పష్టంగా కనిపిస్తాయి.

**అతివేగపడక :** - కంటికి శ్రమకలిగే ఏకాగ్రదృష్టితో. నీటిలో ఉండదగు కొద్దిపాటి కీటకములకు గూడ హాని కలుగకుండ ఉండటమే ఫలితం.

**మండలము :** - ఎత్తయిన వేదిక - బుద్ధప్రతిమవద్ద పూలు, అగరువంటి సుగంధ ద్రవ్యములుంచే వేదిక.

**బాగా వడబోయటం :** - ఐదు విధములయిన పద్ధతులలో ఏదైన ఒక పద్ధతిలో వడబోయటం.

**హానికలుగకుండ :-** నీటిలో ఏదయినా కీటకము కనిపించినట్లయితే దానికి హాని కలుగకుండా బయటకు తీయాలి. దానికి సహజమైన పరిసరాలలో విడచిపెట్టాలి. అనువుగాని పరిసరాలలో ప్రమాదం రాకుండా కాపాడాలి. ఎన్ని జీవులకు అపకారం చేస్తే అన్ని నియమాలు భంగం చేసినట్లు, కనుక నీటిపాత్రపై మూత లేకుండా ఎప్పుడూ ఉంచరాదు.

**ఎట్టి పరిశీలన లేకుండానే ఉపయోగింపదగిన నీటి సేకరణ విధానాలు :-**

1. సరస్సులో నుండి నీరు తెచ్చేటపుడు మోకాలి లోతుకువెళ్లి కీటకాలు లేకుండా చూడాలి. పూర్తిగా చేయిచాపినంతమేర ఏమిలేనట్లయితేనే అది త్రాగదగిన నీరు.

2. బావిలో నీరు తోడినపుడు పాత్రలో, చేదలో కీటకాలు లేకుండా చూడాలి.

3. పూర్తిగా భిక్షువు లయినవారి నుండి ముందుగనే పరిశీలింపబడిన నీటిని తెచ్చి ఇవ్వటం.

4. సంఘం పాకశాలలో నీరు శుభ్రపరచే ఉంటుంది. కనుక దాన్ని తెచ్చి గురువుగారికి యివ్వటం.

5. కొండ చరియలలో రాళ్లమధ్య నుండి ప్రవహించే నీరుగాని, నీటి బుగ్గలలో గాని సహజంగా శుభ్రజలమే ఉంటుంది. గనుక దానిని తెచ్చుకొనవచ్చును.

**గడ్డి, పేడ, కలప వంటివి ఎక్కడయిన అవసరమే గనుక**
**జీవులు, క్రిమికీటకాలు, పురుగులు లేకుండ చూడవలయు.**
**శీలవిధులను పాటించు వారగుటచే ప్రాణిహింస జరుగరాదు. 7**

ఆసనాలు తయారు చేయటానికి గడ్డివాడతారు. కట్టడాలకు, వంట చెరకుగ కట్టెలు, కలపవాడతారు. కనుక వాటిలో పురుగులు లేకుండా చూడాలి. శీలవిధులను జాగ్రత్తగా పాటించి, శరీరంతోను, మాటలతోను, మనసుతోను గతంలో చేస్తూ వచ్చిన దోషాలను నివారించుకోవాలి.

**గురువుగారి స్నానాల గది, నీరు, పలుదోముపుల్ల**
**ఉదికే వస్తువులు - ఆసనం - సంసిద్ధము చేయవలయు.**
**భిక్షాపాత్ర శుభ్రపరచవలయు, సుకరము చేయవలయు.**
**సమయమెరిగి, చేతులు మోడ్చి, ఆహారము గైకొనగ వేదవలయు. 8**

అట్లా అడగటమే సరిగా సన్నద్ధ పరచటం.

**హస్త ప్రక్షాళన చేసుకో,**
**మౌనముతోడ మనసు భోజనముపైన నిల్పి.**
**ఆకలి బాధ నివారించుకొనుటకు మాత్రమే**
**భుజింపుము. క్రమరీతి - భుజింపుము. 9**

బలిష్ఠుడు కావాలనిగాని, సౌందర్యం పెంచుకొనటం కోసంగాని భుజించటం వల్ల అకుశలం కలుగుతుంది. ఆహారం తీసుకొనకపోతే దేహం క్షీణించి ధర్మసాధనకు ప్రతిబంధక మవుతుందని భావించి భుజించటం కుశలాన్ని కలిగిస్తుంది. ఈ రెండు రకాల ఆలోచనలు కూడ లేకుండా భుజించటం వల్ల అనూహ్య ధర్మవృద్ధి కలుగుతుంది. భోజనాత్పూర్వమే ఈమూడు ఫలితాలను చింతించటం శ్రేయస్కరం.

**భోజనానంతరము**
**స్వచ్ఛ జలం త్రాగిన పిదప,**
**పుణ్యఫలం పెంపొందించుటకై**
**రెండు దాన సూత్రాలు పఠింపుము. 10**

ఆహార భిక్షాదానం ఎవరెవరు చేసారో, వారిలో ఏమయినా ప్రతికూల ప్రభావాలుంటే వాటిని తొలగించుట కొరకు, వారిలోని దాన పారమితను ప్రస్తుతించి వృద్ధిచేయటానికి వారి పుణ్యమును అభినందించుము, అట్లే నాగరాజును ప్రశంసించుము.

**భోజనానంతర విధి :**

**ధ్యానము చేయుము ఉపదేశం పొందిన.**
**కాదేని పఠనమునందు మనసు నిల్పుము. 11**

ఆచార్య ముఖమున శూన్యతవంటి ధ్యానరీతులను ఉపదేశం పొంది ఉంటే, అభ్యాసం చేయాలి. రాగభావాన్ని అసహ్య భావనతో నిరోధించాలి. మైత్రీభావనతో ద్వేషభావాన్ని నిరోధించాలి. అవిద్యను ప్రతీత్య సముత్పాద (కార్యకారణక్రమం) చింతనతో జయించాలి. ఆలోచనా చంక్రమణంలో మనసు స్వాధీనం కానపుడు 'అనాపానసతి' యందు ధ్యానము చేస్తూ ఆలోచనాధారను అతిక్రమించాలి.

ఈ ధ్యాన పద్ధతులలో వేనియందూ శిక్షణ పొంది యుండకపోతే, త్రిపిటక పఠనంలో సమయం గడపాలి.

**3. నిత్య శిక్షణ గురించి వివరణ :**

శిక్షణలో సదా నిర్వర్తింప వలసిన వానిని మొదట సంగ్రహముగాను, పిదప సవివరముగాను చెప్పుతున్నారు.

**అధ్యయనమున పట్టుదల (వీర్యము) ఉండాలి.**
**విధి నిషేధములను దృఢంగా అభ్యసించాలి.**

మనో వాక్కాయ కర్మలలో పది అకరణీయ కర్మలు ఉంటాయి. ఇవి చేయతగనివి. కూర్చొనటం, నిదురించటం, ఆహార స్వీకరణ, నడవటం అనే నాల్గు అవస్థలలో పాటింపదగ్గ కర్మలు కరణీయాలు. ఈ రెండు అంశాలను, (కరణీయ అకరణీయాలను) క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. అకుశలాలను తొలగించుకొనటానికి, కుశలాలను పెంపొందించుకొనటానికి అనుగుణంగా ప్రతి అనుభవంలోను క్రియాశీలంగా తెలుసుకోవాలి. తెలుసుకోవటం మాత్రమే సరిపోదు. ప్రతి బోధనను పట్టుదలతో శ్రమించి ఆచరించాలి. స్వీయ అస్తిత్వాన్ని పరిశుద్ధ పరచుకోవాలి.

సదా పాటించవలసిన విధులు రెండు భాగాలు - వాటి వివరణ.

**1. నాల్గు మూలవిధుల వివరణ**

**ఇవి శిక్షావృక్షానికి మూలాలవంటివి.**

2. ఆరు అనుబంధ విధులు
ఇవి శిక్షావృక్షానికి శాఖల వంటివి.

1. నాల్గు మూల విధులు

క. ప్రాణి హత్య చేయకుండుట.

చ. ఇవ్వని దానిని తీసుకొనకుండుట.

ట. కామాతిచారము చేయకుండుట.

త. అనృత మాడకుండుట

**1. క. ప్రాణిహత్య :** ఇది రెండు రకాలుగ జరుగుతుంది. స్వయంగా చేసే హత్య ఒకటి. చేయించే హత్య మరొకటి.

ఇందులో – స్వయంగా చేసే హత్యలు శారీరకమని, వాచికమని, మానసికమని మూడురకాలు.

**1.క.అ. స్వయంగా చేసుకొనే శారీరక హత్య :–** మనలోని అంతర్గత దోషాలపై ఎట్లా ధ్యానించవచ్చో బోధించాడు భగవానుడు. దాన్ని బాగా అభ్యాసం చేసిన భిక్షువులు అనేకులు వైరాగ్యభావాన్ని గాఢంగా పొందారు. మరికొందరు గాఢమయిన వ్యతిరేక ప్రభాలకులోనయి, నిస్పృహతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. విషంత్రాగో, పొడుచుకొనిగాని కొండకొననుండి దూకిగాని ఆత్మహత్యా ప్రయత్నం చేసుకున్నారు.

**చేయించే హత్య :** వేరొక భిక్షువు ఈ స్థితికే చేరుకున్నాడుగాని ధైర్యం చాలలేదు. కాని తెలివయినవాడు. భిక్షువులకు రక్షకునిగా ఉండే ఒక మూర్ఖునివద్దకు వెళ్లాడు. "ఆర్యా! దయచేసి నన్ను చంపండి నా చీవరాలన్నీ నీకేయిస్తా"నన్నాడు. అతను సరేనని కత్తితో పొడిచి ఆ కత్తిని శుభ్రం చేసుకోవటానికి నది దగ్గరకు వెళ్లాడు. నదిలో నీళ్లమీద మారుని కుమారుడయిన ఒక అసురుడు కనిపించి "భలే పనిచేసావు దీనివల్ల నీకు పుణ్య సంపద పెరిగింది" అని చెప్పాడు. ఆమూర్ఖుడు నమ్మాడు. ఇంకా చీవరాలు, ఇంకా పుణ్యం వస్తుంది గదా అని ఆరామానికి వెళ్లి ప్రదక్షిణ పథంలో తిరుగుతూ అరవైమంది భిక్షువులను హతమార్చాడు.

పూర్ణిమా పర్వదినం వచ్చింది. ఆనందునివల్ల ఈ విషయం తెలిసిన భగవానుడు సంఘమునకు * పదిప్రయోజనాలు ఆశించి ఆ మూర్ఖుణ్ణి ఇట్లా చివాట్లు పెట్టాడు.

నీవల్లగాని నీప్రేరణవల్లగాని ఎవరైనా
ఒకడు ఉద్దేశపూర్వకంగా హతుడైతే
శిక్షణావిధి నిశ్చయముగ భగ్నమయినట్లే.
శిక్షణావిధి నిర్వహించెడి మనసు
పతనమొందకుండ హెచ్చరికతో నుండవలయు. 12

భయోత్పాతం, అత్యధిక రాగభావం, క్రోధం, విభ్రమం, మనోవైకల్యం మొదలయిన అసాధారణ వృత్తులవలన మనశ్శక్తులు క్షీణిస్తాయి. అందువల్ల శిక్షణా విధి నిర్వహణ బలహీనపడుతుంది.

'ఒకడు హతుడు' కావటం అంటే జన్మించిన వాడయినా లేక, గర్భస్థంగా ఉన్న శిశువయినా ఆ జీవిని "ఒకడు"గానే గుర్తించాలి.

ఉద్దేశపూర్వకంగా హత్యచేసినపుడు మాత్రమే శిక్షణవిధి సంపూర్ణంగా భగ్నమయినట్లు. పొరపాటుగ జరిగిన హత్య అయితే పూర్తిగా భగ్నమయినట్లు కాదు. హననక్రియ పూర్తి అయి, వ్యక్తి మృతుడు అయిన క్షణంలో శిక్షణావిధి భంగం అయినట్లు. అతడు ఇక ఏమాత్రము శ్రమణుడు కాదు. **

**1.క.ఇ : - మాటలవల్ల హత్య**

బాధల యాతన పడేవారికి గాని
దీక్షావిధులలో నున్నవారికి గాని
దీక్షాభంగ దోషశంకయందున్న వారికిగాని
రోగపీడితులుగ నున్నవారికిగాని
ఎవరికీ మరణాన్ని సూచించకు. 13

మరణాన్ని బాధలకు పరిష్కారంగానో, సద్గతికి మార్గంగానో, బోధించిన ఉదంతాలు ఉన్నాయి. విపరీతమయిన బాధలు పడేవారికి "నీవు చనిపోతే ఉత్తమ జన్మ వస్తుంది - మరణించు" మని చెప్పేవారు కొందరు. "దీక్షా భంగం చేసావు

---

* *1) సంఘ ఉన్నతి, 2) సంఘసౌకర్యం, 3) దుర్బుద్ధులను నివారించటం, 4) సన్మార్గ శ్రమణుల సుఖం, 5) కాలుష్యానికి తక్షణ నివారణ మొ॥ (చూ ప్రాతిమోక్షాసూత్ర).*

** *హత్యవల్ల దీక్షావిధి భంగపడటం శ్రమణులకు మాత్రమే అయినా, ఇది పంచశీల విధిభంగం కనుక అందరకు నిషిద్ధమే.*

గనుక ఆత్మహత్య చేసుకో లేకపోతే పాపాలు పెరుగుతాయి." అని చెప్పేవాళ్లు కొందరు. ఏదయినా వ్యాధితో బాధపడేవారిని "ఇంకా జీవిస్తే బాధలు పెరుగుతాయి. కనుక జీవితం ముగించుకొమ్మ"ని సలహా యిచ్చే వారు మరికొందరు. ఇట్లా ఇచ్చిన సూచనలవల్ల మరణించిన వారి ఉదంతాలు ఉన్నాయి. ఇట్లాంటి సూచనలు ఇచ్చినవారు మాటలతో ప్రోత్సహించి హత్య చేసినట్లే పరిగణించాలి. కనుక శిక్షావిధిని భంగం చేసినట్లే.

**నిపుణవిద్యల ద్వారా హత్య :**

ఒక కుటుంబంలో అన్న విదేశ వ్యాపారానికి వెళ్లాడు. తమ్మునివల్ల అన్న భార్యకు గర్భం కలిగింది. తర్వాత తమ్ముడు శ్రమణుడయ్యాడు. వైద్యునిద్వారా అన్న భార్యకు గర్భస్రావం జరిగింది. ఈ విషయాలన్నీ బుద్ధుని చెవినపడ్డాయి. దీక్ష తీసుకున్న తమ్ముణ్ణి పిలచి "గర్భస్రావం చేయించావా!" అని అడిగాడు. "నేను చేయించలేదు కాని ఆమోదించాను" అన్నాడు తమ్ముడు. బుద్ధుడు మందలించి ఇదిగూడ దీక్షా నియమభంగమేనన్నాడు.

**వైద్యం, భూతవైద్యం, మంత్రంతో**
**మరియే ఇతర తంత్రాల వల్లనైనా**
**మరణాన్ని ప్రోత్సహించటం**
**మరణోన్ముఖంగా ప్రేరేపించటమే**
**అది శిక్షావిధిని కూల్చటమే** **14**

మరణముఖంగా ప్రోత్సహించటం అంటే, కొండ శిఖరాలకో నదీప్రవాహం లోతులకో నడిపించటం పాములతో కరిపించటం, నిప్పులలో దూకేలాగా చేయటం మొదలయినవి. ఇట్లాంటి మార్గాల ద్వారా హత్యచేసినా, చేయించినా, ప్రోత్సహించినా అది విధి భంగమే అవుతుంది.

**1.క.ఉ. హత్యాతుల్యములు :** రెండు రకములు. పెద్దవి కొన్ని – చిన్నవి కొన్ని.

**జంతువులను, నరకజీవులను,**
**ప్రేతాలను, దివ్యులను హత్యచేసిన**
**నీచజన్మలను కలిగించిన పాపం కలుగు .** **15**

మనోవాక్కాయములు దేనితోనయినా
చంపాలని శ్రమణుడు భావిస్తే చాలు,
వారు జీవించి ఉన్నాసరే, చెప్పలేనంతపాపం
మూడురెట్లు మూటకట్టుకున్నట్లు. 16

రాళ్లతోగాని కర్రతోగాని
చేతితో నయినాసరే
జంతువులనుకొట్టి హింసించకు.
విలాసంకోసం గుర్రాలపై స్వారీచేయకు. 17

**1.చ. అదిన్నాదానం :** ఇవ్వని దానిని పుచ్చుకొనరాదు - అనేది ప్రాథమిక విధి.

ఇందులో మూడు భాగాలు

అ) ఉపదేశించిన విధులు, ఇ) స్వల్ప ఉల్లంఘనలు

ఉ) ఉల్లంఘనలకు దారితీసే ఇతర విషయాలు

**1.చ.అ - ఉపదేశించిన మౌలికవిధులు :**

శ్రమణులు తమ కుటీరాలను నిర్మించుకొనటానికి కలపను, రెల్లును, సేకరించి ఒకసారి రాజాగ్రహానికి గురి అయిన సందర్భంలో భగవాను డీవిధంగా నియమం ఏర్పరచాడు.

శ్రమణేరుడు స్వయముగా గాని
అన్యసహాయంతో నయినా
లోభంతోనో, ఉద్దేశపూర్వకంగానో,
బలప్రయోగంతోనో, చౌర్యంగానో, 18

పరుల యింటినుండి ఐదు మాషలైన దొంగిలించినా
పాపు కర్షపణం బాటసారి నుండి అపహరించినా,
ఆ చౌర్యంచేత - ఆతని నైతిక విధి భంగమయినట్లే 19

భగవానుడు కలందక విహారం (రాజగృహం)లో ఉన్నపుడు ఒక సంఘటన జరిగింది. కుమ్మరి వంశం నుండి వచ్చిన ఒక యువకుడు నోర్బన్. (ఇది భారతీయ పదానికి టిబెటన్ భాషా సమానార్థకం - బుద్ధుడు - ఆనందు మొదలయిన

ప్రసిద్ధ పదాలు తప్ప తక్కిన వ్యక్తినామాలను టిబెట్‌లోకి అనువదించి వాడతారు. సమానమయిన భారతీయ పదం చెప్పటం కష్టం). భిక్షుదీక్ష తీసుకున్నాడు. రాజగృహ సమీపంలో ఒక పర్ణశాలలో ఉంటున్నాడు. అతను భిక్షకు వెళ్లినపుడు ఒకరోజున ఎవరో పశువుల కాపరులు అతని పర్ణశాల కూల్చి కలప గడ్డి ఎత్తుకుపోయారు. భిక్షువు రెల్లుగడ్డి కలప తెచ్చుకొని మళ్లీ పర్ణశాల కట్టుకున్నాడు. దీన్నికూడ అట్లాగే దొంగిలించారు. భిక్షువుకు కోపం వచ్చింది. అయినా ఈసారి కూడ ఎర్రమట్టితో అందంగా కట్టుకున్నాడు.

భగవానుడు అటువైపుగా వెడుతూ ఈ అందమయిన పర్ణశాలను చూచాడు. ఎవరిదో తెలుసుకున్నాడు. ఇంత అందమయిన పర్ణశాల ఉంటే అసూయతో లోకులు విమర్శిస్తారు. కనుక దీన్ని పడగొట్టమన్నాడు. ఈసారి భిక్షువే పడగొట్టుకున్నాడు.

మళ్లీ కలప గడ్డికోసం కలప రక్షకుడయిన ప్రభుత్వ అధికారి వద్దకు వెళ్లాడు. "రాజుగారు పట్టాభిషేకం నాడు భిక్షువులకు దానంచేసిన కలపను ఇమ్మ"ని కోరాడు. "రాజుగారు యిచ్చి ఉంటే నీకు కావలసినట్లు తీసుకు పొ"మ్మన్నాడు అధికారి. రాజగృహంలో మరమ్మత్తుల కోసం ఉంచిన కలపలో కావలసినట్లు నరుక్కొని భిక్షువు తీసుకొని వెడుతున్నాడు. దారిలో రక్షకభటుడు చూచి అతన్ని అదుపులోకి తీసుకున్నాడు.

రాజుగారు పిలిపించారు "నీకు ఇవ్వని దాన్ని తీసుకొని వెళ్లటం శీలమేనా" అని మందలించాడు.

"ఇవ్వని దాన్ని తీసుకోవటం తప్పేగాని, ఈ కలపను తమరు నాకు యిచ్చారు. ఉపయోగించకుండా ఉన్న రెల్లును, కలపను, నీటిని, భిక్షువులు, బ్రాహ్మణులు తమకు అవసరం అయినంత తీసుకొనివెళ్ల వచ్చునని, తమ పట్టాభిషేకం నాడు ప్రకటించారు మహారాజా!" అన్నాడు.

"నేను ప్రకటించింది నా పర్యవేక్షణలో లేని దానిని గాని నా అధీనంలో ఉన్న దాన్ని కాదు" అన్నాడు.

"మీ అధీనంలో లేని దాన్ని మీరు ఇవ్వటం ఏం సమంజసం రాజా!" అన్నాడు భిక్షువు ప్రతి సమాధానానికి రాజుకు కోపంవచ్చి ఇట్లా తీసుకొని వెళ్లేవారికి ఉరిశిక్ష ప్రకటించాడు.

శ్రమణేరుడు ఎవరయినా అక్రమబుద్ధితో విలువగల దేనినైనా దొంగిలించి, తనదిగా భావించినచో అతని నైతికవిధి భంగపడినట్లే. (మాషలు, కార్షపణాలు ఆనాడు చెలామణీ ఉన్న నాణేలు. వాటికి నేటి సమాన విలువ ఎంతో చెప్పలేముగాని, ఎంత స్వల్ప విలువ అయినా అది దీక్షాభంగమని చెప్పటమే కారిక ఉద్దేశ్యం.)

**1.చ. ఇ. స్వల్ప ఉల్లంఘనలు :** పొందాలని ఆశించిన వస్తువు విలువ స్వల్పమయినాసరే – తానున్న చోటు నుండి లోభదృష్టితో స్వల్పంగా కదలినా సరే ఆక్షణంలో నియమం బీటలు వారినట్లే. బీటలను వెంటనే సరి చేసుకొనటం మంచిది.

**1.చ.ఉ. ఉల్లంఘనకు దారితీసే విషయాలు :**

**బీజాలు, మూలాలు, ఫలాలు, వృక్షాలు,**
**కాండం, పత్రం, బెరడు, నీళ్లు,**
**నీటిలోనో, నేలపైనో పూచే**
**పూవులుగాని – పంటపొలం, నేల, పడవ –** **20**

**పన్ను, ప్రయాణరుసుము,**
**రెండో, నాలుగో కాళ్లుగాని అసలేలేని జంతువో**
**శ్రమణుడు దొంగిలిస్తే**
**ధనం, నగలు, విలువయినవి తస్కరిస్తే**
**శిక్షావిధి నశించినట్లే.** **21**

నీరు దొంగిలించటం : – పొలంలోకి నీరు మళ్లించు కోవటం.

పూలు దొంగిలించటం : – పూజకయినాసరే, కొమ్మలు, ఆకులు, రెమ్మలు వైద్యానికయినాసరే.

జంతువులు : రెండు కాళ్లవి – కోళ్లు మొదలయినవి పక్షులు, నాల్గుకాళ్లవి – పశువులు, గొర్రెలు, మేకలు, అసలే లేనివి – చేపల వంటివి.

ఇవన్నీ శ్రమణదీక్ష పూర్వపు అలవాట్లవల్ల కొనసాగే ప్రలోభాలు.

**నీభిక్షాపాత్రనుగాని మరేదయినా**
**దొంగిలించిన దొంగకు ధర్మం తెలియజెప్పి.**

తిరిగి తీసుకో, లేకుంటే అంతే విలువైన మరోపాత్ర కొనుక్కో.
ఇందుకు భిన్నంగా ప్రవర్తిస్తే
విధిని స్వల్పంగా భంగం చేసినట్లు. 22

భిన్నంగా ప్రవర్తించటం అంటే ఆ దొంగ నుండి వస్తువును బలప్రయోగంతో తీసుకుంటే అది ఉల్లంఘనే.

**1. ట - బ్రహ్మ చర్యాభంగం చేయక పోవటం**

1) దేనిని, దేనినుండి రక్షించుకోవాలి.

2) తనను తాను ఎట్లా రక్షించుకోవాలి.

**1. బ్రహ్మ చర్యంలో దేనిని - దేని నుండి రక్షించుకోవాలి :**

సుదిన్నుని కథ వినయంలో ప్రసిద్ధం -

భగవానుడు కలందక విహారం సమీపంలో ఉన్నపుడు ఒక సంఘటన జరిగింది. సుదిన్నుడు అనే గృహస్థు దీక్ష తీసుకొని ఇల్లువదలి వెళ్లాడు. వాళ్ల అమ్మవచ్చి అతనిని అర్థించింది. "నిన్ను మళ్లీ గృహస్థువు కమ్మని అడగటంలేదు. వారసుడు లేకపోతే సంపద అంతా రాజులపాలు అవుతుంది. కనుక భార్యకు వీర్య దానం చేసి వారసుణ్ణి ఇమ్మ"ని కోరింది. నిర్ధారిత సమయంలో అతను యింటికి వెళ్లాడు. తల్లి ఆదేశం మేరకు అలంకృత అయిన భార్యను యోగ్యమయిన కాలంలో సంభోగం చేసి వచ్చాడు.

ఇది జరిగిన కొద్దిరోజులకే బుద్ధుడు తన ప్రసంగంలో క్రోధము - కామము - మోహము అన్న మూడు మానసిక విషాల గురించి ప్రసంగించారు. శ్రద్ధగా విన్న సుదిన్నుడు తన పూర్వచర్యకు పశ్చాత్తాపంతో దిగులుతో ఉన్నాడు. తోటి భిక్షువులు గమనించి అతని దిగులుకు కారణం అడిగారు. అతను దాచకుండా చెప్పాడు. వారు బుద్ధునికి చెప్పారు. ఆయన సుదిన్నుని పిలిచి అనేక విధాల వివరించి గట్టిగా మందలించాడు.

దీక్ష స్వీకరించినవాడు వెనుకాడని మనసుతో
వ్యామోహితుడై ఏమూడు ద్వారాలలో
తన రత్నాన్ని విడచినా, అవి రోగరహితమయినా సరే,

స్కలనసుఖం అనుభవించితే,
దీక్ష పతనమయినట్లే - నియమం నశించినట్లే. 23

పురుషుడో, స్త్రీయో, నపుంసకుడో
బలాత్కరిస్తే లొంగిపోయిగూడ
వీర్య స్కలనసుఖం అనుభవించితే
దీక్ష పతనమయినట్లే. నియమం నశించినట్లే. 24

వెనుకాడని మనస్సు : ప్రతిఘటన లేని, అనుకూలమైన, ఆమోద మనోప్రవృత్తితో, సహజంగా పాల్గొనటం.

మూడు ద్వారాలు : యోనిద్వారము - మలద్వారము - ముఖద్వారం

బలాత్కరిస్తే : తన యిష్టం లేకపోయినా, అన్యుల బలాత్కరం వల్లనయినా, ఆసమయంలో సుఖాన్ని మానసికంగా అనుభవిస్తే - నియమభంగమే.

---

బ్రహ్మచర్యం గురించి బౌద్ధభిక్షువులపై ఎందుకు అంతటి నిష్ఠను విధిస్తున్నారని కొందరు ప్రశ్నిస్తారు. లామా టుబ్‌టెన్ జో వ్రాసిన "Commentary to the Mahayana Precepts" (Kathmandu International Mahayana Institute) అనే గ్రంథంలో ఇలా వివరించారు. సెక్సు సుఖము, ఇంద్రియ స్కలనాలు మనసును నిష్ఠ నుండి మసక పారుస్తాయి. శక్తిహీనం చేస్తాయి. శరీర సుఖంకోసం తృష్ణతో ఆతురపడటం, ధ్యానసమయంలో అట్టి ఆలోచనలు కల్లోల పరచటం, స్పష్టమయిన దర్శనశక్తిని (తంత్ర ధ్యానంలో) బలహీనపరచటం, మనసుకు ధారణాశక్తి లోపించటంవల్ల తీవ్రధ్యానం బలహీనపడటం, (యోగంలో) శక్తి కేంద్రాలయిన చక్రాలు వికసించటానికి అవరోధం కలగటం, చైతన్య శక్తి ప్రవాహం నిరంతరంగా ఉండటానికి ఆటంకాలు కలగటం, వంటి అవరోధాలు కలుగుతాయి ఉన్నతస్థాయి యోగతంత్ర భూమికల విషయంలో మనోవాక్కాయ కర్మలకు అతి దారుణమయిన అవరోధాలు అవుతాయి అని వివరించారు. ఆధునిక పాశ్చాత్య మనోశాస్త్రజ్ఞులు అనేకమంది బ్రహ్మచర్యాన్ని ఖండిస్తూ - దానివల్ల మనోమూలంలో అనేక వైక్లబ్యాలు కల్లోలు కలుగుతాయని చెపుతున్నారు. "అందరికీ బ్రహ్మచర్యమే యోగ్యం - సెక్సు నీచమయినది" - అనే పాతమాటకు - సెక్సు నిరోధం ఉండరాదన్న కొత్త వాదానికి - మధ్య బౌద్ధం ఒక మధ్యేమార్గాన్ని ప్రతిపాదిస్తున్నట్లు తోస్తుంది. కఠినమయిన భిక్షు దీక్ష తీసుకున్న వారికే ఈ బ్రహ్మచర్య నియమం విధించి, సాధారణ పౌరులకు విధించలేదు. నీతిబద్ధమయిన శృంగారానుభవం - ఒకరాత్రి ఐదుసార్ల వరకు అనుభవించవచ్చునని (అంతకుమించినది అతి శృంగారం- అవాంఛనీయం) అనుమతించారు. దీనివలన సుఖవంతమయిన గృహస్థ సమాజం పటిష్టమయిన భిక్షుసంఘం నిర్మితం కావటానికి ఈ మధ్యేమార్గం చక్కగా ఉపకరించవచ్చు.

**2. తనను ఎట్లా పరిరక్షించుకోవాలి :**

జననేంద్రియ సుఖాలను వాంఛించటంకన్న
విషసర్పం నోట దూరటంమేలు.
అందువలన దీక్షానియమ భంగం జరుగదు
అని పల్కె సంబుద్ధుడు. 25

ఏదిశ్రేయమీరెండింటను
సర్పం నినుచంపినా, దీక్ష కొనసాగుచునే యుండును.
స్వభావమునందు దీక్షాభంగము జరిగిన
దుఃఖమును, ముక్తికి విఘాతమును కలుగును 26

శిక్షణావిధికి విఘాతం కలుగకుండా మరణం కలిగినప్పటికి సత్ఫలితాలు ఉత్పన్నం అవుతాయి. శిక్షణా విధిని భంగపరచే కారణాలను నిరోధించుకుంటే, భవిష్యత్తు లోనయినా ఈ పుణ్యఫలంవల్ల, అనుకూల పరిసరాలలో మరల జన్మిస్తాడు. అట్లాకాక స్వీయశిక్షణావిధికి భంగం కలిగితే అపరిమిత దుఃఖం ఈ జన్మలోనే ఉత్పన్నం అవుతుంది. రాబోయే జన్మలు నరకంలోనో, ప్రేతలోకంలోనో జంతులోకంలోనో కలుగుతాయి. పరమ సుఖప్రాప్తికి అవరోధాలు కలుగతాయి.

**1. త. సత్యభాషణ విధి :**

1. పూర్తిగా విధిని భంగపరచు అతిక్రమణలు.
2. తదితర అప్రశస్త పద్ధతులు.

**1.త.1. పూర్తిగా విధిని భంగపరచే అతిక్రమణలు :**

వైశాలి పరిసరాలలో కాటకం సంభవించింది. స్వంత పిల్లలకుగూడ ఆహారం పెట్టలేనంత దైన్యం వ్యాపించింది. భిక్షువులు సమూహాలుగా వివిధ ప్రాంతాలకు వెళ్లిపోయారు. వారిలో కొందరు వృద్ధ భిక్షువులు, అతీంద్రియ శక్తులుగల మరికొందరు కలసి ఉత్తర దిశగా వలస వెళ్లారు. దూరదేశంవెళ్లి తమకేకాక మరికొంతమంది ఇతరులకు గూడ ఇవ్వటానికి సరిపోయినంత ఆహారం తెచ్చారు. దీక్షకు పూర్వం బెస్తవారిగ జీవితం గడుపుతుండే 500 మంది భిక్షువులు ఒక పన్నాగం పన్నారు. తమలో తాము మహిమాన్వితులుగా ప్రకటించుకుంటే సాధారణ జనులు మోసపోయి అధికమయిన ఆహారంతెచ్చి యిస్తారు గదా అని వారి ఎత్తుగడ

నిజానికి వారివద్ద ఏరకమయిన మహత్తులు, అతీతశక్తులు లేవు. వారు ప్రారంభ దశలోని వారు మాత్రమే. కాని "అతడు శ్రోతాపన్నుడు, ఇతడు సకృదాగామి, అదుగో అతడు అనాగారకుడు, వీరు అర్హతులు. వీరందరు త్రిపిటక పండితులు" అంటూ ఒకరి గురించి ఒకరు గొప్పలు చెప్పుకుంటూ వదంతులు వ్యాప్తిచేసారు. అధిక ఆహారం పొంద గలిగారు.

అవసరాలు తీరిపోయాయి. వేసవి ఆఖరుకు అందరు భిక్షువులు మళ్లీ 'వైశాలి'కి చేరారు. సరిగా ఆహారం లభించనివారు శల్యావశిష్టులై వచ్చారు. వీరు మాత్రం బలిష్టంగా వచ్చారు. ఇది ఎట్లా జరిగిందని ఆనందుడు ప్రశ్నించాడు. బలిష్టులుగ వచ్చినవారు తాముచేసినపని దాచకుండా చెప్పారు. అబద్ధం ఆడినందుకు ఆనందుడు వారిని చివాట్లు పెట్టాడు. ఇదంతా విన్న బుద్ధుడుగూడ వారిని మందలిస్తూ ఇట్లా చెప్పాడు.

తాను దేవతలను చూచానంటూ,
వారి మాటలువిన్నానని, మాట్లాడానని,
తానున్నచోటికి దేవతలు వచ్చారని,
స్వర్గానికి రాకపోకలు చేస్తుంటానని,
ఇంకా సుగంధ భుక్కులైన దివ్యులను చూచానని. 27

రక్తపిపాసి ప్రేతాలను చూసానంటు,
సమాధి స్థితుడనని, దివ్య దృష్టి,
దివ్యశ్రవణాలు, అనంత గుణాలున్నాయని,
శ్రోతాపన్న, సకృదామి, అనాగామి, అర్హతాది
సిద్ధుడనని మార్గస్థితుడనని 28

అసాధారణ పురుషుడనని, భ్రాంతి రహితుడనని
ఈ అపూర్వ గుణములన్ని తనకున్నట్లు
అబద్ధము చెప్పుకున్న -
వాని శిక్షణావిధి పతనమగును. 29

ఒక భిక్షువు, ఏకాంతలో నివసిస్తూ, సాధనచేస్తూ మనసును వికలం చేసే రాగ, క్రోధ, భ్రాంతులను నిగ్రహించుకొన గలిగాడు. సమాధిని సాధనచేసాడు.

ఇంక ఇవి ఎప్పటికి తన జోలికి రావని గట్టిగా అనుకున్నాడు. ఒకసారి నగరంలోకి ప్రవేశించాడు. అందమయిన అమ్మాయిను చూచాడు. పూర్వ శత్రువులు కనిపించారు. దాంతో మళ్లీ రాగం ద్వేషం తనలో మొలకెత్తినట్లు గుర్తించాడు. అధర్మ పరాకాష్ట అయిన అబద్ధాలు చెప్పాననుకున్నాడు. బుద్ధుని వద్దకువెళ్లి తన అనుభవం వివరించాడు.

"తాను పొందిన సాధనానుభవాలను, సాధించిన ఉన్నత భూమికలను ప్రకటించగూడదు. అవి అద్భుతానుభవ భ్రాంతులే గనుక చెప్పరాదు" - అని సలహా యిచ్చాడు బుద్ధుడు.

**1.త.2. ఇతరములయిన అప్రశస్త సంభాషణలు :**

గ. వచోపరమయిన అబద్ధాలు.

జ. భిక్కువులకు నాలుగు ధార్మిక చర్యలు.

డ. ఇతరములయిన అప్రశస్తములను తొలగించుకొనుటకు సూచనలు.

**గ. వచోపరమయిన అబద్ధాలు :**

**ప్రత్యేక సిద్ధుల గురించి మాత్రమేనా!**
**ఘనత కోసం చెప్పే అబద్ధాలన్నీ పాపకరాలే.**
**మిత్రభేదంచేసే నిందలు చెప్పకు.**
**మందిలో మాట్లాడకు, - పరుషంగా భాషించకు.** **30**

నిందలు : నిందలు నిజమయినవా కావా అన్నది ముఖ్యం కాదు. ఆ మాటలు ఇద్దరినీ దూరంచేసే మాటలయితే చాలు దోషమే. సిద్ధులు ఉన్నాయని అబద్ధం చెప్పినపుడు మాత్రమే సత్యభాషణవిధి భంగమయినట్లు పరిగణించాలి. అబద్ధాలు, అనవసర ప్రసంగాలు కూడ దోషకరాలే. అవి దుఃఖానికి, అధోలోకంలో జన్మించటానికి కారణములవుతాయి.

**జ - భిక్కువులకు నాల్గు ధార్మిక చర్యలు :**

**అవమాన పరచే నీచభాషణలకు బదులు పల్కకు.**
**తిడుతుంటే మందలించకు.**
**నీ పొరపాట్లను ఎక్కువచేసి ప్రకటిస్తే, వాదులాడకు.**
**కొట్టినా తిరిగి కొట్టకు.** **31**

**డ - ఇతర అప్రశస్తములు :**

ఇక్కడ పేర్కొనని మరికొన్ని అప్రశస్త సంభాషణలను కూడ విడువుమని ఉపదేశం.

**శిక్షణపై అనురక్తితో**
**వచోదోషములను తొలగించుకొని**
**నిగ్రహించుకొనును వివేకి.**
**తెలివిగ నోటికి కళ్లెం వేసుకొనును. 32**

వచోదోషాలు : ఆపద కలిగించే చర్చలు - రాజుల రాజకీయాలు - చోరుల గురించిన ప్రసంగాలు గూడ.

**ఇంతవరకు చెప్పినవి నాల్గు మూలవిధులు. ఇవి శిక్షావృక్షానికి మూలాలు వంటివి.**

ఇక వృక్షానికి శాఖలవంటి ఆరు విధములయిన గౌణనియమాలు నాల్గు శీర్షికల క్రింద వివరించబడ్డాయి.

య - ప్రశాంతచిత్తం
ర - నాల్గు నియమాలతో కూడిన నిరాడంబర జీవనం
ల - స్వర్ణరజతాలను స్వీకరించకపోవటం
వ - పైన పేర్కొనని ఇతరములయిన నిగ్రహములు.

**య - ప్రశాంత చిత్తం :** త్రాగరాని పానీయాలు

**ధాన్యాలు, పులవపెట్టిన బార్లీ, యవల పానీయాలు**
**వృక్ష, పుష్ప, శాలి, వంటి ద్రాక్షాసవాలు**
**సత్ఫలముగోరు దీక్షాపరుడు సేవింపరాదు**
**వివేకము పోగొట్టునవియన్ని అప్రశస్తములు 33**

ఈ పానీయాల నిషేధావశ్యకత.

**మద్యం సేవించినవారు**
**మనసును గమనించుకోలేరు.**
**శ్రమణుడు స్వాధీనము తప్పును.**
**స్వాధీనము తప్పిన శిక్షణ భగ్నమౌను. 34**

**ఆచార్యుని బోధను మరువకుము.**
**మత్తిచ్చు పానీయం అసమబుద్ధిని పెంచును.**
**కుశాగ్రముపై నిలచే బిందువంత మద్యమైన త్రాగబోకు** **35**

ఒక శ్రమణుని ముందు మదిరాపాత్రను, యువతిని, గొఱ్ఱెను ఉంచారు. ఈ మూడింటిలో ఏదయిన ఒకదానిని స్వీకరించాలని ఆదేశించారు. మూడింటిలో మదిరాపాత్ర తక్కువ పాపకరం అనుకున్నాడు. గొఱ్ఱెను చంపితే హింసా పాపం, – స్త్రీతోడయితే వ్యభిచారపాపం. అనుకొని వాటిని నిరాకరించి, మదిరాపాత్రను ఖాళీచేసాడు. మనసు స్వాధీనం తప్పింది. తాను చేస్తున్న దానిపై విచక్షణ తప్పింది. గొఱ్ఱెను చంపాడు. స్త్రీని చెరచాడు.

ఇట్లాంటి సంఘటనలను గమనించిన బుద్ధుడు "బౌద్ధ దీక్షాపరుడు కుశగ్రాసం కొనమీద నిలచేపాటి మద్యబిందువు నయినా త్రాగరాదు. త్రాగించరాదు, త్రాగినవాడు ధర్మసాధకుడుగా ఉండ తగదు. అతనికి నేను ఆచార్యుడను కాను" అని ప్రకటించాడు.

బీరు, ఆసవం మొదలయినవి త్రాగటంలో సహజమయిన దోషం ఏమిలేదు. కాని అవి మనసును ప్రభావితంచేసి విచక్షణను, స్వాధీనాన్ని పోగొడతాయి కనుకనే అవి దోషాలు. అనారోగ్య స్థితిలో మదిరాసవం తప్పనిసరి అయితే దాని వాసన, మత్తు, పోయేవరకు వెచ్చచేసి ఔషధంలాగా స్వీకరించవచ్చు.

**ర. నిరాడంబరత నాల్గు విధాలు :**

1. నృత్య నాటకాదులను నిగ్రహించటం.
2. ఆభరణాలను ధరించకపోవటం.
3. ఎత్తయిన విలాస శయ్యలను ఆసనాలను వాడకుండుట.
4. సాయంకాలము నిరాహారముగా నుండటం.

**ర.1. నృత్య నాటకాదుల నిషేధం :**

ఒకసారి భగవానుడు రాజగృహంలో ఉన్నాడు. బింబిసార మహారాజు నాగరాజుకు కట్టిస్తున్న దేవాలయం పూర్తి అయింది. ప్రారంభ ఉత్సవానికి నాట్యప్రదర్శనలు ఏర్పాటు చేసాడు. దక్షిణ దేశం నుండి నృత్య కళాకారులను

ఆహ్వానించారు. వారు "బుద్ధుడు - ఆరుగురు తెలివి తక్కువ శిష్యులు" - అన్న వ్యంగ్య నాటకం ప్రదర్శించారు. అదిచూచి ఆరుగురు బుద్ధశిష్యులు బాధపడ్డారు. ప్రతీకారంగా మరునాడు ఆశిష్యులు తామే నాట్య ప్రదర్శన చేసారు. ప్రజలు విరగబడి చూచి మెచ్చుకున్నారు. ఫలితంగా వృత్తి నాట్యకారులకు ఆర్థిక నష్టం, అప్రతిష్ఠ కలిగాయి. ఈ విషయమంతా బుద్ధునికి తెలిసింది. ఈ క్రింది ఆదేశం చేసారు.

**దీక్షాపరుడు నృత్యగానాలు చేయరాదు**
**గీతవాద్యాలపై మ్రోయింపరాదు**

గానం చేయరాదు అంటే అయోగ్యమయిన సమయాలలో, అయోగ్య సందర్భాలలో, అనుచిత గానాలు చేయరాదని తాత్పర్యం.

**ర.2. ఆభరణాదులు ధరించరాదు :**

కలందక విహారంలోని కాంతివనంలో భగవానుదున్నపుడు ఆ తెలివితక్కువ శిష్యులు ప్రధాన దేవాలయంలో ఒక వేడుకకు వెళ్లారు. అక్కడివారు వీరిని ఆభరణాలతో అలంకరించి, వీరి శరీరాలను రంగు రంగులతో అద్దారు - వారిని చూచి భగవానుదు ఆ తర్వాత ఈ నిషేధం చేసారు.

**శ్రమణులు సుగంధ లేపనాలు చేసుకొనరాదు.**
**చందనచర్చలు తగదువారికి.**
**పసుపు కుంకుమల వర్ణ లేపనాలంకరణ వలదు.**
**కంఠభూషలు - పూలదండలు - శిరోమండనాలు వలదు.** 36

**రత్న స్వర్ణభూషణాలు తగదు**
**కంటి కంజనములు కాటుకలు వలదు**
**వ్యాధి వచ్చినపుదు తప్పులేదు.** 37

**విలాస శయ్యలమీద నిదురించరాదు :**

**మూరెడెత్తును మించిన శయ్యలపై**
**సుఖాసనములపై నిదురించకు, కూర్చొనకు.**
**ఎత్తులేకున్నను విలాసవంతమౌ**
**స్వర్ణాలంకృత శయ్యలు ఆసనములు వాడవలదు.** 38

ధర్మప్రసంగాలు చేసే సమయంలో మాత్రం ఉన్నతమయిన విలువైన ఆసనములపై కూర్చుండుట దోషముకాదు. అపుడు శ్రమణుడు విరాగముపై అనిత్యతపై ధ్యానమనస్కుడై ఉండవలెను. శీతల దేశములో, తుఫాను ముసురు కాలంలో మాత్రం జంతు చర్మాదులతో చేసిన శయ్య అనుమతింపబడినది.

నాట్యము, అలంకరణాలు - ఉన్నత శయ్యాసనాలు నిషేధించటంలోగల ప్రయోజనం గురించి -

**ఉన్నత శయ్యాసనాలను, సంగీత నృత్యాలను**
**వినియోగించుట గర్వము కలిగించును.**
**వ్యర్థాంశములను తొలగించుచు**
**శిక్షణావిధి నిర్వహించవలయు.** **39**

**ర.4. సాయంకాల ఆహారవిధి :**

సాయంకాలం ఆహారం నిషేధం. మూడు విభాగాలుగా తెలియజేసారు అసమయం, నియమ భంగం చేసేవి, చేయనివి.

**అసమయం :**

**సూర్యుడు మధ్యాహ్న రేఖదాటి**
**అరుణోదయం వచ్చువరకు**
**దీక్షాపరుడు భుజింపరాదు.**
**బుద్ధుడు చెప్పె నిట్లు** **40**

వేకువలో మూడుభాగాలు - 1. మసక వెలుతురు, 2. సువర్ణకాంతి, 3. అరుణకాంతి.

సువర్ణకాంతి తూర్పున అలుముకొన్న సమయమే ఈ నియమంలో నిర్దిష్టకాలం.

**తగుసమయం :**

**అరుణోదయాది మధ్యాహ్నం వరకు**
**ఆహార స్వీకరణకు యోగ్యసమయం.**
**స్మృతి దృఢ మౌటకు శిక్షణ నిర్వహించుటకు**
**తగు సమయమందె భుజింపుము.** **41**

విధి భంగము చేయునవి - చేయనివి :

తగిన సమయమే అనుకొని
వేళకాని వేళలందు భోజనమును చేయరాదు.
వైద్యులిచ్చెడు పథ్యసూచనలబట్టి
వ్యాధి వచ్చిన నియమము వీడవచ్చు. 42

విధి భంగము చేయనివి :

కొన్ని మైళ్ల దూరము మించి నడచునపుడు కరువు పీడించు ప్రాంతాల నుండునపుడు వీలు, వనరులబట్టి భుజింపవచ్చు.

రజతము స్వర్ణములను స్వీకరించకపోవుటను అను మూడుభాగాలుగా వివరిస్తున్నారు. నియమ ప్రయోజనము - ఏమి చేయాలి - ప్రత్యేక పరిస్థితి.

నియమ ప్రయోజనము :

వెండి బంగారాలు, ధన సంబంధి లోహాలు,
అభిమానులు సమర్పించునపుడు
విరాగులౌ శ్రమణులు స్వీకరింపరాదు. 43

అపుడేం చేయాలి :

స్వీకరింపక తప్పని సమయమందు
శ్రమణుల బదులు శ్రావకుడు చేకొనవచ్చు.
అవసర వస్తువుల కొనుట కొరకు
వాడవలయు, మొలకెత్తు కోర్కెల అరసికొనుచు 44

అత్యవసరములు : ఆహారము, దుస్తులు, ఔషధములు వంటి అత్యవసర సామాగ్రికి కొరత కలిగినపుడు విలువయిన దక్షిణలను స్వీకరించవచ్చును. అపుడయినను స్వయముగా స్వీకరింపక - శ్రావకులు తీసుకొని (శ్రమణ దీక్షను స్వీకరించనివారు) అవసర వస్తువులను కొనుగోలు చేసి ఇవ్వవచ్చును.

ప్రత్యేక పరిస్థితులు :

వెండి బంగారములు తీసుకొన్నచో,
త్రిరత్నములకు సమర్పించినను

**బ్రహ్మాచారుల కిచ్చినను,**
**దోషము రాదు దానివలన. 45**

త్రిరత్నములకు సమర్పించుటనగా బుద్ధమూర్తులను నిర్మించుట, ధర్మగ్రంథములను వ్రాయించుట. ముద్రించుట, శ్రమణ సమూహమునకు సహాయపడుట, లేక బ్రహ్మాచారులను, ఆచార్యులను గౌరవించుట వంటి కార్యములకు వినియోగించుట దోషముకాదు. బహిరంగమున వస్తుమారక వినియోగము అవసరమయినచో అది శ్రావకుల (భిక్షువులు కానివారు) ద్వారా మాత్రమే జరుపవలయును.

పైన పేర్కొనబడని అంశములలో విధి నిషేధములు రెండు శీర్షికలలో వివరింపబడినవి.

1. గతమందలి విపత్తి కరభావాలను తొలగించుకొనుట

2. ఇతరులను గౌరవించుట.

1. గత సంస్కారాలుగా మనసులో కొనసాగుతున్న విపత్తికర (దురదృష్టకరములయిన) భావాలను తొలగించుకొనుట -

**అన్ని అవరోధములు వాంఛచేత**
**కల్పితాలు అని చెప్పె బుద్ధుడు.**
**అట్లుకాదని భిన్నముగ,**
**తెలివి లేక శ్రమణుడు పలుకరాదు.**
**అట్లే ఎంతచెప్పినా వాదించుచున్న**
**బయటకు పంపించ వలయు విహారము నుండి 46**

బౌద్ధశ్రమణుడు బుద్ధవచనమునకు భిన్నముగా మాట్లాడుతుంటే అతనిని మృదువుగా మందలించాలి. అయినా ఉపయోగం లేకపోతే భిక్షు సంఘ నాయకుడు అతని ప్రవర్తనను జాగ్రత్తగా మలచుకొమ్మని సూచించాలి. అయినా సవరించుకొనకపోతే అతనిని భిక్షు సమూహం నుండి ఆరోజే పంపివేయాలి. ఆవిహారంలో మరొకరాత్రి గడపనీయరాదు.

శ్రమణేరుని అభ్యాసం బుద్ధుని బోధకు విరుద్ధమయిన భావాలతో కలుషితం అయింది గనుక - అతడు నిగ్రహం కోల్పోయాడు గనుక, విహారంలో అర్హత

కోల్పోయాడు. అతని అంతరంగం ద్వైధీ భావంతో నిండి ఉంది గనుక అతను మృతులతో సమానం. అతడు ఆలంకారిక భాషలో శవతుల్యుడు.

**ఇతరులను గౌరవించుట :**

మరణమును భావించి - హింసమానుము
బిగ్గరగా నవ్వకు - ఆవలింతకు చేయి అడ్డుపెట్టుకొనుము.
పెద్దలు తుమ్మిన - వందన మనుము.
పిన్నలు తుమ్మిన - శుభము నీకనుము.
శ్రావకులు తుమ్మిన - చిరంజీవ యనుము. **47**

గురుని నివాసముచెంత - చీదకు - ఉమ్మకు.
వారిసమక్షమున పన్నులు కుట్టుకొనకు.
వారు నిలచియుండ పరుండకు కూర్చొనకు.
పనిలేక ఊరక తిరుగాడకు.
లోదుస్తులు మాత్రముదాల్చి కన్పించకు.
శ్రమణుడట్లు గౌరవ మర్యాదలు పాటింపవలయు. **48**

**సాయంకాల విధులు :**

చేతులు క్షాళనం చేసుకొని - ఇంటి పాత్రలు శుభ్రపరచుము.
నీరు ముందుగ పరిశీలించి - వడబోసి లోనికి తెమ్ము.
నీకు నియతము కానిచోట నిదురించకు.
వేరొక శ్రమణుని శయ్యపై ఎరుకలేక కూర్చొనకుము. **49**

"విహారంలో నివసించే అర్హత కోల్పోయిన తర్వాత ఒక్కరాత్రి అయిన అక్కడ నిదుర చేయటం భావ్యంకాద"ని బుద్ధుని వచనం. భిక్షుదీక్ష తీసుకొని పది సంవత్సరాలు గడవనివారు ఎరుకతో ఉన్న దోషములేదు. ప్రయాణాలలో ఉన్నపుడో, పర్యటనలో ఉన్నపుడో, విహారాలలో రాత్రిపూట బసచేయదలిస్తే ముందుగా ఆచార్యుని నుండిగాని, లేక విహార సంరక్షకుని నుండిగాని, అనుమతి తీసుకోవాలి. అందుకు సమానమయినవారు అక్కడ ఎవరూ లేనట్లయితే, అక్కడ బాధ్యతగల వ్యక్తియో, ధ్యానస్థితులను పొందినవారో, వినయ నియమాలను అధ్యయనం చేసినవారో, శిక్షాచరణలో నిష్ణాతులో, నిగ్రహాశీలురో - అయిన వారి నుండి అనుమతి పొందాలి.

**గురువుగారి అనుమతి లేకుండా గూడ**
**దాహంకోసమో, ముఖప్రక్షాళనానికో,**
**గురుశంకకో, లఘుశంకకో**
**బుద్ధ వందన మాచరించటానికో**
**వెళ్లటం తప్పుగాదు గాని,**
**ఇందుకు అన్యమయిన ఏపనికయినా**
**ముందుగా ఆచార్యుని అనుమతి**
**అడగటమే వినయవిధి. 50**

అన్యమయిన పని : వేరొక ఆచార్యునివద్ద సూత్రాధ్యయనం – కొత్తపద్ధతిలో ధ్యానాభ్యాసం – కొత్త దీక్షావస్త్రాలు తీసుకొనటం వంటివి.

**రాత్రి స్థూపవందనం వెంటనే**
**శ్రమణుడు నిదురకు పోరాదు.**
**గురువును చేరి ఆదేశమునకై అర్థించవలయు. 51**

ఆదేశమును అర్థించుట : రాత్రి మరికొంతకాలము మేల్కొని ఉండవలెనా! వేకువన ముందుగా మేల్కొనవలెనా! లేక అపుడేవిధమయిన అభ్యాస మాచరించవలెను! మొదలగు విషయములలో గురువు ఆదేశములు పొందటం.

**గురువునకు స్నానమాచరించి**
**రాత్రి – తొలి, తుదియామములందు**
**శ్రమణుడు శ్రద్ధాళువై యుండవలయు.**
**నిదురించరాదు ఈ యామములందు. 52**

గురువచనమునకు బద్ధుడై ఇట్లా ఆచరింపవలెను. గురువచనాన్ని విడచిపెట్టి తీసుకున్న దీక్షకు అన్యథా ప్రవర్తించినట్లయితే అది ధర్మ వంచన అవుతుంది.

**మేలుకొనుటపై, కాంతిపై,**
**మనసు ప్రసరింపజేసి –**
**సింహ భంగిమలోన**
**నిదురింపదగును రాత్రులందు. 53**

మేలుకొనుట : చివరి యామంలో అనగా వేకువజామున నిదురలేవటం గూర్చి.

రాత్రి మధ్యయామము వచ్చేసరికి మనసులో క్రింది రెండు అంశములపైన ధ్యాసను నిలిపి, నిదురించే సింహామువలె పడుకోవాలి.

మేలుకొనుటపై దృష్టి: "పెందలకడనే అనుకున్న సమయానికి నిదుర లేవాలి." అని భావన చేయటం.

కాంతిపై దృష్టి - దశ దిశలపై కాంతి ప్రసరిస్తున్నట్లు భావన చేస్తూ నిదురించాలి.

**పూర్తి ఎరుకతో, అనుకూల (చింతనా) స్రవంతిలో**
**మెలకువలోనికి రావాలి.**
**ఉపదేశసారం అభ్యసించాలి. 54**

నిద్రకు ఉపక్రమించేటపుడు మనసును ఎరుకలో నిలపాలి. దశ దిశలందు వెలుగులు నిండినట్లు భావిస్తూ, అంతఃకరణను త్రిరత్నములవంటి వానిపై ప్రసరించుకోవాలి. అపుడు వచ్చే స్వప్నాలుగూడ ప్రయోజనకరంగా ఉంటాయి. చివరి యామంలో సులువుగ వెంటనే నిదుర లేవగలుగుతారు. చివరియామం రాగానే నిదుర నుండి వెంటనే మేల్కొని ఇంతకుముందు చెప్పినట్లు పగటివేళ విధులు నిర్వహించాలి. ఈ విధంగా రోజుమొత్తం శిక్షణలో గడుపుతూ దీక్షాసమయం నిర్వర్తించాలి.

-: సమాపన వాక్యం : -

**ఇవన్నీ ఆచరించటంవల్ల కలిగే పుణ్యఫలప్రశంస**

**అవిద్య వేగమున నశించును.**
**కలుగును పరమ జ్ఞానలబ్ధి.**
**కనుక శ్రద్ధవహింపవలయు. 55**

పై వివరించిన విధులను క్రమశిక్షణా బద్ధంగా ఆచరిస్తే ఏ అర్హతలు కలుగుతాయి ఏ ప్రయోజనాలు సిద్ధిస్తాయి?

ప్రతీత్య సముత్పాద క్రమాన్ని ప్రత్యక్షంగా గ్రహించగలిగి, 'తథత'ను తెలుసుకొనగల దశకు నీ మనస్సు శరీరం వికసిస్తాయి. నీ మనోప్రవాహం నుండి అన్ని ఆలోచనా సంస్కారాలు మనకబారి క్రమంగా రాలిపోతాయి. శ్రావకులు, అర్హతులు, ప్రత్యేక బుద్ధులు, పొందిన జ్ఞానసిద్ధులను క్రమంగా దాటి

పురోగమిస్తారు. సమ్యక్ సంబుద్ధ స్థితిని గూడ అందుకుంటారు.

అందుచేత ఈమూడు ఫలితాలను సాధించగల సామర్థ్యాన్నిచ్చే నిష్ఠాచరణ యందు శ్రద్ధ వహించాలి. గౌరవ భావంతో, ముక్కుసూటిగా, శిక్షణా విధి నాచరించాలి. పారమార్థిక కుశల కర్మల నాచరించటం - అకుశలములను విసర్జించటం అభ్యాసం చేయాలి. ఇది నా మనః పూర్వక ఉపదేశం.

**మూలగ్రంథానికి ముగింపు మాట :**

మూల సర్వాస్థి వాదానుసారం శ్రమణేరులకు ఈ కారికలను నాగార్జునాచార్యులవారు రచించారు.

మూల సంస్కృత గ్రంథం నుండి టిబెట్టు భాషలోకి అనువదింపబడింది. భారతీయ బౌద్ధపండితుడయిన "మునివర్మ" టిబెట్టు భాషానువాదకులయిన "ననమ్ యెషే" గార్లు పరిష్కరించి ఆమోదించారు.

తన గురువయిన "తామామిసామ్" గారి మౌఖిక బోధ ననుసరించి సమంత ధర్మకీర్తి, చేసిన తన వ్యాఖ్యాన్ని ముగిస్తూ ఈ క్రింది సందేశాన్నిచ్చారు.

**అన్ని అతీతస్థితులకు మూలము,**
**పారమార్థిక సుఖానుభవాలకు ఆటపట్టు,**
**పరమ శుభాన్నిచ్చే ముక్తి మార్గమయిన**
**ఈ స్వీయ శిక్షణా మార్గాన్ని**
**శిక్షకునికి, శిక్షితునికి బుద్ధుడుపదేశించాడు.**
**ముక్తి మార్గాన్వేషణా రతులయిన శ్రమణేరులు**
**దీనికి స్వయముగా బద్ధులు కావలెను.**
**రాబోవు కాలమందు**
**వినయ సాగరంలో గంభీరముగా ప్రవేశింపగలరు.**

**ఈ రచనలవల్ల కలుగు పుణ్యఫలము**
**భూత, వర్తమాన ఆచార్యుల దర్శనములను**
**సఫలము చేయుగాక.**
**దీక్షాగతుల ఆయువును వృద్ధి పరచుగాక.**

బుద్ధ ధర్మమును చిరకాలము మనుచుగాక.
సర్వజీవులను క్రమముగా పూర్ణబుద్ధుల చేయుగాక.

"మిసామ్ రింపోచా" గారు ఈ దిగువ ఆకాంక్షతో తన వ్యాఖ్యానం ముగించారు.

"అనుపమానమీ వినయ మధూత్సవము
యౌవ్వనము మొగ్గతొడుగు శ్రమణేరులకు
దీని దివ్యసుగంధము వ్యాప్తిచేసి
స్వచ్ఛమానస నవకములమ్ముల నలంకరించి
సర్వశుభముల విస్తరించునుగాక"

- పరిసమాప్తం -

A C.No. 137179

# ధర్మసాధన గ్రంథమాల

## ధాన్యకటక బుద్ధవిహారట్రస్టు ప్రచురణలు

1. ప్రపంచశాంతి - దలైలామా ప్రసంగాలు - (ఆనంద బుద్ధవిహారట్రస్టు)
2. కాలచక్ర - అనువాదం - వావిలాల సుబ్బారావు
3. మైత్రీభావన - వావిలాల సుబ్బారావు
4. ధమ్మపదము - నవనీతం (ఆకాశవాణి ప్రసంగాలు) - వావిలాల సుబ్బారావు
5. జీవితం - కారాగారం - (బుద్ధదాసభిక్షు) - శ్రీమతి గొర్తి లక్ష్మీసుషమ
6. ధర్మసేతువు (పారమితలు) - శ్రీ తియ్యగూర సీతారామిరెడ్డి
7. బోధిసత్త్వ (ధర్మానంద కోశాంబి) - నాటకం
8. ఆచార్య నాగార్జున లేఖలు - అనువాదం - వావిలాల సుబ్బారావు

ఇతర ప్రచురణలు :

1. చలం కథానికా సాహిత్యం అనుశీలన - వావిలాల సుబ్బారావు
2. Gadaba the Language and the People - Vavilala Subba Rao
3. విజయప్రస్థానం - శ్రీ వావిలాల నరసింహారావు
4. చలం సాహిత్య సంగ్రహం - సంపాదకులు - వావిలాల సుబ్బారావు
5. చలంపై ఇంకా... ఇంకా.... (అచ్చులో) - వావిలాల సుబ్బారావు



పారమితలలో దానపారమిత శ్రేష్ఠం.
దానములలో కెల్లా ధర్మదానం శ్రేష్ఠం.
ఇతర దానాలు - చేసిన వారికి,
పొందిన వారికి తృప్తిని ఇస్తాయి.
ధర్మదానం అందరికి తృప్తినిస్తుంది.
ధర్మాన్ని ప్రేరేపిస్తుంది.



ధర్మసాధన గ్రంథమాల
ధాన్యకటక బుద్ధవిహార ట్రస్టు
అమరావతి - 522 020